www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 30-3-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 345 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: పంచమి రా. 9.15 తదుపరి షష్ఠి; నక్షత్రం: అనూరాధ రా. 10.04 తదుపరి జ్యేష్ఠ వర్జ్యం: తె. 3.52-5.31; దుర్ముహూర్తం: ఉ. 6.15-7.53; అమృతఘడియలు: ఉ. 11.02-12.44; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.15; సూర్యాస్తమయం: 6.25 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కోల్‌కతా టాప్‌షో

బెంగళూరు ఓటమి ● విరాట్ పోరాటం వృథా

అదరగొట్టిన వెంకటేశ్, నరైన్


సునీల్ నరైన్ (22 బంతుల్లో 47)

బెంగళూరు: కోల్‌కతా నైట్‌రైడర్స్ నుంచి మరో అదిరిపోయే ప్రదర్శన. టాపార్డర్‌లో వెంకటేశ్ అయ్యర్ (30 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 50), ఓపెనర్లు సునీల్ నరైన్ (22 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లతో 47), ఫిలిప్ సాల్ట్ (20 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 30) తుఫాన్ ఇన్నింగ్స్‌తో చిన్నస్వామి స్టేడియంలో బౌండరీల వర్షం కురిపించారు. దీంతో భారీ ఛేదనను అలవోకగా ముగిస్తూ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ)పై 7 వికెట్లతో భారీ విజయం సాధించింది. అలాగే తాజా సీజన్‌లో హోం గ్రౌండ్‌లో ఓడిన తొలి జట్టుగా ఆర్సీబీ నిలవగా, ఈ మైదానంలో నైట్‌రైడర్స్‌కిది వరుసగా ఆరో విజయం. విరాట్ కోహ్లీ (59 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 83 నాటౌట్) ఒక్కడే రాణించడంతో శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 6 వికెట్లకు 182 పరుగులు చేసింది. కామెరూన్ గ్రీన్ (21 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 33) ఫర్వాలేదనిపించాడు. రస్సెల్, హర్షిత్ రాణాలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో కోల్‌కతా 16.5 ఓవర్లలో 3 వికెట్లకు 186 పరుగులు చేసి గెలిచింది. శ్రేయాస్ అయ్యర్ (39 నాటౌట్) సత్తా చాటాడు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నరైన్ నిలిచాడు.

బాదుడే బాదుడు: ఛేదన కోసం బరిలోకి దిగిన కేకేఆర్ పరుగుల ప్రవాహం తొలి బంతి నుంచే సాగింది. ఆర్సీబీ బౌలర్లు తమ సొంత మైదానంలోనూ ఏమాత్రం ప్రభావం చూపలేకపోయారు. వైశాక్ మాత్రం పొదుపుగా బౌలింగ్ చేయగలిగాడు. ఓపెనర్లు నరైన్, సాల్ట్ ధాటిగా ఆడేస్తూ పవర్‌ప్లేలోనే ఏకంగా 85 పరుగులు సాధించారు. ఇది ఆ జట్టు తరఫున రెండో అత్యధికం. చాలా రోజుల తర్వాత నరైన్ తన బ్యాట్ పవర్ చూపించగా, అటు సాల్ట్ తొలి ఓవర్‌లోనే 6,4,6తో 18 పరుగులు రాబట్టాడు. మరో ఎండ్‌లో నరైన్ మూడో ఓవర్‌లో రెండు సిక్సర్లతో అలరించాడు. దీంతో 21 బంతుల్లోనే జట్టు 50 పరుగులకు చేరింది. ఆరో ఓవర్‌లో నరైన్ మరింత విజృంభిస్తూ 4,6,6 బాదేయడంతో 21 పరుగులు వచ్చాయి. అయితే హాఫ్ సెంచరీ ఖాయమని భావించిన నరైన్‌ను మయాంక్ దాగర్ యార్కర్‌తో బౌల్డ్ చేశాడు. దీంతో తొలి వికెట్‌కు 39 బంతుల్లో 86 పరుగుల మెరుపు భాగస్వామ్యం ముగిసింది. ఆ వెంటనే సాల్ట్‌ను వైశాక్ అవుట్ చేసినా వెంకటేశ్ అయ్యర్ రూపంలో కేకేఆర్ ఆటలో వేగం తగ్గలేదు. తొమ్మిదో ఓవర్‌లోనే స్కోరు వంద పరుగులకు చేరగా.. అటు అయ్యర్ ఆటలో వీలైనంత త్వరగా మ్యాచ్‌ను ముగించాలనే కసి కనిపించింది. దీంట్లో భాగంగా అల్జారి ఓవర్‌లో 6,4,6,4తో 20 పరుగులు రాబట్టాడు. అటు కెప్టెన్ శ్రేయాస్ స్ట్రయిక్ రొటేట్ చేస్తూ సహకరించాడు. 14 ఓవర్లలోనే స్కోరు 150కి చేరడంతో ఆర్సీబీ ఓటమి ఖరారైంది. 29 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసిన వెంటనే వెంకటేశ్‌ను యష్ దయాల్ అవుట్ చేయడంతో మూడో వికెట్‌కు 75 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అప్పటికి 29 బంతుల్లో 16 పరుగులే కావాల్సి ఉండగా.. శ్రేయాస్, రింకూ (5 నాటౌట్) మరో 19 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించారు.

విరాట్ అజేయ ఇన్నింగ్స్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీకి శుభారంభం దక్కకపోయినా విరాట్ మెరుపు ఇన్నింగ్స్‌తో తుది కంటా నిలిచి జట్టు భారీ స్కోరుకు దోహదపడ్డాడు. అతడికి గ్రీన్, మ్యాక్స్‌వెల్ (28) చివర్లో దినేశ్ కార్తీక్ (20) సహకరించారు. ఇక ఈ మ్యాచ్‌లోనూ కేకేఆర్ రూ. 24 కోట్ల విలువైన బౌలర్ స్టార్క్ పూర్తిగా తేలిపోవడం గమనార్హం. ఓపెనర్ డుప్లెసి (8) రెండో ఓవర్‌లోనే వెనుదిరగ్గా, మూడో ఓవర్‌లో విరాట్ 6,4.. గ్రీన్ ఫోర్‌తో 17 రన్స్ సమకూరాయి. ఇక ఆరో ఓవర్‌లోనూ గ్రీన్ చెలరేగి వరుసగా 4,4,6తో 15 రన్స్ రాబట్టడంతో జట్టు పవర్‌ప్లేను 61 పరుగులతో ముగించింది. కానీ ఆ తర్వాత పరుగుల వేగం తగ్గింది. గ్రీన్‌ను రస్సెల్ బౌల్డ్ చేయడంతో రెండో వికెట్‌కు 65 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అయితే 12వ ఓవర్‌లో విరాట్ సిక్సర్, మ్యాక్స్‌వెల్ 4,4తో స్కోరులో కాస్త కదలిక కనిపించింది. అటు మ్యాక్స్ వరుస ఓవర్లలో ఇచ్చిన రెండు సులువైన క్యాచ్‌లను రమణ్‌దీప్, నరైన్ వదిలేశారు. అయితే అతడిని ఎక్కువ సేపు క్రీజులో నిలువకుండా కేకేఆర్ చూడగలిగింది. 15వ ఓవర్‌లో రింకూ క్యాచ్‌తో తను పెవిలియన్‌కు చేరాడు. తర్వాతి వరుస ఓవర్లలోనే రజత్ (3)ను రస్సెల్.. అనూజ్ (3)ను హర్షిత్ అవుట్ చేయడంతో పాటు పరుగులను కూడా కట్టడి చేశారు. కానీ 19వ ఓవర్‌లో దినేశ్ కార్తీక్ రెండు సిక్సర్లతో మురిపించాడు. అలాగే ఆఖరి ఓవర్‌లోనూ విరాట్, డీకే చెరో సిక్సర్‌తో ఆర్సీబీ స్కోరు 180 దాటింది.


విరాట్ కోహ్లీ (59 బంతుల్లో 83 నాటౌట్)

1 బెంగళూరు తరఫున ఎక్కువ సిక్సర్లు (241)బాదిన బ్యాటర్‌గా కోహ్లి. గేల్ (239)ను దాటాడు.

4 టీ20ల్లో 500 మ్యాచ్‌లు పూర్తి చేసిన నాలుగో క్రికెటర్‌గా సునీల్ నరైన్. పొలార్డ్ (660), బ్రావో (573), షోయబ్ మాలిక్ (542) ముందున్నారు.

నేటి మ్యాచ్
లఖ్‌నవూ X పంజాబ్
రాత్రి 7.30 గం. నుంచి

స్కోరుబోర్డు

బెంగళూరు: విరాట్ కోహ్లీ (నాటౌట్) 83, డుప్లెసి (సి) స్టార్క్ (బి) హర్షిత్ 8, గ్రీన్ (బి) రస్సెల్ 33, మ్యాక్స్‌వెల్ (సి) రింకూ (బి) నరైన్ 28, పటీదార్ (సి) రింకూ (బి) రస్సెల్ 3, అనూజ్ (సి) సాల్ట్ (బి) హర్షిత్ 3, దినేశ్ (రనౌట్) 20, **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 20 ఓవర్లలో 182/6;** వికెట్ల పతనం: 1-17, 2-82, 3-124, 4-144, 5-151, 6-182; **బౌలింగ్:** స్టార్క్ 4-0-47-0, హర్షిత్ రాణా 4-0-39-2, అనుకూల్ 2-0-6-0, నరైన్ 4-0-40-1, రస్సెల్ 4-0-29-2, వరుణ్ చక్రవర్తి 2-0-20-0.

కోల్‌కతా: సాల్ట్ (సి) గ్రీన్ (బి) వైశాక్ 30, నరైన్ (బి) దాగర్ 47, వెంకటేశ్ అయ్యర్ (సి) కోహ్లీ (బి) యష్ దయాల్ 50, శ్రేయాస్ అయ్యర్ (నాటౌట్) 39, రింకూ సింగ్ (నాటౌట్) 5, **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 16.5 ఓవర్లలో 186/3;** వికెట్ల పతనం: 1-86, 2-92, 3-167; **బౌలింగ్:** సిరాజ్ 3-0-46-0, యష్ దయాల్ 4-0-46-1, అల్జారీ జోసెఫ్ 2-0-34-0, మయాంక్ దాగర్ 2.5-0-23-1, వైశాక్ 4-0-23-1, గ్రీన్ 1-0-7-0.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
చెన్నై	2	2	0	0	4	1.979
కోల్‌కతా	2	2	0	0	4	1.047
రాజస్థాన్	2	2	0	0	4	0.800
హైదరాబాద్	2	1	1	0	2	0.675
పంజాబ్	2	1	1	0	2	0.025
బెంగళూరు	3	1	2	0	2	-0.711
గుజరాత్	2	1	1	0	2	-1.425
ఢిల్లీ	2	0	2	0	0	-0.528
ముంబై	2	0	2	0	0	-0.925
లఖ్‌నవూ	1	0	1	0	0	-1.000

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్



సెమీస్‌లో సిక్కి జోడీ

● క్వార్టర్స్‌లో సింధు ఓటమి
● స్పెయిన్ మాస్టర్స్ టోర్నీ

మాడ్రిడ్: సిక్కిరెడ్డి జోడీ జోరు కొనసాగిస్తూ స్పెయిన్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో సెమీఫైనల్‌కు దూసుకుపోయింది. ఇక స్టార్ షట్లర్ పీవీ సింధు క్వార్టర్స్‌లో ఓటమితో టోర్నమెంట్ నుంచి నిష్క్రమించగా, డబుల్స్‌లో అశ్వినీ పొన్నప్ప ద్వయం కూడా పరాజయం పాలైంది. శుక్రవారం జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో సిక్కిరెడ్డి/సుమిత్ రెడ్డి జంట 14-21, 21-11, 21-17తో నాలుగో సీడ్ ఇండోనేసియా ద్వయం రేహన్ నౌఫల్/లిసా కుసుమావతిని చిత్తు చేసింది. ఫైనల్లో చోటు కోసం ఆరోసీడ్ ఇండోనేసియా జోడీ రినోవ్ రివాల్డీ/పిటా హనింగ్త్యస్తతో సిక్కి ద్వయం అమీతుమీ తేల్చుకోనుంది. మహిళల సింగిల్స్‌లో క్వార్టర్‌ఫైనల్లో రెండో సీడ్ సింధు 26-24, 17-21, 20-22తో సుపనిద కటిథాంగ్ (థాయ్‌లాండ్) చేతిలో పోరాడి ఓడింది. మహిళల డబుల్స్ రౌండ్-8లో మూడో సీడ్ అశ్వినీ పొన్నప్ప/తనీషా క్రాస్టో జంట 13-21, 19-21తో ఆరో సీడ్ లీ చియా/టింగ్ చున్ (తైపీ) జోడీ చేతిలో ఓడిపోయింది. కాగా, పురుషుల డబుల్స్‌లో భారత జంట ఎమ్‌ఆర్ అర్జున్/ధ్రువ్ కపిల జోడీకి క్వార్టర్స్‌లో చుక్కెదురైంది. రెండోసీడ్‌గా బరిలోకి దిగిన అర్జున్ ద్వయంపై 21-19, 21-23, 21-17తో మలేసియా జంట జునైది ఆరిఫ్/రా కింగ్ యాప్ గెలిచింది.

‘పారిస్’లో పతాకధారిగా నీరజ్‌ను ఎందుకు ఎంపిక చేయలేదు?

ప్రశ్నించిన అంజూ బాబీ జార్జ్



న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో భారత పతాకధారిగా నీరజ్ చోప్రాను ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదని దిగ్గజ లాంగ్‌జంపర్ అంజూ బాబీ జార్జ్ ప్రశ్నించింది. వెటరన్ టీటీ ఆటగాడు శరత్ కమల్‌ను బృందం నాయకుడిగా ఎంపిక చేస్తూ భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) ఇటీవల నిర్ణయం తీసుకున్న విషయం విదితమే. ఈ నిర్ణయంపై అంజూ స్పందిస్తూ ‘టేబుల్ టెన్నిస్ సమాఖ్య సహా అన్ని క్రీడా సంఘాలు పారిస్ గేమ్స్‌కు తమ జట్లను ఇంకా ప్రకటించనేలేదు. అలాంటప్పుడు ఒలింపిక్స్‌లో పాల్గొనడం ఖాయమైన నీరజ్ చోప్రాను పతాకధారిగా నియమించకపోవడం ఆశ్చర్యకరం’ అని వ్యాఖ్యానించింది.

ఒలింపిక్స్ భద్రతకోసం విదేశీ సాయం



పారిస్: ఈ జులై-ఆగస్టు నెలల్లో ఒలింపిక్స్‌కు ఆతిథ్యమివ్వనున్న ఫ్రాన్స్.. క్రీడలకు అత్యంత కట్టుదిట్టమైన భద్రత కల్పించేందుకు ఇతర దేశాల సాయాన్ని కోరుతోంది. రెండు వేలమందికిపైగా పోలీసు అధికారులను పంపాలని 46 దేశాలను అభ్యర్థించింది. 2022లో ఖతార్‌లో జరిగిన వరల్డ్ కప్ ఫుట్‌బాల్‌కు రక్షణ కల్పించేందుకు తమ దేశం నుంచి 200 మంది పోలీసులు, పారా మిలటరీ సిబ్బందిని పంపిన విషయాన్ని ఫ్రాన్స్ అంతర్గత మంత్రిత్వ శాఖ గుర్తు చేసింది. అలాగే కొద్ది సంఖ్యలో మిలిటరీ సిబ్బందిని కూడా పంపాలని పలు దేశాలను ఫ్రాన్స్ రక్షణ మంత్రిత్వ శాఖ కూడా కోరింది.

అమెరికా జట్టులో కోరె అండర్సన్



న్యూయార్క్: న్యూజిలాండ్ మాజీ ఆల్‌రౌండర్ కోరె అండర్సన్ ఇకపై అమెరికా క్రికెట్ జట్టు తరఫున ఆడబోతున్నాడు. కెనడాతో జరిగే ఐదు టీ20ల సిరీస్ కోసం మోనాంక్ పటేల్ నేతృత్వంలో 15 మందితో కూడిన జట్టును ప్రకటించారు. 2018లో కివీస్ తరఫున చివరి మ్యాచ్ ఆడిన 33 ఏళ్ల అండర్సన్ 2020లో అమెరికాకు వచ్చాడు. అక్కడి దేశవాళీ మ్యాచ్‌ల్లో పరుగుల వరద పారించడంతో ఇప్పుడు జాతీయ జట్టుకు ఆడనున్నాడు. గతంలో భారత అండర్-19కు ఆడిన హర్మీత్ సింగ్, ఢిల్లీ బ్యాటర్ మిలింద్ కుమార్, కెనడా జట్టు మాజీ కెప్టెన్ నితీష్ కుమార్ కూడా టీమ్‌లో ఉన్నారు. అయితే యూఎస్‌లో క్రికెట్ ఆడుతున్న ఉన్ముక్త్ చంద్‌కు మాత్రం నిరాశే ఎదురైంది.

టీ20 కెప్టెన్‌గా మళ్లీ బాబర్!

షహీన్ అవుట్?



కరాచీ: పాకిస్థాన్ టీ20 జట్టు కెప్టెన్‌గా షహీన్ షా అఫ్రీది స్థానంలో బాబర్ ఆజమ్ నియామకం ఖాయంగా కనిపిస్తోంది. వచ్చేనెల 18నుంచి స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరిగే ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌తోనే బాబర్ తిరిగి కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టనున్నట్టు పాక్ క్రికెట్ బోర్డు వర్గాలు వెల్లడించాయి. గత ఏడాది భారత్‌లో జరిగిన వన్డే వరల్డ్‌కప్‌లో జట్టు దారుణ వైఫల్యం దరిమిలా మూడు ఫార్మాట్లలో ఆజమ్ కెప్టెన్సీపై వేటు పడింది. అనంతరం టీ20 జట్టు సారథిగా నవంబరులో అఫ్రీది నియమితుడయ్యాడు. అతడి హయాంలో ఒకటే టీ20 సిరీస్ కివీస్‌తో ఆడిన పాక్ 1-4తో ఓడింది.

సోషల్ మీడియాను పట్టించుకోవద్దు!

● హార్దిక్‌కు స్మిత్ బాసట

న్యూఢిల్లీ: ముంబై కెప్టెన్ హార్దిక్ పాండ్యాపై క్రికెట్ ఫ్యాన్స్ విమర్శలు అసంబద్ధమని ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ అన్నాడు. సోషల్ మీడియాలో వాటిని హార్దిక్ చూడడం మానేయాలని సూచించాడు. ఐదుసార్లు ఐపీఎల్ టైటిల్ అందించిన రోహిత్‌ను పక్కనబెట్టిన ముంబై ఫ్రాంచైజీ ఈ సీజన్‌కు హార్దిక్‌ను కెప్టెన్‌గా నియమించిన సంగతి తెలిసిందే. దాంతో గరంగరంగా ఉన్న రోహిత్ అభిమానులు పాండ్యాపై విమర్శల దాడికి దిగారు.

బిజినెస్

కొత్త ఇళ్ల సరఫరా తగ్గింది

కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నివేదిక

న్యూఢిల్లీ: హైదరాబాద్ సహా దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాల్లో కొత్త ఇళ్ల సరఫరా జనవరి-మార్చి త్రైమాసికంలో సగటున 15 శాతం తగ్గిందని కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ సంస్థ తాజా నివేదికలో తెలిపింది. బెంగళూరు, ముంబై నగరాల్లో మాత్రం సరఫరా స్వల్పంగా పెరిగిందని; ఢిల్లీ ఎన్‌సీఆర్, చెన్నై, హైదరాబాద్, పుణె, కోల్కతా, అహ్మదాబాద్‌లలో తగ్గిందని పేర్కొంది. దేశవ్యాప్తంగా గత ఏడాది ఇదే త్రైమాసికంలో 81,167 ఇళ్లు అందుబాటులోకి రాగా ఈ ఏడాది 69,143 యూనిట్లు మాత్రమే అందుబాటులోకి వచ్చాయని పేర్కొంది. హైదరాబాద్‌లో కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఇళ్లు గత ఏడాది జనవరి-మార్చితో పోల్చితే 14,371 యూనిట్ల నుంచి 11,090కి తగ్గాయి. ఈ ఎనిమిది నగరాల్లోనూ మొత్తం ఇళ్ల అమ్మకాల్లో విలాసవంతమైన భవనాల వాటా 34 శాతం ఉన్నట్టు పేర్కొంది.



పసిడి సరికొత్త రికార్డు

2023-24లో రూ.8,730 అప్

ఒక్కరోజే రూ.1,420 పెరుగుదల, తులం రూ.68,730

అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు 2,250 డాలర్ల ఎగువకు

హైదరాబాద్: బంగారం మళ్లీ కొండెక్కుతోంది. శుక్రవారం నాడు హైదరాబాద్‌లో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం ఒక్కరోజే రూ.1,420 పెరిగి రూ.68,730కి చేరుకుంది. ధర రూ.68,000 దాటడం ఇదే తొలిసారి. 22 క్యారెట్ల బంగారం సైతం రూ.1,300 పెరిగి రూ.63,000కు ఎగబాకింది. కిలో వెండి రూ.80,800 పలికింది. అంతర్జాతీయంగా బంగారం, వెండి ధర పెరగడమే ఇందుకు ప్రధాన కారణం. ఫెడ్ రేట్ల తగ్గింపు అంచనాలు ఊపందుకోవడంతో అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.2,254 డాలర్లకు పుంజుకుంది. వెండి 25.10 డాలర్ల వద్ద ట్రేడైంది. ఒక్క మార్చి నెలలోనే ఔన్సు బంగారం 9 శాతం పెరిగింది. 2020 జూలై తర్వాత అత్యధిక నెలవారీ వృద్ధి ఇది. అంతేకాదు, వరుసగా రెండు త్రైమాసికాలుగా బంగారం ప్రియమవుతూనే వచ్చింది.

2022-23 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రూ.60,000 స్థాయిలో ఉన్న తులం బంగారం.. ఈ ఆర్థిక సంవత్సరం చివరికి మరో రూ.8,730 పెరుగుదలతో రూ.68,730కి చేరుకుంది. అంటే పసిడి ఇన్వెస్టర్ల పెట్టుబడి విలువ ఏడాది కాలంలో 14.6 శాతం పెరిగింది. ఫెడ్ రేట్ల తగ్గింపుపై మరింత స్పష్టత వస్తే, బంగారం రేటు మరింత పుంజుకునే అవకాశాలున్నాయని బులియన్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ఏడాది చివరినాటికి వడ్డీరేట్లను 0.75 శాతం మేర తగ్గించే అవకాశాలున్నాయని ఫెడ్ రిజర్వ్ చీఫ్ జెరోమ్ పావెల్ సంకేతాలిచ్చారు. సాధారణంగా ఫెడ్ రేట్లు పెరుగుతున్న సమయంలో అమెరికన్ డాలర్, బాండ్ల రేట్లు పెరుగుతూ పోతే.. బంగారం తగ్గుతూ వస్తుంది.

ఎఫ్‌పీఐ పెట్టుబడుల వరద

2023-24లో మొత్తం రూ.3.4 లక్షల కోట్లు రాక

న్యూఢిల్లీ: ఈ నెల 31తో ముగియనున్న ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత మార్కెట్లోకి విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు (ఎఫ్‌పీఐ) పోటెత్తాయి. డిపాజిటరీల వద్దనున్న సమాచారం ప్రకారం.. ఈసారి ఎఫ్‌పీఐలు ఈక్విటీ మార్కెట్లో రూ.2.08 లక్షల కోట్లు, డెట్ మార్కెట్లోకి మరో రూ.1.2 లక్షల కోట్లు కలిపి మొత్తం రూ.3.4 లక్షల కోట్లు గుమ్మరించారు. అంతర్జాతీయ ప్రతికూలతల్లోనూ భారత ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉండటం ఇందుకు ప్రధానంగా దోహదపడింది. గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో మాత్రం మన ఈక్విటీల నుంచి విదేశీ పెట్టుబడులు వెనక్కి తరలిపోయాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో నికరంగా రూ.37,632 కోట్లు, 2021-22లో రూ.1.4 లక్షల కోట్లు వెనక్కి తీసుకున్నారు. అయితే 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఎఫ్‌పీఐల రాకపై మజర్స్ మేనేజింగ్ పార్ట్‌నర్ భరత్ ధావన్ అప్రమత్తతతో కూడిన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రగతిశీల సంస్కరణలు, ఆర్థిక స్థిరత్వం, ఆకర్షణీయ పెట్టుబడి మార్గాలు ఎఫ్‌పీఐల జోరు కొనసాగేందుకు దోహదపడవచ్చన్నారు. అయితే, అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ ఆందోళనలు పెట్టుబడుల ప్రవాహంపై ప్రభావం చూపవచ్చన్నారు.

జీ బెంగళూరు కేంద్రంలో సగం మంది ఔట్

న్యూఢిల్లీ: జీ ఎంటర్‌టెయిన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (జీఎల్) ఉద్యోగుల కోతలకు దిగింది. బెంగళూరులోని కంపెనీ టెక్నాలజీ అండ్ ఇన్నొవేషన్ కేంద్రంలో (టీఐసీ) పని చేస్తున్న ఉద్యోగుల్లో సగం మందిని ఇంటికి పంపించింది. ఖర్చుల తగ్గింపులో భాగంగా ఈ చర్య తీసుకున్నట్టు కంపెనీ రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. అయితే ఎంత మంది ఉద్యోగులను తొలగించిందీ వెల్లడించలేదు. కంపెనీ తాజా వార్షిక నివేదిక ప్రకారం ఈ కేంద్రంలో 650 మందికిపైగా ఇంజినీర్లు పని చేస్తున్నారు. దీంతో వీరిలో కనీసం సగం మంది రోడ్డున పడినట్టు భావిస్తున్నారు.

యశోదాలో ఫ్యూజిఫిలిం అత్యాధునిక అల్ట్రా సౌండ్ పరికరం



హైదరాబాద్: డయాగ్నస్టిక్ ఇమేజింగ్‌లో అగ్రగామి అయిన ఫ్యూజిఫిలిం అత్యాధునికమైన అరీటా 850 డయాగ్నస్టిక్ అల్ట్రా సౌండ్ సిస్టమ్‌ను యశోదా ఆస్పత్రిలో ప్రారంభించింది. హైదరాబాద్‌లో ఇలాంటి అత్యాధునిక యంత్రం అందుబాటులోకి రావడం ఇదే ప్రథమమని ఫ్యూజిఫిలిం తెలిపింది. ఉదరకోశ వ్యాధులను ప్రత్యేకించి ఉదరకోశంలోను, చుట్టుపక్కల ప్రాంతాల్లోను ఏర్పడే కేన్సర్ టిష్యూలను గుర్తించి సకాలంలో సరైన చికిత్స అందించడానికి ఈ ఎండోస్కోపిక్ అల్ట్రాసౌండ్ యంత్రం ఎంతో సహాయకారి అవుతుందని పేర్కొంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

30వ తేదీ



హైదరాబాద్	375	విజయవాడ	400
చిత్తూరు	458	విశాఖపట్నం	415
గోదావరి	400	వరంగల్	377
		దజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. **వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



హైదరాబాద్	122	గోదావరి	121
వరంగల్	122	విజయవాడ	121
కరీంనగర్	122	గుంటూరు	122
మహబూబ్‌నగర్	122	ఒంగోలు	122
కర్నూలు	123	చిత్తూరు	135
విశాఖపట్నం	117		


మార్చి 31 వచ్చేస్తోంది
పన్ను ప్లానింగ్‌లో తడబాటు వద్దు

పన్ను ఆదా పథకాల్లో పెట్టుబడులు ఆయా వ్యక్తుల దీర్ఘకాలిక ఆర్థిక ప్రణాళిక లక్ష్యానికి అనుగుణంగా ఉండాలి. ఈ విషయం ఆలోచించకుండా పన్ను ఆదా పథకాల్లో మదుపు చేస్తే కొద్ది మొత్తంలో పన్ను ఆదా ఐనా, రాబడులు పెద్దగా ఉండవు. మార్కెట్ అనుకూలించక పోతే ఈఎల్ఎస్ఎస్, యులిప్స్ వంటి పన్ను ఆదా పథకాల్లో అసలుకే మోసం వచ్చే ప్రమాదం ఉంది.

ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంక ఒక రోజే వ్యవధి ఉంది. పన్ను ప్లానింగ్ ఇంకా పూర్తి చేయని వ్యక్తిగత ఐటీ చెల్లింపుదారులు పన్ను తగ్గించుకునేందుకు చివరి క్షణం చర్యలకు పరుగులు తీస్తారు. ఏ పథకంలో మదుపు చేస్తే అధిక లాభం పొందగలమా అని ఆదుర్దా పడుతుంటారు. ఇది డిస్ట్రిబ్యూటర్లు, బ్రోకర్లకు పండగ. మా పథకం మంచిదంటే మాదంటూ వెంటపడుతుంటారు. పన్ను చెల్లింపుదారులు కూడా పన్ను భారం తగ్గించుకోవడమే ముఖ్యంగా భావించి ఏదో ఒక పథకంలో మదుపు చేస్తుంటారు. తీరా చూస్తే వాటిలో రాబడి అంతంత మాత్రంగానే ఉన్నా, పెట్టుబడి మాత్రం ఖరీదుగా మారుతుంది. ఈ నేపథ్యంలో ఇంకా తమ పన్ను ఆదా పెట్టుబడులు పూర్తి చేయని ఐటీ చెల్లింపుదారులు ఈ కింది జాగ్రత్తలు పాటించడం మంచిది.

పరిమితి కంటే తక్కువ పెట్టుబడులు

పాత ఆదాయ పన్ను పథకాన్ని వినియోగించుకునే ఐటీ చెల్లింపుదారులు పన్ను ఆదా కోసం సెక్షన్ 80సీ కింద చేసే పెట్టుబడుల్లో రూ.1.5 లక్షల వరకు, సెక్షన్ 80 సీసీడీ (1బీ) కింద ఎన్‌పీఎస్‌లో మదుపు చేస్తే మరో రూ.50,000 వరకు మినహాయింపు లభిస్తుంది. ఇవి కాకుండా తన కోసం, కుటుంబ సభ్యులు, తల్లిదండ్రుల ఆరోగ్య బీమా కోసం చెల్లించే ప్రీమియం, గృహ, విద్యా రుణాలపై చెల్లించే వడ్డీకి కూడా ఆదాయ పన్ను మినహాయింపు లభిస్తుంది. ఐటీ రిటర్న్ ఫైల్ చేసే వారిలో చాలా మందికి ఈ విషయాలు తెలియవు. దాంతో తమ ఆదాయ పరిమితి మినహాయింపు పరిమితి కంటే తక్కువ పెట్టుబడులను క్లెయిమ్ చేస్తుంటారు. చక్కటి ప్లానింగ్‌తో ఈ పరిమితిని ఉపయోగించుకుంటే పన్ను ఆదాతో పాటు, పెట్టుబడులపై మంచి రాబడులూ పొందే అవకాశం ఉంటుంది. మరి కొంత మంది వివిద సెక్షన్ల కింద లభించే మినహాయింపులపై అవగాహన లేక తమ పరిమితికి మించి పెట్టుబడులు పెడుతుంటారు. దీని వల్ల పెట్టుబడులు ఆయా పథకాలను బట్టి మూడు నుంచి ఐదేళ్ల పాటు లాక్ అయిపోతాయి.



ప్రణాళికా రహిత పెట్టుబడులు

ఆర్థిక ప్రణాళికకు మరో పేరే టాక్స్ ప్లానింగ్. ఐటీ చెల్లింపుదారులు, ఈ వియాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయా పథకాల మంచి చెడులను కూలంకషంగా తెలుసుకుని మాత్రమే పెట్టుబడులు పెట్టాలి. ముఖ్యంగా ఎన్‌పీఎస్, సెక్షన్ 80 సీ పెట్టుబడి పథకాలు ఎంచుకోవాలి. ఈక్విటీ మార్కెట్ ఆటుపోట్లకు సిద్ధమైతే ఈఎల్ఎస్ఎస్ పథకాలు, రిటైర్మెంట్ కోసమైతే ఎన్‌పీఎస్ పథకాలు ఎంచుకోవాలి. ఏ మాత్రం నష్ట భయాన్ని తట్టుకోలేకపోతే ఎన్ఎస్‌సీ లేదా ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాలను ఎంచుకోవాలి. ఏదేమైనా టాక్స్ ప్లానింగ్ ఆయా వ్యక్తుల దీర్ఘకాలిక పెట్టుబడి లక్ష్యాలకు అనుగుణంగా ఉండాలి.

హడావిడి వద్దు

బ్యాంక్ రిలేషన్‌షిప్ మేనేజర్ లేదా బీమా ఏజెంట్లతో ఎంత పరిచయం ఉన్నా, తొందరపడి పెద్ద మొత్తంలో దీర్ఘకాలిక పెట్టుబడులకు కమిట్ కావద్దు. దీర్ఘకాలిక ఆలోచనతోనే జీవిత బీమా పాలసీలు తీసుకోవాలి. పాలసీ గడువు కంటే ముందే పాలసీ నుంచి తప్పుకుంటే పెద్ద మొత్తంలో నష్టపోవాల్సి ఉంటుంది. మనకు ఎంత కవరేజి కావాలి, పాలసీ గడువు ముగిసే వరకు ప్రీమియం చెల్లించగలమా, లేదా; పాలసీపై వచ్చే 5-6 శాతం రాబడులపై తృప్తి పడగలమా అనే విషయాలు అన్నీ ఆలోచించుకున్న తర్వాతే జీవిత బీమా పాలసీలు తీసుకోవాలి. టాక్స్ ప్లానింగ్ కోసం యులిప్స్‌లో మదుపు చేస్తున్నా, వాటిపై రాబడులు మార్కెట్ పనితీరుపై ఆధారపడి ఉంటాయనే విషయాన్ని మర్చిపోవద్దు.

నష్ట భయం ఉండే పెట్టుబడులు

ఈక్విటీ మార్కెట్లు జోరు మీద ఉండడంతో ఈఎల్ఎస్ఎస్ పథకాలు గత ఏడాది సగటున 37.4 శాతం, గత మూడేళ్లలో సగటున 18.1 శాతం రాబడులు పంచాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని సెక్షన్ 80సీ కింద లభించే రూ.1.5 లక్షల ఆదాయ మినహాయింపునకు ఉన్న మొత్తాన్ని ఈఎల్ఎస్ఎస్ పథకాల్లో మదుపు చేయవద్దు. ఎందుకంటే స్టాక్ మార్కెట్ ఇప్పటికే హీటెక్కి ఉంది. స్మాల్ అండ్ మిడ్‌క్యాప్ కంపెనీల షేర్లు తీవ్రంగా నష్టపోతున్నాయి. దీంతో సూచీలూ దిద్దుబాటుకు లోనవుతున్నాయి. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఈఎల్ఎస్ఎస్ పథకాల్లో రూ.50,000 నుంచి రూ.60,000కు మించి పెట్టుబడి పెట్టవద్దు. మిగతా మొత్తాన్ని సురక్షితమైన పీపీఎఫ్, ఎన్ఎస్‌సీ లేదా టాక్స్ సేవింగ్ ఫిక్స్‌డ్ డిపాజిట్లలో మదుపు చేయండి.

అవగాహన

టాక్స్ సేవింగ్ పెట్టుబడుల రాబడులపై పన్ను పోటు ఉంటుందా, లేదా అనే విషయం కూడా మదుపరులు తెలుసుకుని ఉండాలి. ఎన్ఎస్‌సీ రాబడులపై పన్ను పోటు ఉంటుంది. ఈఎల్ఎస్ఎస్ పథకాలపై వచ్చే రాబడులపై రూ.లక్ష వరకే పన్ను మినహాయింపు లభిస్తుంది. అంతకు మించిన రాబడులపై 10 శాతం చొప్పున పన్నుపోటు తప్పదు. ఈ విషయాలన్నీ తెలుసుకున్న తర్వాతే టాక్స్ సేవింగ్ పథకాల్లో మదుపు చేయాలి.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
శనివారం | 30-3-2024
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

అప్పుడే పుట్టిన పిల్లలూ ఏఐ అంటారు

నేటి తరం చిన్నారులు చాలా అడ్వాన్స్‌డ్.. డీప్ ఫేక్ వినియోగంపై నియంత్రణ అవసరం



ఢిల్లీలోని తన నివాసంలో బిల్‌గేట్స్‌తో భేటీ అయిన ప్రధాని మోదీ

మళ్లీ అధికారం చేపట్టిన వెంటనే గర్భాశయ కేన్సర్ టీకా అభివృద్ధికి నిధులు

బిల్‌గేట్స్‌తో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

టెక్నాలజీని ప్రజలకు చేరువ చేయడంలో భారత్ భేష్: బిల్‌గేట్స్ 9

శ్రీలక్ష్మి.. నీ మహిమలూ..!

అడ్డగోలు జీవోలు.. అంతే వేగంగా వెనక్కి

ఆమె పేరు... శ్రీలక్ష్మి! సీనియర్ ఐఏఎస్ అధికారి! రాష్ట్ర మునిసిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి! గతంలో పాలకులు చెప్పినట్లుగా వి ని, అడ్డగోలుగా సంతకాలు పెట్టడంతో ఎదురైన అనుభవాలను అప్పుడే మరిచిపోయినట్లున్నారు! ఇప్పుడూ అదే పని చేస్తున్నారు! 'తాడేపల్లి క్యాంపు' చెప్పినట్టల్లా నిధులు విడుదలకు అడ్డగోలు జీవోలు జారీ చేశారు. చివరికి... పరువు పోగొట్టుకున్నారు!

- నిబంధనలు తెలిసీ తప్పుడు ఆదేశాలు
- పూర్తికాని పనులకూ బిల్లుల చెల్లింపు
- రాజకీయ ప్రయోజనాలే లక్ష్యంగా జీవోలు
- కీలక నిబంధన ఉల్లంఘనతో ఆందోళన
- తప్పుడు ఆదేశాలను బయటపెట్టిన 'ఆంధ్రజ్యోతి'
- మూడు జీవోలు ఉపసంహరించుకున్న శ్రీలక్ష్మి

పాత అనుభవాలు మరిచిపోయి అవే తప్పులు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'మీరు నవ్వుకున్నా సరే! నేను చేసేది చేస్తా! తాడేపల్లి ప్యాలెస్ ఆదేశాలనే అమలు చేస్తా!'... ఇదీ ఆ మహిళా ఐఏఎస్ వ్యవహార శైలి! అర్హులను మూలకు తోసేసి.. అస్మదీయులకు బిల్లులు చెల్లించడమే అంతిమ లక్ష్యం. ఆమె ఎవరో కాదు! ప్రస్తుతం రాష్ట్రంలోనే అత్యంత సీనియర్ ఐఏఎస్ అధికారి, మునిసిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి! రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి కంటే కూడా ఆమెనే సీనియర్. అయినా, జీవోల్లో ఘోర తప్పిదాలు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా.. 'పూర్తి కాబోయే పనులకూ' బిల్లులు

మిగతా 10వ పేజీలో...





జగన్‌కు నిరసన సెగ

కర్నూలు జిల్లాలో సీఎం జగన్‌కు నిరసన సెగ తగిలింది. తాగునీటి సమస్య తీర్చాలంటూ గూడూరు మండలం కొత్తూరుకు చెందిన మహిళలు ఖాళీ బిందెలతో జగన్ బస్సు యాత్రకు ఇలా అడ్డు తగిలారు.

అబద్ధాలతో సిద్ధం

99% హామీలు అమలు చేశామని జగన్ గొప్పలు

- హోదా, రైల్వేజోన్, స్టీల్‌ప్లాంట్ ఏవీ?
- సంపూర్ణ మద్యపాన నిషేధం ఏదీ?
- ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల, సీపీఎస్ రద్దు ఎక్కడ?
- అతీగతీ లేని పోలవరం ప్రాజెక్టు
- కీలక హామీలపై సీఎం మౌనం
- వివేకా హత్యపై మళ్లీ డ్రామా
- సొంతగడ్డపైనా బస్సు యాత్రకు జనం నుంచి స్పందన కరువు



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మూడు విమర్శలు, ఆరు అబద్ధాలు.. అన్నట్టుగా ముఖ్యమంత్రి జగన్ ఎన్నికల ప్రచారం సాగుతోంది. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపైనా అబద్ధాలు. ప్రతిపక్ష నేతలపై చేస్తున్న ఆరోపణల్లోనూ అసత్యాలు, అబద్ధాలే వల్లె వేస్తున్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చానని జగన్ గొప్పలు చెబుతున్నారు. ఓసారి 2019 ఎన్నికల సమయంలో జగన్ ఇచ్చిన హామీలను గుర్తు చేసుకుంటే.. ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు, కడప స్టీల్ ప్లాంట్, విశాఖ రైల్వే జోన్, దుగరాజపట్నం పోర్టు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, అర్హులందరికీ ఇళ్లు, ప్రతి ఏటా జనవరి ఒకటో తేదీన జాబ్ క్యాలెండర్, సీపీఎస్

మిగతా 11వ పేజీలో...

రద్దులు.. గుద్దులు.. కేసులు.. కూల్చివేతలు

విధ్వంసక జగన్

వైసీపీ తుక్కుతుక్కు కావడం ఖాయం: బాబు



కావలిలో ప్రజాగళం సభకు హాజరైన జనం. (ప్రసంగిస్తున్న చంద్రబాబు)

- ఇచ్ఛాపురం నుంచి మంత్రాలయం వరకు ఎన్డీయే తుఫాన్
- జగన్ నోరు తెరిస్తే అబద్ధాలే.. 3 రాజధానులు కట్టేశాడట!
- ఈయన్ను విమర్శిస్తే పోలీసులొచ్చి కేసు పెడతారు
- ఊళ్లో దొంగలు పడితే కలిసి తరిమికొట్టినట్టే ఈ అరాచక శక్తిని సాగనంపడానికీ ఒక్కటవ్వాలి
- మే 13న ఈ సీఎం అహంకారం అణిగిపోతుంది
- ప్రజల భవిష్యత్ కోసమే జనసేన, బీజేపీతో పొత్తు
- జగన్‌ను తరిమికొడదాం.. రాష్ట్రాన్ని బాగు చేసుకుందాం
- బనగానపల్లె, కావలి, వింజమూరు 'ప్రజాగళం'లో బాబు

జగన్.. నీ సొంత చిన్నాన్నను చంపావు. చంపిన వారికి టికెట్ ఇచ్చి మీ నాన్న, చిన్నాన్నలను వెక్కిరిస్తున్నావా? వారి ఆత్మను క్షోభ పెడతావా? చెల్లెలినీ జైలుకు పంపించాలని చూస్తున్నావ్! -చంద్రబాబు

నెల్లూరు/నంద్యాల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం నుంచి మంత్రాలయం వరకు ఎన్డీయే తుఫాన్ రానుందని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. దీని దెబ్బకు ఫ్యాన్ రెక్కలు విరిగి చెత్తబుట్టలో చేరడం ఖాయమని స్పష్టం చేశారు. సీఎం జగన్ నోరుతెరిస్తే అబద్ధాలేనని.. గత ఐదేళ్లలో అరాచక పాలన సాగించారని ధ్వజమెత్తారు. అందరం

మిగతా 12వ పేజీలో...

చీపురుపల్లిలో బొత్స X కళా

12

- భీమిలిలో గంటా.. టీడీపీ అభ్యర్థుల తుది జాబితా
- గుంతకల్లులో జయరాం.. ఆలూరులో వీరభద్ర గౌడ్
- దర్శిలో గొట్టిపాటి లక్ష్మికి చాన్స్.. రాజంపేటలో సుగవాసి
- ఒంగోలు లోక్‌సభ మాగుంటకే.. భూపేశ్‌రెడ్డికి కడప
- అప్పలనాయుడికి విజయనగరం.. రఘురామపై చర్చలు

టీడీపీలో చేరిన 'పేట' వైసీపీ నేత మల్లెల

టీడీపీలో టికెట్ల చిచ్చు | అనంత, అనపర్తిలో భగ్గుమన్న తమ్ముళ్లు

డీఎస్సీ.. ఓ కల!



నేడు జరగాల్సిన డీఎస్సీ వాయిదా

ఐదేళ్లలో ఒక్కటీ పూర్తిచేయలేకపోయిన జగన్

- 57 నెలల తర్వాత నోటిఫికేషన్.. పూర్తికాదని తెలిసీ విడుదల 10
- ఎన్నికల వేళ పోటీ పరీక్షలు వాయిదా.. అయినా నిర్వహిస్తామని వెల్లడి
- నిరుద్యోగులను ముంచిన వైసీపీ.. ఫీజులు వృథా అంటున్న అభ్యర్థులు

"ఏ దుష్టశక్తులూ అడ్డుపడకుంటే డీఎస్సీని సకాలంలో పూర్తిచేస్తాం. కానీ అడ్డుపడితే చేసేదేం ఉండదు" ఈ ఏడాది ఫిబ్రవరి 12న డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల సమయంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వ్యాఖ్య ఇది. ఆయన అన్నట్టు ఏ దుష్టశక్తులూ అడ్డుపడలేదు. కానీ, డీఎస్సీ నిర్వహణలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. మొదట ప్రకటించిన షెడ్యూలును మార్చి, రెండో షెడ్యూలు విడుదల చేసినా పరీక్షల నిర్వహణలో చేతులెత్తేసింది. దీనికి ఎన్నికల కమిషన్ అనుమతివ్వలేదని పాఠశాల విద్యాశాఖ సాకుగా చూపుతున్నా, అసలు డీఎస్సీపై ప్రభుత్వానికే చిత్తశుద్ధి లేదన్న విషయం తేటతెల్లమవుతోంది.

నీళ్లు.. కన్నీళ్లు



అడుగంటిన జలాశయాలు



నీరు లేక నెర్రెలు చీలిన కర్నూలు జిల్లాలోని సుంకేసుల జలాశయం

- డెడ్ స్టోరేజీకి శ్రీశైలం, సాగర్
- ఎండిపోయి నెర్రలిచ్చిన సుంకేసుల
- తోటపల్లిలో తగ్గుతున్న నీటినిల్వలు
- అడుగంటిన ప్రకాశం బ్యారేజీ, పులిచింతల
- గోదావరిలో వేగంగా పడిపోతున్న మట్టాలు
- వంతులవారీగా సరిపెట్టడానికి తంటాలు
- మార్చి నెలాఖరు నాటికే ఈ పరిస్థితి
- ఇక మే నెల నాటికి దాహం కేకలే 11
- సీమలో ముంచుకొస్తున్న వేసవి ఎద్దడి

జలహక్కులను కాపాడటంలో జగన్ ప్రభుత్వ ఉదాశీనత రాష్ట్రంలోని ప్రధాన డ్యామ్‌లకు శాపంగా మారింది. గత ఏడాది రాష్ట్రాన్ని తీవ్ర వర్షాభావ పరిస్థితులు చుట్టుముట్టాయి. అయినా, తెలంగాణ ఇబ్బడిముబ్బడిగా జల విద్యుదుత్పత్తి చేసింది. నీటి నిల్వలను పరిరక్షించాల్సిన ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పుకోవడంతో తెలంగాణ ఇష్టానుసారం వ్యవహరించింది. దీంతో వేసవి ముదరక ముందే నీటి ఎద్దడి రాష్ట్రమంతా ముసురుకుంటోంది. జంట జలాశయాలు శ్రీశైలం, నాగార్జునసాగర్ సహా రాష్ట్రంలోని ప్రధాన జలాశయాలు, ఆనకట్టల్లో నీటినిల్వలు కనిష్ఠ స్థాయి కంటే దిగువకు చేరుకున్నాయి.

1823 కోట్లు కట్టండి

కాంగ్రెస్‌కు ఐటీ శాఖ తాఖీదులు

- 1993 నుంచి లెక్కలు తీసిన ఆదాయపు పన్ను శాఖ
- ఇది ట్యాక్స్ టెర్రరిజమేనన్న కాంగ్రెస్
- అధికారంలోకి వచ్చాక అరాచక శక్తులపై చర్యలు
- మళ్లీ ఇలాంటి పనులు చేయకుండా బుద్ధి చెబుతాం
- ఇది నా గ్యారెంటీ: రాహుల్ గాంధీ
- బీజేపీకి రూ. 4,600 కోట్ల ఫైన్ వేయాలి: ఖర్గే
- శని, ఆదివారాల్లో దేశవ్యాప్త నిరసనలకు పిలుపు

న్యూఢిల్లీ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌పై ఆదాయపన్ను (ఐటీ) శాఖ మరో భారీ వేటు వేసింది. ఇప్పటికే రూ.270 కోట్ల మేర బ్యాంకుఖాతాల్ని స్తంభింపజేసి రూ.135 కోట్లను స్వాధీనం చేసుకున్న ఐటీ శాఖ.. శుక్రవారం మరో రూ.1,823.08 కోట్ల మేర నోటీసులు పంపించింది. దీనిపై కాంగ్రెస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది పన్ను ఉగ్రవాదమేనని అభివర్ణించింది. ఆదాయపన్ను శాఖ బీజేపీ అనుబంధ విభాగంలా పని చేస్తోందని విమర్శించింది. తాము అధికారంలోకి వచ్చాక తీవ్ర చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఐటీ నోటీసులపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందిస్తూ.. ప్రతిపక్షం మీద మాత్రమే అన్యాయంగా వ్యవహరించేలా

మిగతా 9వ పేజీలో...

భారత్‌లో రాజకీయ హక్కులకు రక్షణ ఉందని భావిస్తాం

ఎన్నికలు స్వేచ్ఛగా జరుగుతాయని ఆశిస్తున్నాం

కేజ్రీవాల్ అరెస్టుపై ఐరాస వ్యాఖ్య 9

కేజ్రీకి మద్దతుగా రేపు ఢిల్లీలో సభ

హాజరు కానున్న రాహుల్, 13 పార్టీల నేతలు

ఎండ సుర్రు సుర్రు!

- రాష్ట్రంలో పెరిగిన ఎండ తీవ్రత
- నంద్యాలలో 42.5 డిగ్రీలు నమోదు
- పలుప్రాంతాల్లో మొదలైన వడగాడ్పులు
- దేశంలో సగం ప్రాంతంలో వేడి వాతావరణం
- అనేక చోట్ల 40-43 డిగ్రీల మధ్య నమోదు 3



నేడు, రేపు బ్యాంకులు

పనిచేస్తాయ్

ఎల్ఐసీ కార్యాలయాలూ.. 9

ట్రాక్టర్‌తో తొక్కించి.. కత్తులతో విరుచుకుపడి!

- గుంటూరు జిల్లాలో బరితెగించిన వైసీపీ ఇసుక మాఫియా
- ఒకరికి తీవ్ర గాయాలు.. మరికొందరికి గాయాలు
- భయంతో పరుగులు తీసిన గ్రామస్థులు 9

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మాటల వెనుక మాయలు

న్యాయవ్యవస్థకు వ్యతిరేకంగా కుట్ర జరుగుతోందని, ఎన్నికలవేళ ఆ సర్వోన్నత వ్యవస్థను అప్రదిష్టపాల్జేసే యత్నాలు సాగుతున్నాయంటూ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్‌కు ఏకంగా ఆరువందలమంది న్యాయవాదులు మూకుమ్మడి లేఖ రాయడం చిన్న విషయమేమీ కాదు. ఎంతో కీలకమైన అంశాల్లో అన్నివందలమంది ఏకాభిప్రాయాన్ని కలిగివుండటం, వాటిని గుదిగుచ్చి, న్యాయవ్యవస్థను రక్షించుకోండంటూ సీజేఐకు హెచ్చరికలాంటి జాగ్రత్తలు చెప్పడం విశేషమే. న్యాయవ్యవస్థ పరువును దిగజార్చేందుకు, దానిని భయంలో ముంచెత్తి తీర్పులను ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తున్న బృందాలు, కుట్రదారులు, విచ్ఛిన్నకరశక్తులు ఎవరో ఈ లేఖలో లేదు కానీ, దానిని సంధించిన ఆరువందలమందిలో ప్రముఖంగా కనిపించిన పేరు హరీశ్ సాల్వే. ప్రముఖులపక్షాన మాత్రమే వాదించే ఈ ప్రముఖ న్యాయవాది ఇటీవల ఎన్నికలబాండ్ల కేసులో గుప్తదానాల గుట్టును సుప్రీంకోర్టు బహిరంగపరచడాన్ని వ్యతిరేకించిన విషయం తెలిసిందే. న్యాయవ్యవస్థకు కొన్ని హెచ్చరికలు, కాసిన్ని జాగ్రత్తలు చెప్పిన ఈ లేఖమీద ప్రధాని నరేంద్రమోదీ స్పందించడం మరో విశేషం. ఆయన దానిని బేఖాతరుచేసివుంటే ఇంత ప్రాధాన్యత రాకపోయి వుండేది. కానీ, ఆ లేఖను ఆయన సద్వినియోగం చేసుకున్నారు. వేధించడం కాంగ్రెస్‌కు అనాదిగా ఉన్న అలవాటేనంటూ, ఐదుదశాబ్దాలక్రితమే ‘కమిటెడ్ జుడీషియరీ’ని ఆ పార్టీ కోరుకుందని విమర్శించారు. ఇందుకు జవాబుగా కాంగ్రెస్ కూడా మోదీ హయాంలో న్యాయవ్యవస్థలో సంభవించిన వివిధ పరిణామాలను గుర్తుచేసి, ప్రతీవ్యవస్థనూ మీరే భ్రష్టుపట్టించేశారంటూ ప్రతివిమర్శలు చేసింది.

లేఖలో ఉన్న అంశాల లోతుపాతుల్లోకి పోవాల్సిన అవసరం లేదు కానీ, న్యాయవ్యవస్థను, దాని స్వతంత్రతను కాపాడటానికి ఉద్దేశించే ఎటువంటి ప్రయత్నమైనా అది సద్బుద్ధితో జరిగినపక్షంలో ప్రశంసించాల్సిందే. లేఖలోని అంశాలకంటే దానిని మోదీ ముందుకు తోయడం, ఆ తరువాత రవిశంకర్ ప్రసాద్ మీడియా సమావేశంలోనూ అవే విమర్శలు కొనసాగించడంతో చాలామందికి ఈ లేఖ వెనుక ఉన్న లక్ష్యాలమీద అనుమానాలు కలగడం మొదలైంది. కుట్రదారులు, వెన్నుపోటుదారుల నుంచి న్యాయవ్యవస్థను రక్షించేందుకు ఉద్దేశించినట్టుగా ఉపరితలంలో కనిపిస్తున్న ఈ వ్యవహారాన్ని తెరవెనుకనుంచి నడిపిస్తున్నది పాలకులేనని వారి అనుమానం. న్యాయవ్యవస్థను కొందరు శాసిస్తున్నారని, తీర్పులను ప్రభావితం చేస్తున్నారని, ముఖ్యంగా అవినీతి కేసుల్లో ఇరుకున్న రాజకీయనాయకుల విషయంలో కోర్టులమీద ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఒత్తిడితెస్తున్నారంటూ ఈ లేఖలో ప్రస్తావించిన అంశాలు ఇప్పటి రాజకీయవాతావరణంలో ఎవరిపక్షాన ఎవరు చేస్తున్న ఆరోపణలో ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు.

తీర్పులను ప్రభావితం చేసేందుకు కొంతమంది కుట్రలు చేస్తున్నారన్నది లేఖలో ఓ ప్రధాన ఆరోపణ. నిజానికి, సుదీర్ఘకాలంగా సర్వోన్నతన్యాయస్థానం నుంచి కేంద్రంలోని ప్రభుత్వాన్ని ఇబ్బందుల్లో పడవేసే తీర్పులేవీ వెలువడలేదు. ఇటీవల ఎన్నికలబాండ్ల కేసులో తీర్పు ప్రజాస్వామ్య ప్రియులకు కాస్తంత ఉపశమనాన్ని ఇచ్చింది. బీజేపీ ప్రభుత్వం ఏరికోరి తెచ్చుకున్న ఈ విధానం రాజ్యాంగవ్యతిరేకమనీ, అప్రజాస్వామికమని అంటూ సుప్రీంకోర్టు దానిని కొట్టివేసింది. అంతటితో ఊరుకోకుండా ఆ గోప్యతను బద్దలు కొట్టే దిశగా పట్టుబట్టిమరీ జారీ చేసిన ఆదేశాలు పాలకులను ఇబ్బందిలో పడవేసిన మాట నిజం. అధికారపక్షానికి మొత్తంగా ఎంత ముట్టిందన్నది అటుంచితే, ఎవరు ఎప్పుడు ఆ పార్టీకి ఎందుకు విరాళం ఇచ్చారన్న అనంతర విశ్లేషణలు దానిని ఎన్నికల ముందు ఇబ్బంది పెడుతున్నాయి. ఎన్నికలబాండ్ల కేసులో హరీశ్ సాల్వే పాత్ర అందరికీ తెలుసు. ఇక, ఈ బాండ్ల లావాదేవీలను బహిర్గతం చేయకుండా, కార్పొరేట్ కంపెనీలకూ రాజకీయపార్టీలకు మధ్య ఉన్న లాలూచీ బయటపడకుండా సుప్రీంకోర్టును నియంత్రించాల్సిందిగా రాష్ట్రపతికి లేఖరాసిన మరో వ్యక్తి ఈ లేఖమీద సంతకం చేసిన సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆదిష్ అగర్వాలా. రామమందిరం ఆరంభోత్సవం నాడు న్యాయవ్యవస్థకు సెలవుదినంగా ప్రకటించాలని అభ్యర్థించిన బార్ కౌన్సిల్ ఆఫ్ ఛైర్మన్ సంతకం చేసినవారిలో మరొకరు. ఈవీఎంలు, సీఏఏ ఇత్యాది కీలకమైన కేసుల్లో సర్వోన్నత న్యాయస్థానం నుంచి రాబోయే రోజుల్లో తీర్పులు వెలువడాల్సి ఉంది. పౌరసమాజం, మీడియా, రాజకీయం ఇత్యాది రంగాలనుంచి అరెస్టయిన అసమ్మతి గొంతులను అది వింటున్నది. న్యాయవ్యవస్థను ప్రభావితం చేయడానికో, హద్దుల్లో ఉంచడానికో పాలకపక్షంనుంచి ఏవో ప్రయత్నాలు జరగడం కొత్తేమీ కాదు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఉద్దేశించిన భవిష్యత్ తీర్పులను ఈ విన్యాసాలు ప్రభావితం చేయకూడదని సామాన్యుడి ఆకాంక్ష.

‘రంగం’ తరహాలో కేజ్రీవాల్ రాజకీయం!

తొమ్మిదేళ్ళ క్రితం ఢిల్లీ మహానగరంలో అన్నా హజారే నేతృత్వంలో సాగిన లోక్‌పాల్ బిల్లు సాధనా ఉద్యమం, తర్వాత జరిగిన నిర్భయ ఉద్యమం సాధారణ ప్రజలు, విద్యార్థులు, విద్యావంతులు, మేధావులను విశేషంగా ఆకర్షించి ఢిల్లీ రాజకీయాలను ప్రత్యామ్నాయ మార్పు దిశగా మళ్ళించాయి. కానీ అన్నా హజారే నేతృత్వంలో సాగిన ఈ అవినీతి వ్యతిరేక మహా ఉద్యమంలో అవకాశవాద శక్తుల చేరిక ప్రత్యామ్నాయ మార్గాన్ని సమూలంగా మార్చివేసిందని చెప్పవచ్చు. కమ్యూనిస్టు భావజాలంతో ప్రభావితమైన అరవింద్ కేజ్రీవాల్ గాంధేయ మార్గంలో కొనసాగుతున్న అన్నా హజారే ఉద్యమాన్ని హైజాక్ చేశారన్న విషయాన్ని ఇప్పటివరకు యావత్ దేశ ప్రజలు ముఖ్యంగా ఢిల్లీ వాసులు ఎవరూ గ్రహించలేకయారు. అన్నా హజారే చేపట్టిన అవినీతి వ్యతిరేక ఉద్యమాన్ని కేజ్రీవాల్ చాకచక్యంగా వాడుకోగలిగారు. మరోవైపు మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని అప్పటి యూపీఏ ప్రభుత్వం అవినీతి, దీర్ఘకాలం ఢిల్లీ ముఖ్యమంత్రిగా సాగిన షీలా దీక్షిత్ పాలన కేజ్రీవాల్ నాయకత్వానికి వరంగా మారింది.

ముందస్తు ప్రణాళికలో భాగంగానే మావోయిస్టు భావజాలం కలిగిన అరవింద్ కేజ్రీవాల్ సమయ సందర్భాలను అంచనా వేసి 2012లో ఆమ్ ఆద్మీ పేరిట రాజకీయ పార్టీని ప్రారంభించారు. కేవలం సామాజిక దృక్పథంలో సాగిన అన్నా హజారే నేతృత్వంలోని ఉద్యమాన్ని రాజకీయాలకు వాడుకోగలిగారు కేజ్రీవాల్. 2013లో జరిగిన ఢిల్లీ రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికల్లో మొదటిసారి పోటీచేసిన ఆప్ పార్టీ విజయం సాధించి కేవలం 49 రోజులు మాత్రమే అధికారంలో ఉండగలిగింది. అనంతరం 2015, 2020 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించి మరో రెండుసార్లు అధికారంలోకి వచ్చారు కేజ్రీవాల్.



కేవలం సామాజిక దృక్పథంలో సాగిన అన్నాహజారే నేతృత్వంలోని ఉద్యమాన్ని రాజకీయాలకు వాడుకోగలిగారు కేజ్రీవాల్. ‘రంగం’ సినిమాలో మాదిరిగా రాజకీయరంగంలో కేజ్రీవాల్ ఎన్నో కుట్రలు కుతంత్రాలు నడిపారు.

దశాబ్దం క్రితం 2011లో తమిళంలో ‘కో’ అన్న పేరుతోనూ, తెలుగులో ‘రంగం’ అన్న పేరుతోనూ విడుదలై భారీ విజయం సాధించిన సినిమా కథకు, అరవింద్ కేజ్రీవాల్ రాజకీయ జీవితానికి పోలికలు ఇప్పుడు బైట పడుతున్నాయి. ‘రంగం’ సినిమాలో మాదిరిగానే కేజ్రీవాల్ రాజకీయ రంగంలో ఎన్నో కుట్రలు కుతంత్రాలు నడిపారు. రంగం సినిమాలో నక్సలైట్ నేత బోస్ వెంకట్ బృందం బ్యాంకు దోపిడీ చేసిన తరహాలోనే ఆర్థిక నేరాలకు పాల్పడిన కొంతమంది కేజ్రీవాల్ పార్టీ నిర్వహణకు, ఎన్నికలకు సహకరించారన్న ఆరోపణలు గతంలో వచ్చిన విషయం విదితమే. సినిమా క్లైమాక్స్‌లో నక్సలైటు నేత పాత్రలో కనిపించిన బోస్ వెంకట్ ‘విశ్వవిద్యాలయాల్లో, అధికార వర్గాల్లో, చివరకు మీడియాలో సైతం మా వాళ్ళు ఉన్నారు’ అన్నట్టుగానే ఢిల్లీ మహానగరంలోని అన్ని విశ్వవిద్యాలయాలు, అనుబంధ కళాశాలల్లో మేధావులుగా చలామణి అవుతున్న అర్బన్ నక్సలైట్లు, వామపక్ష నాయకత్వం, విశ్వవిద్యాలయాల్లో తిష్ట వేసిన పలు సంస్థలు, సంఘాల నాయకత్వం అంతా కేజ్రీవాల్‌ను గెలిపించిందన్నది వాస్తవం. అంతేకాదు సినిమాలో బాంబు పేలుడును జర్నలిస్టు పాత్రధారి సరస్వతి గుర్తించి హత్యకు గురైన మాదిరిగానే ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు అన్వర్ తారీఖ్, ఆయన అనుచరుల చేతిలో ఢిల్లీ నిఘా విభాగం అధికారి అంకిత శర్మ దారుణ హత్యకు గురయ్యారు. సినిమాలో రేణుక-అశ్వత్థామ (జీవా-కార్తీక నాయర్) పాత్రలు నవతరం రాజకీయ పార్టీ నేత వసంత్‌కు ప్రచార ప్రసార సాధనాలుగా సహకరించిన మాదిరిగానే బీజేపీని ఈ పరిస్థితుల్లో అధికారంలోకి రాకుండా చేయాలన్న ఉద్దేశంతో పని చేసిన అర్బన్ నక్సలైట్లు, వామపక్ష నాయకత్వం, ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో ప్రభావం చూపగల ఖలిస్తాన్ లాంటి వేర్పాటువాద జాతి వ్యతిరేక గ్రూపులన్నీ ఆప్ పార్టీని అధికారంలోకి వచ్చేలా చేశాయి. సినిమాలో లాగానే ఆమ్ ఆద్మీ పార్టీ నిజ స్వరూపం త్వరలోనే బయటపడే అవకాశాలు అధికంగానే ఉన్నాయి.

ఢిల్లీ అల్లర్ల నేపథ్యంలో ఆప్ నేత తారిక్ అన్వర్ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాకు పలుమార్లు ఫోన్‌కాల్స్ చేశారన్న విషయం బయటకు రావడమే నిదర్శనంగా చెప్పవచ్చు. ఎన్నికల అనంతరం ఢిల్లీలో జరిగిన అల్లర్లలో సిరియా, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్, సౌదీ దేశాల్లో వినియోగించిన విధ్వంస సాధనాల వంటివే ఆప్ నేతల నివాస ప్రాంతాల్లో కనిపించడాన్ని బట్టి ఆప్ పార్టీ వ్యవహార శైలి బట్టబయలవుతోంది. పూర్వ ఆప్ పార్టీ నేత కుమార్ విశ్వాస్ కేజ్రీవాల్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. పంజాబ్‌కు విస్తరించే క్రమంలో ఖలిస్తాన్‌తో చేతులు కలిపి భవిష్యత్తులో ప్రత్యేక పంజాబ్ దేశానికి ప్రధానమంత్రి కావాలన్న తన మనోగతాన్ని కేజ్రీవాల్ తనకు వివరించాడని బాహాటంగా పత్రికలకు వివరించాడు కుమార్ విశ్వాస్. 2014 నుంచి 2022 వరకు 16 మిలియన్లు అంటే దాదాపు రూ.134 కోట్లు ఆప్ పార్టీకి విరాళాలు ఇచ్చామని, అందుకు ప్రతిగా ఖలిస్తాన్ ఉగ్రవాద నేత దేవేందర్ పాల్ సింగ్ బుల్లర్‌ను జైలు నుంచి విడుదల చేస్తామని కేజ్రీవాల్ తమకు హామీ ఇచ్చాడని ప్రత్యేక ఖలిస్తాన్ ఉగ్రవాదనేత గురు పత్వంత్ పున్నన్ ఆరోపించిన విషయం విదితమే. అరవింద్ కేజ్రీవాల్ రైతుల ఉద్యమం పేరిట షహీన్ బాగ్ అల్లర్ల పేరిట దేశ రాజధాని ఢిల్లీలోను, పంజాబ్, గోవాల్లోను విచ్ఛిన్నకర జాతి వ్యతిరేక కుట్రలు అమలు చేశాడన్నది నేటి పరిస్థితులను చూస్తే అవగతమవుతుంది. చీమలు పెట్టిన పుట్టల్లో పాములు దూరినట్టు సమాజ హితాన్ని కోరి ప్రారంభించిన ఉద్యమాన్ని హైజాక్ చేసిన కేజ్రీవాల్ అవినీతి కుంభకోణంలో దోషిగా నిలబడడం పట్ల అన్నా హజారే, సంతోష్ హెగ్డే తీవ్ర మనోవేదనకు గురయ్యారని వారి ప్రకటనలు తెలియజేస్తున్నాయి. ఏది ఏమైనా రాజకీయ అధికారం కోసం నీతిమంతులుగా చెలామణీ అవుతూ తెర వెనక కుట్రలూ కుతంత్రాలకు పాల్పడే కొంతమంది నేతల తీరును కళ్లకు కట్టినట్లు చూపించిన ‘రంగం’ సినిమాలో దర్శకుడు కె.వి. ఆనంద్‌ను అభినందించాల్సిందే.

▪ కొట్టె మురళీకృష్ణ

వికసిత భారత్ విశ్వరూపం!

ఆర్థికాభివృద్ధిలో దేశం ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్నది. ప్రపంచంలో ఐదో అతి పెద్ద ఆర్థికశక్తిగా రూపుదిద్దుకుంది. బ్రిటన్‌ను మించిపోయింది. ఐదేళ్లలో జర్మనీని, జపాన్‌ను కూడా దాటేసి తృతీయ ఆర్థికశక్తిగా ఆవిర్భవిస్తోందని జోస్యాలు వెలువడ్డాయి. ఇండియా స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధిరేటు ఈ ఏడాది 6.5 శాతానికి చేరుకుంటుందని ప్రపంచ ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఇది 8 శాతాన్ని తాకుతుందని కేంద్ర ఆర్థికశాఖ సగర్వంగా చాటుకుంటోంది. త్వరలోనే సంపన్నదేశం కావడం ఖాయమని, అయితే వచ్చే పాతికేళ్లపాటు ఏటా 8 శాతం వృద్ధిని సాధిస్తే తప్ప ఆ స్థాయిని చేరుకోలేమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇలా, వృద్ధిరేటు గురించి ఇంత గొప్పలు పోతున్నప్పటికీ మానవాభివృద్ధిలో చాలా వెనుకబడి ఉన్నాము. వ్యవసాయరంగం మీద ఆధారపడి బతుకులీడుస్తున్న అసంఖ్యాకమైన మిగులు కార్మికశక్తిని ఇతర లాభసాటి ఉత్పాదకరంగాల్లోకి బదలాయిస్తేనే దేశం నిజంగా అభివృద్ధి చెందినట్లని నిపుణులు పేర్కొంటున్నారు. అలాగే కార్మికుల్లో నైపుణ్యాన్ని పెంపొందించాల్సిన అవసరాన్నీ నొక్కి చెబుతున్నారు. ఇంజనీరింగ్ వంటి పట్టభద్రుల్లో సైతం ఆధునిక పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కొరవడిన చేదు వాస్తవం మన ముందు ఉంది. మన దేశంలో తయారీరంగం ఇంకా పుంజుకోవలసి ఉంది. చైనా ఆ రంగంలో దూసుకెళ్లడం వల్లే విశేష స్థాయిలో ఉద్యోగాలు కల్పించగలిగింది.


చైనాతో విసిగిపోయిన బహుళజాతి సంస్థలు తమ పెట్టుబడులను మన దేశానికు తరలిస్తాయన్న అంచనాలు ఫలించలేదు. పాలకవర్గాలే రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను మతపరంగా విభజించి నిరంతరం ఘర్షణ వాతావరణాన్ని పోషిస్తుంటే పెట్టుబడులు ఏ విధంగా తరలి వస్తాయి? అందుకే మన తయారీరంగం ఇంకా దేశీయ మార్కెట్ దయాదాక్షిణ్యాల పైనే ఆధారపడి బతుకుతున్నది. అంతర్జాతీయ మార్కెట్‌ను ఆకట్టుకుని ఎగుమతులను పెంచుకోలేకపోతున్నది. ఉత్పత్తిని బట్టి ప్రోత్సాహం (ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్-పిఎల్ఐ) పథకమూ ఆశించిన ఫలితాలను ఇవ్వడం లేదు.

మన జీడీపీలో సర్వీసుల రంగం వాటా 50 శాతం పైనే ఉండగా తయారీరంగం అట్టడుగున 16–17 శాతం దాటడం లేదు. దాన్ని 25 శాతానికి పెంచాలనే లక్ష్యంతో 2014లో ప్రధాని నరేంద్ర మోడీ మేక్ ఇన్ ఇండియాను ఆవిష్కరించినా అది విఫలమయింది. తయారీ రంగంలో పరిశ్రమలు అధికసంఖ్యలో ఏర్పాటయితే తప్ప వ్యవసాయ రంగం నుంచి అదనపు కార్మికశక్తిని బదలాయించడం సాధ్యపడదు. సర్వీసుల రంగంలో విశేష ప్రగతికి తోడ్పడుతున్న ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) వంటి రంగాలకు అవసరమైన ఉన్నత విద్యావంతులు సాగురంగంలోని కార్మిక శక్తి నుంచి లభించరు. వారికి ఉపాధి కల్పించగల ప్రత్యామ్నాయరంగం తయారీరంగమే. దేశంలోని మొత్తం కార్మికశక్తిలో 45.76 శాతం మంది ప్రస్తుతం వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉన్నారని పీరియాడికల్ లేబర్ ఫోర్స్ సర్వే -పిఎల్ఎఫ్ఎస్ గణాంకాలు వెల్లడించాయి.

దేశ జనాభాలో అత్యధికంగా ఉన్న పేదల బతుకులను బాగుపరచనంతవరకు ప్రపంచంలో ఐదో ఆర్థికశక్తిగా ఎదిగామని, మూడో స్థాయికి దూసుకుపోతున్నామని చెప్పుకుని మురిసిపోయే హక్కు, అర్హత మనకు ఉండవు. ప్రపంచంలోనే అత్యంత ఎక్కువగా ఆహారోత్పత్తి చేసే దేశాల్లో మన దేశం రెండోస్థానంలో ఉన్నా ప్రపంచ ఆకలి సూచీలోని 125 దేశాల్లో మన ర్యాంకు మాత్రం 111. ప్రపంచంలో పోషకాహారం లభించని జనంలోని పావు వంతు మందికి మన దేశం నిలయంగా ఉంది. 19 కోట్ల మంది ఆకలితో అలమటిస్తున్నారు. 2022లో వెలువరించిన ప్రపంచ ఆకలిసూచీ ప్రకారం 121 దేశాల్లో ఇండియా ర్యాంకు 107 కాగా, మనకంటే ఎంతో మెరుగైన స్థితిలో పాకిస్తాన్ (99వ స్థానం), నైజీరియా (103వ స్థానం) ఉండడం గమనించవలసిన విషయం. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 ప్రకారం దేశంలో ఐదు ఐదేళ్ల లోపు పిల్లల్లో మూడింట ఒక వంతు మంది వయసుకు తగ్గ పొడవులో లేరు. ప్రతి ఐదుగురిలో ఒకరు ఎత్తుకు తగ్గ బరువు లేరు.

గత పదేళ్లలో దేశంలో పాతికకోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారనే ఒక ప్రచారం ఈ మధ్య హఠాత్తుగా ఊపు అందుకుంది. ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో 2022–23 నాటికి 24.8 కోట్ల మంది పేదలు బహుముఖీన పేదరికం నుంచి విముక్తి పొందారని నీతి ఆయోగ్ తన కొత్త నివేదికలో వెల్లడించింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ప్రధాని నరేంద్ర మోడీ వంటి వారు దీనిని పదే పదే చెప్పుకుంటున్నారు. అయితే చాలామంది ఆర్థికవేత్తలు దీనిని సహేతుకమైన ప్రశ్నలతో, ప్రతివాదనలతో ఖండించారు. 2014 నుంచి 2022 వరకు 8 సంవత్సరాల పాటు వినియోగఖర్చుకు సంబంధించిన సర్వేలు జరుపకుండా బహుముఖీన దారిద్ర్య సూచిని రూపొందించడం ఒక రాజకీయ కుట్ర అని బాత్ యూనివర్సిటీ విజిటింగ్ ప్రొఫెసర్ సంతోష్ మెహ్రోత్ర ఎండగట్టారు. నీతి ఆయోగ్ చెబుతున్నట్టు ప్రజల బతుకుల్లో ఏమైనా మెరుగుదల వచ్చిందీ అంటే, మోడీ పాలన కంటే ముందున్న ప్రభుత్వాలు ఆరోగ్యం, విద్య, సంక్షేమరంగాల్లో వేసిన పునాది, చేసిన కృషి వల్ల సాధ్యమైనదిమాత్రమేనని మెహ్రోత్ర వ్యాఖ్యానించారు. పూర్వపు యూపీఏ ప్రభుత్వం విద్యాహక్కు చట్టాన్ని, ఆహార భద్రతాచట్టాన్ని తెచ్చి విద్య, ఆరోగ్య, ఆహారరంగాల్లో బాగా నిధులు వినియోగించిన విషయాన్ని మెహ్రోత్ర గుర్తు చేశారు. ప్రజల కొనుగోలు శక్తి పెరిగిన దాఖలాలు లేకుండా బహుముఖీన పేదరికం నుంచి బయటపడినట్టు చెప్పలేమని నిపుణులెందరో అభిప్రాయపడుతున్నారు.

ప్రధాని మోడీ ప్రభుత్వం 2014 నుంచి అమలు చేసిన అనేక పథకాలు ప్రజలను పేదరికం ఊబిలోనుంచి బయటకు లాగాయని బీజేపీ పెద్దలు చెప్పుకుంటున్నారు. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన ద్వారా ఉచితంగా ఆహారధాన్యాల సరఫరా, పీఎం ఆవాస్ యోజన ద్వారా పేదలకు ఇళ్ళు, జన్‌ధన్ యోజన ద్వారా నగదు బదిలీ, ఇంకా ఉజ్వల యోజన ద్వారా చౌక వంటగ్యాస్ వంటి అనేక పథకాలు పేదల బతుకులను మార్చివేశాయని అమిత్ షా వంటి పెద్దలు చాటింపు వేస్తున్నారు. ఈ పథకాలు చేస్తున్న మేలు సముద్రంలో నీటి బొట్టు కంటే బహు తక్కువ అనడం అసంబద్ధం కాబోదు. అలాగే ఇవి మోడీ ప్రభుత్వమే కొత్తగా ప్రవేశపెట్టినవి కావు. దక్షిణాదిలో రూపాయికే కిలోబియ్యం, ఉచితబియ్యం, అమ్మ కాంటీన్లు, అన్న కాంటీన్లు, ఉచితఇళ్ళు వంటి పథకాలు ఎన్నో చిరకాలంగా అమలవుతున్నాయి. ఎన్ని చేసినా అవి కలిగించే ప్రయోజనాన్ని అదుపులేని ద్రవ్యోల్బణం, అధిక ధరలు హరించివేస్తున్నాయి. పేదల బతుకులను ఉన్నచోటి నుంచి అరసెంటిమీటరైనా ముందుకు జరపలేకపోతున్నాయి. ఏ ప్రభుత్వమైనా ప్రజలకు ఏ చిన్న పథకమూ అమలు చేయనక్కరలేదు. ధరలను కొంతకాలమైనా సహేతుకస్థాయిలో నిలిపి ఉంచితే చాలు. పేదరికం తప్పనిసరిగా తగ్గి తీరుతుంది. అది చేయకుండా ఇంకేమి చేసినా వృథాయే.



దక్షిణాదిలో రూపాయికే కిలోబియ్యం, ఉచితబియ్యం, అమ్మ కాంటీన్లు, అన్న కాంటీన్లు, ఉచితఇళ్ళు వంటి పథకాలు ఎన్నో చిరకాలంగా అమలవుతున్నాయి. ఎన్ని చేసినా అవి కలిగించే ప్రయోజనాన్ని అదుపులేని ద్రవ్యోల్బణం, అధిక ధరలు హరించి వేస్తున్నాయి. పేదల బతుకులను ఉన్నచోటి నుంచి అరసెంటిమీటరైనా ముందుకు జరపలేకపోతున్నాయి. ఏ ప్రభుత్వమైనా ప్రజలకు ఏ చిన్న పథకమూ అమలు చేయనక్కరలేదు. ధరలను కొంతకాలమైనా సహేతుకస్థాయిలో నిలిపి ఉంచితే చాలు. పేదరికం తప్పనిసరిగా తగ్గి తీరుతుంది. అది చేయకుండా ఇంకేమి చేసినా వృథాయే.

గోరు చుట్టు మీద రోకటి పోటులా దేశంలో ఆర్థికవ్యత్యాసాలు గత పదేళ్లలో ఎంతగా పెరిగిపోయాయో గణాంక వివరాలు కళ్ళకు కడుతున్నాయి. ఈ వ్యత్యాసాలు బ్రెజిల్, దక్షిణాఫ్రికా, అమెరికాలో కంటే భారత్‌లో ఎక్కువగా, మరీ ఘోరంగా ఉన్నాయని రుజువైంది. మన దేశంలో అత్యంత ఐశ్వర్యవంతులయిన ఒక్కశాతం మంది గుప్పెట్లోనే 40.1 శాతం సంపద కేంద్రీకృతమైనట్టు నివేదిక చాటింది. నలుగురు ఆర్థికవేత్తలు 2022–23లో పారిస్ నుంచి నిగ్గుతేల్చిన ఈ స్థాయి వ్యత్యాసాలను ఇండియాలో 1961 నుంచి ఎన్నడూ చూడలేదని ఆ నివేదిక స్పష్టం చేసింది. సంపాదనలోనే కాదు, ప్రజల ఆదాయాల్లోనూ ఈ తేడా కొట్టొచ్చినట్టుగా ఉందని పేర్కొంది. భారత్‌లో బిలియనీర్ రాజ్ ఏలుబడి సాగుతోందని ఆ ఆర్థికవేత్తలు వ్యాఖ్యానించారు. కుల, మత శ్రేణుల వారీగా అసమానతలు పేరుకుపోయాయని అభిప్రాయపడ్డారు. భారతీయ సమాజం కర్మ సిద్ధాంతం ఇరుసు మీద తిరుగుతున్నదని వ్యాఖ్యానించారు. మరోవైపు గత పదేళ్ల ఎన్‌డీఏ పాలనలో పెన్షన్, గ్రాట్యుటీ వంటి సామాజిక భద్రత కలిగిన స్థిరమైన ఉద్యోగాల కల్పన లేనే లేదని శాస్త్రీయ సర్వేలు స్పష్టం చేశాయి. దేశంలోని 34 శాతం కుటుంబాలు రోజుకు రూ.375 (జాతీయ క్షేత్రస్థాయి కనీస వేతనం) కంటే తక్కువ సంపాదిస్తున్న చేదు వాస్తవాన్ని ఎత్తి చూపాయి. దేశంలోని నిరుద్యోగ యువతలో సెకండరీ లేక ఉన్నత విద్య చదువుకున్నవారు 2000లో 35 శాతం కాగా 2022 నాటికి 65.7 శాతానికి పెరిగిందని అంతర్జాతీయ కార్మికసంస్థ నివేదిక తేల్చి చెప్పింది. మానవాభివృద్ధి సంస్థ కూడా ఇదే మాట నొక్కి చెప్పింది. అంతమందికి ప్రభుత్వం నేరుగా ఉద్యోగాలు కల్పించడం కష్టం అనే మాట వాస్తవమే. ప్రైవేటురంగంలో పెట్టుబడులను విశేషంగా ఆకర్షించి భారీసంఖ్యలో ఉద్యోగ అవకాశాలు కలిగించే దిశగా కృషి చేయాలి.

2047 కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా చేస్తామని ప్రధాని నరేంద్ర మోడీ గొప్పలు పోవడాన్ని చూసి రఘురామ్ రాజన్ వంటి ఆర్థికవేత్తలు నవ్వుకుంటున్నారు. చాలా మందికి ఉన్నత పాఠశాల విద్య కూడా అందుబాటులో లేని పరిస్థితిలో అది దుస్సాధ్యమని రాజన్ చేసిన హెచ్చరిక గమనించదగినది. 140 కోట్ల జనాభాలో సగం కంటే ఎక్కువ మంది 30 సంవత్సరాల లోపు వారు కావడం వరమైతే వారికి సరైన చదువు, నైపుణ్యాలు కొరవడడం శాపమని ఆయన చేసిన విశ్లేషణ కొట్టివేయదగింది కానే కాదు.

• జి. శ్రీరామమూర్తి
సీనియర్ జర్నలిస్ట్

ఆర్బీఐ వేడుకల్లో అంబేడ్కర్ చిత్రపటం!

భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) ఏప్రిల్ 1న తన 89వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటోంది. నిజానికి, వందేళ్ళ క్రితం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సహకారం లేకుంటే నేడు ఈ రిజర్వు బ్యాంక్ ఉనికిలోనే ఉండేది కాదు. 1770లో కలకత్తాలో ‘బ్యాంక్ ఆఫ్ హిందుస్థాన్’ ఏర్పడి పన్నెండేళ్ళకే మూతబడింది. తర్వాత కాలక్రమంలో బ్యాంక్ ఆఫ్ బెంగాల్, బ్యాంక్ ఆఫ్ బొంబాయి, బ్యాంక్ ఆఫ్ మద్రాస్ వంటివి ఏర్పడ్డాయి. మొట్టమొదటి స్వదేశీ బ్యాంక్ ‘అలహాబాద్ బ్యాంక్’ 1865లో కలకత్తాలో ఏర్పడింది. మొదటి ప్రపంచయుద్ధం తరువాత, బ్రిటిష్ ప్రభుత్వం 1921లో అప్పటివరకూ ఉన్న బ్యాంకులన్నింటినీ కలిపి ఇంపీరియల్ బ్యాంక్ ఏర్పాటు చేసినప్పటికీ, దేశం ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని పరిష్కరించడంలో అప్పటి బ్యాంకింగ్ వ్యవస్థ తన కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వర్తించలేకపోయింది. ఈ ఆర్థిక సంక్షోభ స్థితిగతుల నేపథ్యంలోనే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తన 32వ ఏట రాసిన ఓ పుస్తకం భారత ఆర్థిక వ్యవస్థకు మార్గదర్శిగా నిలిచింది. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో డాక్టరేట్ డిగ్రీ కోసం ఆయన చేసిన పరిశోధన ఆధారంగా, 1923లో లండన్‌లో వెలువరించిన ‘ద ప్రాబ్లమ్ ఆఫ్ రూపీ’ గ్రంథం అప్పటి ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి బాటలు పరిచింది. భారత కరెన్సీ సంస్కరణలపై బ్రిటిష్ ప్రభుత్వం నియమించిన హిల్టన్ యంగ్ కమిషన్ సభ్యులకు ఈ పుస్తకం కరదీపిక అయింది. అర్థశాస్త్రంతో సంబంధం ఉన్న ప్రతిఒక్కరూ అప్పట్లో ఈ పుస్తకంపై చర్చలు జరిపారు. హిల్టన్ యంగ్ ఆధ్వర్యంలో నియమించిన రాయల్ కమిషన్‌కు అంబేడ్కర్ లోతైన సూచనలు చేశారు. తదనుగుణంగా కరెన్సీ చలామణి, మారకం రేటు నిర్వహణ ఇత్యాది అంశాలపై పూర్తి నియంత్రణాధికారాలు గల సర్వస్వతంత్ర కేంద్రీయ బ్యాంక్ ఏర్పాటుకు అనుగుణంగా కమిషన్ నివేదిక ఇచ్చింది. రిజర్వ్ బ్యాంక్ ఏర్పాటుకు 1927లోనే బ్రిటిష్ ప్రభుత్వం బిల్లు ప్రవేశపెట్టినప్పటికీ, వివిధ కారణాలరీత్యా అది వాయిదాపడి చివరకు 1935 ఏప్రిల్ 1న రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏర్పడింది. దీనికి ముందు దేశ ఆర్థికవ్యవస్థ, బ్యాంకింగ్ వ్యవస్థ ఎదుర్కొన్న సమస్యలు, సంక్షోభాల రీత్యా ఆ కేంద్రీయ బ్యాంక్ ఏర్పాటు ద్వారా అంబేడ్కర్ ఈ దేశానికి చేసిన సహాయం, దిశానిర్దేశం విస్మరించలేనివి. ఈ నేపథ్యంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటా తన వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో అంబేడ్కర్ చిత్రపటాన్ని ప్రముఖంగా ఉంచాలి, ఆయనకు అంజలి ఘటించాలి.


– జెరిపోతుల పరుశురాం
(కరెన్సీపై అంబేడ్కర్ ఫోటో సాధన సమితి)

అయోమయంలో అపర చాణక్య!

చావుదలకు చాలా మందికి జ్ఞాన బోధ కలుగుతుంది. సామాన్యుడి నుంచి సకల భోగాలు అనుభవించిన వ్యక్తి దాకా ఎవరైనా కన్న తల్లిని పుట్టి పెరిగిన ఊరిని తలచుకుంటారు చివరి దశలో అక్కడికి చేరుకోవాలని తపిస్తారు. తెలంగాణా రాజకీయాల్లో తలపండిన నేత డా. కె.కేశవరావుకు అలా అనిపించడంలో తప్పేమీ లేదు. ఆయనకు కొంత ఆలస్యంగా ఎనభై నాలుగేళ్ల వయసులో ఈ విషయం బోధపడింది. సరిగ్గా పదకొండేళ్ల క్రితం ఆయన కన్నతల్లిలాంటి కాంగ్రెస్ పార్టీని వదిలి తెలంగాణా తల్లిని ఆవాహన చేసుకున్నారు. నిజానికి కేశవరావు మొదటినుంచీ తెలంగాణాకోసం మాట్లాడేవారు. కాంగ్రెస్ పార్టీలో అదే ఆయనకు గుర్తింపు, గౌరవం, పదవులు రావడానికి కారణం అయ్యింది. ఎన్నడూ ప్రజాక్షేత్రంలో లేకపోయినా, ప్రత్యక్షంగా శాసనసభకు ఎన్నిక కాకపోయినా ఆయనకు కాంగ్రెస్ పార్టీ అనేక అవకాశాలు ఇచ్చింది. శాసనమండలి సభ్యుడిగా ఆయనకు రెండుసార్లు అవకాశం ఇవ్వడమే కాకుండా 1980 నాటినుంచే మంత్రిగా కూడా అవకాశాలు ఇచ్చింది. భవనం వెంకట్రామ్ మంత్రి మండలిలో ఆయన అతి చిన్న వయసులో విద్యాశాఖ మంత్రిగా ఆ తరువాత పరిశ్రమలశాఖా మంత్రిగా అనేక కీలక హోదాల్లో పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా కూడా ఉన్నారు. జాతీయ స్థాయిలో కూడా కొంతకాలం ఆయన చక్రం తిప్పారు. అత్యున్నత విధాన నిర్ణాయక విభాగం అయినా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా, నాలుగైదు కీలక రాష్ట్రాలకు ఇంచార్జిగా ఎదిగారు. ఏ పదవిలో ఉన్నా తన లౌక్యం, మాటతీరుతో నెగ్గుకువచ్చిన కేకే చాణక్యం ఆయనను పార్టీ పదవుల్లోనే కాకుండా, మూడు దఫాలుగా రాజ్యసభలో ఉండేలా చేసింది. మొదట కాంగ్రెస్ నుంచి 2006–12 మధ్యకాలంలో రాజ్యసభ సభ్యుడిగా ఉన్న ఆయన తన పదవీ కాలం ముగిసిన వెంటనే అప్పటి టీఆర్ఎస్‌లో చేరి 2014లో మళ్లీ రాజ్యసభకు టీఆర్ఎస్ నుంచి నామినేట్ అవడం అప్పటి తెలంగాణా ఉద్యమకారులను ఆశ్చర్యపరిచింది. తెలంగాణా ఉద్యమం మొదలుపెట్టిన వారినీ, ఆ తరువాత టీఆర్ఎస్ పుట్టిన నాటినుంచీ పనిచేసిన అనేకమంది మేధావులను, ఉద్యమకారులను కాదని కేసీఆర్ ఎందుకోగానీ కేకేను గట్టిగా నమ్మారు. అప్పుడు తెలంగాణా ఏర్పాటు డోలాయమానంగా ఉన్న కారణంగా కేకేకు కాంగ్రెస్‌తో ఉన్న అనుబంధం లాబీయింగుకు పనికొస్తుందని అందరూ దానిని ఆమోదించారు. ఆ తరువాత రెండోసారికూడా అప్పటికే తెలంగాణా పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా ఉన్న ఆయనను టీఆర్ఎస్ మరోసారి రాజ్యసభకు పంపించింది. ఇప్పుడు తన పదవీకాలం ఇంకా రెండొంతులు మిగిలి ఉండగానే ఆయన భారత రాష్ట్ర సమితిని వదిలి కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు ప్రకటించారు. చనిపోయేముందు కాంగ్రెస్ పార్టీలో ఉండాలని అనుకుంటున్నట్టు మీడియాలో వచ్చిన వార్తలు రాజకీయ పరిశీలకులను ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. ఇది ఒక్క కేకే విషయంలోనే కాదు. గతంలో ధర్మపురి శ్రీనివాస్ విషయంలో కూడా ఇదే జరిగింది. తెలంగాణా ఏర్పడకముందు కాంగ్రెస్ పార్టీకి ఆయన అధ్యక్షుడు కూడా. ఆయన కూడా కాంగ్రెస్ ప్రభుత్వాల్లో మంత్రిగా ఉన్నారు. తీరా 2014లో ఆయన టీఆర్ఎస్‌లో చేరిందే తడవుగా కేసీఆర్ ఆయనను రాజ్యసభకు పంపించారు కానీ ఆయనకు కూడా నాలుగేళ్లు తిరగక ముందే కన్నతల్లిలాంటి కాంగ్రెస్ పార్టీ గుర్తుకు వచ్చి రాజీనామా చేయకుండానే ఆ వొడిలో వాలిపోయారు. అప్పుడు ఆయన చెప్పిన మాటే ఇప్పుడు కేకే కూడా చెపుతున్నారు. దానం నాగేందర్ కూడా దాదాపు అదే చెపుతున్నాడు. ఈ ముగ్గురు కాంగ్రెస్ పార్టీ పాత కాపులకు దక్కిన మర్యాద, మన్నన కేసీఆర్ దగ్గర ఉద్యమకారులకు కూడా దక్కలేదన్నది వాస్తవం.

భారతదేశంలో ప్రజలు ఎవరికయినా సరే శాశ్వతంగా విధేయులుగా ఉండరు. ప్రజలకు తమ జీవితానుభవం, సామాజిక సంపర్కం ద్వారా సంక్రమించిన జ్ఞానం ఉంటుంది. ఇది ఇప్పుడే కాదు. గతంలో ఇండియాకు తానే ప్రతిరూపం అనుకున్న ఇందిరా గాంధీ, తెలుగుజాతికి స్ఫూర్తి దీపం అనుకున్న ఎన్‌టీరామారావుకు కూడా చరిత్రలో ప్రజలు ఇలాంటి పాఠాలు చెప్పారు. ఆ అనుభవాలను కూడా కేసీఆర్ ఆకళింపు చేసుకోలేక పోయారు. నమ్మాల్సిన వారిని నమ్మకపోవడం, అసలే నమ్మగూడని వారిని అందలం ఎక్కించడం కొన్నిసార్లు ఆశ్చర్యం కలిగించేది. అది ఆయనకు, ఆయన పార్టీకే కాదు తెలంగాణాకు కూడా చాలా నష్టం కలిగించింది. కోదండరాం విషయమే తీసుకుందాం, ప్రొఫెసర్ జయశంకర్ ప్రోది చేసిన విద్యావంతుల వేదిక నుంచి మొదలై, టీఆర్ఎస్‌కు తిరుగులేని పౌరసమాజ బలాన్ని సమకూర్చి, రాజకీయ ఐక్యకార్యాచరణలో కలిసి నడిచిన ఆయనను, ఆయన లాంటి అనేకమందిని అనుమానించి దూరం చేసుకున్నాడు. పది ఇరవై ఏళ్లుగా తెలంగాణా కోసం పనిచేసిన అనేకమంది మేధావులు, బుద్ధి జీవులు, ప్రజాసంఘాల నాయకులు, దళితులు, ముస్లింలు, మహిళలు, ఆదివాసీ బిడ్డలు, అటుకులు బుక్కీ, అంబలి తాగి పోరాటంలో నిలబడ్డ వాళ్ళు తెలంగాణా పునర్నిర్మాణంలో భాగస్వాములు కాలేకపోయారు. ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా అప్పుడు అధికారంలో, పదవుల్లో, ఆంధ్ర పార్టీలతో అంటకాగిన వాళ్ళు తెలంగాణలో మంత్రులై , అధికారులే ఆధిపత్యం చెలాయించారు. దానం నాగేందర్, పట్నం మహేందర్ రెడ్డి చివరకు కడియం శ్రీహరి లాంటి అనేకమంది అయాచితంగా అధికారం చెలాయించారు. నిజానికి కడియం శ్రీహరి చివరంటా చంద్రబాబు నాయుడు వెంటే ఉన్నారు. ఎన్నికలకు ముందు టీఆర్ఎస్‌లో చేరి నేరుగా ఉపముఖ్యమంత్రి కాగలిగారు. ఎంపీగా, ఎంఎల్సీగా, ఎమ్మెల్యేగా అనేక అవకాశాలు పొందారు. చివరకు తన కూతురికి కూడా కేసీఆర్ అవకాశం ఇచ్చారు. కానీ ఆయన విధేయత చూపలేదు సరికదా ఇప్పుడు ఉన్నట్టుండి ఎదురు తిరిగారు. వ్యక్తిగతంగా అంతో ఇంతో విలువలతో బతికిన శ్రీహరి గారికి జీవిత చరమాంకంలో కూతురు భవిష్యత్తు ముఖ్యమని అనిపించింది. మంద కృష్ణ చెప్పినట్టు ఆయన ఒక్కడి వల్ల అక్కడ కనీసం నలుగురైదుగురు నాయకులు నష్టపోయారు. కేవలం కేసీఆర్ గుడ్డి నమ్మకం వల్లనే ఇదంతా జరిగింది అనే వాళ్ళూ బీఆర్ఎస్‌లోనే ఉన్నారు. ఇలాంటి అంచనాలు తప్పడం మూలంగా ఇప్పుడు ఆ పార్టీ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది.

రాజకీయాల్లో ఓడిపోతున్నామని తెలిసినా పోరాడి తీరాలి. గెలుస్తామన్న భరోసా శ్రేణులకు కలిగించాలి. ఈ విషయం తెలంగాణా ఉద్యమాన్ని నడిపిన కేసీఆర్‌కు బాగా తెలుసు. కానీ ఆయన ఎందుకో అయోమయంలో ఉన్నట్టు కనిపిస్తోంది. అది కేవలం ఆ పార్టీకే కాదు. తెలంగాణాకు కూడా నష్టం. బీఆర్ఎస్ ఉనికిలో ఉండడం తెలంగాణ అవసరం.



నమ్మాల్సిన కొండా విశ్వేశ్వర్ రెడ్డిని, పొంగులేటి శ్రీనివాస రెడ్డిని, నయాన్నో భయాన్నో కాపాడుకోవాల్సిన ఈటెల రాజేందర్‌ను కాపాడుకుని ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదు.

నిజానికి కేసీఆర్ అపరచాణక్యుడని ఇప్పుడు పార్టీ వీడుతున్న వారితో సహా చాలామంది అంటుంటారు కానీ అది ఉట్టి ప్రచారం అని తేలిపోతోంది. తెలంగాణాలో ఒక తిరుగులేని అస్తిత్వ శక్తిగా ఉండి తెలంగాణా సాధనను సాకారం చేసి, పదేళ్ల పాటు తెలంగాణా రాష్ట్రాన్ని తిరుగులేకుండా తీర్చిదిద్దామని చెప్పిన పార్టీ ఇప్పుడు దిక్కుతోచని దయనీయ స్థితిలో పడిపోయిందంటే కేసీఆర్ రాజకీయ చాణక్యం పనిచేయడం లేదని అర్థం అవుతోంది. రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత ఎందుకోగానీ కేసీఆర్ తనకు తిరుగులేదని అనుకున్నారు, తన మాటే శాసనం అనుకుని ప్రజల మనసులో ఏముందో గుర్తించలేకపోయారు. పద్నాలుగేళ్ల పాటు ప్రజల్లో ఉండి నడిపించిన నాయకుడు ప్రజల ఆలోచనలను గమనించలేక దూరమయ్యాడు. పార్టీ నిర్మాణం కూడా అవసరం లేదనే అభిప్రాయంలో తెలంగాణా అంటే కేసీఆర్, కేసీఆర్ అంటే తెలంగాణా అన్న ధోరణిలోకి వెళ్లారు. ప్రజలతో, పార్టీ శ్రేణులతో సంబంధం లేకపోవడం, పరిపాలన మీద పట్టు సడలడంతో పాటు ఇదంతా అహంకారం, దొరతనం, కుటుంబ ఆధిపత్యం అనే ప్రచారం ప్రజల్లోకి వెళ్లడం ఆ పార్టీని పదవిలోకి రాకుండా చేసింది. నిజానికి ఎన్నికల ప్రచారం నాటికి అవినీతి, అభివృద్ధి జరుగలేదనే విమర్శ పెద్దగా లేదు. ఇప్పుడు వెలుగులోకి వస్తున్న కథనాలేవీ అప్పటికి బయటపడలేదు. అయినా ప్రజలు ఆ పార్టీని నమ్మలేదు. ఆ విషయాన్ని ఇప్పటికీ ఆ పార్టీ నమ్మడం లేదు, ప్రజల అభిప్రాయాన్ని గౌరవించడం లేదనుకోండి అది వేరే విషయం.

ఈ ఎన్నికల్లో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే పోటీ మొత్తం బీఆర్ఎస్ వెర్సెస్ బీఆర్ఎస్ అన్నట్టుగా సాగుతోంది. ఇటువంటి పరిస్థితి గతంలో ఎప్పుడూ ఎదురుకాలేదు. మల్కాజిగిరిలో ఈటెల రాజేందర్, సునీతా రెడ్డి, చేవెళ్లలో ప్రత్యర్థులుగా ఉన్న విశ్వేశ్వర్ రెడ్డి, రంజిత్ రెడ్డి బీఆర్ఎస్ తీర్చిదిద్దిన నాయకులే. రేపు వరంగల్ బరిలో కూడా ముగ్గురూ బీఆర్ఎస్ మూలాలనుంచి వచ్చిన వాళ్ళే పోటీ పడబోతున్నారు. ఆదిలాబాద్, జహీరాబాద్, నాగర్ కర్నూల్, వరంగల్, మహబూబాబాద్, మెదక్ నియోజక వర్గాల్లో కూడా బీఆర్ఎస్ పోటీ పడుతున్నది పాత టీఆర్ఎస్ నేతలతోనే. వీళ్లంతా నాయకుడి అవిశ్వాసం వల్ల మాత్రమే బయటకు వెళ్లారు. ఈటెల, విశ్వేశ్వర్ రెడ్డి, రఘునందన్ రావు, బూర నర్సయ్య, సీతారాం నాయక్ వంటి తెలంగాణా ఉద్యమంలో ఉన్న వాళ్ళను ఒకరకంగా బలవంతంగా బయటకు పంపారు. ఇది ఇప్పుడు మొదటికే మోసం వచ్చే విధంగా తయారయ్యింది. రాజకీయాల్లో నిజానికి పార్టీ శ్రేణులకు అనుగునంగా నడుచుకోవాలి. నాయకత్వం ప్రజాస్వామికంగా ఉండాలి. ఎదిగి వచ్చిన నాయకులను గౌరవించాలి. వారి శక్తి సామర్థ్యాలు గుర్తించాలి. మరోవైపు సిద్ధాంత ప్రాతిపదికన ఎదిగి నిలదొక్కుకోవాలి. కాంగ్రెస్ పార్టీ ఆ పని చేసింది, రేవంత్ రెడ్డి ఆ పార్టీలో చేరిన నాలుగేళ్లలో అక్కడ నాయకుడు కాగలిగాడు. అవసరాన్ని గుర్తించిన పార్టీ నలభై ఏళ్లుగా ఉన్న వాళ్ళను కూడా పక్కకు నెట్టి ఆయనను కూర్చోబెట్టి తెలంగాణలో నిలదొక్కుకోగలిగింది. భారతీయ జనతా పార్టీ తన సిద్ధాంతాన్ని తాను ప్రోది చేసుకుంటూనే నడిసొచ్చిన నేతలందరినీ తనలో కలుపుకుంటూ విస్తృతం అవుతోంది. ఈటెల రాజేందర్‌కు ఆ పార్టీ ఇస్తోన్న ప్రాధాన్యమే దానికి ఉదాహరణ. బీఆర్ఎస్‌లో ఈ రెండూ లోపించడం వల్లే ఇవాళ దూదిపింజలా తేలిపోతోంది. చాణక్య నీతి అంటే బలహీనుడైన శత్రువుతో స్నేహం చేసుకోవడం తప్ప బలహీనులను శత్రువులు చేసుకోవడం కాదు. అలా అయిన వాళ్లందరినీ బలహీనులని వదిలేసుకోవడం వల్లే ఇప్పుడు ఈ పరిస్థితి. నిజానికి బీఆర్ఎస్ క్షేత్రస్థాయిలో ఇంకా బలంగానే ఉంది. కొన్నిచోట్ల తన ప్రత్యర్థులకంటే కూడా. కానీ నాయకత్వం నైరాశ్యంలో పడిపోతోంది. రాజకీయాల్లో ఓడిపోతున్నామని తెలిసినా పోరాడి తీరాలి. గెలుస్తామన్న భరోసా శ్రేణులకు కలిగించాలి. ఈ విషయం తెలంగాణా ఉద్యమాన్ని నడిపిన కేసీఆర్‌కు బాగా తెలుసు. కానీ ఆయన ఎందుకో అయోమయంలో ఉన్నట్టు కనిపిస్తోంది. అది కేవలం ఆ పార్టీకే కాదు. తెలంగాణాకు కూడా నష్టం. బీఆర్ఎస్ ఉనికిలో ఉండడం తెలంగాణ అవసరం.

○ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి
(రాజకీయ విశ్లేషకులు)

గురువే వేధిస్తే.. ఇంకెవరికి చెప్పుకోవాలి నాన్నా!

- హాస్టల్ భవనం పైనుంచి దూకి.. పాలిటెక్నిక్ విద్యార్థిని బలవన్మరణం
- లైంగిక వేధింపులే కారణమని తల్లిదండ్రులకు మెసేజ్
- చాలామంది అమ్మాయిలపై వేధింపులని ఆవేదన
- విశాఖలోని కొమ్మాది కళాశాలలో దారుణం

విశాఖపట్నం/కొమ్మాది, మార్చి 29: 'లైంగిక వేధింపులపై ఫ్యాకల్టీకి చెప్పవచ్చు కదా అని మీరు అనుకోవచ్చు. కానీ చదువు చెప్పాల్సిన గురువే కొందరు విద్యార్థులతో కలిసి వేధింపులకు పాల్పడుతుంటే.. ఇంక ఎవరికి చెప్పాలి నాన్నా.. నా ఒక్క దాని విషయంలోనే ఇలా జరగలేదు. కళాశాలలో చాలామంది విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎవరికీ చెప్పుకోలేక, కాలేజీకి వెళ్లలేక నలిగిపోతున్నాం. పోలీసులకు చెబితే సోషల్ మీడియాలో అసభ్యకరమైన ఫొటోలు పెడతామంటూ బెదిరిస్తున్నారు. ఎవరో ఒకరు చస్తే కానీ బయట ప్రపంచానికి ఈ కీచకుల గురించి తెలియదు. ఆ పని నేనే చేస్తున్నా.. నన్ను క్షమించండి...' ఇదీ.. శుక్రవారం విశాఖ కొమ్మాదిలోని చైతన్య పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థిని తన తండ్రికి పంపిన మెసేజ్ సారాంశం!. నగర పరిధిలోని కొమ్మాది చైతన్య పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న ఆ విద్యార్థిని ఆ విద్యా సంస్థ హాస్టల్ భవనం పైనుంచి దూకి శుక్రవారం ఆత్మహత్య చేసుకుంది. కాలేజీలో ఓ అధ్యాపకుడి లైంగిక వేధింపులు భరించలేకే తాను చనిపోతున్నానని తండ్రికి వాట్సాప్ ద్వారా పంపిన లేఖలో పేర్కొంది. పీఎం పాలెం సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లి జిల్లా నాతవరం మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (17) కొమ్మాదిలోని చైతన్య పాలిటెక్నిక్ కళాశాల హాస్టల్‌లో ఉంటూ మొదటి సంవత్సరం (సీఎంఈ) చదువుకుంటోంది. గురువారం ఆమె కళాశాలకు వెళ్లలేదు. సాయంత్రం స్టడీ అవర్స్‌కు కూడా రాకపోవడంతో రూమ్‌తో పాటు ప్రాంగణం మొత్తం వెదికినా కనిపించకపోవడంతో ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించినట్టు హాస్టల్ సిబ్బంది చెబుతున్నారు. అయితే కళాశాల హాస్టల్ ప్రాంగణంలోని సీసీ పుటేజీలను పోలీసులు పరిశీలించగా ఉదయం నుంచి వాష్‌రూమ్‌లో ఉన్న బాలిక.. రాత్రి 11.50 గంటల సమయంలో బయటకు వచ్చి నేరుగా టెర్రస్ మీదకు వెళ్లింది. తండ్రికి, అక్కకు తాను చనిపోతున్నట్టు సెల్ ఫోన్ నుంచి మెసేజ్ పంపించింది. తాను చనిపోవడానికి గల కారణాలను పేర్కొంది. అనంతరం 1.05 గంటల సమయంలో టెర్రస్ పైనుంచి కిందకు దూకింది. కుమార్తె పంపిన మెసేజ్ చూసిన తల్లిదండ్రులు కంగారుపడి డయల్ 100కు సమాచారం అందించారు. స్థానిక పోలీసులు వెళ్లేసరికి పరిస్థితి చెయ్యి దాటిపోయింది. భవనం పైనుంచి ఏదో కిందపడిన శబ్దం రావడంతో వాచ్‌మన్ వెళ్లిచూశాడు. అక్కడ బాలిక కిందపడి ఉండడంతో కళాశాల సిబ్బందిని అప్రమత్తం చేయడంతో వెంటనే కారులో గాయత్రి ఆసుపత్రికి, అక్కడి నుంచి అంబులెన్స్‌లో నగరంలోని మరో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయినా ఫలితం లేకుండా పోయింది. అప్పటికే ఆమె చనిపోయినట్టు వైద్యులు తెలిపారు. విద్యార్థిని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

ఎండ సుర్రు సుర్రు..!

- రాష్ట్రంలో పెరిగిన ఎండ తీవ్రత
- నంద్యాలలో 42.5 డిగ్రీలు నమోదు
- పలుప్రాంతాల్లో మొదలైన వడగాడ్పులు
- దేశంలో సగం ప్రాంతంలో వేడి వాతావరణం
- అనేక చోట్ల 40-43 డిగ్రీల మధ్య నమోదు



విజయనగరంలో కర్ఫ్యూను తలపించిన రహదారులు

విశాఖపట్నం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మార్చి నెల చివరి అంకంలో ఎండ తీవ్రత క్రమేపీ పెరిగింది. వారం క్రితం వరకు దక్షిణాదికే పరిమితమైన ఎండలు రానురానూ మధ్య భారతం, దానికి ఆనుకుని పశ్చిమ, తూర్పు వాయవ్య భారతానికీ విస్తరించాయి. దీనికితోడు వర్షాలు లేకపోవడంతో ఎండ తీవ్రత మరింత పెరిగింది. సాధారణంగా ఏప్రిల్‌లో ఎక్కువ ప్రాంతాల్లో వీయాల్సిన వడగాడ్పులు మార్చి నెలాఖరులోనే మొదలయ్యాయి. శుక్రవారం అనేకచోట్ల గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 నుంచి 43 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. ఇవి సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు అధికం. మహారాష్ట్రలోని అకోలాలో అత్యధికంగా 42.6 డిగ్రీలు, రాయలసీమలోని నంద్యాలలో 42.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, విదర్భ, ఒడిశా, గుజరాత్ తదితర రాష్ట్రాల్లో వడగాడ్పులు వీచాయి. ఏపీలోనూ రాయలసీమ, కోస్తాల్లోని అనేక ప్రాంతాల్లో ఉదయం నుంచి ఎండ తీవ్రంగా ఉంది. మధ్యాహ్న సమయానికి వడగాడ్పులు వీచాయి. రానున్న రెండు మూడు రోజుల్లో గాడ్పుల ప్రభావం మరింత పెరుగుతుందని, దక్షిణ మధ్య, తూర్పు భారతంలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే.. వాతావరణంలో వచ్చిన మార్పుల ప్రభావంతో ఎండతో పాటు ఉక్కపోత ప్రభావం ఎక్కువగా ఉండడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. అనేకచోట్ల గాలిలో తేమ 50 శాతం కంటే తక్కువకు పడిపోవడంతో గాడ్పుల తీవ్రత పెరుగుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. వచ్చే రెండు నెలలు ఎండలు మరింత పెరిగి గాడ్పుల తీవ్రత ఎక్కువవుతుందని హెచ్చరిస్తున్నారు. వాతావరణ అనిశ్చితి ప్రభావంతో కొన్నిచోట్ల ఉరుములు మెరుపులతో వర్షాలు కురిసిన సమయంలో కొంత ఉపశమనం ఉంటుంది తప్ప మిగతా ప్రాంతాల్లో గాడ్పుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని స్పష్టం చేశారు. కాగా, రానున్న మూడు రోజులు ఏపీలోని పలు మండలాల్లో వడగాడ్పులు వీస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. మున్ముందు ఎండలు పెరుగుతాయి కాబట్టి బయటకు వెళ్లే వారంతా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపింది.

శ్రీవారి సేవలో జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్



తిరుమల ఆలయం ముందు జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్

తిరుమల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ తిరుమల శ్రీవారిని శుక్రవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్న ఆయన్ను వేదపండితులు ఆశీర్వదించగా అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

విశాఖ నుంచి ఎంపీగా పోటీ: కేఏ పాల్

- వరంగల్ నుంచి బాబూమోహన్

విశాఖపట్నం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు బాబూమోహన్ వరంగల్ లోక్‌సభ స్థానానికి ప్రజాశాంతి పార్టీ తరఫున పోటీ చేస్తారని, ఆ పార్టీ అధ్యక్షులు కేఏ పాల్ ప్రకటించారు. విశాఖపట్నంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను విశాఖపట్నం ఎంపీగా పోటీ చేస్తున్నానని, ఎన్నికల ప్రచారం కూడా ప్రారంభించానన్నారు. బాబూమోహన్ మాట్లాడుతూ.. విశాఖలో కేఏ పాల్ విజయం కోసం ప్రచారం చేస్తానన్నారు.

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రావాలి

- వైసీపీ పాలనలో అన్నిరంగాలూ సర్వనాశనం
- టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం
- 'నిజం గెలవాలి' కార్యక్రమంలో నారా భువనేశ్వరి
- మచిలీపట్నం, ఘంటసాల మండలాల్లో పర్యటన



కూచిపూడిలో ప్రజలకు నారా భువనేశ్వరి అభివాదం



ఘంటసాల మండలం తాడేపల్లిలో కొడాలి సుధాకర్ కుటుంబ సభ్యులతో భువనేశ్వరి

మచిలీపట్నం టౌన్, మార్చి 29: ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రావాలని టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ఆకాంక్షించారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కృష్ణాజిల్లాలో చంద్రబాబు అక్రమ అరెస్టుతో మృతిచెందిన కార్యకర్తల కుటుంబాలను ఆమె పరామర్శించారు. మచిలీపట్నం మండలం ఉల్లింగిపాలేనికి చెందిన మట్టా సోమయ్య, కోన గ్రామానికి చెందిన బసవయ్య, ఘంటసాల మండలం తాడేపల్లికి చెందిన కొడాలి సుధాకర్ కుటుంబ సభ్యులను భువనేశ్వరి పరామర్శించి బాధితులను ఓదార్చారు. కోనలో గంగపుత్రుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటితో పాటు మత్స్యకారుల సమస్యలను కోన, పల్లెతుమ్మలపాలెం మహిళలు ఆమెకు విన్నవించారు. కోనలో నిర్వహించిన సభలో భువనేశ్వరి ఎంతో ఉద్వేగంతో మాట్లాడారు. చంద్రబాబు ప్రజల కోసమే తన జీవితాన్ని అంకితం చేశారని చెప్పారు. జైలు నుంచి వచ్చిన వెంటనే విశ్రాంతి తీసుకోకుండా ప్రజల వద్దకు వెళ్లారని తెలిపారు. వైసీపీ పాలనలో అన్ని రంగాలు సర్వనాశనమయ్యాయని, తిరిగి టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల కురుక్షేత్రంలో ఓటు అనే ఆయుధంతో వైసీపీ రాక్షసులను తరిమికొట్టాలని భువనేశ్వరి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్, నాయకులు మత్తి వెంకటేశ్వరరావు, బొబ్బా గోవర్ధన్, పరుచూరి సుధాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు. కూచిపూడి, పామర్రు గ్రామాల్లో ప్రజలు పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.


మోడల్ స్కూల్స్‌లో ఆరో తరగతి అడ్మిషన్లు

అమరావతి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్స్‌లో 2024-25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి అడ్మిషన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 6 వరకు పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ప్రవేశపరీక్ష ఏప్రిల్ 21న రాష్ట్రవ్యాప్తంగా జరుగుతుందన్నారు. 5వ తరగతి స్థాయిలో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలలో ప్రశ్నపత్రం ఉంటుందన్నారు. మోడల్ స్కూల్స్‌లో చదివేందుకు ఎలాంటి ఫీజులు ఉండవన్నారు.

ఏపీసీపీఎస్‌ఈఏ భజన సంఘం కాదు: కోరుకొండ

విజయవాడ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం (ఏపీసీపీఎస్‌ఈఏ) ఏ జేఏసీలోనూ అంతర్భాగంగా లేదని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షులు కోరుకొండ సతీశ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పాత పెన్షన్ పునరుద్ధరణ కోసం ఏపీసీపీఎస్‌ఈఏ గత 8 ఏళ్లుగా ఉద్యమం చేస్తోందన్నారు. జేఏసీలు మద్దతు ఇచ్చినా.. ఆ తర్వాత పక్కన పెట్టినా కూడా ఏ దశలోనూ తాము పోరాటాన్ని వీడలేదన్నారు. ఏ జేఏసీ సంఘాలకు తాము భజన చేయటం లేదన్నారు. కొందరు పనిగట్టుకుని అసత్య ప్రచారం చేస్తున్నారని, వాటిని నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రేమించి పెళ్లి చేసుకుంటా


విజయ్ దేవరకొండ

తాను ప్రేమ పెళ్లి చేసుకుంటానని, అయితే, తనకు కాబోయే భార్య తన తల్లిదండ్రులనూ ప్రేమించేలా ఉండాలని విజయ్ దేవరకొండ అన్నారు. ఆయన నటించిన 'ఫ్యామిలీస్టార్' చిత్రం ఏప్రిల్ 5న విడుదలకానుంది. ఈ చిత్రం ప్రమోషన్స్‌లో భాగంగా శుక్రవారం ఆ చిత్ర నిర్మాత దిల్ రాజుతో కలసి ఆయన చెన్నైలో విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఇందులో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ... 'పెళ్లి చేసుకుని భార్యాపిల్లలతో కలిసి జీవించాలన్న ఆశ, కోరిక నాకు కూడా ఉన్నాయి. కానీ, దానికి కొంత సమయం పడుతుంది. అయితే ప్రేమించే పెళ్లి చేసుకుంటా. నాకు కాబోయే భార్య నా తల్లిదండ్రులను కూడా ప్రేమించాలి. ఆమెను మా అమ్మానాన్న ఇష్టపడాలి. ఇప్పటివరకు నేను ఎవరినీ ప్రేమించలేదు. ఒక సినిమాలో హీరోయిన్ ఎంపిక దర్శకుడు, నిర్మాత చేతుల్లోనే ఉంటుంది. హీరోకు సంబంధం ఉండదు. రాజకీయాల్లో వచ్చే స్థాయికి ఇంకా ఎదగలేదు. చిత్రపరిశ్రమలోనే ఇంకా పైస్థాయికి రావాలన్నదే నా కోరిక' అని అన్నారు.

మాస్ లుక్‌లో...



రజనీకాంత్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న కలయిక పట్టాలెక్కింది. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రజనీకాంత్ హీరోగా ఓ చిత్రం ప్రకటించిన విషయం తెలిసిందే. 'తలైవర్ 171' అనేది వర్కింగ్ టైటిల్. త్వరలో చిత్రీకరణ ప్రారంభం కానుంది. దీనికి సంబంధించిన కీలక అప్డేట్‌ను లోకేశ్ వెల్లడించారు. ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. ఏప్రిల్ 22న టైటిల్‌ను ప్రకటించనున్నట్లు తెలిపారు. పోస్టర్‌లో రజనీకాంత్ మాస్‌లుక్‌లో కనిపించారు. ఆయన చేతులకు వాచ్‌లతో సంకెళ్లు వేసి ఉండడం ఆసక్తిని కలిగించింది. సన్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.

డబుల్ ధమాకా



విష్వక్‌సేన్ తన పుట్టిన రోజు సందర్భంగా రెండు ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్స్‌కు సైన్ చేశారు. పదో చిత్రానికి 'మెకానిక్ రాకీ' అనే పేరు నిర్ణయించారు. కొత్త దర్శకుడు రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో రామ్ తాళ్లూరి ఈ సినిమా నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి హీరోయిన్. కామెడీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు.

రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'లైలా'

విష్వక్ తన 12వ చిత్రం కోసం దర్శకుడు రామ్‌నారాయణ్‌తో చేతులు కలిపారు. నిర్మాత సాహు గారపాటి ఈ చిత్రానికి నిర్మాత. 'లైలా' అని పేరు పెట్టినట్లు వెల్లడిస్తూ టైటిల్ పోస్టర్‌ను విడుదల చేశారు.

అవినీతిపై సంధించిన అస్త్రం



నారా రోహిత్ కథానాయకుడిగా రూపొందుతున్న సీక్వెల్ చిత్రం 'ప్రతినిధి 2'. గతంలో వచ్చిన 'ప్రతినిధి' చిత్రానికి ఇది కొనసాగింపు. కుమార్ రాజా బత్తుల, ఆంజనేయులు శ్రీతోట, సురేంద్రనాథ్ బొల్లినేని ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శుక్రవారం చిరంజీవి చేతుల మీదుగా ఈ చిత్రం టీజర్‌ను యూనిట్ విడుదల చేసింది. రాజకీయ అవినీతిని వెలుగులోకి తెచ్చి ప్రజలను చైతన్యవంతం చేసే యువ జర్నలిస్ట్ పాత్రలో నారా రోహిత్ ఆకట్టుకున్నారు. సచిన్ ఖేడ్కర్, రఘు బాబు, జిష్షు సేన్ గుప్తా కీలకపాత్రలు పోషించారు. ఈ చిత్రానికి సంగీతం: మహతి స్వర సాగర్. సినిమాటోగ్రఫీ: నాని చమిడిశెట్టి.

రూ. వంద కోట్లు వసూలు చేస్తుంది




'డీజే టిల్లు' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందిన 'టిల్లు స్క్వేర్' చిత్రం శుక్రవారం విడుదలై మొదటి షో నుంచే బ్లాక్‌బస్టర్ టాక్ తెచ్చుకుంది. ఈ సందర్భంగా హీరో సిద్దు జొన్నలగడ్డ మాట్లాడుతూ 'నిర్మాతలు నాగవంశీ, చినబాబు, త్రివిక్రమ్‌గార్లకు కృతజ్ఞతలు. ఈ సినిమా అదిరిపోతుందని విడుదలకు ముందే నాకు తెలుసు. ఆ మాట ప్రేక్షకుల నుంచి వినాలని ఆగాను' అన్నారు. 'తొలిసారిగా విభిన్నమైన పాత్ర పోషించాను. లిల్లీ పాత్ర మీద మొదటి నుంచి నాకు నమ్మకం ఉంది. అది నిజమైనందుకు ఆనందంగా ఉంది' అన్నారు అనుపమ పరమేశ్వరన్. నిర్మాత నాగవంశీ మాట్లాడుతూ 'సినిమాకు మంచి టాక్ వచ్చింది. ప్రతి ఆటకూ కలెక్షన్లు పెరుగుతున్నాయి. రూ. వంద కోట్ల గ్రాస్ వసూలు చేస్తుందనే నమ్మకం ఉంది' అన్నారు.

ఏప్రిల్‌లో డియర్ ఆంధ్రా



సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్ కుమార్, ఐశ్వర్యారాజేశ్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'డియర్ ఆంధ్రా'. ఆనంద్ రవిచంద్రన్ దర్శకత్వంలో వరుణ్ త్రిపురనేని, అభిషేక్ ఆర్, జీ. పృథ్వీరాజ్ నిర్మించారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఏప్రిల్ 12న 'డియర్ ఆంధ్రా'ను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు శుక్రవారం యూనిట్ ప్రకటించింది. అన్నపూర్ణ స్టూడియోస్, ఏషియన్ సినిమాస్ ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నాయి.

ఏపీ పీఈసెట్



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (ఏపీ ఎస్‌సీహెచ్‌ఈ)-'ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఏపీ పీఈసెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీనిని గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నిర్వహిస్తోంది. ఈ టెస్ట్ ద్వారా రెండేళ్ల వ్యవధి గల బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ/ప్రైవేట్/ అనుబంధ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత వివరాలు: బీపీఈడీ కోర్సులో ప్రవేశానికి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 జూలై 1 నాటికి 19 ఏళ్లు నిండి ఉండాలి.

- డీపీఈడీ కోర్సులో ప్రవేశానికి ఏదేని గ్రూప్‌తో ఇంటర్/పన్నెండోతరగతి/ తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 జూలై 1 నాటికి 16 ఏళ్లు నిండి ఉండాలి.

ఏపీ పీఈసెట్ వివరాలు: ఇందులో రెండు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్ ఉంటుంది. దీనికి 400 మార్కులు కేటాయించారు. పురుషులకు 100 మీటర్ల పరుగు, 6 కేజీల పుట్టింగ్ ద షాట్, 800 మీటర్ల పరుగు, లాంగ్ జంప్/ హై జంప్; మహిళలకు 100 మీటర్ల పరుగు, 4 కేజీల పుట్టింగ్ ద షాట్, 400 మీటర్ల పరుగు, లాంగ్ జంప్/ హై జంప్ ఉంటాయి. ఒక్కో ఈవెంట్‌కు 100 మార్కులు ఉంటాయి. రెండో పార్ట్‌లో స్కిల్ టెస్ట్ ఉంటుంది. బాల్ బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, క్రికెట్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, హాకీ, కబడ్డీ, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్, టెన్నిస్, వాలీబాల్ క్రీడల్లో ఒకదానిలో అభ్యర్థి క్రీడానైపుణ్యాన్ని పరీక్షిస్తారు. దీనికి 100 మార్కులు ఉంటాయి. హార్ట్ సంబంధిత సమస్యలు ఉన్నవారు, గర్భిణులు ఈ టెస్ట్‌లలో పాల్గొనడానికి అనర్హులు. ఏపీ పీఈసెట్ 2024లో అర్హత సాధించాలంటే కనీసం 30 శాతం మార్కులు రావాలి.

దరఖాస్తు ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ.900; బీసీ అభ్యర్థులకు రూ.800; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.700

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 15

టెస్ట్ సెంటర్: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ క్యాంపస్, నాగార్జున నగర్, గుంటూరు

ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్‌లు, గేమ్ స్కిల్ టెస్ట్‌లు: జూన్ 11 నుంచి

వెబ్‌సైట్: cets.apsche.ap.gov.in

దిక్సూచి DIKSUCHI

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/q8kEGWలో చదవండి.

అందరికీ నచ్చే శ్రీరంగ నీతులు



సుహాస్, కార్తిక్ రత్నం, విరాజ్ అశ్విన్, రుహాని శర్మ ముఖ్య పాత్రలు పోషించిన 'శ్రీరంగ నీతులు' చిత్రం వచ్చే నెల 11న విడుదల కానుంది. పంపిణీదారుడు, నిర్మాత ధీరజ్ మొగిలి ఈ సినిమాను ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. శుక్రవారం జరిగిన ట్రైలర్ విడుదల కార్యక్రమంలో నిర్మాత చిత్ర వెంకటేశ్వర రావు మాట్లాడుతూ 'దర్శకుడు ప్రవీణ్‌కుమార్ నా స్నేహితుడు. సినిమా బాగా తీశాడు. అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నా' అన్నారు. తనకు నచ్చిన పాత్ర ఇందులో చేశానని కార్తిక్ రత్నం చెప్పారు. 'మంచి కథతో తీసిన సినిమాలో నేను నటించినందుకు ఆనందంగా ఉంది' అని విరాట్ అశ్విన్ చెప్పారు. 'ఇదొక ఆంథాలజీ. ప్రవీణ్ చాలా కష్టపడ్డాడు. నిర్మాత చక్కని అభిరుచితో ఈ సినిమా తీశాడు' అన్నారు సుహాస్.

మత్స్యకారుల జీవిత కథ




రమాకాంత్, అవంతిక, భానుశ్రీ హీరోహీరోయిన్లుగా నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'సముద్రుడు'. నగేశ్ నారదాసి దర్శకత్వంలో బదావత్ కిషన్ నిర్మించారు. ఇటీవలే ఈ సినిమా ట్రైలర్ విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'సముద్రమే జీవనాధారమైన మత్స్యకారుల జీవితాలను ప్రతిబింబించే కథ ఇది. వారి జీవన పోరాటం, మనోవేదన ఇందులో చూపిస్తున్నాం. త్వరలో సినిమా విడుదల చేస్తాం' అని తెలిపారు. చిత్ర నిర్మాణంలో ఎన్నో అడ్డంకులు ఎదురైనా వెనుకంజ వేయకుండా అనుకున్న విధంగా చిత్రాన్ని పూర్తి చేయగలిగామని హీరో రమాకాంత్ చెప్పారు.

గుజరాత్‌లో గూఢచారి



అడివిశేష్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'గూఢచారి 2'. గతంలో ఆయన నటించిన హిట్ చిత్రం 'గూఢచారి'కి ఇది సీక్వెల్. బనితా సంధు శేష్‌కు జోడీగా నటిస్తున్నారు. 'అక్టోబర్', 'సర్దార్ ఉదం' చిత్రాలతో ఆమె హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం గుజరాత్‌లోని భుజ్‌లో జరుగుతున్న షూటింగ్‌లో శేష్‌తో కలసి బనిత పాల్గొంటున్నారు. వారిద్దరిపై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఈ సందర్భంగా ఎడారిలో ఉన్న బనిత ఫొటోను చిత్రబృందం షేర్ చేసింది. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతోన్న ఈ చిత్రంలో ఇమ్రాన్‌హష్మీ ప్రతినాయక పాత్ర పోషిస్తున్నారు. వినయ్‌కుమార్ సిరిగినీడి దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్నారు.







కదిలింది కరుణరథం

నాడు మనిషి కోసం దేవుడు శిలువ యాత్రకు కదిలితే.. నేడు ప్రభువును కీర్తిస్తూ భక్తులు శిలువయాత్ర వెంట తరలారు. జిల్లావ్యాప్తంగా శుక్రవారం గుడ్‌ఫ్రైడే ఘనంగా జరిగింది. వివిధ ప్రార్థనా మందిరాల ఆధ్వర్యంలో శిలువ యాత్ర నిర్వహించి క్రీస్తుకు క్షమా స్వాగతం పలికారు.

కేదారేశ్వరపేట ప్రార్థనామందిరం ఆధ్వర్యంలో క్రీస్తు శిలువ యాత్ర (ఇన్‌సెట్‌లో) గుణదల కొండపై..



కోనలో జరిగిన ముఖాముఖి బహిరంగ సభలో మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

అధికారంలోకొచ్చాక చేయూత

మత్స్యకారులతో నారా భువనేశ్వరి ముఖాముఖి

మచిలీపట్నం టౌన్, మార్చి 29 : 'వైసీపీ ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమాన్ని గాలికి వదిలేసింది. ఈ ప్రభుత్వ కేటాయింపులను, టీడీపీ హయాంలో కేటాయింపులను పరిశీలిస్తే ఇది స్పష్టమవుతుంది. ఈ ఎన్నికల్లో కూటమి అధికారంలోకొస్తే మత్స్యకారులకు చేయూత అందిస్తుంది. ఆక్వా కల్చర్ కరెంట్ బిల్లులు తగ్గిస్తుంది' అని టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరి.. మత్స్యకారులకు భరోసా ఇచ్చారు. బందరు మండలం కోన గ్రామంలో మహిళలతో శుక్రవారం ముఖాముఖి కార్యక్రమం జరిగింది. ఇందులో మహిళలతో పాటు మత్స్యకారులు, బడుగు బలహీన వర్గాల ప్రజలు పాల్గొన్నారు. మత్స్యకార మహిళలతో మాట్లాడిన భువనేశ్వరి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కోన గ్రామానికి చెందిన కోమటి శివపార్వతి.. భారత్ సాల్ట్ ఫ్యాక్టరీని మూసివేయకుండా చూడాలని కోరారు. అదే గ్రామానికి చెందిన నాగలక్ష్మి.. వారానికి ఒకరోజు తాగునీరు వస్తోందని, ఓహెచ్ఆర్ నిర్మించి ఇంటింటికీ కుళాయి నిర్మించాలని విన్నవించారు. పల్లెతుమ్మలపాలెం గ్రామానికి చెందిన మేడా చంద్రమ్మ.. కరెంటు బిల్లులు ఎక్కువగా వస్తున్నాయని, ఆక్వా రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారని వివరించారు. గిలకలదిండికి చెందిన కొప్పనాతి నాగమ్మ.. మత్స్యపరిశ్రమ వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధికి నోచుకోలేదన్నారు. అందరి సమస్యలను విన్న అనంతరం భువనేశ్వరి బహిరంగ సభలో మాట్లాడారు. 'చంద్రబాబు హయాంలో మత్స్యపరిశ్రమ అభివృద్ధి 19.17 శాతం వృద్ధిరేటు ఉండగా, వైసీపీ ప్రభుత్వంలో 6.44 శాతానికి పడిపోయింది. వైసీపీ ప్రభుత్వం ప్రజల పొట్టలు కొట్టి జేబులు నింపుకుంటోంది. టీడీపీ హయాంలో మత్స్యకారుల సంక్షేమం కోసం రూ.230 కోట్లు కేటాయించగా, వైసీపీ ప్రభుత్వం రూ.59 కోట్లు మాత్రమే కేటాయించింది. వలలు, ఐస్ బాక్సుల కొనుగోలుకు సబ్సిడీ రద్దు చేసింది. విద్యుత్ చార్జీలు పెంచడం వల్ల ఆక్వా రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యుత్ చార్జీలను తగ్గిస్తాం. భీమవరంలో ఆక్వా యూనివర్శిటీని అభివృద్ధి చేస్తాం.' అని భువనేశ్వరి భరోసా కల్పించారు. చంద్రబాబు హయాంలో మత్స్యకారులకు ఆరు రెసిడెన్షియల్ పాఠశాలలు నెలకొల్పారని, బందరు పోర్టుకు చంద్రబాబు 695 ఎకరాలు ముడా ద్వారా కొనుగోలు చేశారని, వైసీపీ అధికారంలోకి రాగానే రివర్స్ టెండర్ల పేరుతో పోర్టు నిర్మాణానికి బ్రేకులు వేసిందన్నారు. మాజీ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే భారత్ సాల్ట్ ఫ్యాక్టరీని కొనసాగిస్తామన్నారు. మాజీ ఎంపీ, టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు పదవులిచ్చిన చంద్రబాబుకు రానున్న ఎన్నికల్లో పట్టం కట్టాలన్నారు.

జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారన్నారు. ఈ సందర్భంగా భువనేశ్వరికి వలలు, చేపలు, బుట్టలను కొల్లు రవీంద్ర, నీలిమ దంపతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత పాల్గొన్నారు.

● అట్టహాసంగా..



టీడీపీ 42వ వ్యవస్థాపక దినోత్సవం జిల్లావ్యాప్తంగా శుక్రవారం ఘనంగా జనిగింది. వాడవాడలా పార్టీ శ్రేణులు కేకులు కట్ చేసి, సేవా కార్యక్రమాలు చేపట్టారు. నగరంలోని గురునానక్ కాలనీలో ఉన్న టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి తినిపించుకుంటున్న టీడీపీ విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని చిన్ని, నాయకులు నెట్టెం రఘురాం, కోనేరు శ్రీధర్, పట్టాభిరాం తదితరులు

నగరం

విజయవాడలో భారీగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

విజయవాడ సిటీ.. ఉదయం 9 గంటలైతే బయటకు వెళ్లలేని పరిస్థితి. సాయంత్రం 5 గంటలు దాటితే బయటకు రాలేని దుస్థితి. మార్చిలోనే మే నెలను పోలిన ఎండలు నగర వాసులను చిర్రెత్తిస్తున్నాయి. ఈ వారంలో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.



నగరంలో వచ్చే వారంలో ఎండలు ఇలా..



- వచ్చే వారం ఉష్ణోగ్రతల్లో భారీగా పెరుగుదల
- ఆదివారం నుంచి 40 డిగ్రీలపైనే..
- మార్చిలోనే మే నెలను పోలిన ఎండలు
- తూర్పు పసిఫిక్ సముద్రంలో పెరుగుతున్న వేడి
- ఫలితంగా ఈ ఏడాది భారీగానే..

పరిశోధనలు జరుగుతున్నాయి

ప్రస్తుతం నమోదవుతున్న ఉష్ణోగ్రతలకు సంబంధించి పరిశోధనలు జరుగుతున్నాయి. ఎల్‌నినో ప్రభావం కారణంగానే ఈ పరిస్థితి ఉందని తేలింది. జూన్‌లో నైరుతి రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకినా ఉష్ణోగ్రతలు ఎక్కువగానే నమోదయ్యాయి. ఇప్పుడు ఎండాకాలానికి ముందే ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. వారం పాటు ఉష్ణోగ్రతల్లో పెరుగుదల ఉంటుంది. ఈ పరిస్థితి ఎన్ని రోజులపాటు కొనసాగుతుందన్నది ఇప్పుడే చెప్పలేం.

- సత్యనారాయణ, వాతావరణ శాఖ నిపుణుడు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : నగరంలో ఉష్ణోగ్రతలు మంటలు పుట్టిస్తున్నాయి. ప్రస్తుతం మార్చి నడుస్తున్నా ఏప్రిల్ రెండో వారంలో నమోదయ్యే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మరో వారంపాటు ఉష్ణోగ్రతలు క్రమంగా పెరిగే సూచనలు కనిపిస్తున్నాయని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికే నమోదవుతున్న ఉష్ణోగ్రతలకు ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉక్కపోతలు తీవ్రంగా ఉంటున్నాయి. ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నా వేడి మాత్రం భారీగా ఉంటోంది.

0.1-0.5 డిగ్రీల వరకు పెరుగుదల

శనివారం నుంచి వారం పాటు ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతాయని వాతావరణ శాఖ నిపుణులు తెలిపారు. రోజుకు 0.1 నుంచి 0.5 డిగ్రీల వరకు పెరుగుదల ఉంటుందని చెబుతున్నారు. ప్రస్తుతం ఎల్‌నినో ఛాయలు ఉన్నందున ఈ ఏడాది ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరిస్తున్నారు. విజయవాడలో శుక్రవారం 38.75 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. శనివారం దీనికి సమీపంగా ఉండొచ్చని వాతావరణ శాఖ ఫోర్‌కాస్ట్ విడుదల చేసింది. ఇక ఆదివారం నుంచి 40.61 డిగ్రీలను తాకే అవకాశం ఉందంటున్నారు. ఈ ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల వరకూ వెళ్తుందని పేర్కొంటున్నారు. ఈ ఏడాది ఉష్ణోగ్రతలు అత్యధికంగా 45-46 డిగ్రీల వరకు నమోదయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. తూర్పు పసిఫిక్ సముద్ర ఉపరితలంలో వేడి విపరీతంగా పెరగడమే ఇందుకు కారణమని వాతావరణ శాఖ తెలిపింది. తూర్పు పసిఫిక్ సముద్రంలో నినో 3.4 అనే జోన్ ఉంటుంది. దీని కేంద్రంగా వాతావరణ శాఖ నిపుణులు పరిశోధనలు చేస్తున్నారు. పసిఫిక్ సముద్రంలోని ఉపరితలంలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటే ఎల్‌నినో వస్తుంది. అదే అక్కడ చల్లని వాతావరణం ఉంటే ల్యానినో వస్తుంది.

రోజుకో మాట!

- ఐదేళ్లలో గుడివాడ టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు చుక్కలు
- ఇళ్లిచ్చినా మౌలిక వసతులు మృగ్యం
- డబ్బులు కట్టాలంటూ బ్యాంకు నోటీసులతో బెంబేలు
- మళ్లీ అధికారంలోకొస్తే రుణమాఫీ అంటూ కపట ప్రేమ
- ఒక్కరోజులోనే మాటమార్చి చేతులెత్తేసిన కొడాలి నాని

- 6లో..



నానితో మాట్లాడుతున్న గుడివాడ టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు

ఆ రెండింటా.. ఉత్కంఠ..!

మచిలీపట్నం ఎంపీ, అవనిగడ్డ ఎమ్మెల్యేపై కొనసాగుతున్న సస్పెన్స్

మచిలీపట్నం ఎంపీ, అవనిగడ్డ ఎమ్మెల్యే స్థానాల నుంచి బరిలో నిలిచే అభ్యర్థులపై ఇంకా ఉత్కంఠ వీడలేదు. ఎన్నికల నోటిఫికేషన్‌కు సమయం సమీపిస్తున్నా ఈ స్థానాల అభ్యర్థులు ఖరారు కాకపోవడం కూటమి శ్రేణుల్లో చర్చ దారితీస్తోంది. టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా విజయవాడ పశ్చిమ, అవనిగడ్డ అసెంబ్లీ స్థానాలు, మచిలీపట్నం ఎంపీ స్థానాన్ని తొలుత జనసేనకు కేటాయించారు. ఆ తర్వాత జరిగిన సర్దుబాట్లలో విజయవాడ పశ్చిమ బీజేపీ ఖాతాలో పడింది. అక్కడి నుంచి బీజేపీ అభ్యర్థిగా యలమంచిలి సుజనా చౌదరిని ఖరారు చేశారు. ఇక జనసేన ఖాతాలో ఉన్న మచిలీపట్నం ఎంపీ, అవనిగడ్డ ఎమ్మెల్యే స్థానాలపై సస్పెన్స్ ఇంకా కొనసాగుతూనే ఉంది. - విజయవాడ, ఆంధ్రజ్యోతి



- ఇంకా ఖరారు చేయని జనసేన అధిష్ఠానం
- మచిలీపట్నం ఎంపీ స్థానానికి బాలశౌరి, బండారు, నాగబాబు పేర్లు
- అవనిగడ్డ ఎమ్మెల్యే స్థానానికి విక్కుర్తి పేరు
- జోరుగా సాగుతున్న పందేలు

పందేల జోరు

ఎక్కడైనా ఎన్నికల ఫలితాలపై పందేలు కాయడం సాధారణం. కానీ, కృష్ణాజిల్లా మచిలీపట్నం పార్లమెంట్ స్థానానికి కూటమి అభ్యర్థి ఎవరన్న దానిపై ప్రస్తుతం జోరుగా పందేలు నడుస్తున్నాయి. మచిలీపట్నం ఎంపీ అభ్యర్థిగా వల్లభనేని బాలశౌరి పోటీ చేస్తారా, లేదా అనే అంశం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. బాలశౌరి పోటీలో ఉంటారా, లేదా అనే దానిపై ప్రస్తుతం జోరుగా బెట్టింగ్‌లు నడుస్తున్నాయి. అధిక శాతం బాలశౌరి బరిలో ఉంటారన్న దానిపైనే నడుస్తుండటం గమనార్హం.

మచిలీపట్నం ఎంపీ అభ్యర్థిపై జాప్యం

జనసేన తరపున మచిలీపట్నం ఎంపీ అభ్యర్థిగా వల్లభనేని బాలశౌరి బరిలో ఉంటారని అంతా భావించారు. వైసీపీ తరపున 2019లో ఎంపీగా గెలిచిన ఈయన ఈ ఏడాది జనవరి 14న ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఫిబ్రవరి 4న జనసేనలో చేరారు. అప్పటి నుంచి మచిలీపట్నం ఎంపీ అభ్యర్థిగా ఆయన పేరు ప్రచారంలో ఉంది. కానీ, నేడు, రేపు అంటూ మీనమేషాలు లెక్కిస్తున్నారు. మరోవైపు జనసేన అధినేత పవన్ కల్యాణ్ సోదరుడు నాగబాబు, ప్రముఖ పారిశ్రామికవేత్త బండారు నరసింహారావు పేర్లు తెరపైకి వచ్చాయి.

అవనిగడ్డ ఎమ్మెల్యే అభ్యర్థి ఎవరు..?

అవనిగడ్డ నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థిని ఖరారు చేయడంలోనూ జాప్యం చోటుచేసుకుంటోంది. మచిలీపట్నం, అవనిగడ్డ స్థానాలు ఒకదానితో ఒకటి సంబంధం ఉండటం వల్లే రెంటినీ ఆపుతున్నారన్న ప్రచారం జరుగుతోంది. మచిలీపట్నం ఎంపీ బరిలో బాలశౌరి కాకుండా వేరేవారు ఉంటే, ఆయన్ను అవనిగడ్డ ఎమ్మెల్యేగా బరిలో దింపుతారన్న ప్రచారం జరుగుతోంది. ఆ కారణంగానే అవనిగడ్డ స్థానాన్ని కూడా పెండింగ్‌లో పెడుతున్నారని సమాచారం. అవనిగడ్డ రేసులో ప్రముఖ వ్యాపారవేత్త విక్కుర్తి శ్రీనివాస్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఈయన పేరుతో పాటు మచిలీపట్నం జనసేన నేత బండి రామకృష్ణ, కృష్ణాజిల్లా జనసేన అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ పేర్లతో ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో అధికశాతం ఓటర్లు విక్కుర్తికి మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. బాలశౌరి మచిలీపట్నం నుంచే బరిలో దిగేది ఖాయమైతే, అవనిగడ్డ బరిలో విక్కుర్తి ఉంటారని సమాచారం.

అధికార పార్టీలో మట్టి పంచాయితీ

- సొసైటీ అధ్యక్షుడు తోట తిరుపతిరావును చెప్పుతో కొట్టిన వెల్వడం సర్పంచ్ ధర్మరాజు
- అనుచరులతో సర్పంచ్ ఇంటికెళ్లిన తోట తిరుపతిరావు
- ఇరువర్గాల ఫిర్యాదులు
- గ్రామంలో పోలీస్ పికెట్

- 6లో..



రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సాయంత్రం) : 6-21 (గురు)
సహర్ (ఉదయం) : 4-52 (శుక్ర)



విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గం మ్యాప్

విజయవాడ పార్లమెంట్ పరిధిలో

1,804 పోలింగ్ కేంద్రాలు

- అత్యధికంగా మైలవరంలో 309
- 292 కేంద్రాలతో రెండోదిగా విజయవాడ తూర్పు, 280 కేంద్రాలతో మూడోదిగా 'సెంట్రల్'

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఎన్టీఆర్ జిల్లాలోని విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 1,804 పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల యం త్రాంగం ఖరారు చేసింది. ఇటీవల పలు మార్పుల, చేర్పుల అనంతరం ఏడు అసెం బ్లీ నియోజకవర్గాల పరిధిలో తిరువూరులో 234 పోలింగ్ కేంద్రాలు, విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో 245, విజయవాడ సెంట్రల్‌లో 280, విజయవాడ తూర్పులో 292, మైలవరంలో 309, నందిగామలో 222, జగ్గయ్యపేటలో 222 పోలింగ్ కేంద్రాలను ఖరారు చేశారు. మొత్తంగా విజయవాడ పార్లమెంట్ పరిధిలో మైలవరంలో అత్యధిక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఆ తర్వాత విజయవాడ తూర్పు, మూడోదిగా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గాలు ఉన్నాయి. మిగిలిన నియోజకవర్గాల్లో 220-250 మధ్యన పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

ఎన్టీఆర్ జిల్లాలో డిస్ట్రిబ్యూషన్,

రిసెప్షన్ సెంటర్ల ఖరారు

- ఎన్నికల నిర్వహణ ప్రక్రియ ప్రారంభం వీటి నుంచే
- విజయవాడలోని మూడు నియోజకవర్గాలకు ఆర్సీల మార్పు
- రూరల్‌లో నాలుగు నియోజకవర్గాల్లో డీసీ, ఆర్సీలు ఒకేచోట

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని తిరువూరు, విజయవాడ పశ్చిమ, సెంట్రల్, తూర్పు, మైల వరం, నందిగామ, జగ్గయ్యపేట మొత్తం 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వ హణలో భాగంగా డిస్ట్రిబ్యూషన్(డీసీ), రిసెప్షన్ సెంటర్ల(ఆర్సీ)ను జిల్లా యంత్రాం గం ఖరారు చేసింది. ఎన్నికల నిర్వహణలో అత్యంత కీలక ఘట్టం ఇది. ఎన్నికల నిర్వహణ ప్రక్రియ డీసీ, ఆర్సీల నుంచే ప్రారంభమవుతుంది. గోదాములో ఉన్న ఈవీఎంలు, వీవీ ప్యాట్లు ముందుగా రిసెప్షన్ సెంటర్లకే వస్తాయి. ఇక్కడి నుంచి పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బందిని, ఈవీఎంలను, వీవీప్యాట్లను కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు నడుమ పంపుతారు. పోలింగ్ ప్రక్రియకు ముందు వరకు ఇవి డీసీగా, పోలింగ్ అనంతరం అధికశాతం ఇవే ఆర్సీగా పనిచేస్తాయి. పోలింగ్ అనం తరం సీల్ వేసిన ఈవీఎంలు, వీవీప్యాట్లను ఎన్నికల సిబ్బంది కట్టుదిట్టమైన భద్రత నడుమ ఇక్కడికే తెస్తారు. ఆ తర్వాత ఆర్సీల నుంచి ఈవీఎంలు, వీవీప్యాట్లను అత్యంత భద్రత మధ్య జూపూడిలోని నోవా ఇంజనీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు తరలిస్తారు. తిరువూరు నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ కేం ద్రాలకు తిరువూరులోని బాలికల జడ్పీ హైస్కూల్‌ను డీసీగానూ, ఆర్సీగానూ నిర్ణ యించారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం పరిధిలో వన్‌టౌన్‌లోని గాంధీజీ మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌ను డీసీగా నిర్ణయించారు. ఇబ్రహీంపట్నం మం డలంలోని జూపూడిలో ఆర్సీని ఏర్పాటు చేశారు. విజయవాడ సెంట్రల్ నియోజక వర్గానికి ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో డీసీని, ఆర్సీని జూపూడిలో ఏర్పాటు చేశారు. విజయవాడ తూర్పుకు పటమటలోని ఎస్ఎస్ఎం పబ్లిక్ స్కూల్‌ను డీసీగా, జూపూడిలో ఆర్సీని ఏర్పాటు చేశారు. మైలవరానికి లకిరెడ్డి బాలిరెడ్డి ఇండోర్ స్టేడియాన్ని డీసీగానూ, జూపూడిలో ఆర్సీని ఏర్పాటు చేశారు. నందిగామ నియోజకవర్గానికి కేవీఆర్ కాలేజీలో డీసీ, ఆర్సీలను ఏర్పాటు చేశారు. జగ్గయ్యపేటకు బాలుర జీవీజే జడ్పీ హైస్కూల్‌లో డీసీ, ఆర్సీలను ఏర్పాటు చేశారు. వీటిలో 40 టేబుల్స్ ఏర్పాటు చేసి ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి ఈవీ ఎంలు, వీవీప్యాట్లు, ఇతర ఎన్నికల సామగ్రి, స్టేషనరీ, సీళ్లు, బ్యాలెట్లు, పెన్నులు, పేపర్లు, ఇతర మెటీరియల్ అందిస్తారు. ఒక్కో కేంద్రంలో 120 మంది ఉద్యోగులు ప్రత్యేక విధులు నిర్వహిస్తుంటారు. పోలింగ్ సరంజామాను అందుకున్న సిబ్బంది తమకు కేటాయించిన బస్సుల్లో పోలింగ్ కేంద్రానికి బయలుదేరతారు. పోలింగ్ కేం ద్రాలకు వెళ్లే బస్సుల ముందు, వెనుక సెక్యూరిటీ వాహనాలు ఉంటాయి. పోలింగ్ కేంద్రం చేరుకున్న తర్వాత, సామగ్రి అంతా అక్కడే సెక్యూరిటీ పర్యవేక్షణలో భద్రం గా ఉంటుంది. రాత్రికి పోలింగ్ సిబ్బంది బస అక్కడే ఉంటుంది. ఉదయం పోలింగ్ విధులకు సిద్ధమవుతారు. పోలింగ్ నిర్వహించే ముందు రాజకీయ పార్టీల ఏజెంట్ల సమక్షంలో ఈవీఎంలు ఎలా పనిచేస్తున్నాయన్నది మాక్ పోలింగ్ నిర్వహిస్తారు. ఆ తర్వాతే ఎన్నికల ప్రక్రియ జరుగుతుంది.



కోనేరు హంపి



వెన్నం జ్యోతి సురేఖ



డాక్టర్ జి.సమరం

ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల స్టార్ క్యాంపెయినర్లుగా

కోనేరు హంపి, జ్యోతిసురేఖ, డాక్టర్ సమరం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల స్టార్ క్యాంపెయి నర్లుగా విజయవాడకు చెందిన ఇద్దరు మహిళా క్రీడాకారిణిలు, ఒక డాక్టర్ కమ్ సెక్సాలజిస్టను స్టార్ క్యాంపెయినర్లుగా జిల్లా ఎన్నికల యంత్రాంగం ఎంపిక చేసిం ది. చదరంగంలో విజయవాడ కీర్తిపతాకను ప్రపంచస్థాయిలో ఇనుమడింపచేసిన కోనేరు హంపి, ఆర్చరీలో ప్రపంచాన్నే శాసించిన వెన్నం జ్యోతి సురేఖ, ప్రముఖ వైద్యుడు, సెక్సాలజిస్ట్, సామాజికవేత్త డాక్టర్ జి.సమరంను ఎంపిక చేశారు. వీరు తమతమ రంగాల్లో సెలబ్రిటీలు కావడంతో వీరి సోషల్‌మీడియా ఖాతాలకు లక్షల సంఖ్యలోనే ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఎన్నికలు ముగిసేవరకు వీరంతా ఓటింగ్ పెంచడానికి వీలైన ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తారు. కొన్ని ప్రత్యక్ష కార్యక్ర మాల్లోనూ పాల్గొంటారు. తమ సోషల్ మీడియా పేజీల్లో పోస్టింగుల ద్వారా కూడా ప్రచారాన్ని కల్పిస్తారు.





సిబ్బందిని విచారణ చేస్తున్న పోలీసులు, స్వాధీనం చేసుకున్న సర్వే పత్రాలు

ఇబ్రహీంపట్నంలో సర్వే కలకలం

- కోడ్ అమల్లో ఉన్నా వైసీపీకి అనుకూలంగా యువకుల సర్వే
- స్థానికుల ఫిర్యాదుతో పోలీసుల అదుపులో సిబ్బంది

ఇబ్రహీంపట్నం, మార్చి 29: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా పట్టించుకోకుండా చైతన్య సర్వే సంస్థ సిబ్బందితో శుక్రవారం ఇబ్రహీంపట్నం ప్రసాద్‌నగర్‌లో వైసీపీకి అనుకూలంగా సర్వే చేయడం చర్చనీయాంశమయ్యింది. ముగ్గురు యువకులు సర్వే పేరుతో ఇంటింటికీ వెళ్లి వైసీపీ అనుకూలంగా తయారుచేసిన కొన్ని ప్రశ్నలను వేసి జవాబులు రాబడుతున్నారు. దీనిపై కొందరు స్థానికులు సర్వే సిబ్బందిని ప్రశ్నిం చారు. స్థానిక వైసీపీ నేతలు సర్వే సిబ్బందికి మద్దతుగా నిలిచి, అభ్యంతరం వ్యక్తం చేసిన వారిపై దౌర్జన్యం చేసినట్లు తెలుస్తోంది. ఇంతలో స్థానికులు కొందరు సర్వే విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. వారు వచ్చి ఆముగ్గురు యువకుల వద్ద ఉన్న సర్వే పత్రాలు స్వాధీనం చేసుకొని వారిని అదుపులోకి తీసుకున్నారు. సర్వేపై టీడీపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

కూటమికి విజయాన్ని చేకూర్చండి

భావితరాల భవిష్యత్ కోసం వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలకండి: నారా భువనేశ్వరి



నిమ్మకూరు అడ్డరోడ్డు వద్ద భువనేశ్వరికి స్వాగతం పలుకుతున్న వర్ల కుమార్‌రాజా, నిమ్మకూరు గ్రామస్థులు

పామర్రు, మార్చి 29: భావితరాల భవిష్యత్తు కోసం రానున్న ఎన్నికల్లో ప్రజలంతా టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి విజయాన్ని చేకూర్చాలని ప్రజలను టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి కోరారు. కృష్ణాజిల్లాలో "నిజం గెలవాలి" యాత్రను నిర్వహిస్తున్న ఆమెకు శుక్రవారం నిమ్మకూరు అడ్డరోడ్డు వద్ద కూటమి పామర్రు అభ్యర్థి వర్లకుమార్‌రాజా ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన నేతలు నిమ్మకూరు మహిళలు ఘనస్వాగతం పలికారు. రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని, కూటమి అభ్యర్థులకు ఓటేసి దానికి ప్రజలు స్వస్తి పలకాలని ఆమె పిలుపునిచ్చారు. స్వాగతం పలికిన వారిలో టీడీపీ నేతలు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, నందమూరి శివరామకృష్ణ, గొట్టిపాటి లక్ష్మీదాసు, తాతినేని అపర్ణ, జంపాన లక్ష్మి, నందమూరి స్వరాజ్యలక్ష్మి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్ పాల్గొన్నారు.



నోబుల్ చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న నారా భువనేశ్వరి

గుడ్‌ఫ్రైడే ప్రత్యేక ప్రార్థనల్లో భువనేశ్వరి

మచిలీపట్నం టౌన్: గుడ్‌ఫ్రైడే సందర్భంగా నోబుల్ చర్చిలో శుక్రవారం నిర్వహించిన ప్రార్థనల్లో నారా భువనేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసుక్రీస్తు త్యాగాలు అజరామరమని నోబుల్ చర్చి పాస్టర్ బెంజిమెన్ అన్నారు. భువనేశ్వరితో పాటు టీడీపీ-జనసేన-బీజేపీ మచిలీపట్నం అభ్యర్థి కొల్లు రవీంద్ర, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు, ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, తలశిల స్వర్ణలత, లంకిశెట్టి నీరజ, సుచరిత, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండి రామకృష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఐసీపీ కరుణకుమార్, టీడీపీ నాయకులు మోటమర్రి బాబాప్రసాద్, గుమ్మడి విద్యాసాగర్, యువరాజు, బొమ్మిడి శ్రీరాములు, పండు, కార్పొరేటర్ దేవరపల్లి అనిత తదితరులు పాల్గొన్నారు.



హైకోర్టు జడ్జి జస్టిస్ మల్లికార్జునరావుకు అమ్మవారి చిత్రపటం ఇస్తున్న ఈవో

దుర్గమ్మ సన్నిధిలో

స్వామీజీ, హైకోర్టు జడ్జి

వన్‌టౌన్, మార్చి 29: ఉత్తరాఖండ్‌లోని బదరికాశ్రమానికి చెందిన జ్యోతిర్మఠ్ పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య స్వామి వాసు దేవానంద్ సరస్వతి శుక్రవారం దుర్గమ్మను దర్శించుకున్నారు. ఈవో ఆయనకు ఆలయ మర్యాదలను అందజేసి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వాసుదేవానంద సరస్వతి అనుగ్రహభాషణం చేశారు. హైకోర్టు జడ్జి జస్టిస్ టి మల్లికార్జున రావు కుటుంబసభ్యులతో కలిసి దుర్గమ్మను దర్శించుకున్నారు. అనంతరం ఆయనకు ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు అందజేశారు. శుక్రవారం కావడంతో దుర్గమ్మ దర్శనానికి భక్తజనం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దుర్గగుడిలో జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం ఈవో పరిశీలించారు. ముఖ్యంగా వాహనాల పార్కింగ్ కోసం దుర్గాఘాట్ పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. వేసవి దృష్ట్యా దుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తులకు దుర్గగుడిలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీని శుక్రవారం ఈవో రామారావు ప్రారంభించారు. అనంతరం ఆయన స్వయంగా భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈఈ లింగం రమాదేవి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక విప్లవానికి టీడీపీ నాంది

టీడీపీ ఆవిర్భావ దినోత్సవంలో కేశినేని శివనాథ్(చిన్ని)



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కేశినేని చిన్ని

విద్యాధరపురం, మార్చి 29: ఆంధ్రుల ఆత్మగౌరవానికి, ఆత్మవిశ్వాసానికి ప్రతీక ఎన్టీఆర్ అని ఆయన స్థాపించిన టీడీపీ సామాజిక విప్లవానికి నాంది పలికిందని టీడీపీ విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. గురునానక్ కాలనీలోని పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం టీడీపీ ఆవిర్భావ దినవేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి చిన్ని పూలమాలలు వేసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. టీడీపీ ఆవిర్భావం ఒక చరిత్ర అని తెలుగువారి ఆత్మగౌరవానికి ఎన్టీఆర్ ప్రతీక అయితే ఆత్మవిశ్వాసానికి చంద్రబాబు ప్రతీక అని ఆయన అన్నారు. రానున్న ఎన్నికలు చాలా కీలకమని మరో 60 ఏళ్ల పాటు పార్టీ ముందుకు వెళ్లడానికి దోహదపడతాయని అన్నారు. ఎన్ని కష్టాలు, ఇబ్బందులొచ్చినా వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి కాబోతున్నారని తెలిపారు. యుద్ధం చివరి దశకు చేరుకుందని ఈ యుద్ధం రాష్ట్రాభివృద్ధి కోసం, బిడ్డల భవిష్యత్తు కోసమని అన్నారు. ఏ పార్టీకి లేనంతగా కార్యకర్తలు టీడీపీకి ఉన్నారని పార్టీకి బలమే కార్యకర్తలని, 42 ఏళ్లుగా పార్టీని భుజస్కంధాలపై మోస్తున్నారని అన్నారు. జనసేన-బీజేపీ బలపరచిన టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. టీడీపీ వచ్చాకే రాష్ట్ర రాజకీయాల్లో నూతన శకం ఆరంభమైందని ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ అన్నారు. టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మాట్లాడుతూ సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లన్న నినాదంతో టీడీపీ ఆవిర్భావం జరిగిందన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్‌ను ఓడించి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు, టీడీపీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు షేక్ ఆషా, జిల్లా మహిళా అధ్యక్షురాలు చెన్నుపాటి ఉషారాణి, ఫిరోజ్, సొంగా సంజయ్ వర్మ, బొప్పన భవకుమార్, యర్రబోతు రమణ, శావల దేవదత్తు, ఉమ్మడి చంటి, కే.శ్రీనివాసరావు, పి.ప్రసాద్, పి.సాయిబాబు, శ్రీనివాసయాదవ్ పాల్గొన్నారు.

దేవినేని ఉమాకు చిన్ని జన్మదిన శుభాకాంక్షలు



ఉమాకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న కేశినేని చిన్ని

గొల్లపూడి, మార్చి 29: టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి దేవినేని ఉమామహేశ్వరరావు జన్మదినం సందర్భంగా కేశినేని శివనాథ్(చిన్ని) గొల్లపూడిలోని ఉమా నివాసానికి వెళిఏఅ శుభాకాంక్షలు తెలిపారు. అనేక ప్రజా పోరాటాలకు నాయకత్వం వహించిన నాయకుడు ఉమా అని చిన్ని పేర్కొన్నారు. దుర్మార్గపు జగన్మోహన్‌రెడ్డి పాలనకు వ్యతిరేకంగా ప్రజలందరినీ సంఘటితం చేసిన నాయకుడు ఉమా అన్నారు. ఆయన ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో నూరేళ్ల జీవించాలని, ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు.

రోజుకో మాట!

గురువారం ఇలా..

"ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి తిరిగి అధికారంలోకి రాగానే టిడ్కో లబ్ధిదారులను రుణవిముక్తులను చేస్తాం. పేదలకు చంద్రబాబు హయాంలో పట్టా రిజిస్ట్రేషన్ చేశారని నిరూపిస్తే రాజకీయాలను వదిలేస్తా. అర్హత ఉండి నియోజకవర్గంలో ప్రభుత్వ సహాయం అందలేదని, ఇంటి స్థలాలు రాలేదని ప్రతిపక్షాలు ఒక్క లబ్ధిదారునితో చెప్పించినా ఎన్నికల్లో పోటీ చేయను"

- ఎన్నికల ప్రచారంలో భాగంగా గుడివాడలోని 4వ వార్డులో కొడాలి నాని విసిరిన సవాల్ ఇది.

శుక్రవారం ఇలా..

"బ్యాంకు రుణం డబ్బులున్నవారు నెమ్మదిగా కట్టుకోవాలి. డబ్బులు లేనివారికి తరువాత ప్రభుత్వంతో మాట్లాడి వన్‌టైం సెటిల్‌మెంట్ చేయిస్తా. బ్యాంకువారు తాళాలు వేసినా, స్వాధీనం చేసుకున్నా దాని సంగతి అప్పుడు చూద్దాం. మ్యానిఫెస్టోలో రుణమాఫీ అంశాన్ని పెడితే ఇబ్బందులు వస్తాయి. ఇన్ని వేల కోట్ల రూపాయల హామీని మేం ఇవ్వలేం"

-రాజేంద్రనగర్‌లోని స్వగృహంలో తనను కలిసిన కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులతో కొడాలి నానీ చెప్పిన మాటలివి

గుడివాడ : అది 2018 మే 7వ తేదీ. గుడివాడలోని నెహ్రూచౌక్ సెంటర్‌లో వైసీపీ బహిరంగ సభలో అప్పటి ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్ టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు ఎన్నికల వరం ఇచ్చారు. "అక్కచెల్లెలమ్మలెవ్వరూ డబ్బులు కట్టొద్దు. ఎటువంటి డబ్బు చెల్లించకుండానే అర్హులైన అందరికీ ఇళ్లు ఉచితంగా అందిస్తా. మాట తప్పం. మడమ తిప్పం. వైసీపీ ప్రభుత్వం రాగానే అక్కచెల్లెమ్మలకు రూపాయికే రిజిస్ట్రేషన్ చేసి గృహాన్ని అందిస్తా" అని ప్రకటించారు. నిజానికి టీడీపీ హయాంలో 85 శాతం పూర్తయ్యాయి. మిగిలిన కొరవలు పూర్తిచేసి మౌలిక వసతులు కల్పించడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైంది. అరకొర సదుపాయాలతో లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించారు. మౌలిక సదుపాయాల్లేవు. వాటిలో నివశించే పరిస్థితి లేదు. బ్యాంకులు మాత్రం రుణాలు చెల్లించాలని లబ్ధిదారులపై ఒత్తిడి చేస్తున్నాయి.

● టీడీపీ హామీతో రుణ విముక్తి ప్రచారం

గుడివాడలోని ప్రధాన సమస్యల్లో ఒకటైన టిడ్కో ఇళ్లపై టీడీపీ కూటమి అభ్యర్థి వెనిగండ్ల రాము లబ్ధిదారులకు భరోసా ఇచ్చారు. అధికారంలోకి రాగానే టిడ్కో గృహ లబ్ధిదారులకు రుణవిముక్తి కలిగిస్తామని చెప్పారు. రెండు రోజుల నుంచి చేస్తున్న ఎన్నికల ప్రచారాల్లో వైసీపీకి ప్రజల నుంచి నిలదీతలు, లబ్ధిదారుల నుంచి ప్రతిఘటనలు ఎదురవుతున్నాయి. దీంతో టీడీపీ హామీని దృష్టిలో పెట్టుకుని వైసీపీ మళ్లీ కపట హామీకి కంకణం కట్టుకుంది. అధికారంలోకి రాగానే టిడ్కో లబ్ధిదారులకు రుణవిముక్తి కలిగిస్తామని కొడాలి నాని హామీ ఎన్నికల ప్రచారంలో భాగంగా 4వ వార్డులో గురువారం హామీ ఇచ్చారు. ఇప్పటికే ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని గ్రామాల్లో వ్యతిరేకత ఎదురవుతోందని, మళ్లీ ఇటువంటి హామీలు ఇచ్చి ఏమారిస్తే నమ్మే స్థితిలో లేరని ప్రజలు బహిరంగంగానే దుమ్మెత్తిపోస్తున్నారు.

● రుణ భారంపై మాటమార్పు

గుడివాడలోని రాజేంద్రనగర్ కాలనీకి చెందిన అభివృద్ధి కమిటీ సభ్యులు సంగమ్మ, అరుణ శుక్రవారం కొడాలి నానీని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో టిడ్కో రుణమాఫీ అంశాన్ని పెట్టాలని, గుడివాడలోని 7900 మంది పేదలపై రూ.650కోట్లు రుణభారం ఉందని నానీకి వివరించారు. 20 సంవత్సరాల పాటు నెలనెలా వాయిదాలను చెల్లించాలని, బ్యాంకు వారు వాయిదాలు కట్టమని నోటీసులిస్తున్నారని, రుణమాఫీ హామీ పత్రాలను తీసుకురమ్మంటున్నారని వాపోయారు. వారి అభ్యర్థనకు సమాధానంగా.. టిడ్కో లబ్ధిదారుల రుణవిముక్తిపై స్పష్టమైన హామీని ఇవ్వలేనని ఎమ్మెల్యే కొడాలి నాని వారికి తేల్చి చెప్పడంతో వారు అవాక్కయ్యారు.

అధికార పార్టీలో

మట్టి పంచాయితీ

- వెల్వడం సొసైటీ అధ్యక్షుడు తోట తిరుపతిరావుపై చెప్పుతో సర్పంచ్ ధర్మరాజు దాడి
- అనుచరులతో సర్పంచ్ ఇంటిపైకి వెళ్లిన తిరుపతిరావు
- ధర్మరాజును అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఇరువర్గాల ఫిర్యాదులు..గ్రామంలో పోలీస్ పికెట్



ధర్మరాజు ఇంటిముందు గొడవ చేస్తున్న తోట తిరుపతిరావు, అనుచరులు



వెల్వడంలో తిరుపతిరావు, అనుచరులతో మాట్లాడుతున్న ఎస్సై హరిప్రసాద్

మైలవరం రూరల్, మార్చి 29: వెల్వడంలో అధికారపార్టీ నాయకుల మధ్య మట్టి పంచాయితీ బహిరంగంగా చెప్పులతో కొట్టుకునే వరకూ వెళ్లింది. అధికార పార్టీకి చెందిన సర్పంచ్, సొసైటీ అధ్యక్షుల మధ్య ఘర్షణ ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. గ్రామంలోని దళితవాడలో ఏసోబు అనేవ్యక్తి అనారోగ్య కారణాలతో గురువారం మృతి చెందాడు. శుక్రవారం ఉదయం సర్పంచ్ ప్రత్తిపాటి ధర్మరాజు, సొసైటీ అధ్యక్షుడు తోట తిరుపతిరావు మృతదేహానికి నివాళులర్పించేందుకు వచ్చారు. నూజివీడు- మైలవరం ప్రధాన రహదారిపై ఇద్దరు ఎదురుపడ్డారు. గ్రామస్థులంతా చూస్తుండగానే సర్పంచ్ ధర్మరాజు చెప్పుతో సొసైటీ అధ్యక్షుడు తిరుపతిరావుపై దాడి చేశారు. తనపై సర్పంచ్ చెప్పుతో దాడి చేయడంతో తన అనుచరులతో కలిసి తిరుపతిరావు సర్పంచ్ ఇంటికి వెళ్లి తనను ఎందుకు కొట్టాడో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశాడు. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. తిరుపతిరావును ఇంట్లోకి రానీయకుండా సర్పంచ్ అనుచరులు అడ్డుకున్నారు. అధికార పార్టీ నాయకుల గొడవ విషయం తెలుసుకున్న మైలవరం సీఐ కిషోర్‌కుమార్, ఎస్సై హరిప్రసాద్‌లు తమ సిబ్బందితో వెల్వడం చేరుకున్నారు. సర్పంచ్ ధర్మరాజు ఇంటివద్ద నుంచి తిరుపతిరావును, అనుచరులను పంపించివేసి, సర్పంచ్ ధర్మరాజును మైలవరం సీఐ కార్యాలయానికి తీసుకువచ్చారు. తన అనుచరులతో మైలవరం పోలీస్ స్టేషన్ చేరుకున్న తోట తిరుపతిరావు నన్ను చంపేందుకు సర్పంచ్ ధర్మరాజు ప్రయత్నించచాడని ఆరోపిస్తూ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కొన్నినెలలుగా అనుమతులు లేకుండా గ్రామంలో మట్టి తోలకాలు జరుపుతుండగా సొసైటీ అధ్యక్షుడు తోట తిరుపతిరావు అడ్డుకుంటున్నారు. ఈ నెల 21న కూడా నిల్వచేసిన మట్టిని అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు ఇటుక బట్టీలకు తరలిస్తుండగా తోట తిరుపతిరావు అడ్డుకున్నారు. ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఈ తోపులాటలో తిరుపతిరావుకు గాయాలవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుపతిరావు ఫిర్యాదు మేరకు సర్పంచ్ ధర్మరాజుపై మూడు రోజుల క్రితం పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిని మనసులో పెట్టుకున్న ధర్మరాజు శుక్రవారం తిరుపతిరావుపై దాడి చేసినట్లు సీఐ కిషోర్‌కుమార్ మీడియాకు తెలిపారు. సర్పంచ్ ధర్మరాజు, రాంభూపాల్‌రెడ్డిలు గ్రామంలో చేస్తున్న అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తున్నందుకే తనను చంపేందుకు కుట్రపన్నారని తిరుపతిరావు ఆరోపించారు. మట్టి అమ్ముకోనివ్వకుండా అడ్డుపడతావా నిన్ను చంపేస్తా అంటూ ధర్మరాజు కత్తితో దాడి చేయడానికి ప్రయత్నించాడని, తన అనుచరులు అడ్డుకోవడంతో ప్రాణాలతో బయటపడ్డానని తెలిపారు. సర్పంచ్ తనపై దాడి చేయడం వెనుక రాంభూపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డిల హస్తం ఉందని చెప్పారు. గ్రామంలో ఉద్రిక్తత చోటు చేసుకోకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఘటనపై ఇరువర్గాల వారు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు విచారణ చేసి కేసులు నమోదు చేస్తామని ఎస్సై హరిప్రసాద్ తెలిపారు.

కేసులు.. కాసులుపై

ఏసీపీ-1 ఆరా

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

సత్యనారాయణపురం, మార్చి 29: డ్రంకెన్ డ్రైవ్‌లో కేసులు..కాసులు కురిపిస్తున్నాయని అని శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. మూడో ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌కు శుక్రవారం ఏసీపీ-1 పి.జనార్దన్ వచ్చి వివరాలు సేకరించారు. ట్రాఫిక్ సీఐ అలీ, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్ని వాహనాలు పక్కదారిలో వెళ్లాయో విచారణ చేస్తున్నారు. ప్రాథమికంగా పోలీసు రికార్డులో నమోదు చేయకుండా వాహనాలు బయటకు వెళ్లినట్లు గుర్తించారని విశ్వసనీయ సమాచారం. వాహనాలు బయటకు వెళ్లడంలో ఇద్దరి పాత్రపైన ఆరా తీశారు. వాటి రికార్డులను పరిశీలిస్తున్నారు. ఇప్పటి వరకూ ఎన్ని వాహనాలు పక్కదారిన వెళ్లాయో గుర్తించే పనిలో ఉన్నారు.

నిష్పక్షపాతంగా

ఎన్నికల కోడ్ అమలు

- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు: ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు



మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, మార్చి 29: ఎన్టీఆర్ జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ)ని నిష్పక్షపాతంగా, సమర్థవంతంగా అమలు చేస్తున్నామని, ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు హెచ్చరించారు. శుక్రవారం పార్లమెంటరీ, అసెం బ్లీ నియోజకవర్గాల రిట ర్నింగ్ అధికారులు, ఎంసీసీ, ఎన్నికల వ్యయం, ఎంసీ ఎంసీ తదితర విభాగాల నోడల్ అధికారులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ఎన్నికల కోడ్ అమలుతీరుతో పాటు ఫిర్యాదుల పరిష్కారం, రిపోర్టింగ్ మేనేజ్‌మెంట్, ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఈఎస్ఎంఎస్) తదితరాల్లో ప్రగతిని విశ్లేషించడంతో పాటు ఇకపైనా కోడ్ పటిష్ట అమలుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు మార్గనిర్దేశనం చేశారు. నగదు, మద్యం, మత్తుపదార్థాలు, విలువైన లోహాలు తదితరాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడానికి చెక్ పోస్టులు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. జిల్లాలో శుక్రవారం సాయంత్రం వరకు రూ.1.53 కోట్ల విలువైన నగదుతో పాటు మొత్తం రూ.4.83 విలువైన సీజర్లు జరి గాయని వివరించారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సం పత్‌కుమార్, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, ఆర్డీవోలు బీహెచ్ శంకర్, కె.మాధవి, ఎ.రవీంద్రరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పరకాల ప్రభాకర్

హిందూ జిన్నాలు

దేశాన్ని పాలిస్తున్నారు

- ప్రభుత్వ మాజీ సలహాదారు పరకాల ప్రభాకర్

విజయవాడ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): హిందూ జిన్నాలు దేశాన్ని పరిపాలిస్తున్నారని ప్రభుత్వ మాజీ సలహాదారు పరకాల ప్రభాకర్ విమర్శించారు. రాష్ట్రాలను కేంద్రం గుప్పెట్లో పెట్టుకుని రాజకీయంగా సంక్షోభం తీసుకువస్తోందన్నారు. ఎన్నికల సంఘంలో నియామకాలను సుప్రీంకోర్టుతో సంబంధం లేకుండా కేంద్రం మార్చుకుంటుందన్నారు. బాలోత్సవ భవనంలో 'సంక్షోభంలో నవభారతం - ఆర్థిక, రాజకీయ మూలాలు' అనే అంశంపై శనివారం రాత్రి జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. దేశంలో విధ్వంసం జరుగుతోందన్నారు. తనకు మన్‌కీ బాత్ మీద నమ్మకం లేదన్నారు. 35వేల నాన్‌టెక్నికల్ ఉద్యోగాలకు ప్రకటన వస్తే 1.25 కోట్లు దరఖాస్తులు వచ్చాయన్నారు. దేశంలో నిరుద్యోగం ఎలా ఉందో తెలియజేయడానికి ఈ పరిస్థితి నిదర్శనమన్నారు. ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయన్నారు. ధరలను ఎక్కడా అదుపు చేయడం లేదన్నారు. దేశంలో అసమానతల గురించి కాకుండా ఆదాయం గురించి మాట్లాడుతున్నారంటే ప్రజలను బుట్టలో వేస్తున్నట్టేనని చెప్పారు. వ్యవస్థలు కుప్పకూలిపోతున్నాయన్నారు. ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో ప్రజలు ఉన్నారన్నారు. ద్రవ్యోల్బణం పెరుగుతూనే ఉంటుందని ఆర్‌బీఐ అభిప్రాయపడిందన్నారు. న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, కాంగ్రెస్ నేత నరహరశెట్టి నరసింహరావు, న్యాయవాదులు చలసాని అజయ్‌కుమార్, సంపర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	124, 133, 144
చికెన్ విత్ స్కిన్	236
చికెన్ స్కిన్‌లెస్	246

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.00

యంగ్ ప్రొఫెషనల్స్ ఆత్మీయ సమావేశం

భారతీనగర్, మార్చి 29 : గురునానక్ రోడ్డులోని స్వర్ణ కన్వెన్షన్‌లో యంగ్ ప్రొఫెషనల్స్ ఆత్మీయ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి యంగ్‌ప్రొఫెషనల్స్ హాజరైయ్యారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్, గద్దె అనురాధ, బొప్పన భవకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు, రాష్ట్ర అభివృద్ధి పరిశ్రమలు తరలి పోతున్న విధానాలు పై చర్చించారు. యువత బలహీన పడటానికి రాజకీయ నాయకులే కారణమన్నారు. వచ్చే ఎన్నికలు కేవలం రాష్ట్ర అభివృద్ధి, పిల్లల భవిష్యత్ కోసమే జరుగుతున్నాయని, ఆ విధంగానే ప్రజలు ఓటు అనే ఆయుధాన్ని వాడుకునేందుకు సిద్ధమయ్యారన్నారు.

ఎంబీవీకేలో కంప్యూటర్ వేసవి శిక్షణ బ్యాచ్‌లు ప్రారంభం

గవర్నర్‌పేట, మార్చి 29: ఎంబీవీకే ఆధ్వర్యంలో కంప్యూటర్ వేసవి శిక్షణ నూతన బ్యాచ్‌లు ప్రారంభిస్తున్నట్లు మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం కంప్యూటర్ విభాగం బాధ్యులు టి. క్రాంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్ ఆఫీస్, డీటీపీ, సి. ల్యాంగ్వేజ్, ఇంటర్నెట్ బేసిక్స్ కోర్సులకు కొత్త బ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఆసక్తి కలిగినవారు ఎంజీ రోడ్డులోని ఎంబీవీకే ఆఫీసులో నేరుగా వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 0866- 2578044, 9490098042 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ఐరన్ గడ్డర్లు ధ్వంసం



కిందపడిపోయిన ఐరన్ గడ్డరు

రామలింగేశ్వరనగర్, మార్చి 29 : భారీ వాహనాలు రాకుండా అడ్డంగా వేసిన ఐరన్ గడ్డర్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 16వ డివిజన్ ఫీడర్ రోడ్డులో రోడ్డుకు ఒక వైపు పేయర్స్ బ్లాక్స్ తో రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. ఈ బ్లాక్స్ పై ఇసుక లారీలు, ట్రాక్టర్స్ తో పాటు ఇతర లారీలు నిలుపుదల చేస్తున్నారు. దీంతో ఈ రోడ్డు పాడవడంతో పాటు స్థానికులకు ఇబ్బందిగా ఉందని గ్రహించిన అధికారులు గీతానగర్ నాలుగురోడ్ల సెంటర్ వద్ద లారీలు, భారీ వాహనాలు రాకుండా ఇనుప గడ్డర్లు ఏర్పాటు చేశారు. ఇటీవల కే బిల్డింగ్ వైపు గడ్డర్‌ను పైన తొలగించగా, గీతానగర్ వైపు గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయంలో భారీ వాహనంతో ఢీ కొట్టించినట్లు వంగి పోయిఉంది. అక్కడి తో ఆగని వారు బుధవారం రాత్రి దానిని పూర్తిగా ధ్వంసం చేశారు.



నాలుగో డివిజన్ కార్యాలయంలో..



మధురానగర్ 29వ డివిజన్‌లో..



వించిపేటలో..



అర్జునవీధిలో..

తెలుగుజాతి ఆత్మగౌరవ ప్రతీక ఎన్టీఆర్

టీడీపీ ఆవిర్భావ దినోత్సవంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కేశినేని చిన్ని

పటమట, మార్చి 29 : తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని చాటిన మహనీయుడు ఎన్టీఆర్ అని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. అశోక్‌నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా శుక్రవారం నిర్వహించారు. టీడీపీ జెండాను కేశినేని శివనాథ్, గద్దె రామ్మోహన్ ఆవిష్కరించారు. ఎన్టీఆర్ విగ్రహానికి బొప్పన భవకుమార్ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెలుగువారి ఆత్మగౌరవ నినాదంతో తెలుగుదేశం పార్టీని స్థాపించి తొమ్మిది నెలల్లోనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. పొట్లూరి సాయిబాబు, శాయన బుజ్జి, అన్నే జనార్ధనరావు, కె.రవి, అబ్దుల్ కరీమ్, పేరేపి ఈశ్వర్, చలసాని రమణలు పాల్గొన్నారు.

భారతీనగర్ : రమేష్‌బాబు ఆసుపత్రి జంక్షన్ సమీపంలోని నాలుగో డివిజన్ కార్యాలయంలో కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు ఆధ్వర్యంలో తెలుగుదేశంపార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు పార్టీ కార్యాలయంలో తూమాటి ప్రేమనాథ్ జెండా ఆవిష్కరణం చేశారు. అనంతరం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో దేవరపల్లి ఆంజనేయులు, కొనసాని నాగమణి, వి.గోపాలకృష్ణ, గొల్లపూడి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



కబేళా సెంటర్‌లో ..

మధురానగర్ : మధురానగర్ 29వ డివిజన్‌లో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. డివిజన్ అధ్యక్షుడు పీవీఆర్, ఇన్‌చార్జి నెక్కంటి ప్రసాద్, క్లస్టర్ ఇన్‌చార్జి సింగం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వన్‌టౌన్‌లో..

వన్‌టౌన్ : టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు వన్‌టౌన్, విద్యాధరపురం, భవానీపురం ప్రాంతాల్లో శుక్రవారం ఘనంగా జరిగాయి. నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. వించిపేటలో ఎం.ఎస్.బేగ్ తన కార్యాలయం వద్ద జరిగిన వేడుకల్లో పాల్గొని జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ధారా సైదులు, షేక్ అబ్దుల్ సత్తార్‌లను సత్కరించారు. వన్‌టౌన్ అర్జునవీధిలో మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న కార్యాలయం వద్ద ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, టీడీపీ అధికార ప్రతినిధి నాగుల్‌మీరా, ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి బుద్దా వెంకన్న పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు(చంటి), గుండరాపు హరిబాబు, కామా దేవరాజ్, ఎస్.ఏడుకొండలు, పి.వి చిన్నసుబ్బయ్య పాల్గొన్నారు. వన్‌టౌన్ రమణయ్య కూల్‌డ్రింక్ షాపు వద్ద వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు సోలంకి రాజుభాయ్ కేక్ కట్ చేశారు. 37వ డివిజన్ అధ్యక్షుడు పిళ్లా సుదర్శనరావు ఆధ్వర్యంలో మురళీబాబు, గోపాలకృష్ణ, పి.రమణ తదితరులు పాల్గొన్నారు. విద్యా ధరపురం గుప్తా సెంటర్ వద్ద 39వ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళు లర్పించారు. డివిజన్ అధ్యక్షుడు రేగళ్ల లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి కె.సాంబశివయ్య, తదితరులు పాల్గొన్నారు. భవానీపురం 42వ డివిజన్ కార్యాలయం వద్ద 42, 43వ డివిజన్‌ల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. వల్లభనేని ప్రసన్న పార్టీ జెండాను ఆవిష్కరించారు. 42, 43వ డివిజన్‌ల అధ్యక్షులు శివాజీ ముదిరాజ్, కె.కొండయ్య యాదవ్, సయ్యద్ కరీముల్లా, ఎం.శివ, టి.శ్రీనివాస్, వి.నరసింహరావు, బి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ కార్యాలయంలో జరిగిన పార్టీ ఆవిర్భావ వేడుకల్లో గద్దె, చిన్ని, బొప్పన

సితార, కబేళా సెంటర్లలో

భవానీపురం : 45వ డివిజన్‌లోని సితార, కబేళా సెంటర్లలో నాయకులు గంగవరపు మురళీ ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేశారు. టీడీపీని గెలిపించడానికి ఐక్యంగా పార్టీ శ్రేణులు కష్టించి పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో మల్లెబోయిన కొండ, ఆలుగండ్ల సుబ్బారెడ్డి, సుభాని, నాగూల్ మీరా, గాలీబ్ షాహిద్, టి. ప్రసాద్, ఎన్. జగన్‌లు పాల్గొన్నారు.



18వ డివిజన్ పార్టీ కార్యాలయం వద్ద ..

కబేళా సెంటర్‌లో టీడీపీ జెండాను 45వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పేరం సత్యనారాయణ ఆవిష్కరించారు.

రాణిగారితోట : 18వ డివిజన్ పార్టీ కార్యాలయం వద్ద డివిజన్ అధ్యక్షుడు వేముల దుర్గారావు కేక్ కట్ చేశారు. అనంతరం అయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి బీసీ, ఎస్సీ ఎస్టీ, మైనార్టీల సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో పీరుబాబు, దుర్గారావు, కాశి, శ్రీను, బలగాని శ్రీను, విజయ్, గండ్ర రాజు, వేంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకులకు సత్కారం

విద్యాధరపురం : ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం జరగిన టీడీపీ ఆవిర్భావ వేడుకల్లో సీనియర్ నాయకులను కేశినేని చిన్ని సమక్షంలో సత్కరించారు. పార్టీ ఆవిర్భాం నుంచి జెండా మోసిన మాజీ మేయర్ కోనేరు శ్రీధర్, వీరప్రకాశ్, ఎన్టీఆర్ అభిమాని వడ్డే సాంబశివరావు, మైనార్టీ సెల్ నాయకులు వాహిని, మాజీ కార్పొరేటర్ చెన్నుపాటి గాంధీ, సిద్ధం నాగేంద్ర రెడ్డి, గుడూరు పద్మశేఖర్, పామల మాలకొండయ్య, పరిశపోగు రాజేష్, మహిళా నాయకురాలు ముక్కంటి నారాయణమ్మ, విజయలక్ష్మి, దేవమణిలను ఘనంగా సత్కరించారు.

ఖతార్‌లో టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

విద్యాధరపురం, మార్చి 29 : ఖతార్‌లో శుక్రవారం ఘనంగా టీడీపీ ఆవిర్భావ వేడుకలు జరిగాయి. నాయకులు, శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం, పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. జూమ్‌లో పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ ఖతార్ టీడీపీ నాయకులు పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అరాచక పాలనకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని ఈ పోరాటంలో ప్రవాసులు భాగస్వాములు కావాలని వచ్చే ఎన్నికలలో కూటమిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో పొనుగుమాటి రవి, దాసరి రమేష్, మల్లిరెడ్డి సత్యనారాయణ, శాంతయ్య యలమంచిలి, బి.రజిని తదితరులు పాల్గొన్నారు.



ఖతార్‌లో టీడీపీ ఆవిర్భావ దినోత్సవంలో టీడీపీ శ్రేణులు

ప్రకటన

నా క్లయింటు విశ్వనాధుని (లేటు) సత్యనారాయణ కుమారుడు విశ్వనాధుని రాఘువేంద్ర నివాసం డోర్ నెం: 1-4/4-28, కామకోటినగర్, శంకరమఠం వీధి విద్యాధరపురం, విజయవాడ టౌన్, ఎన్.టి.ఆర్ జిల్లా వారి సంజాయిషీ పై యావన్మందికి తెలియజేయునది ఏమనగా!

నా క్లయింటు విశ్వనాధుని రాఘువేంద్ర గార్కి వారి తండ్రి గారైన విశ్వనాధుని సత్యనారాయణ గారి స్థిరాస్తిపై వారి స్వాధీన హక్కు భుక్తములలో యుండి సర్వహక్కులతో అనుభవించుచూ వారి తదనంతరము దిగువ షెడ్యూలు ఆస్తి పై మరియు ఇతర ఆస్తుల పై జరగవలసిన ఏర్పాట్లు గురించి నిర్దేశిస్తూ ది. 25-11-2017 న ఒక వీలునామాను వ్రాసి శ్రీ విజయవాడ జిల్లా రిజిస్ట్రారు వారి ఆఫీసులో 3వ పుస్తకం నెం: 783/2017గా రిజిష్టరు చేసి, సదరు వీలునామాను ఎట్టి మార్పులు చేయుటలు, రద్దుపరచకుండా సదరు వీలునామానే ఆఖరి వీలునామాగా యుంచి ది. 19/12/2022 తేదీన స్వర్గస్తులైనారు. వారి మరణానంతరము సదరు వీలునామాలోని అంశముల ప్రకారము యన్.టి.ఆర్.జిల్లా, విజయవాడ జిల్లా రిజిస్ట్రారు వారి యిలాకా - విజయవాడ మున్సిపల్ కార్పోరేషన్ ఏరియాలో చేరిన విజయవాడ టౌన్, విద్యాధరపురం ఏరియాలోని కామకోటినగర్లో గల ఆస్తికి విద్యాధరపురం తాలూకు రెవిన్యూ వార్డు నెం.1, బ్లాకు నెం.1, యన్.టి.యస్. నెం.14, ప్లాటు నెం. 28, మున్సిపల్ వార్డు నెం.1 ప్రస్తుత వార్డు నెం. 1బి, అసిస్మెంటు నెం.649సి, న్యూ అసిస్మెంటు నెం. 7430, ప్రస్తుత అసిస్మెంటు నెం.1073003828 డోర్ నెం. 1-4/4-28 రు చ.గ. 200 లు లేక చ.మీ. 167.226 ల స్థిరాస్తి నివేశన స్థలము, సదరు స్థలములోని గ్రౌండు ఫ్లోరుగా గల ఆర్.సి.సి. డాబా యిల్లు, మరియు ఫస్టు ఫ్లోరుగా గల రేకుల షెడ్డు కట్టడములున్నూ, మరియు మరికొంత ఆస్తిని విశ్వనాధుని రాఘవేంద్ర గారు స్వాధీన పరచుకొని యావత్తు పన్నులు షైరా చెల్లించుకొనుచూ సర్వ సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములతో అనుభవిస్తూయున్నారు. సదరు రిజిష్టరు వీలునామా నెం. 783/2017 ఒరిజినల్ వీలునామాను నా క్లయింటు విశ్వనాధుని రాఘవేంద్ర గారు జిరాక్స్ నిమిత్తము విద్యాధరపురం ఏరియాలో ఉన్న జిరాక్స్ షాపు కు తీసుకొని వెళ్ళుచుండగా గైరాజరయినది. సదరు విషయమై భవానీపురం పోలీస్ స్టేషన్లో కంప్లెయింటు ఇచ్చియున్నారు. సదరు ఒరిజినల్ వీలునామా 25-11-2017 రిజిష్టర్ నెం: 783/2017 ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది అడ్రసు దారునకు అందచేయగలరు.

విశ్వనాధుని రాఘువేంద్ర
డోర్ నెం: 1-4/4-28, కామకోటినగర్,
శంకరమఠం వీధి విద్యాధరపురం,
విజయవాడ టౌన్, ఎన్.టి.ఆర్ జిల్లా
సెల్ నెం. 9885314820

ఇట్లు: L.V.V.N.BHANU PRIYA
S.V. SUBBA RAO, ADVOCATES
G-3, 111 Floor, Classic Towers,
Mogalrajpuram,Vijayawada,
Cell No: 9441463180

పాపుల రక్షణకు శిలువనెక్కిన క్రీస్తు

భవానీపురం, మార్చి 29 : మానవాళి పాప పరిహారానికి ఏసుక్రీస్తు సిలువెక్కి తన రక్తాన్ని చిందించి అందరిలోను ప్రేమను చాటాడని జోజినగర్ బాలయేసు చర్చి విచారణ గురువులు మెరుగుమాల చిన్నప్ప అన్నారు. పవిత్ర శుక్రవారం (గుడ్‌ఫ్రైడే)ను పురస్కరించుకుని బాలయేసు చర్చి నుంచి సిలువ మార్గం నిర్వహించారు. ప్రపంచ మానవాళి పాపం నుంచి విముక్తి కలిగించిన విశిష్టమైన రోజే గుడ్‌ఫ్రైడే అని తెలిపారు. కార్యక్రమంలో సహాయక గురువులు ఫాదర్ రాజేష్, విచారణలోని కన్యస్త్రీలు, కౌన్సిల్ నెంబర్సుపాల్గొన్నారు.

రాణిగారితోట : గుడ్‌ఫ్రైడ్ సందర్భంగా రాణిగారితోటలోని ఆర్‌సీఎం చర్చి నుంచి ఏసుప్రభు సిలువ మార్గంలో పాల్గొన్న భక్తులకు వేముల నిఖిల్ కుమార్, వెంకట్ గౌతమ్‌లు 500 భక్తులకు ద్రాక్ష రసం పంపిణీ చేశారు.



భవానీపురం బైపాస్‌లో శిలువ యాత్ర

కార్యక్రమంలో వేముల దుర్గారావు, పీరుబాబు, మర్రి వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

లబ్బీపేటలో ఇఫ్తార్ విందు

లబ్బీపేట, మార్చి 29 : ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపు కునే రంజాన్ మాసంలో సమైక్యత్యకు నిలయంగా ఇఫ్తార్ విందులను ఏర్పాటు చేస్తారని ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షుడు ముహమ్మద్ రఫీఖ్ తెలిపారు. జమాతె ఇస్లామీ హింద్ విజయవాడ తూర్పు శాఖ ఆధ్వర్యంలో శుక్రువారం లబ్బీపేటలోని హర్నూ హైస్కూల్ లో ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముహమ్మద్ కరీముద్దీన్, ఇస్మాయిల్ ఉమ్రీ, షేక్ హుస్సేన్ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో రౌడీషీటర్

వన్‌టౌన్, మార్చి 29 : వైసీపీ ఎన్నికల ప్రచారంలో రౌడీషీటర్లు పాల్గొంటున్నారు. కొత్తపేట పోలీసు స్టేషన్ పరిధి 50 వడివిజన్‌లో శుక్రవారం పశ్చిమ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ తరఫున ఆయన కుమార్తె కుమారుడి ప్రచారంలో మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు ముఖ్య అనుచరుడు రౌడీషీటర్ బంక శివ పాల్గొన్నాడు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు నిఘా ఉంచాల్సి ఉంటుంది. అయితే కొన్ని రోజుల నుంచి రౌడీషీటర్ బంకా శివ సెంట్రల్ నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు ప్రచారంలో పాల్గొంటూనే, పశ్చిమ నియోజకవర్గంలో అభ్యర్థి షేక్ ఆసిఫ్ ప్రచారంలోనూ పాల్గొంటున్నాడు.



ఆసిఫ్ కుమారుడు నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారంలో రౌడీషీటర్ బంకా శివ (రౌండ్ చేసిన వ్యక్తి)

విద్యుత్ సరఫరా నిలిపివేత

గవర్నర్‌పేట, మార్చి 29: చుట్టుగుంట సబ్ స్టేషన్ విశాలాంధ్ర ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ టీవీ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశాలాంధ్ర ప్రెస్ ఏరియా, బ్రహ్మానందరెడ్డి రోడ్, దాసరి వారి వీధి, కోవెలమూడి వారి వీధి, చలసాని వెంకట కృష్ణయ్య వీధి, వేముల శ్యామలాదేవి వీధి, బాలాజీ వీధి, పాపయ్య వీధి, ఇజ్జాడ వారి వీధి, లంకపల్లి వారి వీధి, నేతాజీ వీధి, శ్రీనివాసరావు వీధి, శాతవాహనా కళాశాల వెనుక భాగంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

కరూర్ వైశ్యా బ్యాంక్ సిబ్బంది రక్తదానం

అజిత్‌సింగ్‌నగర్, మార్చి 29 : రక్తదానంతో మరో ముగ్గురు జీవితాలకు వెలుగు ప్రసాదించవచ్చునని, రక్తదాతలు ప్రాణదాతలని కరూర్ వైశ్యా బ్యాంక్ డివిజనల్ హెడ్ కె.వి.ఎస్.ప్రసాద్ అన్నారు. లబ్బీపేటలోని బ్యాంకు డివిజనల్ కార్యా లయంలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది సమాజ శ్రేయస్సును ఆకాంక్షిస్తూ రక్తాదాన శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయం అన్నారు. రక్తదానంపై లయన్స్ క్లబ్ సభ్యులు ప్రజల్లో అవగాహన కల్పించి చైతన్యం తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. బ్యాంకు సిబ్బంది 30 యూ నిట్లు రక్తాన్ని బ్లాడ్ బ్యాంక్‌కు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ అధ్యక్షుడు బి. హనుమయ్య, చిగురుపాటి మంజువాణి, వరప్రసాద్, క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ జెఎన్. శంకర్, జె.వి.సుబ్రహ్మణ్యం, పి.శివరాజు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న సిబ్బంది

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
శనివారం • 30 మార్చి 2024

నిర్క్షీరపాచితపయః ప్రహితాష్ట భాగం శ్యామాక ధాన్యం నవం నిర్భృతాంతరోష్మ!
తతపాయసం నరసమావనయం సుధాయాః కో లోడిభూప తిమ్యతె ఘృతఖండ సాకమ్!!

సామలతో రాజ పాయసం

'పయః' అంటే పాలు. ఆవు పాలకే ఈ పదాన్ని ఎక్కువగా ఉపయోగిస్తారు. క్షీరానికి 'పయస్సు' పర్యాయపదమే అయిన ప్పటికీ మొక్కల నుంచి వచ్చే పాలకు, ఇతర జంతువుల క్షీరాలకు 'పయః' అనే పదం వర్తించదు. ఆవు పాలతో కాచినది కాబట్టి పాయసం అన్నారు. పాయసం అన్నారంటే ఆవు పాలతో తయారైందనే మనం భావించాలి. సాధ్యమైనంత ప్రయత్నించి ఆవు పాలు నమ్మకమైనవి దొరక్కపోతేనే గేదె పాలు లేదా ప్యాకెట్టు పాలను వాడాలి.

పాయసం కాయాలంటే ఆవు పాలు, బియ్యం లేదా చిరుధాన్యాలు, కమ్మగా కాచిన తాజా నెయ్యి, పంచదార లేదా బెల్లం కావాలి. గోధుమల్ని మాత్రమే ప్రధాన ఆహారంగా తీసుకునే వారు కూడా పాయసాన్ని వీటితోనే వండుకుంటారు. క్షేమశర్మ 'క్షేమ కుతూహలం' గ్రంథంలోని పై శ్లోకంలో 'రాజ పాయసం' కోసం 'శ్యామాక ధాన్యం నవం' తీసుకోవాలన్నాడు. 'శ్యామాక ధాన్యం' అంటే సామలు. కొత్త సామలతో పాయసం కాచుకోవటం గురించి ఈ శ్లోకంలో వివరిస్తున్నాడు.

- ముందుగా సామలనే ధాన్యాన్ని ఒక గ్లాసు మోతాదులో



తీసుకొని, కడిగి శుభ్ర పరచుకుని నీళ్లలో రెండు గంటలసేపు నాననివ్వాలి.

- పాలు చిక్కగా ఉండాలి. నీళ్లు కలిసినవిగా ఉంటే కాసేపు మరిగించి చిక్కగా ఉన్న పాలు 8 కప్పులు తీసుకోవాలి. 'నిర్క్షీర పాచిత పయః' అంటే అర్థం ఇదే.
- ఇప్పుడు 8 కప్పుల పాలను పొయ్యి మీద పెట్టి, మరగటం మొదలయ్యాక, నానిన ఈ సామల్ని ఒక కప్పు మోతాదులో తీసుకుని ఈ మరిగే పాలలో వెయ్యాలి.
- సన్న సెగన ఈ పాలలో సామల్ని చక్కగా ఉడకనివ్వాలి.
- గింజ మెత్తబడి ఉడికిన తరువాత తగినంత నెయ్యి, పంచదార లేదా బెల్లం అందులో కలిపి మూతబెట్టి కాసేపు మగ్గనివ్వండి. కమ్మని 'రాజ పాయసం' తయారైనట్టే! ఇష్టమైతే జీడిపప్పు, ఏలకులు, పచ్చ కర్పూరం కలుపుకోవచ్చు.

చంద్రప్రభా క్షీర పాకం...

ఒక బాండీలో కొద్దిగా నెయ్యి తీసుకుని కాగిన తరువాత, కడిగి ఆరబోసిన బియ్యం ఒక కప్పుడు ఈ నేతిలో వేయాలి. బాగా కలియ బెడుతూ వేగించాలి. బియ్యానికి పూర్తిగా నెయ్యి పట్టిన తరువాత ఇందాక చిక్కగా కాచిన పాలు ఆ బియ్యం మునిగేంతవరకు పోయాలి. అత్తెసరు అన్నం వండేప్పుడు బియ్యానికి ఎన్ని రెట్లు నీళ్లు పోస్తామో ఆ కొలతలో పాలు పోయాలి. ఆ పాలతోనే బియ్యం ఉడకాలి. అవసరం అయితే మరికాసిని పాలు పోసుకోవచ్చు. బాగా ఉడికిన తరువాత పొయ్యి మీంచి దించి, చల్లారాక అందులో చాలినంత తేనె కలపాలి. ఈ క్షీరాన్నాన్ని 'చంద్రప్రభా క్షీరపాకం' అన్నాడు క్షేమశర్మ. ఒక వేళ తేనె లేకపోతే బెల్లం లేదా పంచదార కలిపి వండుకోవచ్చు.

'చంద్రప్రభా క్షీరపాకం' వాత వ్యాధులమీద పని చేస్తుందన్నాడు క్షేమశర్మ. ధాతు పుష్టినిస్తుంది. రక్త స్రావాలను అరికడుతుంది. వేడిని తగ్గిస్తుంది. కానీ కష్టంగా అరుగుతుంది. జీర్ణశక్తిని అనుసరించి దీన్ని తీసుకోవాలి.

ఔషధంలా...

'పాయసం దుర్జరం బల్యం ధాతుపుష్టి వివర్ధనమ్! విష్టంభ జననం రక్తపిత్తాగ్ని మారుతాన్!'... అంటే ఇలా తయారైన పాయసం అమితమైన శక్తినిస్తుంది. ధాతువుల్ని పోషిస్తుంది. క్షీణించే వ్యాధులతో బాధపడేవారికి పుష్టి నిస్తుంది. వేడి తగ్గుతుంది. రక్తస్రావం ఆగుతుంది. అయితే జీర్ణశక్తిని బట్టి దీన్ని తీసుకోవాలి. మితిమీరిన ఆకలి ఉన్నవారికి ఇది దండిగా ఉంటుంది. ఎప్పుడు పడితే అప్పుడు ఏది పడితే అది తినేవారికి తమ ఆకలి మీద తమకే అదుపు కలిగించటానికి ఈ రాజ పాయసం ఉపయోగపడుతుంది. మలబద్ధకంతో బాధపడేవారికి ఇది విరేచనాన్ని బంధించే అవకాశం ఉంది. జాగ్రత్తగా తీసుకోవాలి.

ఇది సామలతో వండే రాజపాయసం. తెలుగువాళ్లు రథసప్తమి రోజున ఆవుపేడ పిడకల మీద వరి బియ్యంతో పాయసాన్ని ఇదే పద్ధతిలో వండుతారు. బియ్యంతో ఈ పద్ధతిలో వండే పాయసాన్ని క్షేమశర్మ 'చంద్రప్రభా క్షీర పాకం' అనే పేరుతో వివరించాడు.

పాయసం భారత దేశపు మొదటి పిండివంటల్లో ఒకటి. పవిత్రాహారం. ఇది ఋగ్వేద కాలం నుంచి దేశీయులు ఆస్వాదించిన గొప్ప వంటకం. మైదా పిండితో తయారైన నూడుల్సు తోనో, సేమ్యాతోనో కాకుండా చిరుధాన్యాలతో పాయసాన్ని ఎలా వండుకోవాలో ఈ అధ్యాయంలో క్షేమశర్మ వివరించాడు.

• గంగరాజు అరుణాదేవి

వంటిల్లు

ఎండాకాలం వచ్చేసింది. పచ్చి మామిడికాయలు మార్కెట్లో దొరుకుతున్నాయి. మామూలు వంటలైనా మామిడిని మిక్స్ చేసి చేస్తే మాత్రం కాస్త డిఫరెంట్‌గా ఉంటుంది. మామిడికాయ చేపల పులుసు, మ్యాంగో చికెన్ టిక్కా పుల్ల మామిడి మటన్ కర్రీ, మ్యాంగో చిల్లి చికెన్ కర్రీలను వండుకోవచ్చు ఇలా..



నాన్‌వెజ్‌తో మామిడి మిక్స్ చేస్తే..

మ్యాంగో చికెన్ టిక్కా

కావాల్సిన పదార్థాలు: చికెన్ క్యూబ్స్- 500 గ్రాములు, వెల్లుల్లి రెబ్బలు- 10, అల్లం- చిన్న ముక్క, పచ్చిమిర్చి- 4, కొత్తిమీర- పావు కప్పు, పసుపు- చిటికెడు, కారం- టీస్పూన్, జీలకర్ర పొడి- 1 టీస్పూన్, గరం మసాలా పొడి- అర టీస్పూన్, ధనియాల పొడి- 1 టీస్పూన్, నల్ల మిరియాల పొడి- అరటీస్పూన్, ఉప్పు- తగినంత, పెరుగు- రెండు టేబుల్ స్పూన్లు, పచ్చి మామిడికాయల చూర్ణం- 2 టేబుల్ స్పూన్లు, క్రీమ్- 2 టేబుల్ స్పూన్లు, శనగపిండి- 1 టేబుల్ స్పూన్, నూనె- 2 టేబుల్ స్పూన్లు

తయారీ విధానం: చిన్న జార్‌లో వెల్లుల్లి రెబ్బలు, పచ్చిమిర్చి, అల్లం ముక్కతో పాటు అరకప్పు నీళ్లు వేసి మిక్సీ పట్టాలి. ఈ మెత్తటి పేస్ట్‌ను బౌల్‌లో వేసి పక్కన ఉంచాలి. ఆ తర్వాత మరో జార్‌లో కొత్తిమీర, పసుపు, కారం, జీలకర్ర పొడి, గరం మసాలా పొడి, ధనియాల పొడి, నల్ల మిరియాల పొడి, ఉప్పు, పెరుగు వేసి పావు కప్పు నీళ్లు వేసి మిక్సీ పట్టాలి. ఈ మెత్తటి పేస్ట్‌ను బౌల్‌లో వేసి పక్కన



ఉంచుకోవాలి.

చికెన్ ముక్కలను బౌల్‌లో వేసి అందులో పక్కన ఉంచుకున్న రెండు పేస్ట్‌లను వేశాక.. పచ్చి మామిడికాయల చూర్ణం, ఫ్రెష్ క్రీమ్, శనగపిండి వేసి బాగా కలపాలి. చికెన్ ముక్కలకు ఈ మిశ్రమం బాగా పడుతుంది. దీన్ని నలభై నిముషాల పాటు మారినేట్ చేసి పెట్టుకోవాలి.

నలభై నిముషాల తర్వాత టిక్కా స్టిక్స్ తీసుకుని మొదట ఉల్లిపాయ పొర, చికెన్ క్యూబ్, క్యాప్సికమ్ ముక్క ఇలా వరుసగా స్టిక్‌లో గుచ్చాలి. ఇలా మూడు నాలుగు స్టిక్స్ గుచ్చుకుని ప్లేట్‌లో ఉంచుకోవాలి. తర్వాత గ్రిల్ ప్యాన్ తీసుకుని అందులో నూనె వేయాలి. నూనె కాస్త వేడయ్యాక ఈ స్టిక్స్‌ను అందులో ఉంచి అన్ని వైపులా జాగ్రత్తగా కాల్చుకోవాలి. బాగా గ్రిల్ అయిన తర్వాత చికెన్ ముక్కల మీద నిమ్మకాయ రసం పిండుకుని కొత్తిమీర చల్లుకుని వేడివేడిగా తింటే మ్యాంగో ఫ్లేవర్ ఉండే చికెన్ టిక్కా మరింత రుచిగా ఉంటుంది.

కావాల్సిన పదార్థాలు: బోన్‌లెస్ చికెన్- 400 గ్రాములు (కూరకు సరిపడ సైజ్‌లో ముక్కలు తరగాలి), మీడియం సైజ్ మామిడికాయలు- 2 (చిన్న ముక్కలుగా తరగాలి), పచ్చి మిరపకాయలు- 5, వెల్లుల్లి రెబ్బలు- 5, సన్నగా తరగిని అల్లం ముక్కలు- పావు టీస్పూన్, ఉల్లిపాయలు- 2 (సన్నగా తరగాలి), కొత్తిమీర- గుప్పెడు, నూనె- 2 టీ స్పూన్లు, జీలకర్ర- ఒకటిన్నర టీస్పూన్, కారంపొడి- ఒకటిన్నర టీస్పూన్, పసుపు- అరటీస్పూన్, ధనియాల పొడి- ముప్పావు టీస్పూన్, జీలకర్ర పొడి- అరటీస్పూన్, కొత్తిమీర- 2 టీస్పూన్లు

మ్యాంగో చిల్లి చికెన్ కర్రీ

కావాల్సిన పదార్థాలు: బోన్‌లెస్ చికెన్- 400 గ్రాములు (కూరకు సరిపడ సైజ్‌లో ముక్కలు తరగాలి), మీడియం సైజ్ మామిడికాయలు- 2 (చిన్న ముక్కలుగా తరగాలి), పచ్చి మిరపకాయలు- 5, వెల్లుల్లి రెబ్బలు- 5, సన్నగా తరగిని అల్లం ముక్కలు- పావు టీస్పూన్, ఉల్లిపాయలు- 2 (సన్నగా తరగాలి), కొత్తిమీర- గుప్పెడు, నూనె- 2 టీ స్పూన్లు, జీలకర్ర- ఒకటిన్నర టీస్పూన్, కారంపొడి- ఒకటిన్నర టీస్పూన్, పసుపు- అరటీస్పూన్, ధనియాల పొడి- ముప్పావు టీస్పూన్, జీలకర్ర పొడి- అరటీస్పూన్, కొత్తిమీర- 2 టీస్పూన్లు



తయారీ విధానం: జార్‌లో మామిడికాయ ముక్కలు, నాలుగు పచ్చి మిరపకాయలు, వెల్లుల్లి, అల్లం ముక్కలు, తరగిన రెండు ఉల్లిపాయల్లో సగం విశ్రమంతో పాటు కొద్దిగా నీళ్లు వేసి మిక్సీ పట్టాలి. ఈ మెత్తని మిశ్రమంలో కొత్తిమీర వేసి మరోసారి మిక్సీ పట్టాలి. ఈ పేస్ట్‌ను బౌల్‌లో వేసి పక్కన ఉంచుకోవాలి.

బౌల్‌లో శుభ్రపరచిన చికెన్ తీసుకుని సరిపడ ఉప్పు వేసి మిక్సీ పట్టి పక్కన ఉంచుకున్న మామిడికాయల పేస్ట్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమం ముక్కలకు పడుతుంది. అరగంట పాటు ఈ మిశ్రమాన్ని పక్కన ఉంచుకోవాలి.

ప్యాన్‌లో నూనె వేసిన తర్వాత జీలకర్ర, మిగిలిన ఉల్లిపాయ ముక్కలు, నాలుగు పచ్చిమిర్చి వేసి బాగా కలపాలి. ఇందులో పసుపు, కారం పొడి, ధనియాల పొడి, జీలకర్ర పొడి వేసి బాగా కలపాలి. సరిపడ ఉప్పు వేసి మరో సారి గరిటెతో కలపాలి. ఇందులోకి కొత్తిమీర వేసిన తర్వాత చికెన్ ముక్కల విశ్రమాన్ని వేయాలి. బాగా కలిపిన తర్వాత ముప్పావు కప్పు నీళ్లు పోసి రుచికి సరిపడ ఉప్పుందో లేదో చెక్ చేసుకుని మిశ్రమాన్ని కలపాలి. ప్యాన్‌పై మూత ఉంచి చికెన్ ముక్క ఉడికేంత వరకూ కుక్ చేయాలి.

మ్యాంగో చిల్లీ చికెన్ కర్రీని బౌల్‌లో వేసుకుని కొత్తిమీరతో గార్నిష్ చేసుకుని అన్నంతో లేదా చపాతీలతో తినాలి.

మ్యాంగో చేపల పులుసు

కావాల్సిన పదార్థాలు: చేప ముక్కలు- 250 గ్రాములు, పచ్చి మామిడికాయ ముక్కలు- 1 కప్పు, ఆవాలు- అర టీస్పూన్, మెంతులు- పావు టీస్పూన్, ఎండు మిరపకాయలు- 2, కరివేపాకు- కొద్దిగా, ఉల్లిపాయలు- అరకప్పు, అల్లం, వెల్లుల్లి పేస్ట్- 1 టీస్పూన్, టొమాటో పేస్ట్- అరకప్పు, చింతపండు రసం- కప్పు, పసుపు- చిటికెడు, కారం- 1 స్పూన్, ధనియాల పొడి- అరటీస్పూన్, జీలకర్ర పొడి- పావు టీస్పూన్, ఉప్పు- రుచికి తగినంత, బెల్లం- కొద్దిగా, కొత్తిమీర- 1 టేబుల్ స్పూన్, నూనె- కప్పు



తయారీ విధానం: ముందుగా చేప ముక్కలను శుభ్రంగా కడగాలి. ఒక ప్లేట్‌లో చేప ముక్కలు వేయాలి. ఇందులో ఉప్పు, పసుపు వేసి ముక్కలకు పట్టేట్లు కలపాలి. దీన్ని పక్కన ఉంచుకోవాలి. ఇప్పుడు స్టవ్ ఆన్ చేసి ప్యాన్‌లో నూనె వేయాలి. నూనె వేడయ్యాక మెంతులు, ఆవాలు, ఎండు మిరపకాయలను సగానికి కట్ చేసి వేయాలి. ఉల్లిపాయ ముక్కలు, కరివేపాకు వేసి గరిటెతో నిముషం పాటు కలిపాక అల్లం, వెల్లుల్లి పేస్ట్ వేసి వాసన పోయేంత వరకూ కలుపుతూ ఉండాలి. ఉల్లిపాయ ముక్కలు రంగు మారిన తర్వాత మామిడికాయ ముక్కలు వేసి గరిటెతో కలపాలి. నిముషం పాటు కలిపాక తగినంత ఉప్పు వేసి ప్యాన్ మూత పెట్టి కుక్ చేయాలి. మూడు నిముషాల తర్వాత మూత తీసి పసుపు, ధనియాల పొడి వేసి కలిపాక జీలకర్ర పొడి, కారం వేసి కలిపాక టొమాటో పేస్ట్ వేసి బాగా ముక్కలకు పట్టేట్లు నిముషం పాటు కలిపాక చింతపండు రసం వేసి నిముషం పాటు కలిపాక సగం గ్లాసు నీళ్లు పోసి ప్యాన్‌పై మూత ఉంచాలి. మూడు నిముషాల తర్వాత చూస్తే మామిడి ముక్కలు ఉడుకుపడినట్లు కనపడుతుంది. ఇందులో మారినేట్ చేసుకున్న చేప ముక్కలను ఒక్కోటి ఉంచాలి. వీటిని గరిటెతో తునగిపోకుండా జాగ్రత్తగా మామిడి మిశ్రమంలో కలపాలి. కొద్దిగా బెల్లం, కొత్తిమీర వేసిన తర్వాత ప్యాన్‌పై మూత ఉంచి ఐదు నిముషాల పాటు కుక్ చేయాలి. మూత తీశాక నూనె పైకి తేలినట్లు కనపడుతుంది. ఈ మిశ్రమాన్ని కలిపి బౌల్‌లో తీసుకుని వేడివేడి అన్నంలో తినేయాలి.

మ్యాంగో మటన్ కర్రీ

కావాల్సిన పదార్థాలు

మీడియం సైజ్ మామిడికాయ- 1 (చిన్న ముక్కలుగా తరగాలి), మటన్- కేజీ (చిన్న ముక్కలుగా కట్ చేయాలి), నూనె- కప్పు, యాలకులు- 3, లవంగాలు- 5, దాల్చిన చెక్క- 1, మిరియాలు- 6, ఉల్లిపాయలు- 2 (సన్నగా తరగాలి), పచ్చిమిర్చి- 4 (సన్నగా తరగాలి), జింజర్, గార్లిక్ పేస్ట్- 2 టీస్పూన్లు, పసుపు- అరటీస్పూన్, కారం- 2 టీస్పూన్లు, టొమాటో- 1 (ముక్కలుగా తరగాలి), ధనియాల పొడి- 1 టీస్పూన్, జీలకర్ర పొడి- 1 టీస్పూన్, గరం మసాలా- 1 టీస్పూన్,

తయారీ విధానం

కుక్కర్‌లో నూనె వేసి యాలకులు, లవంగాలు, దాల్చిన చెక్క, మిరియాలు, ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి వేశాక బాగా కలపాలి. ఆ తర్వాత జింజర్ గార్లిక్ పేస్ట్ వేసి నిముషం పాటు గరిటెతో గార్లిక్ వాసన పోయేంత వరకూ కలిపిన తర్వాత మటన్ ముక్కలు వేయాలి. మిశ్రమంలో కలిసేట్లు మటన్ ముక్కలు కలపాలి. దీని మీద ప్లేట్ ఉంచి మూడు నిముషాల పాటు కుక్ చేశాక పసుపు, కారం వేశాక తగినంత ఉప్పు వేసి గరిటెతో మటన్‌ను బాగా కలపాలి. ఆ తర్వాత కుక్కర్ మీద ప్లేట్ ఉంచి మూడు నిముషాల పాటు కుక్ చేయాలి.

ప్లేట్ తీసి టొమాటో ముక్కలు, పుల్ల మామిడి ముక్కలు వేసి బాగా కలపాలి. మిశ్రమానికి మామిడి ముక్కల ఫ్లేవర్ బాగా పడుతుంది. ఇందులో జీలకర్ర పొడి, ధనియాల పొడి, గరం మసాలా వేసి కలిపిన తర్వాత గ్లాసు నీళ్లు పోయాలి. విశ్రమాన్ని గరిటెతో కలిపిన తర్వాత కుక్కర్ మూత బిగించాలి. నాలుగు విజిల్స్ వచ్చేంత వరకూ మటన్‌ను ఉడికించాలి. మూత తీసి గరిటెతో బాగా కలిపి కొత్తిమీర చల్లుకుని వడ్డించుకోవాలి. అన్నం, దోశె, చపాతీలోకి ఈ పుల్ల మామిడికాయ మటన్ రుచికరంగా ఉంటుంది.

నవ్య 'స్మార్ట్ పేజీ'లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/o33jg9p
లో చదవండి.

స్ఫూర్తి

భవితకు భరోసా



కాళ్లూ రెండూ చచ్చుపడినా.. వేరొకరికి సాయం చేయాలన్న తపన ఆమెను ఇంట్లో కూర్చోనివ్వలేదు. ఉదయాన్నే బండెక్కి... ఊరంతా తిరుగుతూ... తనలాంటివారి గళమై నినదిస్తున్నారు. వైకల్యాన్ని పక్కకు నెట్టి... 'డెవలప్‌మెంట్ ఫోరమ్ ఫర్ విమెన్ విత్ డిజేబిలిటీ' నెలకొల్పి... సామాజిక చైతన్యం రగిలిస్తున్న 43 ఏళ్ల కె.సుజాత ప్రయాణం ఇది...

"అనుకున్నవన్నీ జరిగితే అది జీవితం ఎందుకు అవుతుంది? నిత్యం సవాళ్లు, సమస్యలతో సహజీవనం చేయాలి. ఈ సత్యం నాకు చిన్నప్పుడే బోధపడింది. తమిళనాడు రాజధాని చెన్నై శివారు ప్రాంతం పెరుంబాక్కం మాది. పేద కుటుంబం. పుట్టిన ఏడాదికే నేను అడుగులు వేశానని మా ఇంట్లోవాళ్లు సంబరాలు చేసుకున్నారట. కానీ అంతటి సంతోషాన్ని ఒక్కసారిగా దూరం చేసింది విధి. నాకు ఏడాదిన్నర వయసు ఉన్నప్పుడు ఆడుకొంటూ... ఉయ్యాలలో నుంచి కింద పడ్డాను. పెద్దగా దెబ్బలేమీ తగలలేదు కానీ... కాలు కదపలేకపోయాను. ఒక్కసారిగా ఒళ్లు వేడెక్కింది. వెంటనే ఆసుపత్రికి తీసుకువెళితే... వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు పోలియోగా నిర్ధారించారు. జీవితాంతం వైకల్యంతోనే బతకాలని చెప్పారు. అది విని అమ్మానాన్న తల్లడిల్లిపోయారట. ఇప్పటికీ ఆ సందర్భాన్ని గుర్తు చేసుకుని వాళ్లు కుమిలిపోతుంటారు. నేనే వారికి ధైర్యం చెబుతుంటాను.

స్వయం శక్తితో...

నా రెండు కాళ్లూ ఎనభై ఐదు శాతం చచ్చుబడిపోయాయి. ఒకరి సాయం లేకుండా కదలలేని పరిస్థితి. చిన్నప్పుడంటే పెద్దవాళ్లు చూసుకొంటారు. కానీ ఎన్ని రోజులు అలా ఒకరిపై ఆధారపడాలి? ఇదే నన్ను బాగా కలవర పెట్టింది. అప్పుడే అనుకున్నా... స్వశక్తితో జీవితమనే సాగరాన్ని ఈదాలని. క్రమంగా నా పనులు నేను చేసుకోవడం మొదలుపెట్టాను. కష్టమే... కానీ ప్రయత్నిస్తే అసాధ్యమనేది ఏదీ ఉండదు కదా. వైకల్యం ఉందని వెనకడుగు వేస్తే... భవిష్యత్తులో చేయి అందించేవారు దొరక్కపోతే... బతుకు సాగేదెలా! నాకు కుటుంబం, సన్నిహితులు ఎంతోమంది అండ ఉంది. నా ప్రయాణంలో అత్యధిక భాగం వారందరి సహకారంతోనే సాగింది. మరి చుట్టూ ఎవరూ లేని వికలాంగుల పరిస్థితి ఏమిటి? వారిని పట్టించుకొనేది ఎవరు? అందుకే అలాంటివారికి నేను భరోసా కావాలనుకున్నా.



నాలాంటివారి కోసం...

అదే సమయంలో నగరంలోని పలు మురికివాడలను ఖాళీ చేయించింది ప్రభుత్వం. వాళ్లందరినీ మా ప్రాంతానికి తరలించింది. కొత్త ప్రదేశం. ఎన్నో సమస్యలు. కనీస వసతులు లేవు. అన్నీ బాగున్నవారే ఎన్నో అవస్థలు పడుతున్నారు. ఇక నాలాంటివారి పరిస్థితి వర్ణనాతీతం. వారి బాధలు పట్టించుకునేవారే లేరు. దాంతో నేనే చొరవ తీసుకున్నాను. వారికి ఎదురైన ప్రధాన సమస్య... చిరునామాలు మారడంతో వికలాంగ పింఛన్లు పూర్తిగా ఆగిపోయాయి. ఆ క్షణమే నిర్ణయించుకున్నాను... పెరుంబాక్కం ప్రాంతవాసుల సంక్షేమం కోసం పాటుపడాలని. నా ప్రయాణం మురికివాడల్లోని పిల్లలకు విద్య బోధనతో మొదలుపెట్టాను. అలాగే మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేలా వారిలో చైతన్యం రగిలించాను. అత్యవసరంగా చేయాల్సింది బడి మానేసిన పిల్లలను తిరిగి తరగతి గదుల్లో కూర్చోబెట్టడం. ఎందుకంటే బాల్యం గాడి తప్పితే వారి భవిత అంధకారం అవుతుంది. వసతులు లేవనే కారణంతో చిన్నారులను విద్యకు దూరం చేయడం సరైంది కాదు. అందుబాటులో ఉన్న వనరులతోనే విద్యాబుద్ధులు నేర్పించేందుకు కృషి చేయాలి. ఈ ఆలోచనతోనే ముందడుగు వేశాను.

అవగాహన కల్పిస్తూ...

ఇక్కడ ప్రధాన సమస్య... రైట్ టూ ఎడ్యుకేషన్ గురించి తల్లితండ్రులకు అవగాహన లేకపోవడం. దీనిపై అవగాహన కల్పించేందుకు వాలంటీర్లను నియమించాను. అది మంచి ఫలితాలు ఇచ్చింది. కొద్ది రోజుల్లోనే పిల్లలను దగ్గర్లోని బడులకు పంపడంలో విజయవంతమయ్యాం. అయితే అన్నిటికంటే కష్టం అనిపించింది... వికలాంగులకు ఉపాధి కల్పించడం. అలాగే పిల్లలకు స్కాలర్‌షిప్‌లు ఇప్పించడం. ఎలాగో కష్టపడి పది మంది కళాశాల విద్యార్థుల చదువు కోసం రెండు లక్షల రూపాయల స్కాలర్‌షిప్‌లు సాధించాను. వీరంతా వికలాంగుల బిడ్డలే.

మహిళల కోసం...

మా ప్రాంతం నగరానికి దూరంగా ఉండడంతో మహిళల భద్రత సమస్యగా మారింది. తమ పిల్లలను చదివించుకోవడానికి వారికి ఉపాధి మార్గం కూడా చూపించాల్సి వచ్చింది. అలాంటి మహిళలందరికీ వర్క్‌షాప్‌లు, శిక్షణ తరగతులు ఏర్పాటు చేశాను. స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించాను. కొన్ని స్వచ్ఛంద సంస్థల సహకారంతో మరికొందరికి ఉద్యోగ అవకాశాలు కల్పించగలిగాను. నిధులు సేకరించి వికలాంగులకు ప్రత్యేక వాహనాలు ఇప్పించగలిగాను. మహిళల అభ్యున్నతికి అతిపెద్ద అవరోధం... ఒకరిపై ఆధారపడి జీవించడం. ముఖ్యంగా వైకల్యం ఉన్న మహిళలు తమ పనులు తాము చేసుకోగలగాలి. సంపాదించుకోగలగాలి. ఒక మహిళ సాధికారత సాధించడమంటే... ఆ కుటుంబం, ఆ సమాజం సాధికారత వైపు అడుగులు వేసినట్టే.

నేను చేస్తున్న సేవా కార్యక్రమాలన్నిటికీ ఒక వేదిక ఉండాలనే ఉద్దేశంతో 2017లో 'డెవలప్‌మెంట్ ఫోరమ్ ఫర్ విమెన్ విత్ డిజేబిలిటీ' పేరుతో ఒక స్వచ్ఛంద సంస్థ ప్రారంభించాను. విభిన్న వర్గాలవారి హక్కుల కోసం పోరాడుతున్నాను. ఇప్పుడు ఈ సంస్థ మా ప్రాంతంలోని పిల్లలు, మహిళలు, ప్రత్యేకించి వికలాంగ మహిళల భవితకు అతిపెద్ద భరోసా."

రూ.1823 కోట్లు కట్టండి

(మొదటి పేజీ తరువాయి)

ఐటీ శాఖ మీద ఎవరు ఒత్తిడి తెస్తున్నారని ప్రశ్నించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని రద్దు చేయటానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈడీ, ఐటీ, సీబీఐలను దుర్వినియోగపరుస్తుందన్నారు. ఎటువంటి లెక్కలు, ఆధారాలు లేకుండా బీజేపీ సేకరించిన రూ.42 కోట్ల డిపాజిట్లపై ఐటీ శాఖ రూ.4,600 కోట్ల జరిమానా విధించాల్సి ఉందని, కానీ ఆ పని చేయటం లేదన్నారు. అదే తమ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు డిపాజిట్ చేసిన రూ.14 లక్షల మొత్తంపైన మాత్రం రూ.132 కోట్ల జరిమానా కట్టాలని నోటీసులు పంపిందన్నారు. ఐటీ తాజాగా పంపించిన నోటీసుల తాలూకు వివరాలను ఖర్గే వెల్లడించారు. '1993-94 సంవత్సరానికి రూ.54 కోట్లు, 2016-17కి రూ.182 కోట్లు, 2017-18కి రూ.179 కోట్లు, 2018-19కి రూ.910 కోట్లు, 2019-20కి రూ.480 కోట్ల జరిమానా విధించారు' అని తెలిపారు. ఎన్నికల్లో కాంగ్రెస్ తన పూర్తి శక్తిసామర్థ్యాలతో పోటీ పడుతుందని, బీజేపీ నియంతృత్వం నుంచి దేశంలోని వ్యవస్థలను విడిపిస్తామని ఖర్గే పేర్కొన్నారు. ఐటీ తాజా నోటీసులపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యాన్ని విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నిస్తున్న శక్తులపై తీవ్ర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మరోసారి, ఇలాంటి పనులు చేయకుండా బుద్ధి చెబుతామని, ఇది తన గ్యారంటీ అని పేర్కొన్నారు. బీజేపీ టాక్స్ టెర్రరిజానికి పాల్పడుతోందన్నారు.

సీతారాం కేసరి కాలం నుంచి లెక్కలా?

ఐటీ నోటీసుల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్, కోశాధికారి అజయ్ మాకెన్ ఢిల్లీలో పార్టీ ప్రధాన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తమ పార్టీని ఆర్థికంగా పూర్తిగా దెబ్బతీసేందుకే ఈ నోటీసులు పంపారని విమర్శించారు. ఇలాంటి నోటీసులకు తాము బెదరబోమని, మరింత దూకుడుగా ఎన్నికల్లో పోరాడతామని స్పష్టం చేశారు. తమ పార్టీ ప్రచార కార్యక్రమాలను కొనసాగిస్తామని, తాము ప్రకటించిన హామీలను ప్రజలకు చేరవేస్తామని చెప్పారు. తమ పార్టీ కోశాధికారిగా సీతారాం కేసరి ఉన్నప్పటి కాలం నుంచి పన్నులను అక్రమంగా లెక్కిస్తున్నారని పేర్కొంటూ.. 1993 నుంచి 2020 వరకు బీజేపీ పాల్పడిన పన్ను ఉల్లంఘనలకు ఆ పార్టీపై రూ.4,600 కోట్ల మేర పన్ను విధించాలని డిమాండ్ చేశారు. కాగా, ఐటీ నోటీసులపై శని, ఆదివారాల్లో దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలంటూ కాంగ్రెస్ పార్టీ తన అనుబంధ విభాగాలకు పిలుపునిచ్చిం ది. మరోవైపు, ఇండియా కూటమిలో భాగస్వామ్యపక్షంగా ఉన్న సీపీఐకి కూడా రూ.11 కోట్ల బకాయిలు చెల్లించాలంటూ ఐటీ శాఖ నోటీసులు పంపించింది.

క్యాన్సర్ రోగుల్లో నొప్పి నివారణ ముఖ్యం

- ఇండో బ్రిటిష్ అడ్వాన్స్‌డ్ పెయిన్ క్లినిక్ సదస్సులో ప్రముఖ వైద్య నిపుణులు.. కొత్త పరిశోధనల ఫలితాలపై చర్చ

హైదరాబాద్, మార్చి 29: క్యాన్సర్‌తో పోరాడుతున్న వ్యక్తుల జీవన నాణ్యతను మెరుగుపరచడానికి నొప్పి నివారణ, నిర్వహణ చాలా ముఖ్యమైనదని పెయిన్ ఫిజీషియన్ డాక్టర్ విజయభాస్కర్ బండికట్ల అన్నారు. క్యాన్సర్ రోగుల్లో బాధకు పర్యాయపదంగా నొప్పి ఉండకూడదని ఆయన చెప్పారు. ఈ అంశంపై హైదరాబాద్‌లో ఇండో బ్రిటిష్ అడ్వాన్స్‌డ్ పెయిన్ క్లినిక్ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. డాక్టర్ బండికట్ల మాట్లాడుతూ దురదృష్టవశాత్తు క్యాన్సర్ రోగులు.. ముఖ్యంగా వ్యాధి అడ్వాన్స్‌డ్ దశలో ఉన్న వారు అధిక నొప్పిని అనుభవిస్తున్నారని తెలిపారు. కాబట్టి నొప్పిని తీవ్రరూపం దాల్చడానికి ముందే పరిష్కరించాలన్నారు. దీనికి ఇండో బ్రిటిష్ అడ్వాన్స్‌డ్ పెయిన్ క్లినిక్‌లో అధునాతన చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. సీనియర్ ఆంకాలజిస్ట్ డాక్టర్ సెంథిల్ మాట్లాడుతూ వైద్య శాస్త్రంలో అనేక పరిశోధనలు కొత్త ఆశను కలిగిస్తున్నాయని చెప్పారు. ఎంఎన్‌జే హాస్పిటల్ పాలియేటివ్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ గాయత్రి పాలట్ మాట్లాడుతూ క్యాన్సర్ కణితి తగ్గింపులో రేడియేషన్ థెరపీ ప్రభావవంతంగా ఉన్నా చుట్టుపక్కల కణజాలాలను దెబ్బతీయడం ద్వారా నొప్పిని పెంచుతోందన్నారు. న్యూయార్క్‌కు చెందిన డాక్టర్ నాగేంద్ర మాట్లాడుతూ క్యాన్సర్ రోగుల్లో దీర్ఘకాలిక నొప్పి నివారణకు అమర్చే పరికరాల గురించి వివరించారు. క్యాన్సర్ పెయిన్ ట్రీట్‌మెంట్‌లో నిపుణుడైన డాక్టర్ బండికట్ల నేతృత్వంలో జరిగిన ఈ సెమినార్... నొప్పి నిర్వహణ వ్యూహాల్లో పురోగతి సాధించిందని నిర్వాహకులు పేర్కొన్నారు.

సిరియాపై ఇజ్రాయెల్ దాడి..42 మంది మృతి

టెల్ అవీవ్, మార్చి 29: సిరియాపై శుక్రవారం ఇజ్రాయెల్ జరిపిన గగనతల దాడుల్లో 42 మంది మరణించారు. అలెప్పో ప్రావిన్స్‌లోని జిబ్రీన్‌లో ఉన్న లెబనాన్ ఉగ్రవాద సంస్థ హిజ్బుల్లాకు చెందిన ఆయుధ డిపోను, సమీపంలోని మిలటరీ స్థావరాన్ని లక్ష్యంగా చేసుకొని ఈ దాడులు జరిగాయి. 36 మంది సిరియా సైనికులు, ఆరుగురు హిజ్బుల్లా ఉగ్రవాదులు ప్రాణాలు కోల్పోయారు. వారిలో హిజ్బుల్లా డిప్యూటీ కమాండర్ అలీ అబెద్ అక్సాన్ నయీం కూడా ఉన్నారు.

హౌసింగ్ బోర్డు కేసులో వైవీ సుబ్బారెడ్డికి ఎదురుదెబ్బ

- క్వాష్ పిటిషన్‌ను తిరస్కరించిన హైకోర్టు

హైదరాబాద్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం జగన్ అక్రమాస్తులకు సంబంధించిన ఏపీ హౌసింగ్ బోర్డు కేసులో 6వ నిందితుడు వైవీ సుబ్బారెడ్డికి తెలంగాణ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆయన పెట్టుకున్న క్వాష్ పిటిషన్‌ను తిరస్కరించింది. ఈ వ్యవహారంతో తనకెలాంటి సంబంధం లేదని.. ఉమ్మడి ఏపీ మాజీ సీఎం వైఎస్ తోడల్లుడనన్న కారణంతో ఇరికించారని ఆరోపించారు. సీబీఐ నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరారు. జగన్ అక్రమాస్తుల కేసులోని 11వ ఛార్జిషీటులో సుబ్బారెడ్డి నిందితుడిగా ఉన్నారు. హైదరాబాద్ గచ్చిబౌలిలో రూ.25 కోట్ల విలువైన 4.29 ఎకరాల ప్రాజెక్టులో కుట్రపూరితంగా 50 శాతం వాటాను దక్కించుకున్నారని, ఈ ప్రాజెక్టు వసంత ప్రాజెక్ట్స్‌కు దక్కేలా ప్రభావితం చేశారని ఆరోపించింది. సుబ్బారెడ్డికి మేలు చేయడానికి ఈ ప్రాజెక్టులో నుంచి తప్పుకొన్న ఇందూ ప్రాజెక్ట్స్‌కు వేరేచోట అప్పటి ప్రభుత్వం నామినేషన్‌పై భూమి కేటాయించిందని పేర్కొంది. వసంత ప్రాజెక్ట్స్, ఇందూప్రాజెక్ట్స్, వైవీ సుబ్బారెడ్డి కలిసి హౌసింగ్ బోర్డుకు నష్టం కలిగించారని పేర్కొంది. తనకు వ్యతిరేకంగా ఒక్క సాక్షిగా గానీ, ఒక్క డాక్యుమెంట్‌గానీ లేదని సుబ్బారెడ్డి పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం.. ఇదే కేసులో ఇతర నిందితులు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌లను హైకోర్టు కొట్టేసిందని గుర్తుచేసింది. సుబ్బారెడ్డి పోషించిన పాత్రపై సీబీఐ కచ్చితమైన అభియోగాలు మోపిందని.. 48 మంది సాక్షుల్లో ఆరుగురు సాక్షులు సుబ్బారెడ్డి పాత్రపై వాంగ్మూలాలు ఇచ్చారని పేర్కొంది. అందువల్ల ఇది క్వాష్ చేయడానికి తగిన కేసు కాదని స్పష్టం చేసింది.

కోతలే కోతలు

- ఎమ్మిగనూరు సభలో జగన్ అవే అబద్ధాలు
- చేయనివీ చేసినట్లుగా కలరింగ్
- చంద్రబాబు ప్రభుత్వంపై అసత్యాలు
- ప్రసంగం మధ్యలోనే జనం బయటకు




జనాలు లేక వెలవెలబోతున్న సభ, జగన్ సభకు వచ్చి మద్యం సేవిస్తున్న దృశ్యం

కర్నూలు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మళ్లీ అవే అబద్ధాలు. అభూత కల్పనలు. మాటల గారడీలు. పరదాలు దాటి ఎన్నికల ముందు జనం మధ్యకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్ తానొక్కడే రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నట్లు ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. 'మే 13 కురుక్షేత్ర యుద్ధానికి నేను సిద్ధం.. మీరు సిద్ధమా..?' అంటూ బస్సుయాత్ర చేపట్టిన జగన్.. సంక్షేమ పథకాలపైనా అసత్యాలు చెప్పారు. శుక్రవారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు వీవర్స్ కాలనీ మైదానంలో జరిగిన 'సిద్ధం' సభ జనం లేక వెలవెలబోయింది. జగన్ సభా వేదికకు చేరుకోకముందే కొందరు.. ప్రసంగం మొదలవగానే ఇంకొందరు వెళ్లిపోయారు. దాదాపుగా సగానికి పైగా సభా మైదానం ఖాళీగా కనిపించింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో 21 రోజుల బస్సు యాత్రలో భాగంగా మూడో రోజు కర్నూలు జిల్లాలో సాగింది. గూడూరు మండలం పెంచికలపాడు నుంచి ఉదయం 11 గంటలకు బస్సు యాత్ర ప్రారంభించారు. జగన్ బస్సు యాత్ర ఏ పల్లెకు వెళ్లినా సమస్యలతో జనం ఏకరువు పెట్టారు. మళ్లీ జగన్‌ను సీఎంగా చేసేందుకు తాము సిద్ధంగా లేమంటూ సంకేతాలు ఇచ్చారు.

ప్రసంగమంతా అబద్ధాలే

రైతు భరోసా కింద ఐదేళ్లలో ప్రతి రైతుకు రూ.67,500 ఇచ్చానని జగన్ గొప్పగా చెప్పారు. అందులో దాదాపు రూ.30 వేలు కేంద్రం ఇస్తున్న విషయాన్ని దాచిపెట్టారు. చంద్రబాబు సీఎంగా తొలి సంతకం రుణమాఫీ ఫైల్ మీద పెడతానని చెప్పి మోసం చేశారని జగన్ అన్నారు. అయితే ఒకే విడతలో రూ.50వేల లోపు ఉన్న రుణాలు మాఫీ చేసిన విషయం, విడతల వారీగా రూ.1.50 లక్షలలోపు రుణాలు చంద్రబాబు మాఫీ చేసిన విషయాన్ని దాచిపెట్టారు. సోలార్, విండ్ పవర్ ఉత్పత్తి పెంచి చంద్రబాబు నాణ్యమైన విద్యుత్ అందిస్తే.. అప్పుడు కరెంట్ కష్టాలు ఉన్నాయని, తాను వచ్చాకే పగటి పూట కరెంట్ ఇస్తున్నానని పచ్చి అబద్ధాలు చెప్పుకొచ్చారు. అవ్వాతాతలకు పెన్షన్ చంద్రబాబు రూ.2 వేలకు పెంచితే.. జగన్ వచ్చాక విడతల వారీగా రూ.3 వేలకు పెంచిన విషయాన్ని చెప్పకుండా జనాన్ని మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. 2.31 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పడానికి గర్వపడుతున్నానని గొప్పగా చెప్పారు. అందులో రూ.5 వేల గౌరవ వేతనం ఇచ్చే వలంటీర్లను సైతం ఉద్యోగులుగా చిత్రీకరించడం జగన్‌కే చెల్లిందంటూ సభలోని యువత వాపోయారు.

చేనేతల మాటే ఎత్తని జగన్

ఎమ్మిగనూరు చేనేతలకు పెట్టని కోట. ఇక్కడ చేనేత సహకార వ్యవస్థను స్థాపించి దివంగత పద్మశ్రీ మాచాని సోమప్ప చేనేత రంగానికి అంతర్జాతీయ ఖ్యాతి తీసుకువచ్చారు. అదే చేనేతలు ఉండే వీవర్స్ కాలనీ మైదానంలోనే జగన్ 'మేము సిద్ధం' సభ పెట్టారు. కానీ చేనేతల అభివృద్ధి, సంక్షేమం కోసం తమ ప్రభుత్వం ఏం చేసిందో చెప్పలేదు. ఏమి చేయబోతున్నామో హామీ కూడా ఇవ్వలేదు. దీంతో చేనేత కార్మికులు నిరుత్సాహంతో వెనుదిరిగారు. వైసీపీ అభ్యర్థి బుట్టా రేణుక మాట్లాడుతూ.. 'చేనేతలకు ఉపాధి కల్పించేందుకు టెక్స్‌టైల్ పార్కు ఇవ్వాలి అన్నా' అని విన్నవిస్తే జగన్ కనీసం స్పందించలేదు. చంద్రబాబు ప్రభుత్వంలో టెక్స్‌టైల్ పార్కు కోసం వంద ఎకరాలు కేటాయించగా, జగన్ ప్రభుత్వం వచ్చాక రద్దు చేయడమేగాక జగనన్న స్మార్ట్‌సిటీ పేరుతో భూ వ్యాపారానికి తెరతీశారు.

సభ వెలవెల

ఎమ్మిగనూరు 'సిద్ధం' సభ ఫ్లాప్ షోగా మారింది. లక్ష మందికి పైగా ప్రజలు ఈ సభకు వస్తారని వైసీపీ నాయకులు గొప్పగా చెప్పారు. కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాల నుంచి 1200లకు పైగా ఆర్టీసీ బస్సులను తరలించారు. సభకు వచ్చే వారికి రూ.300, పురుషులకు అదనంగా మందు, బిర్యానీ ఇచ్చారు. అయితే.. మైదానంలో పాతిక వేల మంది కూడా లేరని ప్రభుత్వ నిఘా వర్గాలే వెల్లడించాయి. జగన్ ప్రసంగం మొదలు పెట్టే సరికి వెనుకవైపు ఉన్న గ్యాలరీలు ముప్పాతిక శాతం ఖాళీ అయ్యాయి. 6.35 గంటల సమయంలో వేదిక ముందు గ్యాలరీలలో తప్ప వెనుకవైపు ఉన్న గ్యాలరీలు మొత్తం ఖాళీగా కనిపించాయి. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డికి సిద్ధం సభలో మాట్లాడేందుకు అవకాశం ఇవ్వలేదు.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
అనంతపురం	41.0	26.0
తిరుపతి	40.4	26.0
హైదరాబాద్	40.2	25.4
గుంటూరు	39.0	24.0
విజయవాడ	37.4	24.6
విశాఖపట్నం	36.2	25.0

నేడు, రేపు పనిచేయనున్న బ్యాంకులు

- ఎల్ఐసీ కార్యాలయాలు కూడా

న్యూఢిల్లీ, మార్చి 29: ఈ ఆర్థిక సంవత్సరం(2023-24) చివరిలో ఈ నెల 29న గుడ్‌ఫ్రైడే, 31న ఆదివారం సెలవులు రావడంతో పన్ను చెల్లింపుదారులకు ఊరట కల్పిస్తూ రిజర్వు బ్యాంకు నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వానికి సంబంధించిన చెల్లింపులు, వసూళ్లు జరిపే బ్యాంకులు సంబంధిత శాఖలను మార్చి 30, 31 తేదీల్లో(శని, ఆదివారాల్లో) తెరిచి ఉంచాలని రిజర్వు బ్యాంకు సూచించింది. ఈ రెండు రోజులు ప్రభుత్వ ఖాతాలకు సంబంధించిన చెల్లింపులు, వసూళ్లు చేసేందుకు సమర్పించే చెక్కులను క్లియర్ చేస్తారు. నెఫ్ట్, ఆర్‌టీజీఎస్ సేవలు కూడా అందుబాటులో ఉంటాయి. అలాగే లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎల్ఐసీ) కార్యాలయాలూ మార్చి 30, 31 తేదీల్లో పనిచేయనున్నాయి. ఆర్థిక సంవత్సరం ముగియనున్నందున పన్ను చెల్లింపుదారులు పన్ను తగ్గింపునకు పొదుపు చేసుకొనేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఐఆర్‌డీఏఐ సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎల్ఐసీ ఒక ప్రకటనలో తెలిపింది. తమ కార్యాలయాలు అధికారిక పనివేళల వరకు పనిచేయనున్నట్లు వెల్లడించింది.

భారత్‌లో రాజకీయ హక్కులకు రక్షణ ఉందని భావిస్తాం: ఐరాస

ఐక్యరాజ్యసమితి, మార్చి 29: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుపై తాజాగా ఐక్యరాజ్యసమితి స్పందించింది. ఇంతవరకు జర్మనీ, అమెరికా దేశాలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయగా ప్రస్తుతం ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ అధికార ప్రతినిధి స్పందించారు. భారత్‌లో అందరి రాజకీయ, పౌర హక్కులకు రక్షణ ఉందని; నిజాయితీ, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు వేయగలుగుతారని ఆశిస్తున్నట్టు అభిప్రాయపడ్డారు. గురువారం జరిగిన రోజువారీ విలేకరుల సమావేశంలో సెక్రటరీ జనరల్ అధికార ప్రతినిధి స్టెఫానే డుజారిక్ ఈ వ్యాఖ్యలు చేశారు. రానున్న ఎన్నికల సందర్భంగా భారత్‌లో నెలకొన్న 'రాజకీయ అశాంతి'పై అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంలో ఈడీ కేసులో కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం, ఆదాయపు పన్ను శాఖ కాంగ్రెస్ పార్టీ బ్యాంకు ఖాతాలను స్తంభింపచేయడంపై విలేకరులు ఆ ప్రశ్న అడిగారు. స్టెఫానే స్పందిస్తూ "భారత్.. ఆ మాటకు వస్తే ఎన్నికలు జరిగే అన్ని దేశాల్లో.. ప్రతి ఒక్కరి పౌర, రాజకీయ సహా అన్ని హక్కులకు రక్షణ ఉంటుందని; స్వేచ్ఛగా నిజాయితీగా జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు వేసుకోగలుగుతారని ఎంతగానో ఆశిస్తున్నాం" అని వ్యాఖ్యానించారు.

కేజ్రీవాల్‌కు మద్దతుగా రేపు ఢిల్లీలో బహిరంగ సభ

న్యూఢిల్లీ, మార్చి 29: ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఆదివారం ఇక్కడ విపక్షాల కూటమి 'ఇండియా' భారీ బహిరంగ సభ నిర్వహించనుంది. రాంలీలా మైదానంలో ఈ సభ జరగనుంది. ఇందుకు ఢిల్లీ పోలీసులు అనుమతి ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే సహా 13 పార్టీల నేతలు హాజరు కానున్నారు. ప్రస్తుతం జైలులో ఉన్న ఝార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరేన్ భార్య కల్పనా సోరేన్, ఎన్‌సీపీ వ్యవస్థాపకుడు శరద్ పవార్, శివసేన (ఠాక్రే) నాయకులు ఉద్ధవ్ ఠాక్రే, ఆదిత్య ఠాక్రే, సమాజ్‌వాదీ చీఫ్ అఖిలేశ్, ఆర్జేడీ నాయకుడు తేజస్వీ, ఝార్ఖండ్ సీఎం చంపేయి రాయ్, తృణమూల్ ఎంపీ డెరెక్ ఓబ్రెయిన్, సీపీఎం నాయకుడు సీతారాం ఏచూరి తదితరులు ప్రసంగించనున్నారు. తానాషాహీ హటావో-లోక్‌తంత్ర బచావో (నియంతృత్వాన్ని పారదోలండి- ప్రజాస్వామ్యాన్ని కాపాడండి) అన్న నినాదంతో ఈ మెగా ర్యాలీని నిర్వహించనున్నారు. కాగా, కేజ్రీవాల్‌కు ప్రజలందరి ఆశీర్వాదం కావాలని ఆయన భార్య సునీత కోరారు. సరికొత్తగా వాట్సాప్ ప్రచారాన్ని ప్రారంభించారు. "కేజ్రీవాల్ కోసం ప్రతి ఒక్కరూ 8297324624 వాట్సాప్ నంబరుకు మెసేజ్‌లు చేయండి" అని పిలుపునిచ్చారు.




అడ్డుపడ్డ వారిపైకి ట్రాక్టర్‌ను ఎక్కించి, కత్తులతో దాడి చేస్తున్న దృశ్యం

ట్రాక్టర్‌తో తొక్కించి.. కత్తులతో విరుచుకుపడి!

- గుంటూరు జిల్లాలో బరితెగించిన వైసీపీ ఇసుక మాఫియా

కొల్లిపర, మార్చి 29 : ఇసుక అక్రమ తవ్వకాలు నిలువరించాలంటూ అడ్డుకున్న గ్రామస్థులపై ఇసుక మాఫియా విరుచుకుపడింది. గుంటూరు జిల్లా కొల్లిపర మండల పరిధిలోని మున్నంగి ఇసుక రీచ్ సమీపంలోని కరకట్టపై శుక్రవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. ఇసుక తరలింపునూ నిలువరించిన వారిపై కత్తులతో ఇనుపరాడ్డులతో అదే గ్రామానికి చెందిన వైసీపీ నేతల అనుచరులు దాడికి దిగారు. ఇసుక తరలింపును అడ్డుకున్న వారిపైకి, వారి వాహనాలపైకి ట్రాక్టర్‌తో దూసుకువచ్చారు. భయభ్రాంతులకు లోనైన గ్రామస్థులు పరుగులు తీయగా, ద్విచక్రవాహనాలు ధ్వంసమయ్యాయి. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన వేమూరి బాలరాజును 108 వాహనంలో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గాయాలపాలైన మరి కొందరిని మోటారు సైకిల్‌పై తెనాలి తీసుకువెళ్లారు. వైసీపీ నేతల అనుచరులుగా చలామణి అవుతున్న వేమూరి మోషయ్య అతని కుమారుడు దాడికి పాల్పడ్డారని బాధితులు వాపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు అప్రమత్తమయ్యారు.

టెలికాంశాఖ పేరుతో ఫేక్ కాల్స్

న్యూఢిల్లీ, మార్చి 29: కొందరు తమ డిపార్ట్‌మెంట్ పేరు చెప్పి కాల్స్ చేస్తున్నారని.. చట్ట విరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడినందుకు నంబర్ డిస్‌కనెక్ట్ చేస్తామని బెదిరిస్తున్నారని టెలికాం శాఖ తెలిపింది. ఒకవేళ ఇప్పటికే ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే హెల్ప్‌లైన్ నంబర్ 1930కి ఫిర్యాదు చేయొచ్చని సూచించింది. అలాగే సంచార్ సాథీ పోర్టల్ www.sancharsaathi.gov.in లో 'నో యువర్ మొబైల్ కనెక్షన్' ఆప్షన్ ద్వారా తమ పేరున ఇతర మొబైల్ నంబర్ కనెక్షన్ ఉంటే సరిచూసుకోవాలని తెలిపింది.

అప్పుడే పుట్టిన పిల్లలూ 'ఏఐ' అంటారు



నేటితరం చిన్నారులు చాలా అడ్వాన్స్‌డ్

డీప్ ఫేక్ వినియోగంపై నియంత్రణ అవసరం

న్యూఢిల్లీ, మార్చి 29: నేటి ఆధునిక ప్రపంచంలో కృత్రిమ మేధ (ఏఐ) పాత్ర కీలకమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భవిష్యత్తులో అప్పుడే పుట్టిన పిల్లలు కూడా ఏఐ(పసిపిల్లలు ఆయ్ అంటూ ఏడవడం) అని అంటారని పేర్కొన్నారు. నేటితరం పిల్లలు అన్ని విషయాల్లో అడ్వాన్స్‌డ్‌గా ఉంటున్నారని తెలిపారు. డీప్‌ఫేక్ సాంకేతికత వినియోగం విషయంలో కొన్ని నియంత్రణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కేంద్రంలో తమ ప్రభుత్వం తిరిగి ఏర్పాటైన వెంటనే గర్భాశయ క్యాన్సర్ నివారణకు అవసరమైన అధ్యయనానికి నిధులు కేటాయిస్తామని తెలిపారు. మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్, ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం సమావేశమయ్యారు. ప్రధాని నివాసంలో జరిగిన ఈ భేటీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), భవిష్యత్ టెక్నాలజీ, మహిళా సాధికారత తదితర అంశాలపై చర్చించారు. వివిధ రంగాల్లో ప్రజలకు మౌలిక వసతులు కల్పించే విషయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో భారత్ అనుసరిస్తున్న తీరును బిల్‌గేట్స్ ఈ సందర్భంగా ప్రశంసించారు. సాంకేతికతను ప్రజలకు చేరువచెయ్యడంలోనూ భారత్ తీరు అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా ఏఐ గురించి మోదీ మాట్లాడుతూ.. దేశంలో చాలామంది అమ్మను ఆయ్(ఏఐ)ని పలుకుతారని, నేటి పరిస్థితులను చూస్తే పిల్లలు పుట్టిన వెంటనే ఏఐ(కృత్రిమ మేధ) అనేలా ఉన్నారని అన్నారు. ఏఐ గొప్ప సాంకేతిక పరిజ్ఞానమని పేర్కొన్న మోదీ.. ఆ సాంకేతికత వల్లే జీ20 సదస్సులో తన ప్రసంగం అనేక భాషల్లోకి సులువుగా అనువాదమైందని తెలిపారు. అదే సందర్భంగా డీప్ ఫేక్ టెక్నాలజీ వాడకంపై ప్రపంచం దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. భారత్ వంటి ప్రజాస్వామ్య దేశంలో డీప్ ఫేక్‌ను ఎవరైనా స్వేచ్ఛగా వాడే వీలు ఉందన్నారు. డీప్ ఫేక్ కంటెంట్‌ను ఏఐ సృష్టిస్తున్న నేపథ్యంలో ఈ సాంకేతికత వినియోగం అంశంలో కొన్ని నియంత్రణలు తీసుకురావాలని అభిప్రాయపడ్డారు. ఏఐను ప్రజలు ఓ సాధనంగా చూడాలని, ఆ సాంకేతికత వల్ల తప్పుదోవ పట్టకూడదని సూచన చేశారు. సాంకేతిక పరిజ్ఞానం దేశంలో అందరికీ అందుబాటులో ఉండాలనేది తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో దేశంలోని మహిళలు ముందంజలో ఉంటున్నారని ప్రశంసించారు.

సమతామూర్తిని దర్శిస్తా

తమ స్వచ్ఛంద సంస్థ మహిళా సాధికారికత కోసం విశేష కృషి చేస్తుందని బిల్ గేట్స్ తెలిపారు. హైదరాబాద్‌లోని సమతామూర్తి విగ్రహాన్ని త్వరలో సందర్శిస్తానని, ఆ సందర్భంలో కొన్ని మహిళా సంఘాలతో భేటీ అవ్వాలనుకుంటున్నానని బిల్‌గేట్స్ ప్రధాని మోదీతో చెప్పారు.

రెండాకులకు కషాయం



డీఎంకేకు దీటుగా బీజేపీ వ్యూహాలు.. తమిళనాట పొత్తుల్లో కమలం దూకుడు

- అన్నాడీఎంకేకు ఎదురవుతున్న పెను సవాళ్లు
- గత చరిత్రకు భిన్నంగా రెండాకులు ఢీలా

(చెన్నై-ఆంధ్రజ్యోతి)

తమిళనాట జరగనున్న తొలివిడత లోక్‌సభ ఎన్నికల్లో పాలకపక్షం డీఎంకేతో పోటీపడేలా బీజేపీ వ్యూహ రచనలు చేసింది. డీఎంకే కూటమిలో పాతమిత్రపక్షాలే కొనసాగాయి. సినీనటుడు కమల్‌హాసన్ నాయకత్వంలోని మక్కల్ నీదిమయ్యం పార్టీ ఆ కూటమిలో చేరినా దానికి సీట్లివ్వలేదు. ఆ పార్టీకి వచ్చే ఏడాది రాజ్యసభ సీటు కేటాయించేలా డీఎంకే ఒప్పందం చేసుకుంది. ఈమేరకు డీఎంకే కూటమి అభ్యర్థులకు కమల్ ప్రచారం చేయనున్నారు. డీఎంకేతో పోటీపడేలా వేగంగా నిర్ణయాలు తీసుకోవడంలో అన్నాడీఎంకే వెనకపడింది. డీఎంకే కూటమిని తలదన్నేలా మెగా కూటమిని ఏర్పాటు చేస్తామన్న పళనిస్వామి ప్రకటన కార్యరూపందాల్చలేదు. అదేసమయంలో బీజేపీ.. వన్నియార్ల ఓటు బ్యాంకు మెండుగా ఉన్న పాట్టాలిమక్కల్ కట్చితో పొత్తుపెట్టుకుంది. సినీనటుడు శరత్‌కుమార్ నాయకత్వంలోని సమత్తువ మక్కల్ కట్చి పార్టీని బీజేపీలో విలీనం చేసుకుంది. అమ్మామక్కల్ మున్నేట్ర కళగం నాయకుడు దినకరన్, మాజీ సీఎం పన్నీర్‌సెల్వంలతోనూ బీజేపీ పొత్తుపెట్టుకుంది. ప్రధాని మోదీ సేలం సభలో పాల్గొనడానికి ముందే ఇవన్నీ జరిగాయి.

ఇక తమిళనాడు ఎన్నికల చరిత్రను పరిశీలిస్తే ఎన్నిక ఏదైనా నిర్ణయాలు తీసుకోవడంలో అన్నాడీఎంకే ముందంజలో ఉండేది. పొత్తులు, మిత్రపక్షాలకు సీట్ల కేటాయింపు, ఏనియోజకవర్గాలు ఇవ్వాలి? అనే విషయాలపై అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు ఎంజీఆర్, ఆయన రాజకీయ వారసురాలు జయలలిత వేగంగా నిర్ణయాలు తీసుకునేవారు. జయలలిత మరణం తర్వాత సీఎం అయిన పళనిస్వామి కూడా గత మూడేళ్లగా ఆమెలాగే వేగంగా నిర్ణయాలు తీసుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో పొత్తుపెట్టుకుని పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా కల్పించారు. ఆ ఎన్నికల్లో అన్నాడీఎంకేతో పొత్తువల్ల బీజేపీ 4 అసెంబ్లీ స్థానాల్లో గెలిచింది. ఆ తర్వాత పార్టీ పగ్గాలను చేపట్టడంలో చాకచక్యంగా వ్యవహరించారు. పార్టీలో ఏకనాయకత్వం అవసరమని, తానే ప్రధాన కార్యదర్శినంటూ సమన్వయకర్తగా వ్యవహరించిన పన్నీర్‌సెల్వంను దూరంగా పెట్టారు. పార్టీ వ్యవహారాల్లో, న్యాయపోరాటాల్లో విజయం సాధించి అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిగా పార్టీపై ఆధిపత్యం సంపాదించుకోగలిగారు. అలాం టి ఆయన ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో వేగంగా నిర్ణయాలు తీసుకోలేకపోవడం పట్ల పార్టీ నేతలే దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. బీజేపీకూటమి నుంచి వైదొలగే నిర్ణయం తీసుకున్న పళనిస్వామి లోక్‌సభ ఎన్నికల్లో వన్నియార్ల ఓటు బ్యాంక్ కలిగిన పీఎంకేతో పొత్తు కుదుర్చుకోవడంలో జాప్యంచేశారని చెబుతున్నారు. అదేసమయంలో బీజేపీ సుడిగాలిలా పీఎంకేను చుట్టేసింది. ఎక్కువ సీట్లిస్తామనే హామీతోపాటు అవసరమైతే అన్బుమణికి మంత్రి పదవిచ్చేందుకు సిద్ధమేనని ప్రకటించింది. దీం తో పీఎంకే నేతలు రాందాస్, అన్బుమణి బీజేపీ కూటమిలో చేరారు. ఈ పరిణామం పళనిస్వామికి దిగ్భ్రాంతి కలిగించింది. చిన్నాచితకా పార్టీలతో పొత్తును ఖరారు చేసుకున్న పళనిస్వామి డీఎండీకేను కూటమిలో చేర్చుకోవటంలో సఫలీకృతులయ్యారు. ఏపార్టీతో పొత్తు కుదుర్చుకోవాలో గురువారం చెబుతానన్న డీఎండీకే నాయకురాలు ప్రేమలతతో చర్చించి ఒకరోజు ముందే పొత్తుపెట్టుకున్నారు. ఈ ఎన్నికల్లో డీఎంకే, అన్నాడీఎంకే మెగా కూటములు తలపడాల్సి ఉండగా..బీజేపీ సృష్టించిన రాజకీయ తుఫానులో పరిస్థితులు మారాయి. ఈసారి డీఎంకే మెగా కూటమితో బీజేపీ మెగా కూటమి తలపడే పరిస్థితి నెలకొంది.

9 మంది ఎంపీలపై మర్డర్ కేసులు

వీరిలో ఐదుగురు బీజేపీ సభ్యులే

- 28 మందిపై హత్యాయత్నం కేసులు: ఏడీఆర్

న్యూఢిల్లీ, మార్చి 29: లోక్‌సభలోని 514 మంది ఎంపీల్లో 225(44%) మందిపై క్రిమినల్ కేసులు ఉన్నట్టు స్పష్టమైంది. వారు సమర్పించిన ఎన్నికల అఫిడవిట్లను అధ్యయనం చేసిన అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) ఈ వివరాలను వెల్లడించింది. ఇక, వీరిలో 5 శాతం మంది ఎంపీలు రూ.100 కోట్లకు పైబడి ఆస్తులు కలిగినట్టు తెలిపింది. నివేదిక వివరాలు ఇలా ఉన్నాయి. 29 శాతం మంది సభ్యులపై అతి తీవ్రమైన క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. వీటిలో హత్య, హత్యా ప్రయత్నం, మతపరమైన హింసను ప్రేరేపించడం, కిడ్నాపులు, మహిళలపై దాడులు, లైంగిక నేరాలు ఉన్నాయి. 9 మంది ఎంపీలపై హత్య కేసులు నమోదయ్యాయి. వీరిలో ఐదుగురు బీజేపీ సభ్యులే. 28 మందిపై హత్యాయత్నం కేసులు నమోదయ్యాయి. వీరిలో 21 మంది బీజేపీకి చెందిన వారే. 16 మందిపై మహిళలకు సంబంధించిన నేరాలకు సంబంధించి కేసులు నమోదయ్యాయి. వీటిలో మూడు అత్యాచార కేసులు కూడా ఉన్నాయి. రాష్ట్రాలవారీగా చూస్తే ఏపీ, తెలంగాణ, యూపీ, బిహార్, మధ్యప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఎంపీల్లో సగం మంది(50%)కిపైగా క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. అత్యధిక మొత్తంలో ఆస్తులు కలిగి ఉన్న తొలి ముగ్గురు ఎంపీల్లో కాంగ్రెస్‌కు చెందిన నకుల్‌నాథ్, డీకే సురేశ్ ఉన్నారు. మూడో ఎంపీ ఏపీకి చెందిన రఘురామకృష్ణరాజు ఉన్నారు. మొత్తం ఎంపీల్లో గ్యాడ్యుయేట్ లేదా అంతకన్నా ఎక్కువ చదువుకున్న వారు 73% మంది. లోక్‌సభలో మొత్తం ఎంపీల్లో మహిళలు 15% మంది మాత్రమే.

'సీ-విజిల్'కు 79 వేల ఫిర్యాదులు

న్యూఢిల్లీ, మార్చి 29(ఆంధ్రజ్యోతి): పార్లమెంటు, పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించిన తర్వాత ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా పలు పార్టీల నాయకులు చేసిన పనులపై భారీ సంఖ్యలో ఫిర్యాదులు అందాయని ఎన్నికల సంఘం(ఈసీ) తెలిపింది. ఈ నెల 16 నుంచి 29వ తేదీ వరకు దేశవ్యాప్తంగా 79 వేల ఫిర్యాదులు సీ-విజిల్ యాప్ ద్వారా అందాయని తెలిపింది. వీటిలో 99 శాతం ఫిర్యాదులను పరిష్కరించామని స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా, లోక్‌సభ, 4 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎగ్జిట్‌పోల్స్ నిర్వహణ, ప్రచురణ, ప్రసారంపై ఈసీ నిషేధం విధించింది. ఏప్రిల్ 19వ తేదీ సాయంత్రం ఆరున్నర గంటల నుంచి జూన్ ఒకటో తేదీ వరకు ఈ నిషేధం అమలులో ఉంటుంది.

బీజేపీ రాష్ట్ర నేతల వల్లే టికెట్ రాలేదు

నర్సాపురం నుంచే పోటీ చేస్తా: ఎంపీ రఘురామరాజు



భీమవరం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): 'రానున్న ఎన్నికల్లో కూటమిదే విజయం. రాష్ట్రంలో వినాశకర ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకే టీడీపీ, జనసేన, బీజేపీలు కూటమిగా ఏర్పడ్డాయి' అని నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు పేర్కొన్నారు. భీమవరంలో ఆయన మాట్లాడారు. 'అభివృద్ధి దిశగా ఏపీ పయనించాలంటే కూటమికి ప్రజలు మద్దతు ఇవ్వాలి. నర్సాపురం నుంచే నేను ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తా. బీజేపీ రాష్ట్ర నాయకులు ఇచ్చిన తప్పుడు సమాచారం వల్లే నర్సాపురం టికెట్టు రాలేదు. ఆ పార్టీ కేంద్ర నాయకులతో మంచి సంబంధాలున్నాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షునిగా కన్నా లక్ష్మీనారాయణ ఉన్నంత వరకు రాష్ట్రంలోనూ సంబంధాలున్నాయి. ఆ తర్వాత పరిస్థితులు మారిపోయాయి. నాకు టికెట్ పార్టీలు ఇస్తాయా? ప్రజలే ఇస్తారా? అనేది త్వరలో తేలిపోతుంది. రాయలసీమ ప్రాంతంలో జగన్ సభలు తుస్సుమంటున్నాయి. ప్రతిసభకు 3 లక్షల మంది వస్తారంటూ వైసీపీ నాయకులు చెప్పుకొంటున్నారు. కనీసం 30 వేల మంది కూడా రావడం లేదు. అదే చంద్రబాబు సభలకు ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారు' అని రఘురామరాజు అన్నారు.

వలంటీర్లకు టీడీపీ వ్యతిరేకం కాదు: అచ్చెన్న

టెక్కలి, మార్చి 29: 'వలంటీర్ల వ్యవస్థకు టీడీపీ వ్యతిరేకం కాదు. సీఎం జగన్ ఇచ్చిన రూ.5,000 కన్నా మేం మెరుగైన జీతాలు ఇస్తాం. అవసరమైతే స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా ఉద్యోగాలు కల్పిస్తాం' అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు అన్నారు. శుక్రవారం రాత్రి శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలో ఆయన మాట్లాడారు. 'వలంటీర్లు ప్రజలకు సేవకులుగా పనిచేయాలే తప్ప వైసీపీకి కాదు. వలంటీర్లకు ఇచ్చే రూ.5,000 నెలవారీ జీతం జగన్ జేబులోది కాదు. అది ప్రజలు కట్టిన పన్నుల నుంచి ఇస్తున్నది. వైసీపీకి పనిచేస్తే వలంటీర్లు తమ జీవితాలను పోగొట్టుకుంటారు. కొంతమంది వలంటీర్లు తాము రాజీనామా చేస్తున్నామని, వైసీపీలో యాక్టివ్‌గా పనిచేస్తామని ప్రకటనలు చేస్తున్నారు. ఇలాంటి వారిపైన అవసరమైతే క్రిమినల్ కేసులు పెట్టాల్సి ఉంటుంది. మేం వస్తే వలంటీర్ల వ్యవస్థను చక్కదిద్ది మెరుగుపరుస్తాం' అని అచ్చెన్న హామీ ఇచ్చారు. సీఎం జగన్ దగాకోరని, సొంత బాబాయిని చంపించి చంద్రబాబు చంపాడని గత ఎన్నికల్లో లబ్ధి పొందారని గుర్తు చేశారు.

నేటి నుంచి పవన్ ప్రచారం

అమరావతి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): నేటి నుంచి జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తున్నట్లు పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. శుక్రవారం మనోహర్ మీడియాతో మాట్లాడారు. 'తొలి విడతలో దాదాపు 10 నియోజకవర్గాల్లో పవన్ పర్యటిస్తారు. నేటి నుంచి ఏప్రిల్ 12 వరకూ ఆయన పర్యటనలు ఉంటాయి. ఏప్రిల్ 2 వరకూ ఆయన పిఠాపురంలో ఉంటారు. శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు పవన్ పిఠాపురం చేరుకుంటారు. తొలిరోజు శక్తి పీఠం పురుహూతికాదేవి ఆలయానికి వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారు. దత్త పీఠాన్ని దర్శిస్తారు. దొంతమూరు గ్రామంలో మాజీ ఎమ్మెల్యే వర్మ నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలుస్తారు. సాయంత్రం 4 గంటలకు చేబ్రోలులో వారాహి విజయభేరి సభలో పాల్గొంటారు. ఏప్రిల్ 3న తెనాలి, 4న నెల్లిమర్ల, 5న అనకాపల్లి, 6న యలమంచిలి, 7న పెందుర్తి, 8న కాకినాడ రూరల్ నియోజకవర్గాల్లో ప్రచారం నిర్వహిస్తారు. ఉగాది పర్వదినం, 9వ తేదీన పిఠాపురంలో నిర్వహించే ఉగాది వేడుకల్లో పాల్గొంటారు. అనంతరం 10వ తేదీన రాజోలు, 11న పీ గన్నవరం, 12న రాజానగరం బహిరంగ సభల్లో పాల్గొంటారు' అని మనోహర్ తెలిపారు.

జీతాల సొమ్ముపై వైసీపీ దుష్ప్రచారం

రాయల్ మెరైన్ ఫ్యాక్టరీ యజమాని నరేంద్రవర్మ

బాపట్ల, మార్చి 29(ఆంధ్రజ్యోతి): చీరాల మండలం కావూరిపాలెం పరిధిలో ఉన్న రాయల్ మెరైన్ ఫ్యాక్టరీలో దొరికిన జీతాల సొమ్ముపై వైసీపీ చేస్తున్న విష ప్రచారాన్ని ఆ ఫ్యాక్టరీ యజమాని, బాపట్ల టీడీపీ అభ్యర్థి నరేంద్ర వర్మ శుక్రవారం తిప్పికొట్టారు. రాజకీయాల కోసం వేలాది మంది ఉద్యోగుల పొట్ట కొట్టాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. దమ్ము, ధైర్యం ఉంటే తనను ప్రజాక్షేత్రంలో ఎదుర్కోవాలని వైసీపీ ఎమ్మెల్యే కోన రఘుపతికి సూటిగా సవాల్ విసిరారు. ఫ్యాక్టరీలో ఉద్యోగులకు జీతాలు చెల్లించడం కోసం బ్యాంకు నుంచి ఆ డబ్బులు తెచ్చినట్లు తెలిపారు.

శ్రీలక్ష్మి.. నీ మహిమలూ!

(మొదటి పేజీ తరువాయి)

మంజూరు చేశారు. ఈ నెల 23, 24 తేదీల్లో శ్రీలక్ష్మి దాదాపు 9 జీవోలిచ్చారు. ఇందులో మూడు ఇప్పుడు వెనక్కి వచ్చేశాయి. దీంతో శ్రీలక్ష్మి పరువు పోయినట్లయింది.

ఎన్నికల్లో ప్రయోజనాలకే...

మునిసిపాలిటీల్లో ఐదేళ్లుగా వందలకోట్ల విలువైన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కానీ... ఎన్నికల నేపథ్యంలో, రాజకీయ ప్రయోజనాల కోసమే 'ఎంపిక' చేసిన కొన్ని మునిసిపాలిటీలకు హఠాత్తుగా నిధులు విడుదల చేశారు. అందులో... టీడీపీ యువనేత నారా లోకేశ్ బరిలో ఉన్న మంగళగిరి కూడా ఒకటి. అందులోనూ... ఎన్నడూ కనీవినీ ఎరుగని విధంగా 'పూర్తి కాబోయే పనులకూ' నిధులు విడుదల చేస్తూ శ్రీలక్ష్మి జీవో ఇచ్చేశారు. అలాగే.. డోన్, నర్సీపట్నం మునిసిపాలిటీలకు సంబంధించిన మరో రెండు జీవోలు కూడా ఆరోజే ఇచ్చారు. వీటిలో 'పూర్తి కాబోయే పనులు' అనే ప్రస్తావన లేనప్పటికీ... ఇవీ ఆ బాపతువే. పనులు పూర్తయ్యాక బిల్లులు చెల్లించేందుకే చాలా తతంగం ఉంటుంది. సంబంధిత చీఫ్ ఇంజనీర్ లేదా ఆ పనులు పర్యవేక్షించిన ఇంజనీర్లు ఏ పనులు ఎంత శాతం పూర్తయ్యాయి, ఎంత ఖర్చయింది తదితర వివరాలు పేర్కొంటూ సంతకం చేసి సర్టిపై చేయాలి. ఈ సర్టిఫైడ్ పత్రం లేకుండా తమ సెక్రటరీలకు/ఆర్థిక శాఖకు చెల్లింపులకోసం ఫైలు కూడా పంపరు. కానీ, ఈ 3 జీవోల విషయంలో ఏ ఒక్కదానికీ ఇలాంటి సర్టిఫైడ్ పత్రం లేదని తెలిసింది. పనులే పూర్తికానప్పుడు సర్టిఫైడ్ పత్రాలు ఎలా వస్తాయి? దీంతో... అతి కీలకమైన నిబంధనను ఉల్లంఘించామనే భయం మొదలైంది. దీనికి తోడు అడ్డగోలు జీవోల సంగతి 'ఆంధ్రజ్యోతి' కూడా వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో హుటాహుటిన ఆ 3 జీవోలను వెనక్కి తీసేసుకున్నారు.

పాత పంథాలు.. పాత బంధాలు!

వైసీపీ నేతలతో శ్రీలక్ష్మి బంధం ఈనాటిది కాదు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ఓబుళాపురం గనుల ఫైలులో కీలకమైన 'క్యాప్టివ్ మైనింగ్' పదాన్ని ఎత్తేసి జీవోలు ఇచ్చింది ఈమే. ఈ కేసులో శ్రీలక్ష్మి అరెస్టు కూడా అయ్యారు. రాష్ట్ర విభజన తర్వాత ఆమెను తెలంగాణ కేడర్‌కు కేటాయించినప్పటికీ... జగన్ అధికారంలోకి వచ్చాక పరుగు పరుగున ఏపీకి వచ్చేశారు. ఆమెకు జగన్ ఇచ్చిన ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. రోజుల వ్యవధిలోనే రెండు పదోన్నతులు ఇచ్చేశారు. శ్రీలక్ష్మి ఐఏఎస్‌గా రూల్స్‌ను పక్కనపెట్టేసి 'తాడేపల్లి' ఆర్డర్స్‌ను మాత్రమే అమలు చేస్తున్నారని అధికార వర్గాలే చెబుతాయి. ఇదే శ్రీలక్ష్మి... అమరావతి రైతులను మాత్రం పట్టించుకోవడంలేదు. 22,948 రైతు కుటుంబాలు నేటికీ కౌలు అందక విలవిల్లాడిపోతున్నారు. అసైన్డ్ రైతులకు మూడేళ్ల నుంచి కౌలు ఇవ్వడం లేదు. 2023 మేలో అమరావతి రైతులకు అందాల్సిన కౌలు 10 నెలల తర్వాత కూడా పడలేదు.

గుల్జార్‌దీ అదే దారి

మార్చి 16 శనివారం! సచివాలయానికి సెలవు. అయినప్పటికీ ఆర్థిక శాఖ మంగళగిరి పరిధిలోకి వచ్చే తాడేపల్లి-మునిసిపల్ కార్పొరేషన్‌కు రూ.74 కోట్ల అదనపు నిధులు విడుదల చేస్తూ బీఆర్‌వో జీవో ఇచ్చింది. దీని ఆధారంగానే మార్చి 23న శ్రీలక్ష్మి నిధులు విడుదలకు జీవో ఇచ్చారు. ఏ పని ఎంత వరకైందన్న ఆరా తీయకుండా ఆర్థిక శాఖ సెక్రటరీ గుల్జార్ బీఆర్‌వో జారీ చేశారు. అయితే... మునిసిపల్ కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన ప్రతిపాదనలో 'పూర్తికాబోయే పనుల కోసం అదనపు నిధులు' అన్న వాక్యం లేదని తెలిసింది. ఈ వాక్యాన్ని సచివాలయంలోనే కలిపారని తెలిసింది. ముందుగా బీఆర్‌వో ఇచ్చింది ఆర్థిక శాఖే. అక్కడే ఏదైనా మతలబు జరిగిందా? లేక... తాడేపల్లి ఆదేశాల మేరకు మునిసిపల్ శాఖ చేసిన ఒత్తిళ్ల మేరకు ఆ వాక్యం కలిపారా అన్నది తేలాలి.

వైసీపీపై స్వామి భక్తి.. కూటమిపై కుయుక్తి!

కడప డీసీసీబీ సీఈవో సస్పెన్షన్

ఎన్నికల నియమావళి ఉల్లంఘనకు ఫలితం



డీసీసీబీ సీఈవో రాజేంద్రకుమార్

కడప(రూరల్), మార్చి 29: వైసీపీపై స్వామిభక్తిని ప్రదర్శిస్తూ ఎన్డీయే కూటమిపై తన ఫేస్‌బుక్ ఖాతాలో అభ్యంతరకర పోస్టు పెట్టిన కడప జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ) సీఈవో రాజేంద్రకుమార్‌పై ఎన్నికల సంఘం వేటు వేసింది. కోడ్ ఉల్లంఘన కింద ఆయనను సస్పెండ్ చేసింది. టీడీపీ అధినేత చంద్రబాబు, ప్రధాని మోదీ, జనసేన అధ్యక్షుడు పవన్ కలిసివున్న ఫొటోను తన ఫేస్‌బుక్ పేజీలో పెట్టి 'వీరి ముగ్గురి బలం ఎన్నికల్లో సరిపోదని ఈవీఎంలను మేనేజ్ చేయండి' అని కామెంట్ చేశారు. దీంతో పాటు గతంలో చంద్రబాబు ప్రధాని మోదీని విమర్శించారని అంటూ కామెంట్ చేశారు. దీనిని గుర్తించిన అదే శాఖలో పనిచేసే ఓ అధికారి రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు పంపి ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారని ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ ఫిర్యాదును జిల్లా ఎన్నికల అధికారికి పంపించింది. దీంతో జిల్లా ఎన్నికల విభాగం సీఈవో రాజేంద్రకుమార్ ఫేస్‌బుక్ ఖాతాను పరిశీలించి ఎన్డీయే కూటమిపై చేసిన కామెంట్స్ గుర్తించింది. డీసీసీబీ సీఈవో రాజేంద్రకుమార్‌ను సస్పెండ్ చేయాలని ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణిని జిల్లా ఎన్నికల అధికారి(కలెక్టర్) ఆదేశించారు. ఈ మేరకు ఆమె సస్పెండ్ చేశారు. ఆయన స్థానంలో డీసీసీ బ్యాంక్‌లో జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న రాజామణిని ఇన్‌చార్జ్ సీఈవోగా బాధ్యతలను అప్పగించినట్లు సమాచారం.

డీఎస్సీ ఓ కల!

ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ పూర్తి చేయలేకపోయిన జగన్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఉపాధ్యాయ ఉద్యోగాలకు సంబంధించి డీఎస్సీ నిర్వహించడంలో జగన్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. 57 నెలల పాటు మౌనంగా ఉన్న ప్రభుత్వం ఎన్నికలు మరో మూడు నెలల్లో ఉంటాయనగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. నిజానికి ఎన్నికలకు ముందు ఇంత పెద్ద నియామక క్రతువును ఏ ప్రభుత్వమూ తెరమీదికి తీసుకురాదు. ఎందుకంటే ఎన్నికల షెడ్యూల్ వస్తే పరీక్షలకు ఆటంకం ఏర్పడుతుందని ముందుగానే అంచనా వేసుకుంటారు. కానీ, వైసీపీ ప్రభుత్వానికి ఈ విషయం తెలియదా? అంటే తెలుసు. కానీ, ఉద్దేశ పూర్వకంగానే ఎన్నికలకు మూడు మాసాల ముందు డీఎస్సీ ఇచ్చింది. ఎలానూ ఆగిపోతుంది కాబట్టి.. ఇచ్చామన్న పేరు కొట్టేయాలని భావించింది. దీనిని బట్టి ఉపాధ్యాయ పోస్టుల భర్తీపై ప్రభుత్వానికి ఎంత ప్రేమ ఉందో అర్థమవుతోంది. షెడ్యూలు ప్రకారం శనివారం(నేడు) నుంచి డీఎస్సీ పరీక్షలు ప్రారంభం కావాలి. కానీ, అలా జరగడం లేదు. దీంతో ఈ ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్న డీఎస్సీ ఉద్యోగార్థులు తీవ్ర నిరాశలో కూరుకుపోయారు.

ఓట్ల వేట.. నిరుద్యోగులతో ఆట!

మెగా డీఎస్సీ వేస్తామని 2019 ఎన్నికల్లో హామీ ఇచ్చిన జగన్... సీఎం అయ్యాక ఒక్కటంటే ఒక్క టీచర్ ఉద్యోగం భర్తీ చేయలేదు. దాదాపు ఐదేళ్ల పాటు ప్రభుత్వం నోటిఫికేషన్ ఊసు లేకుండా కాలం గడిపేశారు. నిరుద్యోగుల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్న విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం చివర్లో హడావుడిగా నోటిఫికేషన్ జారీచేసింది. అధికారంలోకి వచ్చిన 57 నెలల తర్వాత 6,100 పోస్టులతో మొదటి నోటిఫికేషన్ ఇచ్చింది. అయితే, ఈ నోటిఫికేషన్ కూడా పూర్తికాదని ప్రభుత్వంలో చాలా మంది అంచనా వేశారు. కేవలం ఎన్నికల కోసం నిరుద్యోగులను మభ్యపెట్టి, నోటిఫికేషన్ పేరుతో ఓట్లు సాధించాలనే లక్ష్యంతో భర్తీ ప్రక్రియను ప్రకటించింది. కానీ, ఆ తర్వాత ఏ దశలోనూ ప్రభుత్వం ముందడుగు వేయలేకపోయింది. డీఎస్సీ కంటే ముందు టెట్ విషయంలోనే పలుమార్లు పిల్లిమొగ్గలు వేసింది. టెట్ పరీక్షలను అనుకున్న సమయం కంటే ముందే పూర్తిచేసినా, ఫలితాలు మాత్రం విడుదల చేయలేకపోయింది. టెట్, డీఎస్సీ మధ్య కనీసం 4 వారాల గడువు ఉండాలని హైకోర్టు సూచించడంతో డీఎస్సీ పరీక్షలను రీషెడ్యూలు చేసిన ప్రభుత్వం.. మార్చి 30 నుంచి పరీక్షలు నిర్వహించేలా మరో అలవికాని తేదీలు ప్రకటించింది. తీరా ఇప్పుడు పరీక్షల నిర్వహణ అంశాన్ని ఈసీకి పంపి, ఈసీ అనుమతి ఇవ్వలేదనే సాకుతో వాయిదా వేసింది.

ఒక్క డీఎస్సీ కూడా..!

ఉపాధ్యాయ పోస్టుల భర్తీ విషయంలో ప్రతిపక్ష నేతగా జగన్ ఇచ్చిన హామీకి, అధికారంలోకి వచ్చాక వ్యవహరించిన తీరుకు చాలా తేడా ఉంది. 23 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ వేసి అన్నీ ఒకేసారి భర్తీచేస్తామని ప్రతిపక్షనేతగా జగన్ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక ఒక్కరోజు కూడా దీనిపై దృష్టి పెట్టలేదు. ఇక, ఎన్నికలకు ముందు మొక్కుబడిగా నోటిఫికేషన్ జారీచేశారు. కానీ, ఇది నిలిచిపోయింది. దీంతో, ఒక్క డీఎస్సీని కూడా పూర్తి చేయలేని సీఎంగా జగన్ చరిత్రలో నిలిచిపోయారు.

ఫీజులు దండగ

డీఎస్సీ నిర్వహణపై చిత్తశుద్ధి లేకపోయినా నోటిఫికేషన్లు అంటూ హడావుడి చేసి నిరుద్యోగుల జేబులకు జగన్ ప్రభుత్వం చిల్లుపెట్టింది. ఏక కాలంలో అటు డీఎస్సీ, ఇటు టెట్ అంటూ నోటిఫికేషన్లు జారీ చేసింది. ఒక్కో పేపర్‌కు రూ.750 ఫీజు వసూలు చేసింది. ఎస్జీటీ పోస్టులకు అర్హతను గందరగోళంగా మార్చడంతో టెట్‌లో రెండు పేపర్లకు, డీఎస్సీలో రెండు పేపర్లకు చొప్పున ఒక్కొక్క అభ్యర్థీ రూ.3 వేలు చొప్పున ఫీజులు కట్టారు. అసలు పరీక్షలే జరగని నోటిఫికేషన్‌కు డబ్బులు వృథా చేసుకున్నామని అభ్యర్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ఎవరి హయాంలో ఎలా?

ఎన్టీఆర్: 1984, 1986, 1989ల్లో 3 డీఎస్సీ నోటిఫికేషన్లు విడుదల చేసి పోస్టులు భర్తీ చేశారు.

కోట్ల విజయభాస్కర రెడ్డి: 1994లో నోటిఫికేషన్ ఇచ్చి పోస్టులు భర్తీ చేశారు.

చంద్రబాబు: 1996, 1998, 2000, 2001, 2002, 2003 సంవత్సరాల్లో నోటిఫికేషన్లు ఇచ్చి భర్తీ చేశారు. అదేవిధంగా విభజిత ఏపీలోనూ 2014, 2018 రెండు నోటిఫికేషన్లు జారీచేశారు.

వైఎస్ రాజశేఖరరెడ్డి: 2006, 2008లలో నోటిఫికేషన్ ఇచ్చి పోస్టులు భర్తీ చేశారు.

కిరణ్‌కుమార్ రెడ్డి: 2012లో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి నిరుద్యోగులకు న్యాయం చేశారు.

- ఏ ప్రభుత్వంలోనూ సరిగ్గా ఎన్నికలకు 2, 3 నెలల ముందు నోటిఫికేషన్ ఇవ్వలేదు.
- అలా ఎన్నికలకు ముందు నోటిఫికేషన్ ఇచ్చి, ఒక్క టీచర్ పోస్టును భర్తీచేయని తొలి ప్రభుత్వంగా జగన్ సర్కారు రికార్డు సృష్టించింది.
- డీఎస్సీ నోటిఫికేషన్లు ఇచ్చిన వైఎస్ సహా గత సీఎంలెవరూ 'మెగా డీఎస్సీ' హామీలు ఇవ్వలేదు. కానీ, భారీ సంఖ్యలోనే పోస్టులు భర్తీ చేశారు.
- మెగా డీఎస్సీ అని హామీ ఇచ్చి.. ఒక్క పోస్టును కూడా భర్తీ చేయకుండా.. మాట తప్పి, మడమ తిప్పేసింది ప్రస్తుత సీఎం జగన్ ఒక్కరే.



కాకినాడ తీరంలో ఆకట్టుకున్న టైగర్ ట్రయంఫ్-24

సర్పవరం జంక్షన్, మార్చి 29: భారత్-అమెరికా త్రివిధ దళాలు సంయుక్తంగా కాకినాడ తీరంలో నిర్వహిస్తున్న 'టైగర్ ట్రయంఫ్-24' విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అమెరికాకు చెందిన యుద్ధ నౌకలతో పాటూ భారత తరఫున ఐఎన్ఎస్ జలస్వ, కేసరి, ఐరావత్ యుద్ధ నౌకలు ఈ విన్యాసాల్లో పాల్గొన్నాయి. యుద్ధ సమయంలో శత్రుదేశాలపై చేసే వీరోచిత పోరాటాలు, విపత్తులు, ఆపద సమయాల్లో అందించే రెస్క్యూ సేవలను ప్రదర్శించారు. సీ ఫేజ్‌లో భాగంగా కాకినాడ రూరల్ సూర్యారావుపేట నేవెల్ ఎన్‌క్లేవ్‌లో మూడు రోజుల నుంచి భారత్-అమెరికా సంయుక్త విన్యాసాలు చేపడుతున్నాయి. ఈ కార్యక్రమాల్లో భారత్ నుంచి 700 మంది, అమెరికా నుంచి 400 మంది సిబ్బంది తమ పోరాట పటిమను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఏడీఎం మార్టినెజ్ మేజర్ జనరల్ (54వ డివిజన్) అఖిలేశ్ కుమార్, నేవీ కమాండెంట్ రాజేశ్ ధన్‌ఖడ్, అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నీఫర్ లార్సన్ పాల్గొన్నారు.



ఎన్టీఆర్ సంక్షేమ పథకాలే దేశవ్యాప్తంగా అమలు

నందమూరి రామకృష్ణ

హైదరాబాద్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత సీఎం ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే దేశవ్యాప్తంగా వివిధ పేర్లతో అమలు చేస్తున్నారని ఆయన తనయుడు నందమూరి రామకృష్ణ అభిప్రాయం వ్యక్తం చేశారు. తెలుగుజాతి ఉన్నంతవరకు ఎన్టీఆర్ అందరి గుండెల్లో ఉంటారన్నారు. 1982 డిసెంబరు 9న తిరుమలలో బాలకృష్ణ వివాహం జరిగిందని పేర్కొంటూ... ఆ సమయంలో ఎన్టీఆర్ ప్రజల్లో ఉండిపోవడంతో హాజరుకాలేకపోయారని తెలిపారు. ప్రజల కోసం ఆయన ఎంతో త్యాగం చేశారని గుర్తుచేశారు. టీడీపీ 42వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా, శుక్రవారమిక్కడ ఎన్టీఆర్‌భవన్‌లో పార్టీ జెండాను రామకృష్ణ ఆవిష్కరించారు. ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి కేక్ కట్‌చేశారు. అమెరికాలో ఎక్కువ మంది మాట్లాడే భాషల్లో తెలుగు ఒకటిగా నిలబడిందంటే ఆ ఘనత ఎన్టీఆర్, చంద్రబాబులదేనన్నారు. తెలంగాణలో టీడీపీకి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కృషి చేయాలని పార్టీ నాయకులను కోరారు.

మహారాష్ట్రలో 'ఇన్‌ఫార్మర్' నెపంతో ఒకరి హత్య

మహదేవపూర్, మార్చి 29: సార్వత్రిక ఎన్నికల ముందు మావోయిస్టులు అలజడి సృష్టిస్తున్నారు. తాజాగా గడ్చిరోలి జిల్లా భామ్రాగడ్ తాలూకాలోని తాడ్‌గావ్‌లో ఓ వ్యక్తిని ఇన్‌ఫార్మర్ నెపంతో హత్య చేశారు. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) ఆధ్వర్యంలో గురువారం రాత్రి ప్రజా కోర్టు నిర్వహించారు. దామెరంచ గ్రామానికి చెందిన ఇస్మా అలియాస్ అశోక్ తలాండి అనే వ్యక్తికి మరణశిక్ష విధిస్తున్నట్లు ప్రకటించారు. అతన్ని హింసించి దారుణంగా చంపారు. ఆ తర్వాత శుక్రవారం తెల్లవారుజామున అహెరీ- భామ్రాగడ్ రహదారిపై మృతదేహాన్ని వదిలేయడంతో పాటు పక్కన ఓ లేఖను ఉంచారు. పెరిమెలి దళం పేరుతో ఉన్న ఆ లేఖలో మావోయిస్టులకు వ్యతిరేకంగా పోలీసులకు సమాచారం చేరవేస్తున్నందుకు అతడికి మరణ శిక్ష విధించినట్లు పేర్కొన్నారు. ఎన్నికల నేపథ్యంలో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని సరిహద్దు జిల్లాల్లో రోజుకో ఘటన జరుగుతుండడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. తెలంగాణ సరిహద్దుల్లోని భూపాలపల్లి, ములుగు, పెద్దపల్లి, భద్రాద్రి జిల్లాల్లో వాహన తనిఖీలు, కూంబింగ్‌ను ముమ్మరం చేశారు.

వివేకా హంతకులెవరో అందరికీ తెలుసు: కనకమేడల

న్యూఢిల్లీ, మార్చి 29(ఆంధ్రజ్యోతి): 'మాజీ మంత్రి వైఎస్ వివేకాను ఎవరు చంపారో ఆంధ్రప్రదేశ్ ప్రజలందరికీ తెలుసు. వారేమీ అమాయకులు కాదు' అని టీడీపీ రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ అన్నారు. శుక్రవారం, టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఎన్నికల్లో వివేకా హత్యను వాడుకోవాలని జగన్ చూస్తున్నారు. ఏపీలో రాజ్యాంగానికి చోటు లేకుండా పాలన జరుగుతోంది. అధికారులు సైతం ప్రభుత్వ అడుగులకు మడుగులు ఒత్తుతున్నారు' అని విమర్శించారు.

జగన్ మెప్పు కోసం విద్యార్థులతో ఆటలు: కంభంపాటి

అమరావతి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): జగన్ మెప్పు పొందేందుకు ప్రవీణ్ ప్రకాశ్, హేమచంద్రారెడ్డి విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారని టీడీపీ నేత కంభంపాటి రామ్మోహన్‌రావు ఆరోపించారు. అధికారుల సొంత ఖర్చులకు కూడా విద్యామండలి నిధులు వాడుకుంటున్నారని.. రూ.1,000 కోట్లను దారి మళ్లించారని ధ్వజమెత్తారు.

అవినీతిపై 8 లక్షల ఫిర్యాదులు

- ఎమ్మెల్యేల అక్రమాలపైనే 4 లక్షలు
- ఇన్ని ఉన్నా తన పాలనలో అవినీతి లేదని జగన్ సెల్ఫ్ సర్టిఫికెట్
- ఏసీబీ డీజీ ఎవరో జగన్‌కు తెలియదా?
- సీనియర్ ఐఏఎస్‌కు మంత్రి 100 కోట్ల ఆఫర్ నిజం కాదా?
- ప్రభుత్వంలో అవినీతిపై ధ్వజమెత్తిన జనసేన నేత నాదెండ్ల మనోహర్



అమరావతి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో గత నాలుగేళ్ల కాలంలో అవినీతిపై 8,03,612 ఫిర్యాదులు వచ్చాయని జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ తెలిపారు. వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై 4,39,679 ఫిర్యాదులు వచ్చాయని అన్నారు. కానీ తమ పాలనలో ఒక్క రూపాయి అవినీతీ జరగలేదని, అద్భుతమైన పాలన అందించామని సీఎం జగన్ తనకు తాను సర్టిపై చేసుకుంటున్నారని ఆయన అన్నారు. ఇది హాస్యాస్పదమని నాదెండ్ల ఎద్దేవా చేశారు. శుక్రవారం మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ పాలనలో సామాన్యుడు ఎలా నలిగిపోయాడో, అవినీతి ఎంతలా తాండవం చేసిందో చిన్న పిల్లాడిని అడిగినా చెబుతారని అన్నారు. ఈ ముఖ్యమంత్రి 14400 అనే నెంబర్‌కి ఫోన్ చేసి అవినీతిపై ఫిర్యాదు చేయమంటే.. ఆ నెంబర్‌కి గత నాలుగేళ్లలో 8,03,612 ఫిర్యాదులు వచ్చాయని వివరించారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై 4,39,679 ఫిర్యాదులు అందాయన్నారు. తమ పాలనలో ఒక్క రూపాయి కూడా అవినీతి జరగలేదని సెల్ఫ్ సర్టిఫికెట్ ఇచ్చుకున్న జగన్ దీనికి ఏం సమాధానం చెబుతారని నాదెండ్ల మనోహర్ నిలదీశారు. సీఎం జగన్, ఆయన క్యాబినెట్ మంత్రులు, ఎమ్మెల్యేల అవినీతిపై పత్రికలు పుంఖాను పుంఖాలుగా కథనాలు వచ్చిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. మంత్రులు, ఎమ్మెల్యేలపై వచ్చిన ఫిర్యాదులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. రివ్యూ మీటింగ్‌లో ఏసీబీ డీజీ ఎవరు అని ముఖ్యమంత్రి అడిగారంటే, పరిపాలనపై జగన్‌కు ఎంత శ్రద్ధ ఉందో అర్థం చేసుకోవచ్చునన్నారు. కొన్ని ప్రభుత్వ శాఖల్లో అవినీతి తాండవం చేస్తోందని ఆరోపించారు. టీచర్ల బదిలీల్లో రూ.వందల కోట్ల అవినీతి జరిగిందని, ఒక మంత్రి అయితే ఒక సీనియర్ ఐఏఎస్ అధికారికి రూ.100 కోట్ల ఆఫర్ ఇచ్చారని నాదెండ్ల తెలిపారు. తాను చెప్పింది చేయాలని ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. ఒక ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తన సొంతూరికి బదిలీ చేయాలని అడిగితే మంత్రి రూ.10 లక్షలు తీసుకున్నారని, మరో ఇంజనీర్ దగ్గర రూ.15 లక్షలు తీసుకుని అతడిని బదిలీ చేశారని తెలిపారు. ఇలా మంత్రులు భారీ అవినీతికి పాల్పడుతున్నారన్నారని ఆరోపించారు. పోలీస్ బాస్‌గా ఉన్న డీజీపీనే ఏసీబీ డీజీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారన్నారు. లక్షల ఫిర్యాదులు వస్తే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని, ఎవరి ఒత్తిడి మేరకు తొక్కి పెట్టారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.

41ఏ నోటీసులు ఇచ్చినా..

ముందస్తు బెయిల్‌పై విచారించొచ్చు!

అరెస్ట్ చేస్తారనే ఆందోళన ఉన్నప్పుడు బెయిల్ పిటిషన్ వేయొచ్చు: హైకోర్టు

అమరావతి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): సీఆర్పీసీ సెక్షన్ 41ఏకింద పోలీసులు నోటీసులు ఇచ్చినప్పటికీ, అరెస్ట్ చేస్తారనే ఆందోళన నిందితుడికి ఉన్నప్పుడు, ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌కు విచారణార్హత ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. 41ఏ కింద నోటీసులిచ్చినా.. అరెస్ట్ చేస్తారనే ఆందోళనతో ముందస్తు బెయిల్ కోరుతూ నిందితుడు వేసిన పిటిషన్‌ను విచారించకుండా కోర్టులు తప్పించుకోవడానికి వీల్లేదని రామప్ప వర్సెస్ స్టేట్ ఆఫ్ కర్ణాటక కేసులో కర్ణాటక హైకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తు చేసింది. ప్రస్తుతం తమ ముందు ఉన్న కేసులోనూ పోలీసులు 41ఏ కింద నోటీసులు ఇచ్చినప్పటికీ అరెస్టు చేస్తారేమోనని పిటిషనర్ ఆందోళన చెందుతున్నారని తెలిపింది. ఈ నేపథ్యంలో పిటిషన్ విచారణార్హమైనదేనని పేర్కొంది. నిందితుడికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. పులివెందుల పోలీసు స్టేషన్‌కు హాజరై పూచీకత్తు సమర్పించాలని ఆదేశించింది. మూడు నెలలపాటు 15 రోజులకు ఒకసారి కడప ఎస్పీ ముందు హాజరుకావాలని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ టి. మల్లికార్జునరావు ఇటీవల తీర్పు ఇచ్చారు. ఫేక్ ఐడీలు సృష్టించి వైఎస్ షర్మిల, వివేకా కుమార్తె సునీతల ప్రతిష్ఠను దిగజార్చేలా సామాజిక మాధ్యమాలలో అనుచిత వ్యాఖ్యలతో పోస్టులు పెడుతున్నారన్న ఫిర్యాదు మేరకు పులివెందుల పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న పినపల ఉదయ్ భూషణ్ ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ ఇటీవల విచారణకు రాగా సహాయ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపిస్తూ.. విచారణ నిమిత్తం తమ ముందు హాజరుకావాలని పిటిషనర్‌కు 41(ఏ) కింద పోలీసులు నోటీసులు జారీ చేశారన్నారు. ఈ నేపథ్యంలో ముందస్తు బెయిల్ ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. పిటిషనర్ తరఫున న్యాయవాది పీవీజీ ఉమేశ్‌చంద్ర వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ విశాఖపట్నంవాసి అని, ఆయనకు అక్కడే 41ఏ కింద నోటీసులు ఇచ్చే అవకాశం ఉన్నా.. ఉద్దేశపూర్వకంగా పులివెందుల పోలీస్ స్టేషన్‌కు తరలించారని తెలిపారు. ఫిర్యాదుదారు రవీంద్రారెడ్డి నిందితుడిని చంపుతానని స్టేషన్‌లోనే బెదిరించారని తెలిపారు. ఈ నేపథ్యంలో నిందితుడు పులివెందులకు వెళ్లి దర్యాప్తు అధికారి ముందు హాజరుకాలేరని తెలిపారు. ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరారు.



ఏలూరు సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్నికల స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న సీఈవో మీనా

ఏలూరులో సీఈవో మీనా పర్యటన

స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల పరిశీలన


ఏలూరు సిటీ, మార్చి 29 : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఏలూరు జిల్లాలో స్ట్రాంగ్‌రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఎంపిక చేసిన ఏలూరులోని సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలను శుక్రవారం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా సందర్శించారు. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ ఏర్పాట్లను కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేశ్ ఆయనకు వివరించారు. ఓట్ల లెక్కింపు సమయంలో తీసుకోవాల్సిన భద్రతకు సంబంధించి ఎస్పీ డి.మేరీప్రశాంతి, ఇతర పోలీస్ అధికారులకు సీఈవో సూచనలు చేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీరు, టెంట్లు వంటివి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. జేసీ లావణ్య వేణి, ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ, అసిస్టెంట్ కలెక్టర్ టి.శ్రీపూజ, డీఆర్వో డి.పుష్పమణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీట్ల సర్దుబాటుపై కాంగ్రెస్, వామపక్షాల చర్చలు

పార్టీలో చేరికలపైనే దృష్టి పెట్టిన 'హస్తం'

తుది నిర్ణయంపై ఏప్రిల్ 1న విజయవాడలో సమావేశం..!

అమరావతి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్, వామపక్ష పార్టీల మధ్య సీట్ల సర్దుబాటుపై శుక్రవారం చర్చలు జరిగాయి. ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి హైదరాబాద్‌లో తన నివాసం (లోటస్ పాండ్)లో సీపీఐ, సీపీఎం రాష్ట్ర నేతలతో విడివిడిగా చర్చలు జరిపారు. సీపీఐ తరఫున ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, ముఖ్య నేతలు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జీ ఓబులేసు, సీపీఎం ముఖ్య నేతలు హాజరయ్యారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో తమకు చెరో 15 అసెంబ్లీ, రెండేసి లోకసభ స్థానాలు కేటాయించాలంటూ తాము కోరుకుంటున్న స్థానాల జాబితాలను ఇంతకుముందే అందజేసిన లెఫ్ట్ నేతలు వాటిని ఫైనల్ చేయాలని కోరారు. ఈ సీట్ల సర్దుబాట్లపై మూడు పార్టీల మధ్య పూర్తి సమన్వయంతోనే చర్చలు సాగినట్లు సమాచారం. ఎవరికీ.. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏ పార్టీ.. ఏఏ స్థానాల్లో పోటీ చేయాలనే విషయంలో కూడా ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. అయితే రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పక్షాలైన వైసీపీతోపాటు బీజేపీ, తెలుగుదేశం, జనసేన కూటమి తమ అభ్యర్థులను దాదాపు ఖరారు చేయడంతో ఆయా పార్టీల్లో టికెట్టు దక్కని నాయకులు ఒక్కొక్కరుగా కాంగ్రెస్‌లో చేరుతున్నారు. ఈ నేపథ్యంలో పార్టీలో చేరికలపైనే ప్రధానంగా దృష్టి సారించిన పీసీసీ అధ్యక్షురాలు షర్మిలరెడ్డి సీట్ల పంపకాన్ని ఫైనల్ చేయకుండా ప్రస్తుతానికి వాయిదా వేశారు. సీపీఐ, సీపీఎం పార్టీలు అడుగుతున్న స్థానాలు, కాంగ్రెస్ పార్టీ పోటీ చేసే స్థానాలపై మరోసారి పరిశీలన చేసుకుని, తుది జాబితాను తమ పార్టీ అధిష్ఠానానికి పంపి ఆమోద ముద్ర వేయించుకున్న తర్వాత అభ్యర్థులను ప్రకటిద్దామని షర్మిలరెడ్డి చెప్పడంతో వామపక్షాల నాయకులు కూడా అంగీకరించారు. ఏప్రిల్ 1న తమ మూడు పార్టీల నాయకులు మరోసారి విజయవాడలో సమావేశమై సీట్ల సర్దుబాటుపై తుది నిర్ణయం తీసుకునే వీలుందని లెఫ్ట్ నాయకులు చెబుతున్నారు.



నీటి నిల్వ 810 అడుగులకు పడిపోయిన శ్రీశైలం జలాశయం

నీరు లేక నెర్రెలు చీలిన కర్నూలు జిల్లాలోని సుంకేసుల జలాశయం



సీమకు క..న్నీరే..

రాయలసీమ కరువు పల్లెలకు జీవనాడి శ్రీశైలం, తుంగభద్ర. ఈ జలాశయాలు సైతం పూర్తిగా అడుగంటిపోయిన దృశ్యాలు కలవరపరుస్తున్నాయి. అందులోనూ శ్రీశైలం అత్యంత దయనీయ స్థితికి చేరుకుంది. కర్నూలు, అనంతపురం జిల్లాలకు నీటి ఆధారమైన తుంగభద్ర డ్యామ్ పూర్తిగా అడుగంటింది. కర్నూలు నగర ప్రజల దాహం తీర్చే సుంకేసుల జలాశయం ఎండిపోయి నెర్రలిచ్చింది. గరిష్ఠ నీటి మట్టం 1.20 టీఎంసీలు కాగా 0.05 టీఎంసీలకు చేరింది. అది కూడా బురద నీరే.

నీళ్లు..కన్నీళ్లు

అడుగంటిన జలాశయాలు



అడుగంటిన ప్రకాశం బ్యారేజీ

(అమరావతి, ఆంధ్రజ్యోతి - న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలో గతేడాది ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో రాష్ట్ర ప్రధాన జలాశయాలు నీళ్ల లేక వెలవెలబోతున్నాయి. వేసవి ముదరకముందే, మార్చి నెలాఖరునాటికే భారీ, మధ్యతరహా నీటి వనరులు దాదాపుగా ఎండిపోయాయి. ఈ ఏడాది వేసవి తీవ్రత అత్యధికంగా ఉంటుందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీంతో ఏప్రిల్, మే నెలల్లో రాష్ట్రంలో దాహం కేకలు తీవ్ర స్థాయిలో ఉంటాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉమ్మడి రాష్ట్రాలకు చెందిన జంట జలాశయాలు శ్రీశైలం .. నాగార్జునసాగర్‌లలో నీటి నిల్వలు కనిష్ఠ స్థాయి కంటే దిగువకు చేరుకోవడం ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. రాష్ట్రంలోని భారీ జలాశయాల్లో గరిష్ఠ నీటి నిల్వ 865.64 టీఎంసీలు .. గత ఏడాది ఈ జలాశయాల్లో 421.34 (48.67శాతం) నీటి నిల్వలు ఉంటే .. బుధవారం ఉదయం తొమ్మిది గంటల నాటికి 228.77 (26.43 శాతం) నిల్వలు మాత్రమే ఉన్నాయి. భారీ ఆనకట్టల్లో గరిష్ఠ నీటి మట్టం 865.64 టీఎంసీలు. ఆ స్థాయికి చేరుకోవాలంటే ఇంకా 636.87 టీఎంసీల నీటి నిల్వలు ((76శాతం) అవసరమని రాష్ట్ర జల వనరుల శాఖ అధికారికంగా వెల్లడించింది.

మధ్యతరహా ప్రాజెక్టుల్లోనూ...


మధ్యతరహా నీటి ప్రాజెక్టుల్లో గరిష్ఠంగా 115.09 టీఎంసీల జలాలు నిల్వ ఉండాలి. కానీ బుధవారం నాటికి 37.65 టీఎంసీల (37 శాతం) నీటి నిల్వలు మాత్రమే ఉన్నాయి. అంటే, ఇంకా 77.44 టీఎంసీల జలాలు అవసరం. నదీ పరీవాహక ప్రాంతాలను పరిశీలిస్తే, పెన్నా నదీ పరీవాహక ప్రాంతంలో 239.59 టీఎంసీలకు గాను అత్యల్పంగా 142.22 టీఎంసీల నీటి నిల్వలే (19.02 శాతం) ఉన్నాయి. గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో 5.9 టీఎంసీల నిల్వకు గాను 3.83 టీఎంసీల మేర జలాలు ఉన్నాయి.

కృష్ణాకు కష్టం..

తెలుగు రాష్ట్రాలు ప్రధానంగా ఆధారపడే కృష్ణా నదీ పరీవాహక ప్రాంతంలో 589.67 టీఎంసీల గరిష్ఠ నీటి నిల్వలకుగాను కేవలం 183.23 టీఎంసీల నీటి నిల్వలు (31.07 శాతం) ఉన్నాయి. ఇప్పట్లో భారీ వర్షాలు కురిసే అవకాశం లేదు. ఎగువన కర్ణాటకలో ఇప్పటికిప్పుడు భారీ స్థాయిలో వరదలు వచ్చే వీలులేదు. దీంతో.. ఏకంగా 406.44 టీఎంసీల భారీ వరద వచ్చే వీలు లేదు. ఇతర నదీ పరీవాహక ప్రాంతాల్లో 148.33 టీఎంసీలకు గాను 33.98 టీఎంసీలు నిల్వ ఉంది. ఇంకా 114.35 టీఎంసీల జలాలు అవసరమని జల వనరులశాఖ వెల్లడించింది.. మొత్తంగా నదీ పరీవాహక ప్రాంతాల్లో 983.49 టీఎంసీలకు గాను 266.61 టీఎంసీల నిల్వ (27.11 శాతం) ఉంది.

తెలుగు రాష్ట్రాలకు జీవనాడిగా ఉన్న శ్రీశైలం, నాగార్జున సాగర్‌లలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. బుధవారం ఉదయం పది గంటల సమయంలో రాష్ట్ర జల వనరుల శాఖ అందించిన గణాంకాల మేరకు .. శ్రీశైలం జలాశయం గరిష్ఠ నీటి నిల్వ 215.81 టీఎంసీలు కాగా, డెడ్ స్టోరేజీ స్థాయిలో 34.7 టీఎంసీల నీటి నిల్వలు (16.08 శాతం) ఉన్నాయి. ఈ జలాశయం గరిష్ఠ స్థాయికి చేరుకోవాలంటే 181.11 టీఎంసీల జలాలు కావాలి. ఎగువన కర్ణాటక నుంచి ఈ స్థాయిలో భారీ వరద కృష్ణా నదికి వచ్చే వీలు లేదు. దీంతో.. శ్రీశైలం జలాశయం నుంచి ఈసారి తాగునీటిని అందించడమూ దుర్భరమేనని జల వనరుల నిపుణులు చెబుతున్నారు. మరో ప్రధాన జలాశయం నాగార్జున సాగర్ గరిష్ఠ నీటి మట్టం 312.05 టీఎంసీలకుగాను 137.76 టీఎంసీల నీటి నిల్వలు (44.15 శాతం) ఉన్నాయి. నాగార్జున సాగర్ గరిష్ఠ స్థాయికి చేరుకోవాలంటే .. మరో 174.29 టీఎంసీల జలాలు అవసరం. పులిచింతల రిజర్వాయరు గరిష్ఠ స్థాయి నీటి నిల్వ 45.77 టీఎంసీలకు గాను, 4.67 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. ప్రకాశం బ్యారేజీలో గరిష్ఠ నిల్వ 3.07 టీఎంసీలకు గాను .. 1.68 టీఎంసీల నీటి నిల్వలు (54.72 శాతం) ఉన్నాయి. మరో 1.39 టీఎంసీల జలాలు అవసరమవుతాయని జలవనరుల శాఖ చెబుతోంది.

జల ఆశలు అడుగంటినట్టే!



తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గుముఖం పడుతున్న దృశ్యం

సగానికి పడిపోయిన బ్యారేజీ సామర్థ్యం

సగానికిసగం నీటిమట్టం పడిపోవడంతో ప్రకాశం బ్యారేజీలో పరిస్థితి ఆందోళనకు గురిచేస్తోంది. బ్యారేజీ పూర్తిస్థాయి నీటి మట్టం 12 అడుగులు. నీటి సామర్థ్యం 3.07 టీఎంసీలు. ప్రస్తుతం ఇక్కడ 6.1 అడుగుల వద్ద నీటి మట్టం ఉంది. నీటి నిల్వలు 1.68 టీఎంసీలు ఉన్నాయి. 2015లో ఇలాంటి పరిస్థితి కనిపించింది. ప్రకాశం బ్యారేజీ ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టులోనూ నీటి నిల్వలు తగ్గిపోతున్నాయి. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులు కాగా నీటి నిల్వ సామర్థ్యం 45.77 అడుగులు. ప్రస్తుతం నీటి మట్టం 123.489 అడుగులకు పడిపోగా, నీటి నిల్వలు 4.68 టీఎంసీలు ఉన్నాయి. గత ఏడాది ఇదే సమయానికి నీటి మట్టం 173.75 అడుగులు ఉండగా, నీటి నిల్వలు 43.8 టీఎంసీలు ఉన్నాయి.

గోదావరిలో వేగంగా పడిపోతున్న నీటి మట్టాలు

గోదావరి నీటిమట్టం పడిపోయి ఇసుక తెప్పలు తేలుతున్నాయి. ధవళేశ్వరం బ్యారేజి వద్ద నీటిమట్టం బుధవారం 8.1 అడుగులు ఉంది. వాస్తవానికి గతేడాది ఇదే సమయంలో 7.35 అడుగులు ఉంది. ఇవాళ దానికంటే ఎక్కువగా ఉన్నా వేగంగా నీటిమట్టం పడిపోతున్నట్టు అధికారులే చెబుతున్నారు. వంతులవారీ విధానంలో వివిధ కాలువలకు నీటిని సరఫరా చేస్తున్నారు. రైతులకు పూర్తి సమాచారం అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే శివారు భూములకు తీవ్ర సమస్య ఉందని చెబుతున్నారు.ప్రస్తుతం తూర్పు,పశ్చిమ, కోనసీమ డెల్టాలకు 8,970 క్యూసెక్కుల నీటిని పంపిస్తున్నారు. ఇన్‌ఫ్లోస్ మాత్రం 8,100 క్యూసెక్కులుగా ఉంది. ఈ పరిస్థితుల్లో రబీ వరికి నీటిగండం తప్పేలా లేదు. వరికి ఏప్రిల్ 20వ తేదీ వరకైనా నీరు అవసరం.

- అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గంలోని జీడిపల్లి రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం 1.681. ప్రస్తుత నీటి మట్టం 0.350 టీఎంసీలు
- కడప జిల్లాలోని మైలవరం జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 6.5 టీఎంసీలు. ప్రస్తుతం నీటి మట్టం 0.462టీఎంసీలు
- కడప జిల్లాలో ప్రధాన జలాశయం గండికోట. దీని సామర్థ్యం 26.85 టీఎంసీలు. ప్రస్తుత నీటి మట్టం 4.732 టీఎంసీలు
- శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ మండలం గొల్లపల్లి రిజర్వాయర్ నీటి సామర్థ్యం 1.913 టీఎంసీలు. ప్రస్తుత నీటి మట్టం 0.870 టీఎంసీలు
- అనంతపురంలోని మిడ్ పెన్నార్ డ్యాం నీటి సామర్థ్యం ఐదు టీఎంసీలు. ప్రస్తుత నీటి మట్టం 0.3 టీఎంసీలు.

అడుగంటుతున్న తోటపల్లి

పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలో గరుగుబిల్లి మండలంలో ఉన్న తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టులో నీటినిల్వలు రోజురోజుకూ తగ్గుముఖం పడుతున్నాయి. వాస్తవంగా ప్రాజెక్టులో ఎఫ్‌ఆర్‌ఎల్ 105 మీటర్లు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 102.66 మీటర్ల మేర నీటి నిల్వలు ఉన్నాయి. గతంలో ఎన్నడూలేని విధంగా ఈ ప్రాజెక్టు పరిధిలో నాగావళి నది అడుగంటడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది తాగు, సాగునీటికి ఇబ్బందులు తప్పేలా లేవని వారు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం రబీ సీజన్‌లో పూర్తిస్థాయిలో ఆయకట్టుకు సాగునీరు అందడం లేదని రైతులు వాపోతున్నారు.

ఐటీ శాఖకు నవ సలహాదారులు

- ఒక్కొక్కరికీ నెలకు రూ.3.82 లక్షలు
- ఏడాదికి 4 కోట్ల ప్రజాధనం దోచిపెడుతున్న జగన్
- ఆర్‌టీఐ ద్వారా వెలుగులోకి వచ్చిన వైనం

అమరావతి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): అయిన వారికి సలహాదారుల రూపంలో పదవులు ఇవ్వడం, రూ.లక్షల్లో ప్రజాధనాన్ని జీతాలు, ఇతర సౌకర్యాల రూపంలో దోచిపెట్టడంలో సీఎం జగన్‌ది అందెవేసిన వేసిన చేయి. తాజాగా రాష్ట్ర ఐటీ శాఖ విషయంలోనూ ఇలాంటి దోపిడీనే కొనసాగుతోందని ఆర్టీఐ ద్వారా వెలుగు చూసిన అధికారిక సమాచారమే స్పష్టం చేస్తోంది. రాష్ట్రంలో ఐటీ శాఖకు ఒక్క పైసా పెట్టుబడి రాకపోయినా, ఉన్న పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలి వెళ్లిపోయినా ఆ శాఖ చేసే దుబారా మాత్రం తగ్గడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖల్లో వందల మంది సలహాదారులను నియమించి ఒక్కొక్క సలహాదారుడికీ నెలకు రూ.3.82 లక్షల చొప్పున చెల్లిస్తున్నారు. తమ వాళ్లకు ఏదో ఒక పదవి కట్టబెట్టాలన్న లక్ష్యంతో సీఎం జగన్ ఒక్క ఐటీ శాఖలోనే 9 మంది సలహాదారులను నియమించారు. 2019లో ఈ నియామకాలు ప్రారంభించిన ప్రభుత్వం 2023 దాకా కొనసాగించింది. ఐటీ శాఖలో నియమించిన 9 మంది సలహాదారుల్లో ఏడుగురు రెడ్డి సామాజికవర్గానికి చెందిన వారే కావడం విశేషం. సమాచార హక్కు సొసైటీ జాతీయ అధ్యక్షుడు టి. గంగాధర్ సమాచార హక్కు చట్టం కింద అడిగిన ప్రశ్నలకు ఐటీశాఖ ఆయా వివరాలిచ్చింది. 2019లో కె. రాజశేఖర్‌రెడ్డి, దేవిరెడ్డి శ్రీనాథ్, జె. విద్యాసాగర్‌రెడ్డి, టి. లోకేశ్వర రెడ్డిలను నియమించారు. ఆ తర్వాత 2020లో పెద్దమల్లు చంద్రహాస్‌ను, 2021లో పాటూరి శేషిరెడ్డిని, 2022లో టీవీఆర్ మోహన్‌రెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆర్.చంద్రశేఖర్‌ను, 2023లో సీహెచ్ చంద్రశేఖర్‌రెడ్డిని నియమించారు. వీరిలో కె.రాజశేఖర్‌రెడ్డి, దేవిరెడ్డి శ్రీనాథ్, టి.లోకేశ్వర్‌రెడ్డి పదవులను వదిలిపోగా మిగిలిన ఆరుగురు కొనసాగుతున్నారు. ఒక్కొక్క సలహాదారుకు నెలకు రూ.3.82 లక్షల చొప్పున 9 మంది సలహాదారులకు ఏడాదికి రూ.4.12 కోట్లు ఖర్చు చేస్తున్నారు. నోట్ ఫైల్‌లో సైతం ఆయా సలహాదారుల విద్యార్హత, ఇతర వివరాలేవీ లేవు. కేవలం సీఎం జగన్ ఆదేశాలతో సలహాదారును నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. ఐటీకి సంబంధించి ఒక్క పరిశ్రమ లేక, రాకపోయినా దుబారాలో మాత్రం ఏ మాత్రం తీసిపోకుండా జగన్ ప్రజాధనాన్ని తన వారికి పప్పుబెల్లాల్లా పంచుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అబద్ధాలతో 'సిద్ధం'

(మొదటి పేజీ తరువాయి)

రద్దు వంటి కీలక హామీలు ఇచ్చారు. వీటిలో ఒక్కంటే ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు. ఈ హామీలను ప్రజలు మరచిపోయుంటారనేమో కానీ 99 శాతం అమలు చేశామని మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. హామీలను నెరవేర్చకుండా మహిళలు, నిరుద్యోగులు, రైతులు, ఉద్యోగులు, పేదలు, అన్ని వర్గాలను జగన్ మోసం చేశారు.

ప్రత్యేక హోదా ఏదీ?

25కు 25 ఎంపీ సీట్లు ఇస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా సాధిస్తానని గత ఎన్నికల ముందు జగన్ ఊరూవాడా చెప్పారు. జగన్ మాటలను నమ్మి ప్రజలు 2019 ఎన్నికల్లో 22 మంది లోక్‌సభ సభ్యులను ఇస్తే.. కేంద్రం మెడలు వంచకుండా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాల వద్ద ఆయన సాగిలపడ్డారు. హోదా ఇవ్వాలంటూ గట్టిగా అడిగే సాహసం చేయలేకపోయారు.

పోలవరం ఎప్పుడు?

రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై జగన్ సర్కారు చెప్పిన గడువులు దాటిపోయాయి కానీ ప్రాజెక్టును పూర్తి చేయలేకపోయారు. రూ.1548 కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టును, టెండర్లను రద్దు చేసి, కాలయాపన చేసి ఛిద్రమయ్యేలా చేశారు. పోలవరం ప్రాజెక్టు ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేని పరిస్థితి. ఇతర సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణ పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది.

స్టీల్ ప్లాంట్ ఏమైంది?

సొంత జిల్లా కడపలో స్టీల్ ప్లాంట్ నిర్మాణంతో పాటు దుగరాజపట్నం పోర్టు అతీగతీ లేదు.



జాబ్ క్యాలెండర్ ఏదీ?

జగన్ సర్కారు వచ్చాక 5 జనవరి నెలలు వెళ్లిపోయాయి కానీ ఆయన చెప్పినట్టుగా ఒక్క ఏడాది కూడా జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదు.

సీపీఎస్ రద్దు ఏదీ?

అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛను విధానం అమల్లోకి తెస్తానన్న హామీని కూడా జగన్ అటకెక్కించారు. పాత పింఛను విధానం వల్ల భారీగా ఆర్థిక భారం ప్రభుత్వంపై పడుతుందని, తెలియక హామీ ఇచ్చానని జగన్ మాట తప్పారు.

ఊసే లేని రైల్వేజోన్

విశాఖ రైల్వే జోన్ అంశాన్ని అసలు పట్టించుకోనే లేదు. రైల్వే జోన్‌ను కేంద్రం మంజూరు చేసినా రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయించలేదు. స్వయంగా కేంద్రమే ఈ విషయం వెల్లడించింది. దీన్ని బట్టి జగన్ ప్రభుత్వం ఎంత అలసత్వం చూపుతోందో అర్థమవుతుంది.

ఓట్లు అడగనన్నారే...

దశలవారీగా సంపూర్ణ మద్య నిషేధం అమలు చేశాకే వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడుగుతానన్న హామీని జగన్ గాలికొదిలేశారు. సర్కారీ మద్యం షాపుల ద్వారా విచ్చలవిడిగా 'సొంత బ్రాండ్లు' అవిృమ్ముతున్నారు. జగన్ చెప్పినట్టుగా అయన ఈ ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు అనర్హులు.

నమ్మని జనం

ముఖ్యమంత్రి జగన్ అబద్ధాలు చెప్పి మభ్యపెట్టాలని చూసినా జనం నమ్మడం లేదు. గత ఎన్నికల సమయంలో ఆయన చెప్పిన మాటలను వారింకా మరచిపోలేదు. అందుకే .. జగన్ యాత్రలకు జనం రావడం లేదు. వచ్చినవారూ ఆయన అబద్ధాలను భరించలేక ప్రసంగం మధ్యలోనే బయటకొచ్చేస్తున్నారు. సొంతగడ్డ కడప జిల్లా నుంచే ఎన్నికల ప్రచారాన్ని చేపడితే.. ఆరంభం అదిరిపోతుందని జగన్ ఆశించారు. కానీ ఇడుపులపాయలో బస్సుయాత్ర ప్రారంభం నుంచే తుస్సు మంది. సభల్లో ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి. దీంతో జగన్ నిస్పృహతో మాట్లాడుతున్నారని విపక్షాలు విమర్శిస్తున్నాయి.

రైతులకు మోసం

రైతులకు పంటలకు మద్దతు ధర, పంట నష్ట సాయం, ఉచిత బోర్లు.. ఇలా పలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక మోసం చేశారు.

విద్యుత్ చార్జీల వాత

తాను అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోనని ప్రకటించిన జగన్.. ఐదేళ్లలో రూ.64,000 కోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని రాష్ట్ర ప్రజలపై మోపారు.



వెళ్లిపోతున్న జనం వైపు బేలగా చూస్తున్న విజయసాయిరెడ్డి.. వారిని వెనక్కి పిలుస్తున్న వైసీపీ నేతలు

ఎవరూ వెళ్లొద్దు.. భోజనాలున్నాయ్.!

- విజయసాయిరెడ్డి రోడ్ షోలో వైసీపీ నేతల పాట్లు
- భోజనాలు పెడతామంటున్నా వినకుండా జనం పరార్

'అమ్మా అందరికీ భోజనాలు ఉన్నాయ్. ఎవరూ వెళ్లొద్దు. విజయసాయిరెడ్డి మాట్లాడతారు. నేను చెప్పినదానికైనా వెనక్కి రండి. రండి.. రండి'.. అని వైసీపీ రోడ్ షోకు వచ్చిన జనాన్ని ఆ పార్టీ నాయకులు బతిమిలాడుకోవాల్సి వచ్చింది. నెల్లూరు పార్లమెంటు స్థానానికి వైసీపీ తరఫున బరిలో దిగిన విజయసాయి రెడ్డి ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డితో కలసి గురువారం సీతారామపురంలో రోడ్‌షో నిర్వహించారు. బస్టాండు సెంటర్‌లో విజయసాయి మాట్లాడుతుండగానే జనం ఇంటి బాట పట్టారు. 'ఎవరూ వెళ్లొద్దు. భోజనాలు ఏర్పాటు చేశాం' అంటూ మైక్‌లో వైసీపీ నాయకులు బతిమిలాడినా వినిపించుకోలేదు. కాగా, విజయసాయి సభను విజయవంతం చేసేందుకు రెండ్రోజులుగా నాయకులు జనసమీకరణకు ప్రణాళికలు వేసుకున్నారు. వచ్చిన వారికి రోజు కూలీతో పాటు బిర్యానీ పొట్లాలు, మద్యం ఇచ్చినట్లు సమాచారం. - సీతారామపురం (నెల్లూరు జిల్లా)

జగన్‌కు నిరసన సెగ

కోడుమూరు (రూరల్), మార్చి 29: కర్నూలు జిల్లాలో సీఎం జగన్‌కు నిరసన సెగ తగిలింది. తాగునీటి సమస్య తీర్చాలంటూ మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డుపైకి వచ్చారు. జగన్ బస్సు యాత్రకు అడ్డంగా రాగా పోలీసులు వారిని పక్కకు పంపించేశారు. శుక్రవారం గూడూరు మండలంలోని పెంచికలపాడులో బస్సు యాత్ర ప్రారంభమైంది. కొత్తూరు చేరుకోగానే మహిళలు ఖాళీ బిందెలు చూపుతూ సమస్య తీవ్రతను తెలియజేశారు. దీంతో సీఎం బస్సు దిగి వారితో మాట్లాడారు. త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ గ్రామం ఏర్పడిన నాటి నుంచి స్థానిక ప్రజలకు కుంట నీరే ఆధారం. 50 ఏళ్లకు పైగా కుంట నీరు తాగుతున్నారు. అయితే రెండేళ్ల క్రితం వైఎస్సార్ సుజల స్రవంతి పథకంలో భాగంగా మినీ ట్యాంకులను ఏర్పాటు చేశారు. కొత్తూరులో మినీ ట్యాంకు ద్వారా కొన్ని నెలల పాటు ఫిల్టర్ నీరు అందించారు. ఆరు నెలలకు పైగా ఫిల్టర్ నీరు రాకపోవడంతో తిరిగి తాగునీటి కష్టాలు తప్పలేదు. కొందరు ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చి కొత్తూరులో విక్రయిస్తున్నారు. బిందె రూ.12 ప్రకారం గ్రామస్థులు కొనుగోలు చేసి దాహం తీర్చుకుంటున్నారు.



బనగానపల్లెలో జరిగిన ప్రజాగళం సభకు తరలివచ్చిన జనం, చంద్రబాబు అభివాదం



ఉదయగిరి నియోజకవర్గంలోని వింజమూరులో ప్రజాగళం సభలో జనం

> నా 45 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి ముఖ్యమంత్రి వస్తాడని ఎప్పుడూ ఊహించలేదు. ఈయన పాలిటపడిన రాష్ట్రాన్ని చూస్తే గుండె తరుక్కుపోతోంది.
>
> జగన్.. మే 13న నీ అహంకారం అణగిపోతుంది. నిన్ను, నీ కుర్చీని కూలదోయడానికి.. తాడేపల్లి ప్యాలెస్‌ను బద్దలు కొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. ఓడిపోవడానికి నువ్వు సిద్ధమవ్వు!
>
> జగన్ పాలనలో రాష్ట్ర ప్రజలు స్వేచ్ఛగా బతికే పరిస్థితి లేకుండా పోయింది. వీరి టార్చర్ భరించలేక పిల్లాపాపలతో పాటు ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబాలు ఎన్నో ఉన్నాయి.
>
> దేశంలోనే అత్యంత ధనిక ముఖ్యమంత్రి జగన్. కానీ మన ఆంధ్రప్రదేశ్ మాత్రం అత్యంత పేద.. అత్యధికంగా అప్పులపాలైన రాష్ట్రంగా మారింది.
>
> - చంద్రబాబు

రద్దులు.. గుద్దులు.. కేసులు.. కూల్చివేతలు

విధ్వంసక జగన్

ఇళ్లలోనే రోదించారు

ఈ జగన్ ఆకాశం నుంచి ఊడిపడ్డాడు.. ఎవరూ ప్రశ్నించకూడదు. ఏమీ మాట్లాడకూడదు.. ఏమైనా విమర్శిస్తే వెంటనే పోలీసులు వస్తారు. కేసు పెడతారు. వారి వెంటే సీఐడీ వస్తుంది. జైల్లో పెడతారు. టార్చర్ చూపిస్తారు. చంపడానికి కూడా తెగిస్తారు. ఈ జగన్ అరాచక పాలనలో లక్షలాది మంది ప్రజలు తమకు జరిగిన అన్యాయాన్ని బయటకు చెప్పుకోలేక ఇళ్లలోనే కూర్చుని రోదించారు. ఆస్తులు కొల్లగొడుతున్నా మాట్లాడడానికి భయపడ్డారు. ఆస్తులు పోతే పోయాయ్.. ప్రాణాలు మిగిలితే చాలని ఊళ్లొదిలి పోయారు. వీరి టార్చర్ భరించలేక పిల్లాపాపలతో ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబాలు ఎన్నో. నంద్యాలకు చెందిన అబ్దుల్ సలామ్ ఆత్మహత్య చేసుకుంటానంటే.. నువ్వు చస్తే నీ భార్యను టార్చర్ చేస్తామని బెదిరించారు. దీంతో ఆ భార్యభర్తలిద్దరూ ఆత్మహత్య చేసుకోవాలనుకున్నారు. ఇద్దరు బిడ్డలూ అనాథలవుతారని, వారిని కూడా రైల్వే ట్రాక్‌కు కట్టి, ఇద్దరూ ట్రాక్ మీద పడుకొని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారంటే జగన్ పాలనలో రాక్షసత్వానికి ఇంతకన్నా ఉదాహరణ కావాలా? కాకినాడలో వైసీపీ ఎమ్మెల్సీ తన డ్రైవర్‌ను చంపి ఇంటికి డోర్ డెలివరీ పంపిస్తే అలాంటి వ్యక్తిని ఈ సీఎం పక్కన పెట్టుకుని తిరుగుతున్నాడు.. సొంత బాబాయిని చంపేసిన వ్యక్తికి ఎంపీ టికెట్ ఇచ్చాడు. చెల్లిలిని కించపరిచేలా పోస్టింగులు పెట్టించాడు. ఇలాంటి వ్యక్తిని రాజకీయాల నుంచి సాగనంపాలా వద్దా?

(మొదటి పేజీ తరువాయి)

కలిసి ఆయన్ను తరిమికొట్టి రాష్ట్రాన్ని బాగుచేసుకుందామని పిలుపిచ్చారు. ప్రజాగళంలో భాగంగా శుక్రవారం నంద్యాల జిల్లా బనగానపల్లె, నెల్లూరు జిల్లా కావలి, వింజమూరు (ఉదయగిరి నియోజకవర్గం) బహిరంగ సభల్లో ఆయన ప్రసంగించారు. టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రస్తావిస్తూ ఆ పార్టీ తెలుగుజాతి కీర్తిని విశ్వవ్యాప్తం చేసిన తీరును.. ఐదేళ్ల జగన్ పాలనలో రాష్ట్రం నష్టపోయిన వైనాన్ని వివరించారు. రాష్ట్ర ప్రజలంతా ఈయన్ను ఇంటికి పంపించేయాలని నిర్ణయించుకున్నారని.. ఎన్డీయేకి జై కొడుతున్నారని చెప్పారు. జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ప్రజలకు జరిగిన నష్టాన్ని, కష్టాన్ని, అన్యాయాలను గుర్తు చేయడం కోసమే ప్రజాగళం పేరుతో ప్రజల్లోకి వచ్చానని అన్నారు. ఈ ఐదేళ్ల కాలంలో రైతులు బాగున్నారా, సబ్సిడీలు అందాయా, సాగునీరు అందిందా, గిట్టుబాటు ధర లభించిందా అనే విషయాలను రైతులు గుర్తు చేసుకోవాలన్నారు. ప్రజలకు తాగడానికి మంచి నీళ్లు కూడా ఇవ్వలేని దద్దమ్మ పాలనను చూశామని దుయ్యబట్టారు. ఈ దుర్మార్గుడు రూ.10 ఇచ్చి 100 రూపాయలు లాక్కొని ప్రజల రక్తం తాగేస్తున్నాడని మండిపడ్డారు. రాష్ట్రాన్ని రూ.12 లక్షల కోట్ల అప్పుల పాల్జేశాడని.. వ్యవస్థలను ఛిన్నాభిన్నం చేశాడని అన్నారు. అక్రమ కేసులతో వేధిస్తున్న సైకో పోవాలని.. ప్రజలు గెలవాలని.. భవిష్యత్ బంగారుమయం కావాలని.. రాష్ట్రం నిలబడాలని ఆకాంక్షించారు. ఇంకా ఏమన్నారంటే..

ఏమైనా అభివృద్ధి చేశాడా?

జగన్ నోరు తెరిస్తే అబద్ధం మాట్లాడుతున్నాడు. టీడీపీ ఏం చేసిందని అడుగుతుంటే నాకు ఆశ్చర్యంగా ఉంది. అసలీయన ఈ ఐదేళ్లలో ఏమైనా అభివృద్ధి చేశాడా? మూడు రాజధానులు చేశానని చెబుతున్నాడు. మూడు రాజధానుల పేరిట రాష్ట్రాన్ని మూడు ముక్కలు చేశాడు. రాష్ట్రానికి రాజధానే లేకుండా చేశాడు. జగన్ పాలనలో రైతన్నలు బాగుపడలేదు. గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్నారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తి కాలేదు. నిత్యావసరాల ధరలు అందుబాటులో లేవు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కార్పొరేషన్ల నుంచి ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు. జగన్ మొన్నటి వరకు పరదాల మాటున తిరిగాడు. ఇప్పుడు మళ్లీ ఓట్లు అడిగేందుకు వస్తున్నాడు. కర్నూలు జిల్లాలో కనీసం తాగేందుకు నీరు లేని పరిస్థితి కనిపిస్తుంటే.. ఆ సమస్యను పరిష్కరించకుండా, నంద్యాలలో సభ ఎలా పెట్టాడు? అయనకు తెలిసింది రద్దులు, గుద్దులు, దాడులు, కేసులు, కూల్చివేతలు మాత్రమే. ఐదేళ్లుగా ఎదురు ప్రశ్నించిన వారిని అణగదొక్కడమే! ప్రతి ఇంటిని, ఊరిని, ప్రాంతాన్ని నాశనం చేశాడు.

ఎవరు పెత్తందార్లు..?

టీడీపీ-జనసేన-బీజేపీలను పెత్తందార్లుగా పేర్కొంటూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నాడు. పేదలకు రూ.5కే భోజనం పెట్టడానికి అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసిన మేం పెత్తందార్లమా..? వాటిని రద్దు చేసి పేదల నోటికాడ కూడు లాగేసిన జగన్ పెత్తందారా? విదేశీ విద్య పథకం ద్వారా పేద విద్యార్థులకు విదేశాల్లో చదువుకునే అవకాశం కల్పించిన మేం పెత్తందార్లమా..! ఆ పథకాన్ని రద్దు చేసిన నువ్వు పెత్తందారువా? పేదల పక్కా ఇళ్ల కోసం పైసా విదిల్చకుండా, నువ్వు మాత్రం రుషికొండలో రూ. 500 కోట్లతో విలాస భవంతి నిర్మించుకున్నావు.. నిజమైన పెత్తందారుకు నిదర్శనం నువ్వే! రాష్ట్రంలో దొంగలు పడినప్పుడు వారిని తరిమికొట్టాల్సిన బాధ్యత ప్రజలకు లేదా? దోపిడీదారు, విధ్వంసకుడు, అహంభావి అయిన జగన్‌ను రాష్ట్రం నుంచి తరిమికొట్టాలో లేదో మీరే ఆలోచించాలి. మీ కుటుంబ సభ్యులందరూ కూర్చోండి. ఈ ఐదేళ్ల పాలనలో వచ్చిన ఆదాయం, అయిన ఖర్చు లెక్కలు వేసుకోండి. మీకు మంచి జరిగిందని అంటే నేనేమీ మాట్లాడను. నష్టం జరిగిందనుకుంటే మాత్రం ఈ జగన్‌ను చిత్తుచిత్తుగా ఓడించండి. ఈ ఐదేళ్లలో రాష్ట్రం అప్పులపాలైంది. పోలవరం, రాజధాని పూర్తి కావాలన్నా.. అప్పులు తీర్చాలన్నా కేంద్రం సహకారం అవసరం. అందుకే బీజేపీతో పొత్తు పెట్టుకున్నాం. ఈ పొత్తును నిండు మనసుతో ఆశీర్వదించండి. నేను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా చేసినప్పుడు.. తర్వాత రాష్ట్రం విడిపోయిన తర్వాత మొత్తం 9 డీఎస్సీలిచ్చా. ఎన్టీఆర్ 3 ఇచ్చారు. జగన్ ఈ ఐదేళ్లలో ఒక్కటైనా ఇచ్చాడా? మేం అధికారంలోకి వస్తే వలంటీర్లను తీసివేయనని మాటిస్తున్నాను. ప్రస్తుతం వారు రూ.5 వేలకే పని చేస్తున్నారు. జీతాలు పెంచే మార్గం చూస్తాం. వారికి స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా శిక్షణ ఇప్పించి నెలకు రూ.50 వేలు సంపాదించుకునేలా చేస్తాం. గతంలో రూ.200 ఉన్న పింఛనును రూ.2 వేలు చేశా. మళ్లీ మేమొచ్చాక రూ.4 వేలకు పెంచుతా.

నేడు, రేపు ఐదు జిల్లాల్లో
చంద్రబాబు పర్యటన

అమరావతి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు ఈనెల 30, 31 తేదీల్లో కడప, తిరుపతి, కర్నూలు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో పర్యటించనున్నారు. ఈ ఐదు జిల్లాల్లో ప్రజాగళం సభల్లో చంద్రబాబు పాల్గొననున్నారు. శనివారం ఉదయం నెల్లూరు జిల్లా వింజమూరు నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి కడప జిల్లా ప్రొద్దుటూరు చేరుకుంటారు. స్థానిక పుట్టపర్తి సర్కిల్ వద్ద ప్రజాగళం సభలో మాట్లాడనున్నారు. మధ్యాహ్న భోజనం తర్వాత తిరుపతి జిల్లా నాయుడుపేట చేరుకుంటారు. ప్రజాగళం సభలో పాల్గొంటారు. అనంతరం శ్రీకాళహస్తి చేరుకుని సభలో పాల్గొని, రాత్రికి పార్టీ కార్యాలయంలో బస చేస్తారు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

- ఎన్టీఆర్‌కు చంద్రబాబు, నేతల నివాళి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న చంద్రబాబు

టీడీపీ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రెండు తెలుగు రాష్ట్రాల్లో తెలుగుదేశం పార్టీ శ్రేణులు వేడుకలను నిర్వహించాయి. పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళులర్పించాయి. శ్రీసత్యసాయి జిల్లా కదిరి పట్టణంలో ఆ పార్టీ అధినేత చంద్రబాబు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రజాగళం సభ అనంతరం కదిరి పట్టణం, పీవీఆర్ గ్రాండ్‌లో గురువారం రాత్రి బస చేసిన చంద్రబాబు... శుక్రవారం ఆ ఆవరణలో టీడీపీ జెండాను ఆవిష్కరించారు. ఎన్టీఆర్‌కు నివాళి అర్పించారు. తర్వాత కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ కదిరి అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు. మరో సందేశంలో చంద్రబాబు గుడ్ ఫ్రైడే శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ యువనేత లోకేశ్ శుక్రవారం ఎక్స్‌లో స్పందిస్తూ... టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. మరో సందేశంలో దయామయుడైన ఏసుక్రీస్తు త్యాగమే గుడ్‌ఫ్రైడే అని పేర్కొన్నారు. టీడీపీ ఆవిర్భావంతోనే రాష్ట్రంలో సామాజిక, సంక్షేమ విప్లవం మొదలైందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. మంగళగిరి టీడీపీ జాతీయ కార్యాలయంలో ఉండవల్లిలోని చంద్రబాబు నివాసం వద్ద టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చంద్రబాబు నివాసం వద్ద ఆయన సతీమణి భువనేశ్వరీ ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించి కార్యకర్తలు, నాయకుల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. పార్టీ జాతీయ కార్యాలయంలో టీడీపీ జెండాను ఎగురవేసి పలువురు నేతలు ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు.

దేవినేని ఉమాకు పార్టీ అదనపు బాధ్యతలు

అమరావతి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హోదాలో పనిచేస్తున్న మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుకు టీడీపీ అధినేత చంద్రబాబు అదనపు బాధ్యతలు అప్పచెప్పారు. బాబు ఆదేశాలతో రాష్ట్ర వ్యాప్తంగా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమన్వయ బాధ్యతలు ఆయనకు అప్పచెప్తూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఒక ప్రకటన విడుదల చేశారు.

టీడీపీలో చేరిన 'పేట' వైసీపీ నేత మల్లెల

అమరావతి(ఆంధ్రజ్యోతి), చిలకలూరిపేట అర్బన్, మార్చి 29: చిలకలూరిపేట నియోజకవర్గానికి చెందిన పలువురు వైసీపీ నేతలు టీడీపీలో చేరారు. శుక్రవారం హైదరాబాద్‌లో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ సమక్షంలో చిలకలూరిపేట వైసీపీ మాజీ ఇన్‌చార్జి మల్లెల రాజేశ్ నాయుడుతోపాటు మున్సిపల్ వైస్‌చైర్మన్ గోల్డ్ శ్రీను, మరో 10 మంది కౌన్సిలర్లు, ఒక జడ్పీటీసీ, ఇద్దరు సర్పంచ్‌లు టీడీపీలో చేరారు. వీరికి లోకేశ్ పసుపు కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు కార్యక్రమంలో పాల్గొన్నారు. దీంతో కొద్ది రోజులుగా కాక రేపుతున్న చిలకలూరిపేట రాజకీయం కొత్త మలుపు తిరిగినట్లయింది. అభ్యర్థులతో ఆట లాడుకుంటున్న అధికార వైసీపీకి స్థానికంగా ఊహించని భారీ షాక్ తగిలింది. అవమాన భారం, అసంతృప్తితో వైసీపీ నాయకులు రగిలిపోతున్నా. రజని వెళ్లిపోయిన తరువాత పార్టీకి పెద్ద దిక్కుగా మారిన మల్లెల రాజేశ్ నాయుడు వైసీపీకి గుడ్ బై చెపుతూ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. ఈ సందర్భంగా రాజేశ్ మాట్లాడుతూ, '2019 ఎన్నికల్లో వైసీపీ విజయానికి కృషి చేశాం. కొంత కాలంగా జరుగుతున్న పరిణామాలకు వైసీపీ పట్ల విసుగు చెందా. నాకు జరిగిన తీవ్ర అన్యాయాన్ని భరించలేక వైసీపీని వీడాల్సి వచ్చింది. స్థానికులకే సీటు కేటాయించాలని అధిష్ఠానాన్ని ఎన్ని సార్లు కోరినా సీల్డ్ కవర్ అభ్యర్థిని పంపింది. అందుకే మన చిలకలూరిపేట నినాదంతో ప్రత్తిపాటి పుల్లారావును బలపరచాలని నిర్ణయం తీసుకున్నాం' అని రాజేశ్ వెల్లడించారు. అనంతరం ప్రత్తిపాటి మాట్లాడుతూ, వైసీపీ అక్రమాలకు, దుర్మార్గాలకు విసిగి రాజీనామా చేసి లోకేశ్ సమక్షంలో రాజేశ్ నాయుడు టీడీపీలో చేరారని అన్నారు. మరో రెండు రోజుల్లో పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాజేశ్ నాయుడును నియమిస్తూ ఉత్తర్వులు రానున్నాయని తెలిపారు.



చీపురుపల్లిలో..
బొత్స వర్సెస్ కళా



- భీమిలి బరిలో గంటా
- పెండింగ్ సీట్లకు టీడీపీ అభ్యర్థుల ప్రకటన
- వీటిలో 9 అసెంబ్లీ, 4 లోక్‌సభ స్థానాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పెండింగ్‌లో ఉన్న శాసనసభ, లోక్‌సభ స్థానాలకు టీడీపీ తన అభ్యర్థులను ప్రకటించింది. శుక్రవారం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవాన విడుదల చేసిన నాలుగో జాబితాలో 9 అసెంబ్లీ, 4 పార్లమెంటు స్థానాల అభ్యర్థులు ఉన్నారు. తాజా జాబితాలో కొన్ని ఆసక్తికర ఎంపికలు చోటుచేసుకున్నాయి. విజయనగరం జిల్లా చీపురుపల్లిలో మంత్రి బొత్స సత్యనారాయణతో మాజీమంత్రి, పొలిట్‌బ్యూరో సభ్యుడు కిమిడి కళావెంకట్రావు తలపడనున్నారు. ఇక్కడ పోటీచేస్తారనుకున్న మాజీమంత్రి గంటా శ్రీనివాసరావు భీమిలి టికెట్ సాధించారు. 2014లో ఆయన ఇక్కడి నుంచే గెలిచారు. 2019లో విశాఖ ఉత్తర నియోజకవర్గానికి మారారు. ఈ సీటు పొత్తులో భాగంగా బీజేపీకి వెళ్లడంతో గంటా మరోసారి భీమిలి బరిలో దిగుతున్నారు. ఇక్కడ వైసీపీ అభ్యర్థి, మాజీ మంత్రి, ఒకప్పటి తన సన్నిహితుడైన అవంతి శ్రీనివాస్‌ను ఎదుర్కోనున్నారు. కళావెంకట్రావు గతంలో ఎచ్చెర్ల స్థానానికి ప్రాతినిధ్యం వహించారు. గత ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. ఆ సీటు పొత్తులో బీజేపీకి వెళ్లడంతో కళాకు ప్రత్యామ్నాయం చూపాల్సివచ్చింది. చీపురుపల్లిలో ఇప్పటికే ఆయన సోదరుడి కుమారుడు కిమిడి నాగార్జున టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్నారు. బొత్సను దీటుగా ఎదుర్కొనే క్రమంలో పార్టీ నాయకత్వం కళాకు టికెట్ ఇచ్చిందని టీడీపీ వర్గాలు అంటున్నాయి. పైగా కళా సామాజికవర్గమైన తూర్పుకాపులు చీపురుపల్లిలో ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. ఇక్కడ ఆయనకు బంధువర్గం కూడా అధికంగా ఉండడంతో అధిష్ఠానం ఆయనవైపు మొగ్గింది. వైసీపీ నుంచి ఇటీవలే వచ్చిన మాజీ మంత్రి గుమ్మనూరు జయరాంకు గుంతకల్లు సీటు కేటాయించారు. ఆయన అంతకుముందు కర్నూలు జిల్లా ఆలూరుకు ప్రాతినిధ్యం వహించారు. ఆలూరు సీటును లింగాయత్ సామాజికవర్గానికి చెందిన వీరభద్ర గౌడ్‌కు ఇచ్చారు. అనంతపురం జిల్లా కేంద్రం సీటు మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి సమీప బంధువైన దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్‌కు లభించింది. టీడీపీ సీనియర్ నేత దివంగత మాజీ ఎమ్మెల్యే పాలకొండ్రాయుడి కుమారుడు సుగవాసి సుబ్రమణ్యంకు రాజంపేట అసెంబ్లీ సీటు ఇచ్చారు. ఈయనకు మొదట రాజంపేట లోక్‌సీటు సీటు ఇవ్వాలని అనుకున్నారు. అయితే అది పొత్తులో బీజేపీకి కేటాయించడంతో ఆయనకు అసెంబ్లీ సీటు ఇచ్చారు. ప్రకాశం జిల్లా దర్శి సీటు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మికి లభించింది. ఆమె తండ్రి గొట్టిపాటి నరసయ్య గతంలో టీడీపీ మార్టూరు ఎమ్మెల్యేగా పనిచేశారు. అల్లూరి జిల్లా పాడేరు(ఎస్టీ) సీటును పార్టీలోకి కొత్తగా వచ్చిన రమేశ్‌నాయుడికి కేటాయించారు.

మాగుంటకే చాన్సు

ఒంగోలు లోక్‌సభ అభ్యర్థిగా సిటింగ్ ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పేరును ప్రకటించారు. ముందు ఆయన కుమారుడు రాఘవరెడ్డిని నిలపాలనుకున్నారు. అయితే ఢిల్లీ మద్యం పాలసీ స్కాం కేసు తీవ్రత నేపథ్యంలో ఆయన్ను కాదని చివరకు శ్రీనివాసులరెడ్డికి కేటాయించారు. కడప లోక్‌సభ సీటు అనూహ్యంగా జమ్మలమడుగు నేత చదిపిరాళ్ల భూపేశ్‌రెడ్డికి లభించింది. ఆయన ఇప్పటి దాకా జమ్మలమడుగు అసెంబ్లీ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఆ సీటు పొత్తులో బీజేపీకి పోవడంతో కడప ఎంపీ అభ్యర్థిగా ఎంపిక చేశారు. విజయనగరం జిల్లా ఎచ్చెర్ల సీటు కోసం పోటీపడిన యువ నేత, తూర్పు కాపు సామాజికవర్గానికి చెందిన కలిశెట్టి అప్పలనాయుడుకు విజయనగరం లోక్‌సభ సీటు లభించింది. వివాదరహితుడు కావడంతో ఆయనకు అక్కడ అవకాశం ఇచ్చారు. అనంతపురం లోక్‌సభ స్థానానికి బోయ సామాజికవర్గానికి చెందిన అంబికా లక్ష్మీనారాయణను ఎంపిక చేశారు. ఈయన పార్టీలో హిందూపురం ప్రాంతానికి చెందిన సీనియర్ నేత.

సామాజిక కోణంలో..

144 అసెంబ్లీ, 17 లోక్‌సభ సీట్లకు టీడీపీ ప్రకటించిన అభ్యర్థులను సామాజిక కోణంలో పరిశీలిస్తే.. బీసీలకు అత్యధికంగా 34 అసెంబ్లీ స్థానాలు దక్కాయి. ముస్లిం మైనారిటీలకు 3, ఎస్సీ-25, ఎస్టీ-4, కాపు-10, కమ్మ-32, రెడ్డి-27, వైశ్య-2, క్షత్రియ-5, వెలమ, బలిజకు చెరో సీటు కేటాయించారు. పార్లమెంటు సీట్లలో బీసీలకు 6, ఎస్సీ-3, రెడ్లు-4, కమ్మ వర్గానికి 4 సీట్లు కేటాయించారు.

రఘురామకు సీటు ఖాయం

నరసాపురం సిటింగ్ ఎంపీ రఘురామరాజుకు సీటు ఖాయమని టీడీపీ వర్గాలు తెలిపాయి. ఆయనకు సీటివ్వాలని టీడీపీ-జనసేన-బీజేపీ ఒక నిర్ణయానికి వచ్చాయని, ఆయనను ఎక్కడ నిలిపితే బాగుంటుందనే దానిపై సమాలోచనలు జరుగుతున్నాయని, ఒకట్రెండు రోజుల్లో నిర్ణయం వెలువడుతుందని పేర్కొన్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో ఒక అసెంబ్లీ స్థానంలో ఆయన్ను నిలిపే అవకాశం ఉంది. దీనిపై రఘురామరాజు అభిప్రాయం కూడా తెలుసుకుని ఖరారు చేయనున్నారు.

అసెంబ్లీ అభ్యర్థులు.. (9 మంది)

పేరు	నియోజకవర్గం	కులం
కిమిడి కళావెంకట్రావు	చీపురుపల్లి	తూర్పుకాపు
గంటా శ్రీనివాసరావు	భీమిలి	కాపు
కిల్లు వెంకట రమేశ్‌నాయుడు	పాడేరు(ఎస్టీ)	ఎస్టీ
డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి	దర్శి	కమ్మ
సుగవాసి సుబ్రమణ్యం	రాజంపేట	బలిజ
వీరభద్రగౌడ్	ఆలూరు	లింగాయత్
గుమ్మనూరు జయరాం	గుంతకల్	వాల్మీకి బోయ
దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్	అనంతపురం అర్బన్	కమ్మ
కందికుంట వెంకటప్రసాద్	కదిరి	పద్మశాలి

లోక్‌సభ అభ్యర్థులు.. (నలుగురు)

పేరు	నియోజకవర్గం	కులం
కలిశెట్టి అప్పలనాయుడు	విజయనగరం	తూర్పు కాపు
మాగుంట శ్రీనివాసులరెడ్డి	ఒంగోలు	రెడ్డి
అంబికా లక్ష్మీనారాయణ	అనంతపురం	బోయ
చదిపిరాళ్ల భూపేశ్‌రెడ్డి	కడప	రెడ్డి

కోడ్ బేఖాతర్..!

- నిబంధనలకు విరుద్ధంగా ఆర్టీసీ బస్సులో జగన్
- డీజీపీ, నిఘా ఏడీజీపై విచారణ జరపాలి
- రాష్ట్ర ఎన్నికల అధికారికి టీడీపీ ఫిర్యాదు

అమరావతి, న్యూఢిల్లీ, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్‌ను బేఖాతరు చేస్తున్న అధికారులు, కాళహస్తిలో దొరికిన డంప్‌పై సమగ్ర విచారణ జరపాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్ కుమార్ మీనాకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి రఫీ, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు అఖిల్ ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా కొందరు అధికారులు ఇంకా అధికారపార్టీకి అనుకూలంగా పని చేస్తున్నారని, అటువంటి వారిపై తగిన చర్యలు తీసుకుని వారిని ఎన్నికల విధుల్లో పాల్గొనకుండా చూడాలని ఈసీని కోరారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో సీఈవో కార్యాలయంలో ఫిర్యాదు చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా పోలీసులు మాత్రం అధికారపార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. పట్టపగలే మా పార్టీ కార్యకర్తలపై దాడులు జరుగుతున్నా పోలీసులు చోద్యం చూస్తున్నారు. కొన్ని ఉదాహరణలను ఈసీకి సమర్పించాం. దాడులను నియంత్రించడంలో విఫలమైన డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ ఏడీజీ ఆంజనేయులుపై సత్వరమే చర్యలు తీసుకోవాలి. వారిద్దరిని ఎన్నికల విధుల నుంచి తప్పించాలని సీఈవోను కోరాం. ఎన్నికల కోడ్ వచ్చినా ప్రభుత్వ సొమ్ముతో జగన్ ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. రెండు రోజుల నుంచి ఆర్టీసీ బుల్లెట్ ప్రూఫ్ బస్సుల్లో తిరుగుతున్నారు. ప్రభుత్వ బస్సుల్లో ఎన్నికల ప్రచారం చేసే అధికారం జగన్‌కు లేదు. ఎన్నికల ప్రచారానికి ఆర్టీసీ పంపించిన రెండు బుల్లెట్ ప్రూఫ్ బస్సులను వెంటనే వెనక్కి పిలిపించి ఆ బస్సులను పంపిన ఆర్టీసీ అధికారులపై చర్యలు తీసుకోవాలి. ఇన్ని రోజులు బస్సులు వాడుకున్న జగన్‌రెడ్డి దగ్గర నుంచి చార్జీలు వసూలు చేయాలని సీఈఓకు విజ్ఞప్తి చేశాం' అని వర్ల తెలిపారు.

కోడ్ ఉల్లంఘిస్తున్న అధికారులు: కనకమేడల

న్యూఢిల్లీ, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నియమావళి అమలులో ఉన్నప్పటికీ అధికార వైసీపీకి ప్రయోజనం చేకూర్చేందుకు సీఎంవో, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ అధికారులు నిబంధనలను ఉల్లంఘించి పెండింగ్ బిల్లులను క్లియర్ చేస్తున్నారని టీడీపీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం, కేంద్ర ఎన్నికల సంఘం చీఫ్ కమిషనర్‌కు కనకమేడల లేఖ రాశారు.

వైసీపీకి ఓటేయాలంటూ 'ఆర్టీపీపీ' నేతల ప్రచారం

అమరావతి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు(ఆర్‌టీపీసీ) ఉద్యోగ సంఘాల నేతలు కొందరు బరితెగించారు. ప్రస్తుత ఎన్నికల్లో అధికార వైసీపీ తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. జమ్మలమడుగు వైసీపీ ఎమ్మెల్యే సుధీర్ కుమార్ రెడ్డికి మద్దతుగా గత కొన్ని రోజులుగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ఎమ్మెల్యే తరఫున కరపత్రాలను కూడా పంపిణీ చేస్తున్నారు. ఏపీ పవర్ జనరేషన్ కార్పొరేషన్(ఏపీజెన్కో) ఆధ్వర్యంలో నడుస్తున్న ఆర్‌టీపీపీ ఉద్యోగులు.. ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదు. అయినప్పటికీ బరితెగిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వాట్సాప్ ద్వారా వైసీపీకి ప్రచారం!

బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గంలోని చెరుకుపల్లి సచివాలయం 2 అడ్మిన్ అధికార పార్టీ మద్దతుగా జోరుగా వాట్సాప్, స్టేటస్‌ల ద్వారా ప్రచారాలు నిర్వహిస్తున్నారు. 'మన చెరుకుపల్లి 2 సచివాలయం' పేరిట అడ్మిన్ 7595836808 నంబరుతో వాట్సాప్ స్టేటస్‌ల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇలాంటి వారిపై ఎన్నికల సంఘం అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు. కాగా, వైసీపీ తరఫున ప్రచారం చేయడమే గాకుండా ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసినట్లు టీడీపీ నేతలు ఫిర్యాదు చేయడంతో పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం పనసభద్ర గ్రామంలో నలుగురు వలంటీర్లకు శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు.



అనంతపురం జిల్లా టీడీపీ కార్యాలయం వద్ద సామగ్రిని దహనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి వర్గీయులు



తూర్పుగోదావరి జిల్లా మహేంద్రవాడ గ్రామంలో తల్లిని రిక్షాలో కూర్చోబెట్టుకుని కుటుంబీకులతో సహా పర్యటిస్తున్న మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

టీడీపీలో టికెట్ల చిచ్చు

- ప్రభాకర్ చౌదరి, జితేంద్రగౌడ్ వర్గీయుల ఆందోళన
- పార్టీ పదవులకు నాగార్జున రాజీనామా
- టికెట్ కోసం కుటుంబంతో సహా రోడ్డెక్కిన మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి

అనంతపురం అర్బన్/గుంతకల్లు/చీపురుపల్లి/అనపర్తి, మార్చి 29: టీడీపీ టికెట్ల కేటాయింపు ఆ పార్టీలో చిచ్చురేపింది. చీపురుపల్లి టికెట్ ఇవ్వనందుకు నిరసనగా విజయనగరం జిల్లా టీడీపీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున పార్టీ పదవులకు రాజీనామా చేశారు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి టికెట్ కోసం మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులతో సహా రోడ్డెక్కారు. అనంతపురం జిల్లాలో అనంత అర్బన్, గుంతకల్లు మాజీ ఎమ్మెల్యేలు వైకుంఠం ప్రభాకర్ చౌదరి, జితేంద్రగౌడ్‌కు టికెట్లు దక్కకపోవడంతో వారి వర్గీయులు ఆందోళనలకు దిగారు. శుక్రవారం అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయం ఎదుట ప్రభాకర్ చౌదరి వర్గీయులు పార్టీ జెండాలు, ఫ్లెక్సీలు, కరపత్రాలను దహనం చేశారు. అనంతరం రాంనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయం వద్దకు చేరుకుని తాళాలను బద్దలుకొట్టి లోనికి ప్రవేశించారు. కార్యాలయంలోని కంప్యూటర్లు, ఫర్నీచర్, ఇతర సామగ్రిని ధ్వంసం చేశారు. సామగ్రిని బయటకు తీసుకొచ్చి దహనం చేశారు. చంద్రబాబు, లోకేశ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కాలవ శ్రీనివాసులు ఇంటి ఎదుట తెలుగు మహిళలు పార్టీ జెండాలు, ఫ్లెక్సీలను దహనం చేసి నిరసన తెలిపారు. ఆ సమయంలో ఒక మహిళ సొమ్మసిల్లి పడిపోయారు. ప్రభాకర్ చౌదరికి టికెట్ రాలేదని మనస్తాపానికి గురైన ఇద్దరు కార్యకర్తలు విషం తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. అక్కడే ఉన్న పార్టీ శ్రేణులు వారిని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతపురం అర్బన్‌లో 12మంది క్లస్టర్ ఇన్‌చార్జిలు, 50మంది డివిజన్ అధ్యక్షులు, 57మంది యూనిట్ ఇన్‌చార్జిలు, 277 మంది బూత్ ఇన్‌చార్జిలు టీడీపీకి రాజీనామా చేశారు. గుంతకల్లు టీడీపీ ఎమ్మెల్యే టికెట్ గుమ్మనూరు జయరాంకు ఖరారు కాగానే ఆయన వర్గీయులు టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. అదే సమయంలో గుంతకల్లు టీడీపీ కార్యాలయంలో జితేంద్రగౌడ్ వర్గీయులు ఆగ్రహంతో ఊగిపోయారు. పార్టీ కార్యాలయంలోని కుర్చీలను, కరపత్రాలను రోడ్డుపై వేసి నిప్పుపెట్టారు. చంద్రబాబు చిత్రపటాన్ని తగులబెట్టారు. జయరాంను ఓడిస్తామని శపథం చేశారు. తన వర్గీయులతో మూడు నాలుగు రోజుల్లో సమావేశమై, భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని జితేంద్రగౌడ్ తెలిపారు.

పార్టీ నమ్మించి గొంతు కోసింది: నాగార్జున

ఐదేళ్లపాటు సేవలందించిన తనకు టీడీపీ నమ్మించి ఆశలు చూపించి చివరికి గొంతు కోసిందని ఆ పార్టీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడిగా, నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న తనను తప్పించి చీపురుపల్లి అసెంబ్లీ టికెట్ వేరే వారికి ప్రకటించడం శోచనీయమన్నారు. జిల్లా అధ్యక్ష, నియోజకవర్గ ఇన్‌చార్జి పదవులకు రాజీనామా చేస్తున్నానని ప్రకటించారు. నాగార్జునకు టికెట్ నిరాకరించినందుకు చీపురుపల్లిలో కార్యకర్తలు పార్టీ కరపత్రాలను దహనం చేశారు. చంద్రబాబు డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు.

42 ఏళ్లుగా సేవలందించాం: నల్లమిల్లి

తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో టీడీపీలో అసమ్మతి సెగలు చల్లారలేదు. తొలి జాబితాలో టీడీపీ, జనసేన అనపర్తి నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని ప్రకటించారు. అయితే పొత్తు నేపథ్యంలో బీజేపీకి ఆ సీటును కేటాయించారు. ఈ నేపథ్యంలో అనపర్తి సీటు రామకృష్ణారెడ్డికే కేటాయించాలని కార్యకర్తలు పట్టుబడుతున్నారు. నల్లమిల్లితో చంద్రబాబు ఫోన్‌లో మాట్లాడినా మంటలు చల్లారలేదు. సీనియర్ నాయకులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, వేగుళ్ల జోగేశ్వరరావు, నిమ్మకాయల చినరాజప్ప, సుజయ్ కృష్ణ రంగారావు, గన్ని కృష్ణ శుక్రవారం నల్లమిల్లి నివాసానికి వెళ్లారు. రామకృష్ణారెడ్డి తల్లి సత్యవతి మాట్లాడుతూ.. తమను నమ్మించి మోసంచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. 42ఏళ్లుగా పార్టీని నమ్ముకుని అన్నికాలాలుగా ఇబ్బందులు పడుతూ పార్టీ పటిష్ఠతకు కృషి చేసిన తమ కుటుంబానికి ఇలా చేయడం సమంజసమా అని ప్రశ్నించారు. విజయవాడ వచ్చి అధినేతతో మాట్లాడాలని నేతల బృందం నల్లమిల్లికి సూచించారు. అయితే తాను ఇప్పటికే ప్రజాభిప్రాయం కోసం ఐదు రోజుల పాటు కుటుంబంతో కలిసి పర్యటిస్తానని మాటిచ్చానని, తాను ప్రస్తుతం అధినేతను కలవలేనంటూ వారి ప్రతిపాదనను ఆయన సున్నితంగా తిరస్కరించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి

నవ్య స్మార్ట్

శనివారం • 30 మార్చి 2024



యాపిల్ 16లో ర్యామ్, స్టోరేజీ పెంపు!

యాపిల్ ఐఫోన్ 16లో ర్యామ్, స్టోరేజీ సామర్థ్యాన్ని పెంచుతున్నట్టు సమాచారం. తద్వారా ఏఐ ఫీచర్లను అందుకునేలా ఐఫోన్ 16ని సన్నద్ధం చేస్తోంది. పిక్సెల్ 8 ప్రొ, గెలాక్సీ ఎస్24లో మాదిరిగా ఐఫోన్16లో కూడా ఆ రెంటి పెంపు ఉంటుందని అంటున్నారు. ఇప్పటికి ఐఫోన్ 15ప్రొ లో 8జీబీ ర్యామ్ ఉంది. అదే ఐఫోన్ 15, ఐఫోన్ 15 ప్లస్ విషయానికి వస్తే ర్యామ్ 6జీబీ మాత్రమే. 'టెక్ రెవ్' ప్రకారం త్వరలో విడుదలకానున్న ఐఫోన్ 16లో ర్యామ్, స్టోరేజీ పెరగనున్నాయి. ఈ పెరుగుదల కొద్దిగా ఎక్కువగా ఉండొచ్చు. ఎన్ఏఎన్‌డి ఫ్లాష్ ఆధారిత స్టోరేజీని యాపిల్ మాత్రమే ఉపయోగిస్తోంది. ఆ కారణంగా స్టోరేజీ వేగం పెంపు దానికి పెద్ద విషయం కాదు. హార్డ్‌వేర్ పరిమితుల దృష్ట్యా పిక్సెల్ 8 యూజర్లు జెమినీ నానోపై డివైజ్‌ను రన్ చేయలేరని గూగుల్ ఇప్పటికే స్పష్టం చేసింది. అలాగే కొత్త సాంకేతికతపై యాపిల్ ఒక పరిశోధన పత్రాన్ని ప్రచురించింది. దాని ప్రకారం ఫ్లాష్ మెమరీపై లార్జ్ లాంగ్వేజ్ మోడల్(ఎల్ఎల్ఎం)ని రన్ చేసే వీలు ఉంటుంది. అదే ఐఫోన్‌లో చూడగలుగుతాం. అంతేకాకుండా టిమ్ కుక్ సైతం తాము ఏఐ ఫీచర్లపై పనిచేస్తున్నట్టు కూడా తెలిపారు. వీటన్నింటినీ జాగ్రత్తగా పరిశీలిస్తే ఐఫోన్ 16లో ర్యామ్, స్టోరేజీ పెంపుపై వస్తున్న పుకార్లను ఒకింత నమ్మాల్సి వస్తోంది.



అద్భుతంగా ఉపకరించే యాప్


'వీక్ ప్లాన్'

పనులు ఉండటం వేరు, వాటిని సమయానికి పూర్తి చేయడం వేరు. అనుకున్న పనులను సమర్థంగా పూర్తి చేసుకునేందుకు ఉపయోగపడేది 'వీక్ ప్లాన్ యాప్'. ఆరోగ్యకరమైన పని వాతావరణానికి ఉపకరించేలా ఈ యాప్ ఉంటుంది. దీని సహకారంతో స్వల్పకాలిక, దీర్ఘకాలిక లక్ష్యాలను పెట్టుకోవచ్చు. వాస్తవానికి ఇదో ప్రొడక్టివిటీ టూల్ అని కూడా చెప్పవచ్చు. చేపట్టాల్సిన టాస్కుల్లో వేటికి ప్రాధాన్యం ఇవ్వాలన్నది దీంతో సులువుగా ఎంపిక చేసుకోవచ్చు. అందుకోసం హెచ్ఐటీ - హై ఇంపాక్ట్ టాస్క్‌లను సెట్ చేసుకోవచ్చు. తద్వారా వాటిని ఫలవంతంగా నెరవేర్చుకునే వెసులుబాటు ఉంటుంది.

ఈ యాప్‌లో పొమొడోరొ టైమర్ ఉంటుంది. దీంతో 25 నిమిషాలకు టైమర్‌ను సెట్ చేసుకోవచ్చు. సదరు పని కచ్చితంగా పూర్తయ్యేలా ఫోకస్ పెట్టేందుకు తోడ్పడుతుంది. అయిదు నిమిషాల బ్రేక్, రిఫ్రెష్ మళ్లీ పని ఆరంభించడం అంటూ అంతా ఒక పద్ధతిగా సాగేందుకు వీలుకల్పిస్తుంది. టార్గెట్ల నిర్దేశం, వర్క్‌ఫ్లో డిజైన్, మైల్‌స్టోన్స్ జతచేయడం, టాస్క్, బెస్ట్ గోల్స్ డిజైన్ చేయడంలో ఇందులోని ప్రొడక్టివిటీ టూల్ ఉపయోగపడుతుంది. షెడ్యూలింగ్, టైమ్ ట్రాకింగ్, టాస్క్ మేనేజ్‌మెంట్ వంటివన్నీ ఎఫెక్టివ్‌గా జరిగేందుకు తోడ్పడుతుంది. ముఖ్యంగా స్ట్రెస్, బర్నౌట్ పరిస్థితుల నుంచి ఉపశమనం కలుగుతుంది.

యూట్యూబ్ మ్యూజిక్ సెర్చ్

కూనిరాగం తీస్తే పాట వెతుకుతుంది



కాలానుగుణంగా, ఎప్పటికప్పుడు మార్పులు, చేర్పులు తప్పవు. అందులో ముందుండే యూట్యూబ్ మ్యూజిక్ తాజాగా 'హమ్ టు సెర్చ్' ఫీచర్‌ను జతచేసింది. ఉదాహరణకు పాటలో లిరిక్స్ వెంటనే గుర్తుకురాకపోతే ఏం చేయాలన్నది ప్రశ్న. అయితే అందులో ఒకటో రెండు ముక్కలు గుర్తుంటాయి. యూట్యూబ్ తాజాగా అందించిన ఈ ఫీచర్ ప్రకారం సదరు పాటలోని చిన్న భాగాన్ని మూడు సెకండ్ల సేపు హమ్ చేయగలిగితే చాలు, మెలోడికి అనుగుణంగా అసలు సాంగ్‌ను యూట్యూబ్ లైబ్రరీలో వెతికి పట్టుకుంటుంది. ఆండ్రాయిడ్ ఫోనుల్లోని యూట్యూబ్ మ్యూజిక్ యాప్‌లోకి ఈ ఫీచర్‌ను తీసుకొచ్చే యత్నంలో కంపెనీ ఉంది. కేవలం మూడు సెకండ్ల సేపు హమ్, పాడటం లేదంటే ట్యూన్‌లో చిన్న ముక్కను రికార్డు చేయగలిగినా ఒరిజినల్ సాంగ్‌ను పట్టుకుంటుంది. యూట్యూబ్ స్మార్ట్ టెక్నాలజీ ఇందుకోసం ఉపయోగపడుతుంది. ఇందుకోసం...


- స్మార్ట్‌ఫోన్‌లో యూట్యూబ్ యాప్‌ని ఓపెన్ చేయాలి.
- సెర్చ్ ఐకాన్‌ని టాప్ చేయాలి. అక్కడే మైక్రోఫోన్ ఐకాన్ ఉంటుంది. దాన్ని టాప్ చేసి హమ్ టు సెర్చ్ ఫీచర్‌ని టర్న్ చేయాలి.
- మైక్రోఫోన్‌ని ఈ ఫీచర్ కోసం యూట్యూబ్ ఉపయోగించేందుకు అనుమతించాలి.
- కావాలనుకుంటున్న పాటలోని కొన్ని పదాలను హమ్ చేయాలి.
- ఆడియో ఇన్‌పుట్‌ని ఉపయోగించి యూట్యూబ్ పాటను వెతుకుతుంది.
- సంతృప్తి చెందితే టాప్ చేసి పాట వినొచ్చు. ఫలితంతో సంతృప్తి చెందకుంటే మళ్లీ హమ్ చేసి, వెతకాలి.



అప్‌డేట్

స్పాటిఫై నుంచి ఈ లెర్నింగ్

స్పాటిఫై తాజాగా వీడియో ఆధారిత ఈ లెర్నింగ్ కోర్సులకు శ్రీకారం చుట్టింది. వీటిని ఇప్పటికి యూకేలో అందిస్తోంది. ఇందులో మ్యూజిక్, బిజినెస్, క్రియేటివిటీ వంటి కోర్సులు ఉన్నాయి. మ్యూజిక్, పాడ్‌కాస్ట్‌కు అదనంగా ఈ ఫీచర్‌ను కూడా



జతచేసింది. స్పాటిఫై ప్రీమియమ్ ప్లాన్ కింద వీడియో కోర్సులు ఉంటాయి. నెలవారి చందా కట్టి యూజర్లు ఈ కోర్సుల్లో చేరవచ్చు. 'ఆండ్రాయిడ్ పోలీస్' రిపోర్ట్ ప్రకారం క్రియేటివిటీకి సంబంధించి పలు టాపిక్స్‌ను ఇంటిగ్రేట్ చేసి మరీ స్పాటిఫై వీటిని అందిస్తోంది.

బీబీసీ మేస్ట్రో, స్కిల్‌షేర్, థింక్‌ఫిక్ వంటి కంపెనీలతో ఈ కోర్సుల కోసం ఒప్పందం చేసుకుంది. అలాగే కోర్సులో భాగంగా రెండు వీడియోలను ఉచితంగా అందిస్తోంది. తద్వారా యూజర్లను ఆకట్టుకోవడమే కాదు, చందాదారులుగా మారేలా ప్రయత్నిస్తోంది. యూకేలోని యూజర్లు యాప్ అలాగే వెబ్ బ్రౌజర్ ద్వారా ఈ కోర్సులను అందుకోవచ్చు. ప్రస్తుతానికి ఈ కోర్సులను తానుగా ఆఫర్ చేస్తోంది. అయితే భాగస్వామ్య సంస్థలు అందిస్తున్న రియల్ కోర్సుల విషయంలో డిస్కౌంట్ ఏమైనా పొందే అవకాశం ఉందా అన్నది మాత్రం తెలియరాలేదు.

వెకేషన్స్, షాపింగ్స్ కోసం

గూగుల్ ఎస్‌జీఈ



నిత్యం మనం చేసుకునే పనుల్లో సహాయపడేందుకు గూగుల్‌కు చెందిన కొత్త ఏఐ టూల్స్ ఉపయోగపడనున్నాయి. సెలవులకు ప్లానింగ్ లేదంటే షాపింగ్ విషయంలో పర్సనలైజ్డ్ సహకారం అందించనుంది - గూగుల్‌కు చెందిన ఎస్‌జీఈ. ఏఐతో పనిచేసే ఈ ఫీచర్ పూర్తి రూపం సెర్చ్ జనరేటివ్ ఎక్స్‌పీరియెన్స్. ప్రస్తుతానికి ఇది అమెరికాలో అందుబాటులో ఉంది. అది అందించే టూర్ ప్లాన్‌తో సంతృప్తి చెందితే చాలు అది జీమెయిల్, డాక్స్ లేదా మేప్స్ యాక్సెస్‌ను అందుకుంటుందని 'టెక్‌క్రంచ్' ఒక నివేదికలో పేర్కొంది. గూగుల్‌తో కొనుగోలు చేసే ఆప్షన్ మాత్రం లేదు. అయినప్పటికీ అవసరమైన సమాచారాన్ని అందిస్తుంది. గూగుల్ మ్యాప్స్‌తో తగు సహకారం పొందవచ్చు. ట్రావెల్ ప్లానింగ్‌కు తోడు షాపింగ్ ఎక్స్‌పీరియెన్స్‌ను సైతం పెంపొందిస్తుంది. అపారెల్ నుంచి యాక్సెసరీల వరకు పర్సనలైజ్డ్ సలహాలను ఇస్తుంది. యూజర్ తన ఆలోచనలు, ప్రాధాన్యాలకు అనుగుణంగా షాపింగ్ చేసుకోవచ్చు.

గూగుల్ మెసేజెస్‌లో ఇమేజ్ ప్రివ్యూ సీన్




గూగుల్ మెసేజ్ యూజర్లు త్వరలో ఇమేజ్ ప్రివ్యూ సీన్‌ను పొందనున్నారు. షేర్ చేయదల్చుకున్న ఇమేజ్‌ని సెలెక్ట్ చేసినప్పుడు ఈ వెసులుబాటు లభిస్తుంది. ఇమేజ్ షేరింగ్ ఇంటర్‌ఫేస్‌కు ఇంప్రూవ్‌మెంట్స్ చేస్తున్న నేపథ్యంలో ఈ ప్రయోజనం లభించనుంది. ప్రస్తుతం అందిస్తున్న రిచ్ కమ్యూనికేషన్ సర్వీసెస్‌కు చెందిన మెసేజింగ్ సర్వీస్ - స్మార్ట్ ఫోన్ కెమెరా బంధించిన మల్టిపుల్ ఇమేజెస్‌ను కలుపుకోలేదు. ఒకదాని తరవాత ఒకటి కలుపుకొంటూ యూజర్లు వెళ్ళాలి. కొత్త వెసులుబాటుతో యాడ్ ఆన్ ఆప్షన్ లభిస్తుంది. పలు ఫొటోలను పంపుకొనే వీలూ ఉంటుంది. సరికొత్త ప్రివ్యూ స్క్రీన్‌లో రెండు ఫీచర్లు ఉంటాయి. అలాగే ఒకటి తొలగిపోతుంది. గ్యాలరీ లేదా ఫోల్డర్ నుంచి వర్క్‌ఫ్లోలో మార్పు ఏమీ ఉండదు. యాప్ ఉపయోగించి ఫొటోలను బంధించే విషయంలోనే మెరుగుదల అంతా జరిగింది. ఇన్ యాప్ కెమెరాను ఆఫర్ చేస్తోంది. పిక్చర్‌ని క్లిక్ చేసే సమయంలో యూజర్లు యాప్‌ని విడిచి పెట్టాల్సిన అవసరం ఉండదు. చాటింగ్ సమయంలోనూ కెమెరా, గేలరీని టాప్ చేయవచ్చు. అది కూడా ఇటీవల తీసిన, తీసుకున్న పిక్చర్లను చూపిస్తుంది. అదేవిధంగా క్యాప్చర్ బటన్‌ని టాప్ చేసి వేగంగా ఫొటోలు తీసుకునేందుకు కెమెరా విండో అనుమతిస్తుంది. మినీ విండోను మాత్రం విస్తరించే వీలు మాత్రం ఉండదు.

వాట్సాప్

అందుబాటులోకి మరిన్ని ఫీచర్లు!

వాట్సాప్ యూజర్ల సౌలభ్యం కోసం కొత్తగా కొన్ని ఫీచర్లను తీసుకువస్తోంది. గ్రూప్ ఈవెంట్స్ నుంచి మీడియా అప్‌లోడ్ క్వాలిటీలో మెరుగుదల వరకు వీటిలో ఉన్నాయి. ప్రస్తుతం వీటిపై వాట్సాప్ పనిచేస్తోందని సమాచారం. 'ఆండ్రాయిడ్ అథారిటీ' రిపోర్ట్ ప్రకారం అయిదు ఫీచర్లపై వాట్సాప్ పనిచేస్తోంది. గ్రూప్ ఈవెంట్స్, డిఫాల్ట్ మీడియా అప్‌లోడ్ క్వాలిటీ సెట్టింగ్స్, ఫార్వార్డ్ అండ్ రివైండ్ వీడియోస్, స్టాటస్ అప్డేట్స్, కంపోజర్, ప్రైవసీ ఫీచర్స్ ఫర్ అవతార్ వాటిలో ఉన్నాయి. అవి వరుసగా....



- గూగుల్ క్యాలెండర్‌లో మీటింగ్ షెడ్యూల్స్ మాదిరిగా గ్రూప్ ఈవెంట్స్ ఫీచర్ ఉంటుంది. వాయిస్, వీడియో కాల్స్ నుంచి ఈవెంట్స్‌ను క్రియేట్ చేసుకునే వెసులుబాటు ఉంటుందని సమాచారం. కాల్‌లో చేరేందుకు వీలుగా ఈవెంట్ లింక్‌ను షెడ్యూల్ చేసుకోవచ్చు. టైటిల్స్, డిస్క్రిప్షన్స్, డేట్స్, లొకేషన్స్ వంటి వాటిని గ్రూప్ ఈవెంట్ యూజర్లు కలుపుకోవచ్చు.
- డిఫాల్ట్ మీడియా అప్‌లోడ్ క్వాలిటీకి కూడా అవకాశం ఉంది. దీంతో హెచ్‌డీ క్వాలిటీ ఇమేజ్‌లు, వీడియోలను యూజర్లు పంపుకోవచ్చు. డబ్ల్యుఏబీటా ఇన్ఫో ఈ ఫీచర్‌ను గుర్తించింది. బీటా టెస్టర్లకు ఇది ప్రస్తుతం అందుబాటులో ఉంది.
- అవతార్లకు సంబంధించి ప్రైవసీ ఫీచర్ మరొకటి. దీంతో యూజర్లు తమ అవతార్‌ను స్టిక్కర్‌గాఉపయోగించుకునే విషయంలో కంట్రోల్‌ని ఉంచుకోవచ్చు. మై కాంటాక్ట్స్, సెలెక్టెడ్ కాంటాక్ట్స్, నోబడి నుంచి యూజర్ తనకు ఇష్టమైనది ఎంచుకోవచ్చు.
- వీడియోల ఫార్వార్డ్ -రివైండ్ ఫీచర్‌ని ఐఓఎస్ యూజర్లకు విడుదల చేస్తోంది. స్మార్ట్‌ఫోన్‌పై డబుల్ క్లిక్‌తో ఈ పనిచేయవచ్చు. కెమెరా ఐకాన్‌ను ప్రెస్ చేసి, చాలా త్వరగా వీడియోలను రికార్డు చేసి పంపుకోవచ్చు.
- సరికొత్త స్టాటస్ కంపోజర్‌ని కూడా పరిచయం చేస్తోంది. కంపోజ్ టెక్స్ట్, వీడియో, ఫొటోని యూజర్లు సెలెక్ట్ చేసుకోవచ్చు.

మల్టిపుల్ మెసేజ్‌లను పిన్ చేయవచ్చు

వాట్సాప్ ఇటీవల మెసేజ్ పిన్నింగ్ ఫీచర్‌ను అప్డేట్ చేసింది. సంభాషణలో మూడు మెసేజ్‌లను పిన్ చేసుకునే సౌలభ్యం దీంతో ఉంటుంది. యాప్ బీటా వెర్షన్‌లో గత వారం ఈ అప్డేట్ కనిపించింది. ఈ సదుపాయంతో యూజర్లు మీడియా, వాయిస్ నోట్స్, ఎమోజీలను పిన్ చేయవచ్చు. వ్యక్తిగత, గ్రూప్ చాట్స్‌లో ఈ సదుపాయం ఉంటుంది. డిఫాల్ట్‌గా ఏడు రోజుల వరకు పిన్ చేసే అవకాశం ఉంటుంది. అయితే ఇరవై నాలుగు గంటలు, వారం, నెల రోజులకు పిన్ చేయవచ్చు. దీనికోసం మొదట మెసేజ్‌పై లాంగ్ ప్రెస్ ఆపై టాప్ చేయాలి. డ్రాప్-డౌన్ మెనూలో పిన్‌పై క్లిక్ చేస్తే చాలు, పని పూర్తవుతుంది. అలాగే అన్‌పిన్ కోసం త్రీడాట్ మెనూలో 'అన్‌పిన్'ని సెలెక్ట్ చేసుకోవాలి. యాపిల్ డివైజ్‌లో రైట్ సైడ్ స్వైప్ చేస్తే పిన్ బటన్ కనిపిస్తుంది.



మేజికల్ ఏఐ



ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) పలు ప్రయోజనాలను అందిస్తోంది. అందులో ఒకటి మేజికల్ ఏఐ యాప్. టాస్క్‌ల ఆటోమేషన్ నుంచి ఈమెయిల్స్ అలాగే టెక్స్ట్‌లకు సమాధానం ఇవ్వడంలో స్మార్ట్ సలహాలను ఈ యాప్ అందిస్తుంది. మాన్యువల్‌గా డేటా ఎంట్రీ, ఒకటే పనిని పదేపదే చేయాల్సి రావడంతో విసుగెత్తిన వ్యక్తులకు ఈ మేజికల్ యాప్ ఉపయోగపడుతుంది. విద్య, వైద్య తదితర కార్యకలాపాల్లో దీన్ని ఇంటిగ్రేట్ చేయవచ్చు. జీపీటీ-4 పవర్‌తో ఇది యూజర్ అభీష్టం మేరకు పనిచేస్తుంది. వారంలో సగటున ఏడు గంటల సమయాన్ని ఆదాచేస్తుందని ఈ యాప్ అధికారిక వెబ్‌సైట్ పేర్కొంది. ఈ యాప్ ప్రధానంగా...

- రైటింగ్ పనులు ఆటోమేటిక్‌గా జరిగేలా తోడ్పడుతుంది. వన్ టు వన్ లేదా గ్రూప్ చాట్ సంభాషణల్లో సహకారం అందిస్తుంది. ఈమెయిల్స్‌కు సమాధానం ఇవ్వడంలోనూ సహకరిస్తుంది.
- ఆటోఫిల్ ఫీచర్ దీంతో వస్తోంది. పేరు, ఈమెయిల్ వంటివి ఒక క్లిక్‌లో పూర్తి చేస్తుంది. యూజర్ ప్రాంప్ట్ దీనికి అక్కర్లేదు.
- ప్రి రిటెన్ టెంప్లేట్స్‌ను అందిస్తుంది. యూజర్ ప్రిఫరెన్స్‌ను బట్టి కస్టమైజేషన్ సౌలభ్యం కూడా ఉంటుంది. కాపీ, పేస్ట్ పనిని పూర్తిగా తొలగించింది.
- ఈ యాప్‌లో ఏఐ అసిస్టెంట్ ఫీచర్ ఉంది. స్క్రాచ్ నుంచి ఈమెయిల్స్ సృష్టితో మొదలుపెట్టి మెసేజెస్, నోట్స్ రైటింగ్ ప్రాసెస్ సరళీకరణ, మానవులు చేసే తప్పుల ఉపసంహరణ వరకు పలు పనులను నిర్వర్తించేందుకు ఈ ఏఐ అసిస్టెంట్ సహకరిస్తుంది.

ఐఫోన్ యూజర్లకు అలెర్ట్



పాస్‌వర్డ్ రీసెట్ పేరిట మోసాలు

అడ్వాన్స్‌డ్ ఫిషింగ్ అటాక్‌కు ఇప్పుడు యాపిల్ యూజర్లు టార్గెట్ అయ్యారు. యాపిల్ పాస్‌వర్డ్ రీసెట్ పేరుతో ఇబ్బంది పొంచి ఉంది. యాపిల్ ఐడీ పాస్‌వర్డ్‌ను మార్చుకోవాలని కోరుతూ వచ్చే అభ్యర్థన రూపంలో వ్యవహారం సాగుతోంది. యూజర్ దానికి ఆమోదం తెలిపితే అటాక్‌కు అవకాశం కలుగుతుంది. ఐఫోన్, యాపిల్ వాచ్, సిస్టమ్ స్థాయిలో మేక్‌లో టార్గెట్ చేసుకుని ఈ పనికి పాల్పడుతున్నారు. యాక్సెప్ట్ బటన్‌ను క్లిక్ చేయడం ద్వారా ఇది ఎంటర్ అవుతోంది. అలా యూజర్‌ని అకౌంట్‌కు యాక్సెస్ కాకుండా చేస్తోందని కెర్బాన్ సెక్యూరిటీ పేర్కొంది. ఆమోదం తెలపకుంటే, యాపిల్ ప్రతినిధులమని చెప్పి బలవంతం చేస్తుండటం ఈ అటాక్‌లో మరో కోణం. ఒన్ టైమ్ పాస్‌వర్డ్ చెప్పాలంటూ ఒత్తిడి చేస్తున్నట్టు సమాచారం. యాపిల్ ఐడీతో జతపడి ఉన్న ఈమెయిల్ అడ్రస్, ఫోన్ నంబర్ యాక్సెస్ పొందే యత్నం జరుగుతోంది. యాపిల్ సిస్టమ్‌లో ఉన్న బగ్‌ను ఉపయోగించుకుని పదేపదే అటాకర్లు ప్రయత్నిస్తుండటం విశేషం. ఈ నేపథ్యంలో పాస్‌వర్డ్ చేంజ్ అభ్యర్థనలను యాపిల్ డివైజ్ యూజర్లు లేదా ఓనర్లు మన్నించకపోవడమే ఉత్తమం అని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఇన్ఫో

ఫోన్ వేగం తగ్గిందా! ఇలా చేయండి



ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్ పనితీరు మందగించింది. అంతమాత్రాన కొత్త ఫోన్ కోసం మార్కెట్‌కు బయలుదేరాల్సిన పని లేదు. అందులో ఉన్న వృథాను బైటకు పంపితే ఫోన్ మళ్లీ వేగంగానే పనిచేస్తుంది. అయితే అందుకు కొన్ని పద్ధతులను అనుసరించాలి. ఫొన్ కెచే, క్రోమ్ వంటి తాత్కాలిక యాప్‌తో ఫోన్ నిండి ఉండొచ్చు. నిజానికి అవి బరువును పెంచుతాయి. కెచే ప్రధానంగా ఫోన్ వేగానికి సంబంధించినది. ఉన్న బరువును తగ్గిస్తే లోడ్ తగ్గి పర్ఫార్మెన్స్ మెరుగుపడుతుంది. చిన్న ఫైల్స్ చాలా వేగంగా జతపడతాయి. అవే స్టోరేజీని, ర్యామ్ తినేస్తాయి. ఆండ్రాయిడ్‌లో కూడా పాత మోడల్ ఫోన్లతో అదే ఇబ్బంది తలెత్తుతుంది. ఈ సమస్యకు ఆటోమేటిక్ పరిష్కారం కోసం సీక్లీనర్, ఎస్‌డీ మెయిడ్2 వంటి యాప్‌లు బాగా ఉపయోగపడతాయి. జంక్ ఫైల్స్, కెచే డేటా తదితరాలను గుర్తించి అవి క్లీన్ చేయగలుగుతాయి. అలాగే కొన్ని పేమెంట్‌తో ఇలాంటి సేవలు అందిస్తాయి. నిజానికి అవి డబ్బుకట్టి అందుకోవలసిన సేవలే. క్రోమ్ చాలా ఎక్కువగా స్పేస్ తింటుంది. దాన్ని ఎప్పటికప్పుడు క్లియర్ చేసుకోవాలి. అందుకుగాను క్రోమ్ ఓపెన్ చేయాలి. హిస్టరీలోకి వెళ్ళాలి. క్లియర్ బ్రౌజింగ్ డేటాను సెలెక్ట్ చేసుకోవాలి. కేచ్డ్ ఇమేజెస్, ఫైల్స్ ఆప్షన్‌ను ఎంచుకుంటే చాలు, పనవుతుంది. రెగ్యులర్‌గా కెచే క్లీనింగ్ చేసుకుంటే చాలు, ఫోన్ నిజానికి ఊపిరి పీల్చుకుంటుంది. అనవసరమైన అప్‌గ్రేడ్‌లతోనూ ఇబ్బందులు తప్పుతాయి. స్మార్ట్‌ఫోన్ అనేది చక్కగా పనిచేసుకునేలా పెట్టుకోవడంలోనే యూజర్ పనితనం ఉంటుంది మరి.

తెలంగాణ ఫైన్ ఆర్ట్స్ గురుకుల ఎంట్రెన్స్ టెస్ట్



తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టీఎస్‌డబ్ల్యూఆర్)- మేడ్చల్ జిల్లా మల్కాజిగిరిలోని ఎదులాబాద్-ఘట్‌కేసర్‌లో నిర్వహిస్తున్న ఫైన్ ఆర్ట్స్ స్కూల్‌లో ఆరోతరగతి ప్రవేశాలకు ఉద్దేశించిన 'టీఎస్‌డబ్ల్యూఆర్-ఎఫ్ఏఎస్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఇది రాష్ట్ర స్థాయిలో ఉన్న కో-ఎడ్యుకేషన్ గురుకుల పాఠశాల. ఇందులో అకడమిక్ సిలబస్‌తో పాటు ఫైన్‌ఆర్ట్స్‌లో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. విద్యార్థులు ఏవైనా రెండు 'ఫైన్ ఆర్ట్స్ విభాగాలు' ఎంచుకోవచ్చు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. మొత్తం 80 సీట్లు ఉన్నాయి. ఎస్సీ అభ్యర్థులకు 75 శాతం, ఎస్సీ-సీసీ అభ్యర్థులకు 2 శాతం, ఎస్టీ వర్గాలవారికి 6 శాతం, బీసీ అభ్యర్థులకు 12 శాతం, మైనారిటీలకు 3 శాతం, జనరల్ అండ్ ఈబీసీ అభ్యర్థులకు 2 శాతం సీట్లు కేటాయించారు. ఎంపికైన విద్యార్థులకు బోధన, వసతి, పరీక్ష ఫీజు ఉచితం. అవసరమైన డ్రెస్‌లు, బుక్స్, మెడికల్ కేర్ అందిస్తారు.

ఫైన్ ఆర్ట్స్ విభాగాలు

- **క్లాసికల్ మ్యూజిక్- ఓకల్:** కర్ణాటిక్ మ్యూజిక్, హిందుస్థానీ మ్యూజిక్
- **ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్:** వీణ, వయొలిన్ - కర్ణాటిక్, మృదంగం, తబలా, కీబోర్డు, గిటార్, ఫ్లూట్
- **డ్యాన్స్:** కూచిపూడి, కథక్
- థియేటర్ ఆర్ట్స్
- పెయింటింగ్ అండ్ డ్రాయింగ్

అర్హత: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గుర్తింపు పాఠశాలల నుంచి అయిదో తరగతి పరీక్ష ఉత్తీర్ణులైన/పరీక్షలు రాసే బాలబాలికలు అప్లయ్ చేసుకోవచ్చు. తెలుగు మీడియం అభ్యర్థులు కూడా అర్హులే. విద్యార్థుల వయసు 2024 మే 1 నాటికి పన్నెండేళ్ల లోపు ఉండాలి. కుటుంబ వార్షికాదాయం పట్టణాల్లో రూ.2,00,000, పల్లెల్లో రూ.1,50,000 మించకూడదు.

ఎంట్రెన్స్ టెస్ట్ వివరాలు

- ఇందులో రెండు స్క్రీనింగ్ టెస్ట్‌లు ఉంటాయి. మొదటిది టీఎస్‌డబ్ల్యూఆర్ఎఫ్ఏఎస్ సెట్, రెండోది ఫైన్ ఆర్ట్స్ స్కిల్ టెస్ట్. ఒక్కోదానికి 100 మార్కులు నిర్దేశించారు.
- **టీఎస్‌డబ్ల్యూఆర్ఎఫ్ఏఎస్ సెట్:** ఇది ఆబ్జెక్టివ్ టెస్ట్. ఇందులో ఇంగ్లీష్, తెలుగు, మేథమెటిక్స్, మెంటల్ ఎబిలిటీ, ఎన్విరాన్‌మెంటల్/ జనరల్ సైన్స్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 20 చొప్పున మొత్తం 100 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. అయిదో తరగతి సిలబస్ ప్రకారం ప్రశ్నలు ఉంటాయి. విద్యార్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. నెగెటివ్ మార్కులు లేవు. ఇందులో అర్హత పొందాలంటే కనీసం 35 మార్కులు రావాలి. వీరిని మాత్రమే స్కిల్ టెస్ట్‌కు అనుమతిస్తారు.
- **ఫైన్ ఆర్ట్స్ స్కిల్ టెస్ట్:** ఎంచుకొన్న విభాగానికి ప్రత్యేకించిన అంశాల్లో విద్యార్థుల నైపుణ్యాలను పరీక్షిస్తారు. వీటికి సంబంధించిన వివరాలను వెబ్‌సైట్‌లో చూడవచ్చు. విద్యార్థులు ఎటువంటి మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ తీసుకురానవసరం లేదు.
- పెయింటింగ్, డ్రాయింగ్ పరీక్షల కోసం పెన్సిల్, ఎరేజర్, కలర్ పెన్సిల్స్, క్రేయాన్స్ తెచ్చుకోవచ్చు. డ్యాన్స్ టెస్ట్ కోసం ఎగ్జామినర్ సమక్షంలో ఒక పాటను ప్లే చేస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.100
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 18
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** ఏప్రిల్ 26 నుంచి
- **'టీఎస్‌డబ్ల్యూఆర్-ఎఫ్ఏఎస్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ 2024' తేదీ:** మే 5
- **ఫైన్ ఆర్ట్స్ స్కిల్ టెస్ట్ తేదీ:** మే 26
- **వెబ్‌సైట్:** tswrsplschools.cgg.gov.in

జేవియర్ ఇన్‌స్టిట్యూట్‌లో పీజీడీఎం

బెంగళూరులోని జేవియర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్(ఎక్స్ఐఎంఈ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(పీజీడీఎం), పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(పీజీడీఎం)-బిజినెస్ అనలిటిక్స్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇవి రెండేళ్ల వ్యవధి గల ఫుల్ టైం రెసిడెన్షియల్ ప్రోగ్రామ్‌లు. ట్రైమెస్టర్ విధానాన్ని అనుసరిస్తారు. మొత్తం 570 సీట్లు ఉన్నాయి. పీజీడీఎం ప్రోగ్రామ్‌నకు సంబంధించి చెన్నై క్యాంపస్‌లో 150, బెంగళూరు క్యాంపస్‌లో 240, కొచ్చి క్యాంపస్‌లో 120 సీట్లు; పీజీడీఎంబీఏ ప్రోగ్రామ్‌నకు సంబంధించి బెంగళూరు క్యాంపస్‌లో 60 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్‌లకు ఏఐసీటీఈ గుర్తింపు ఉంది.

స్పెషలైజేషన్‌లు

- పీజీడీఎం ప్రోగ్రామ్‌లో మార్కెటింగ్, ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్సెస్, ఆపరేషన్స్, ఐటీ అండ్ అనలిటిక్స్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.
- పీజీడీఎంబీఏ ప్రోగ్రామ్ మాత్రం బిజినెస్ అనలిటిక్స్‌కు సంబంధించి ఉంటుంది.

ప్రోగ్రామ్‌ల వివరాలు: మొదటి ఏడాది మేనేజ్‌మెంట్ విభాగాలకు సంబంధించిన ఫౌండేషన్ కోర్సులు; రెండో ఏడాది కోర్ కోర్సులు, ఎలక్టివ్ కోర్సులు, ఎన్విరాన్‌మెంటల్ అండ్ ఇంటిగ్రేటివ్ కోర్సులు ఉంటాయి. వీటితోపాటు ఎనిమిది వారాల సమ్మర్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్, మూడు వారాల వ్యవధి గల ప్రొడక్టివ్ యాక్టివిటీ ఆధారిత వింటర్ ఇంటర్న్‌షిప్ పూర్తిచేయాల్సి ఉంటుంది.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయశ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. చివరి సంవత్సర పరీక్షలు రాసి ఫలితాల కోసం చూస్తున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2024 సెప్టెంబరు నాటికి మార్కుల పత్రాలు, సర్టిఫికెట్‌లు సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. బ్యాక్‌లాగ్స్ ఉన్నవారు దరఖాస్తుకు అనర్హులు.

ఎంపిక: ఎక్స్ఏటీ/క్యాట్/సీమ్యాట్/మ్యాట్/ఏటీఎంఏ/జీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్‌నకు 35 శాతం, పదోతరగతి, ఇంటర్, డిగ్రీ/పీజీ మార్కులకు 13 శాతం; గ్రూప్ డిస్కషన్స్/ఇంటర్వ్యూకి 40 శాతం; స్పోర్ట్స్, కరిక్యులర్ యాక్టివిటీస్, అకడమిక్ డైవర్సిటీ, జెండర్ డైవర్సిటీలకు 12 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.



ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1750
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31
- **వెబ్‌సైట్:** https://xime.org

నైసర్‌లో సమ్మర్ ప్రాజెక్ట్

భువనేశ్వర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(నైసర్)కి చెందిన స్కూల్ ఆఫ్ ఫిజికల్ సైన్సెస్(ఎస్‌పీఎస్)- సమ్మర్ ప్రాజెక్ట్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండు నెలలు. ఇందులో భాగంగా ఫిజిక్స్ విభాగానికి సంబంధించి రెగ్యులర్ ప్రాజెక్ట్ వర్క్‌లు, యాక్టివిటీస్, సెమినార్లు, రీసెర్చ్ వర్క్‌లు సహా వివిధ రీసెర్చ్ ల్యాబొరేటరీల సందర్శన, నైట్ స్కై అబ్జర్వేషన్ తదితరాలు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్ మే 21 నుంచి ప్రారంభమౌతుంది. దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఫిజిక్స్ ప్రధాన సబ్జెక్ట్‌గా బీఎస్సీ/ ఎమ్మెస్సీ/ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ చేస్తున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. వసతి సౌకర్యం ఉంది. సమ్మర్ ప్రాజెక్ట్ ఫండింగ్ సదుపాయంలేని అభ్యర్థులకు నెలకు రూ.5000ల స్టయిపెండ్‌తోపాటు స్లీపర్ క్లాస్ రైల్వే ఫేర్/ బస్ ఫేర్ చెల్లిస్తారు.

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ వ్యవధి:** మే 21 నుంచి జూలై 23 వరకు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 21
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** మే రెండో వారంలో
- **వెబ్‌సైట్:** www.niser.ac.in

ఆర్‌సీబీలో ఎంఎస్-పీహెచ్‌డీ



కేంద్ర ప్రభుత్వానికి చెందిన రీజనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ(ఆర్‌సీబీ)-ఎంఎస్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి అయిదు నుంచి ఏడేళ్ల వరకు ఉంటుంది. సెమిస్టర్ విధానాన్ని అనుసరిస్తారు. లైఫ్ సైన్సెస్, మోడ్రన్ బయోటెక్నాలజీ అంశాలకు సంబంధించిన ల్యాబొరేటరీ ట్రెయినింగ్‌లతో కోర్సును రూపొందించారు. మొదటి ఏడాది ల్యాబొరేటరీ ప్రయోగాలతో క్లాస్ రూం టీచింగ్ ఉంటుంది. రెండో ఏడాది రీసెర్చ్ ల్యాబొరేటరీలో వర్క్ చేయాల్సి ఉంటుంది. మాస్టర్స్ డిజర్టేషన్ కూడా సబ్మిట్ చేయాలి. అభ్యర్థి ప్రతిభను పరిశీలించి పీహెచ్‌డీ థీసిస్ వర్క్, రీసెర్చ్ వర్క్‌కు అనుమతిస్తారు. మొదటి రెండేళ్ల ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు ప్రోగ్రామ్‌నుంచి వైదొలగే వీలుంది. వీరికి మాస్టర్స్ డిగ్రీ ప్రదానం చేస్తారు. నిర్దేశిత రుసుం చెల్లించి భోజన, వసతి సౌకర్యాలు పొందవచ్చు. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 20 సీట్లు ఉన్నాయి. విదేశీ విద్యార్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సైన్స్, ఇంజనీరింగ్, మెడిసిన్ విభాగాల్లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రథమ శ్రేణి మార్కులు ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్-బయోటెక్నాలజీ(గ్యాట్ బీ) వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి.

ఎంపిక: గ్యాట్ బీ వ్యాలిడ్ స్కోర్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరిని మాత్రమే ఇంటర్వ్యూకి పిలుస్తారు. సైంటిఫిక్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ అంశాల్లో అభ్యర్థి అవగాహన, ఆసక్తి, అచీవ్‌మెంట్స్ తదితరాలను పరిశీలించి అడ్మిషన్ ఇస్తారు.

ఫెలోషిప్: ఎంపికైన అభ్యర్థులందరికీ ఆర్‌సీబీ రామచంద్రన్ డీబీటీ ఫెలోషిప్ ఇస్తారు. దీని కింద మొదటి రెండేళ్లు నెలకు రూ.16,000 చెల్లిస్తారు. తరవాత అభ్యర్థులు సీఎస్ఐఆర్/ ఐసీఎంఆర్/ డీబీటీ నుంచి జూనియర్/ సీనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అర్హత పొందాల్సి ఉంటుంది. జేఆర్ఎఫ్ కింద నెలకు రూ.37,000; ఎస్ఆర్ఎఫ్ కింద నెలకు రూ.42,000 చెల్లిస్తారు. విదేశీ అభ్యర్థులకు మాత్రం నిబంధనల ప్రకారం ఆర్‌సీబీ డీబీటీ ఇంటర్నేషనల్ డాక్టోరల్ ఫెలోషిప్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.500; దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ, విదేశీ విద్యార్థులకు ఫీజు లేదు.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 30
- **వెబ్‌సైట్:** rcb.res.in

హైదరాబాద్ ఐఎంటీలో లాజిస్టిక్స్‌లో పీజీడీఎం

హైదరాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ(ఐఎంటీ) - కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(సీఐఐ)తో కలిసి లాజిస్టిక్స్ అండ్ సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్‌లో పీజీడీఎం అందిస్తోంది. ఇది రెండేళ్ల పూర్తికాలిక రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. లాజిస్టిక్స్ అండ్ సప్లయ్ చైన్ ఇండస్ట్రీకి ప్రొఫెషనల్స్‌ను అందించేందుకు ఈ కోర్సును ఆరంభించారు. ఫోకస్డ్ కరికులమ్, గెస్ట్ లెక్చర్స్, ఇండస్ట్రీ విజిట్స్, ఇంటర్న్‌షిప్స్, మేనేజ్‌మెంట్స్ ప్రాజెక్టుల సమాహారంగా కోర్సు ఉంటుంది. 2004లో ఆరంభించిన ద సీఐఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లాజిస్టిక్స్ కూడా ఈ కోర్సు రూపకల్పన తదితర వ్యవహారాల్లో పాలుపంచుకుంటోంది.

న్యూస్ ఐఐటీ మద్రాస్‌లో బీఎస్

ఐఐటీ మద్రాస్ బీఎస్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. బీఎస్ డేటా సైన్స్ అండ్ అప్లికేషన్స్, బీఎస్ ఎలక్ట్రానిక్ సిస్టమ్స్ కోర్సులను అందిస్తోంది. కోర్సు కాలవ్యవధి నాలుగేళ్లు కాగా భారత దేశంలో ఎక్కడి నుంచైనా వీటిని చేసే అవకాశం ఉంది. అభ్యర్థులు తమ రెగ్యులర్ కోర్సులతో పాటు వీటిని చేయవచ్చు. ఆర్థికంగా వెనుకబడిన వారికి 75 శాతం వరకు ఉపకార వేతనం కూడా మంజూరు చేస్తారు. అడ్మిషన్ కోసం గత ఏడాది జరిగిన లేదా ఈ సంవత్సరం నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అర్హత సాధించాలి. లేదంటే స్వీయ నియంత్రణ అర్హత ప్రక్రియ ద్వారానూ కోర్సులో చేరవచ్చు. అంటే సంస్థ నిర్వహించే క్వాలిఫయిర్ ఎగ్జామ్‌లో అర్హత సాధించాలి. తదుపరి బ్యాచ్ కోసం మే 26లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అడ్మిషన్ ప్రక్రియ తదితర వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

వెబ్‌సైట్: study.iitm.ac.in/ds, //study.iitm.ac.in/es



ఫిజిక్స్ వాలా స్కాలర్‌షిప్

లీడింగ్ ఎడ్యుటెక్ కంపెనీ 'ఫిజిక్స్ వాలా' విదేశాల్లో చదివే భారతీయ విద్యార్థుల కోసం రూ.50 లక్షల స్కాలర్‌షిప్‌ను ప్రకటించింది. దీనికోసం ప్రత్యేకించి ఇటీవల స్టడీ అబ్రాడ్ ఇనీషియేటివ్ - అకడ్‌ఫ్లైని ఆరంభించింది. అమెరికా, యూకే, కెనడాలోని వెయ్యి వరకు ఉన్న లీడింగ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీల్లో ఎంఎస్ కోర్సు చేస్తున్న భారతీయ విద్యార్థుల కోసం ఈ స్కాలర్‌షిప్‌ను ఉద్దేశించారు. యూఎస్‌లోని ఈటీఎస్‌కు అనుబంధంగా పనిచేస్తున్న ఈటీఎస్ - ఇండియాతో కూడా జనవరిలో ఫిజిక్స్ వాలా ఒప్పందం కుదుర్చుకుంది. జీఆర్ఈ, టోఫెల్ ఎగ్జామ్స్ ప్రిపరేషన్, విదేశీ వర్సిటీలో చదువులకు ఈటీఎస్ సహకరిస్తుందనే విషయం తెలిసిందే.

స్కాలర్‌షిప్ వివరాలకు వెబ్‌సైట్: www.acadfly.com.

జాబ్ కార్నర్ డిటీయూలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు

ఢిల్లీలోని షహబాద్ దౌలత్‌పూర్‌లోని ఢిల్లీ టెక్నలాజికల్ యూనివర్సిటీ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన 158 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

విభాగాలవారీ ఖాళీలు

1. డిజైన్: 6
2. ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరింగ్: 10
3. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ: 13
4. సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్: 5
5. ఎకనామిక్స్(యూఎస్ఎంఈ): 4
6. మేనేజ్‌మెంట్(యూఎస్ఎంఈ): 27
7. బయోటెక్నాలజీ: 9
8. మెకానికల్ ఇంజనీరింగ్: 34
9. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్: 50

అర్హత: సంబంధిత విభాగాల్లో యూజీ, పీజీ, పీహెచ్‌డీ, స్లెట్/ సెట్, యూజీసీ/ సీఎస్ఐఆర్/ ఐకార్/ జీప్యాట్/ గేట్/ ఐసీఎంఆర్/ నెట్ లెక్చర్‌షి లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణతతోపాటు బోధన, పరిశోధన అనుభవం.

ఎంపిక: స్క్రీనింగ్ టెస్ట్, ప్రెజెంటేషన్/ ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఎంపిక ప్రక్రియ ఉంటుంది.

దరఖాస్తు రుసుము: జనరల్ అభ్యర్థులకు రూ.1,000. ఎస్సీ/ ఎస్టీ/ ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.500. దివ్యాంగులకు రుసుము నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ: ఏప్రిల్ 14

దరఖాస్తు హార్డ్‌కాపీ పోస్టులో పంపేందుకు చివరి తేదీ: ఏప్రిల్ 24

చిరునామా: రిక్రూట్‌మెంట్ బ్రాంచ్, ఢిల్లీ టెక్నలాజికల్ యూనివర్సిటీ, షహబాద్ దౌలత్‌పూర్, బవానా రోడ్, ఢిల్లీ.

వెబ్‌సైట్: http://www.dtu.ac.in/

లిటిల్స్




ఖతర్నాక్ పిల్లులు

ఒక ఊరిలో రెండు పిల్లులుండేవి. ఆ పిల్లులు తెలివైనవి. ఆహారాన్ని దొంగతనం చేసేవి. కానీ ఎప్పుడూ బయట పడేవి కావు. అవి కొట్లాడుకోవటం ఎవరూ చూడలేదు. ఒక రోజు సాయంత్రం ఒక అవ్వ ఇంటికి వెళ్లాయి. అవ్వ మూడు రొట్టెలు కాల్చి పొయ్యి దగ్గర ప్లేట్‌లో పెట్టింది. రెండు పిల్లులు ఆ రొట్టెలను దొంగలించాయి. చెరో రొట్టె తీసుకున్నాయి. మూడో రొట్టె ఎవరు తీసుకోవాలో.. అర్థం కాలేదు. కొట్లాట ఎందుకని నల్లపిల్లి తన మిత్రుడు తెల్లపిల్లితో ఇలా అంది.. 'నీకు ఆకలి ఎక్కువ కదా. ఈ రొట్టె కూడా నువ్వే తిను. మనలో ఎవరం తింటే ఏం?' అన్నది. తెల్లపిల్లి సంతోషించింది. దారిలో పోతున్న ఓ కోతి ఈ రెండు పిల్లుల్ని చూసింది. 'మిత్రులారా.. మీకు పంచాయితి ఉంటే నేను తీర్పు ఇస్తా' అన్నది. అవసరం ఉన్నప్పుడు కచ్చితంగా వస్తామన్నది తెల్లపిల్లి. కోతి అక్కడే నిలబడింది. 'ఇక దయచేయచ్చు మీ ఇంటికి' అంటూ కోతితో అన్నది నల్లపిల్లి.



ఒక రోజు ఒక పెద్ద కొక్కు దొరికింది పిల్లులకు. ఆ కొక్కు ప్రాణం తీయకుండా వదిలేశాయి. కొన ఊపిరితో ఉండే కొక్కును ఒక సంచిలో తీసుకుని కోతి ఇంటికి వెళ్లాయి. చెట్టుమీద కోతి వెంటనే కిందికి దూకింది. 'తిండి విషయంలో మాకో గొడవ ఉంది' అంటూ పిల్లులు గట్టిగా అన్నాయి. 'ఆహా.. వీటికి కొట్లాట పెట్టొచ్చు. ఆహారం మనం తినొచ్చు' అనుకుంది. సంచిలోనుంచి తెల్లపిల్లి కొక్కును బయటకు వేసింది. కోతి బిత్తరపోయింది. 'మాకు సరిసమానంగా పంచు' అన్నది నల్లపిల్లి. 'మీ పంచాయితీ నాకొద్దు. నేను అసలే శాకాహారిని. ఈ గొడవ నాకెందుకు. నా దగ్గరకు ఎప్పుడూ రాకండి' అంటూ చిటారు కొమ్మకెళ్లి కోతి కూర్చుంది. రెండు పిల్లులు నవ్వుకుంటూ ఇంటికొచ్చాయి.


8 తేడాలను గుర్తించండి





జాంబీలు ఎన్ని?

సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 268

			8		5		4	
		9	6	1				
								9
	4						9	3
6		3				7		1
1	2						5	
7								
				3	4	5		
	6		1		8			

సుడోకు - 267 సమాధానం

1	4	6	8	9	2	5	7	3
2	9	3	7	1	5	8	6	4
5	8	7	3	6	4	9	2	1
4	5	8	2	7	6	1	3	9
9	6	2	4	3	1	7	8	5
7	3	1	9	5	8	6	4	2
3	2	9	5	8	7	4	1	6
8	1	4	6	2	9	3	5	7
6	7	5	1	4	3	2	9	8

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.